మల్లాది వెంకట కృష్ణ



జయం

రచయిత మాట

ప్రియ పాఠకులకి,

నేను రాసిన తొలి ఆధ్యాత్మిక నవల 'జయం'. గతంలో అనేక విషయాలమీద రాసిన నేను ఈసారి సబ్జెక్ట్‌గా ఆధ్యాత్మికతను ఎన్నుకున్నాను. నవలంతా కథగా సాగినా రెండు మూడు సందర్భాల్లో తత్త్వపరమైన సుదీర్ఘ సంభాషణలు చోటు చేసుకున్నాయి. తత్త్వ జిజ్ఞాస గల పాఠకులకి ఇవి ఎంతో ఆసక్తిగా వుంటాయి.

ఈ కథ పూర్తిగా కల్పితం. అయితే, చాలా సన్నివేశాలు కొందరి నిజ జీవితాల్లోంచి సంగ్రహించాను. ప్రాంతః స్మరణీయులు భగవాన్ శ్రీ రమణమహర్షి, కంచి పీఠాధిపతి శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి, స్వామి వివేకానంద, శ్రీ రాఖాడీబాబా, శ్రీ మళయాళస్వామి, శ్రీ పూర్ణానంద స్వామి, శ్రీ మాతా అమృతానందమయి, అవధూత శ్రీ చిప్రు అణ్ణ, శ్రీముక్తానందబాబా మొదలైన సిద్ధపురుషుల జీవితాల్లో జరిగిన కొన్ని సన్నివేశాలని ఈ నవల్లో వాడుకోవడం జరిగింది.

ఇది మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తూ-

—రచయిత

హైద్రాబాద్
1-5-2(03.

జయం

దుర్లభం త్రయమే వైతత్ దైవానుగ్రహ హేతుకమ్।
మనుష్యత్వం ముముక్షుత్వం మహా పురుష సంశ్రయః।

—వివేకచూడామణి

(అర్థం: మనిషి జన్మ ముక్తి పొందాలన్న కోరిక, సద్గురువు సన్నిధి అనే ఈ మూడు దైవానుగ్రహం వల్లనే లభ్యమౌతాయి)

NO GOD-NO PEACE
KNOW GOD ! KNOW PEACE !!

• • • •

ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియా రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ అది. అందులో 'హౌస్‌కీపింగ్' విభాగంలో గత నాలుగేళ్ళుగా స్కావెంజర్‌గా పని చేస్తున్న పృధ్వీరాజ్ గంటన్నర క్రితం డ్యూటీలోకి ఎక్కాక 'వర్క్ క్లోత్స్'లోకి మారాడు. ఒక్కో టాయిలెట్‌లోకి వెళ్ళి వెస్టర్న్ కమోడ్స్ క్లీన్‌చేసి, యాంటీ బేక్టీరియా డిస్‌ఇన్‌ఫెక్టెంట్‌ని పోసి, పైన సెల్లిఫోన్ పేపర్‌ని ఉంచుతున్నాడు. ఆ పేపర్ మీద 'డిస్‌ఇన్‌ఫెక్టెడ్' అన్న నీలం రంగు అక్షరాలు అచ్చువేసి వున్నాయి. అతని దగ్గరికి వచ్చిన ఒకతను పృధ్వీరాజ్‌తో చెప్పాడు.

"నీ పేరిట ఓ కొరియర్ కవర్ వచ్చింది. ఆఫీస్ గదిలో వుంది."

"థాంక్స్" చెప్పి పృధ్వీరాజ్ ఆఫీస్ గదిలోకి వెళ్లాడు. దాన్ని అందు
కుని, తన పేరున్న కవర్ కొనని కత్తెరతో కత్తిరించి తెరిచాడు. లోపల
నించి ఓ కాగితం బయటకి తీసాడు.

ఒకవైపు చీరల ప్రకటన గల పాంప్లెట్ వేనుక భాగంలో రాసి
వున్నాయి రెండే వాక్యాలు.

అవి చదవగానే అతను ఒక్కసారిగా కుర్చీలో కూలబడ్డాడు. కాళ్ళు
కుర్చీ మీద వుంచి మోకాళ్ళలో తల వుంచుకున్నాడు. క్షణాల్లో అతని
భుజాలు ఎగిరెగిరి పడసాగాయి.

"ఏమిటి?" అడిగాడతని ఆఫీసర్ సానుభూతిగా చూస్తూ.

అయితే పృధ్వీరాజ్ ఆ ప్రశ్న వినిపించుకునే స్థితిలోలేడు. టేబుల్
మీద ఇంటర్ కమ్ మోగింది. నంబర్ వన్ లైటు వెలగడంతో అది ప్రెసి
డెంట్ ఆఫీస్ నించి అని గ్రహించాడు ఆఫీసర్.

"యస్ సర్" చెప్పాడు.

ఇంటర్ కమ్ ఆన్ చేసి, అవతలివైపు నించి చెప్పింది విని, విన
యంగా జవాబు చెప్పాడు.

"యస్ సర్. ఐ విల్ సెండ్ హిమ్ ఇన్ సర్."

లైన్ కట్ చేశాక పృధ్వీరాజ్ భుజం మీద చేతులుంచి చెప్పా
డతను.

"సర్ ప్రయిజింగ్! ప్రెసిడెంట్ నిన్ను తక్షణం చూడాలట."

పృధ్వీరాజ్ తన దుఃఖంలోంచి తేరుకొని, పేపర్ టిష్యూతో
మొహం తుడుచుకుని, కొద్దిక్షణాల్లో ప్రెసిడెంట్ వున్న గదిలోకి వెళ్ళాడు.
ఆ గదిలో అరవై రెండేళ్ళ పైబడ్డ ఆయనొక్కడే నిలబడి వున్నాడు.
ఆయన కళ్ళు ఏడ్చినట్లుగా ఎర్రబడి వున్నాయి.

"నీకూ తెలిసిందా?" అడిగాడాయన పృధ్వీరాజ్ కూడా దుఃఖంలో
వున్నాడని గ్రహించి.

కొరియర్ లో తనకి వచ్చినలాంటి కాగితం ఒకటి ఆయన చేతుల్లో
వుండటం గమనించిన పృధ్వీరాజ్ కి అర్ధమైంది జరిగింది. అతనిలోని
దుఃఖం ఒక్కసారిగా మళ్ళీ పెల్లుబికింది. ఒకరి దుఃఖం మరొకరి

దుఃఖాన్ని పెంచింది. ఇద్దరూ తమ సామాజిక అంతస్తులని మరిచి ఒకరి
నొకరు కౌగిలించుకుని రోదించసాగారు.

అందుకు కారణమైన, ఆ ఇద్దరి మెళ్ళల్లోని లాకెట్లలో వున్న
వ్యక్తి ఫోటో ఒకటే.

• • • •

అమర్ నాధ్ ప్రాంతంలో ఇండియన్ ఆర్మీలో పని చేసే కెప్టెన్
శివకుమార్ కి, ఢిల్లీ నించి వచ్చిన వైర్ లెస్ మెసేజ్ ని ఓ అర్దర్లీ తీసుకొచ్చి
సెల్యూట్ చేసి ఇచ్చాడు. ఓ మేప్ ని పరిశీలిస్తున్న కెప్టెన్ ఆ కాగితాన్ని
యధాలాపంగా చూసాడు. బాల్ పెన్ తో రెండే రెండు వాక్యాలు రాసి
వున్నాయి ఆ మెసేజ్ లో. అది చదవగానే అతని శరీరం క్షణకాలం కంపిం
చింది. 'శివ శివ' అనుకున్నాడు మనసులో. క్షణాల్లో అతని కళ్ళు తడి
అయ్యాయి.

• • • •

కోయంబత్తూరులోని చిన్న క్లినిక్ అది. ముందు గది క్లినిక్, వెనక
గది ఇల్లు. డాక్టర్ గా కంటే సుందరాంబాళ్ కి క్లినిక్ తోపాటు నడిపే
ఎస్.టి.డి. బూత్ వల్ల ఆదాయం అధికంగా వస్తుంది.

సుందరాంబాళ్ కూతురు వెనక గదిలోంచి వచ్చి తమిళంలో అడి
గింది-

"మమ్మీ! నువ్వు కాలేజీ ఫీజు ఇస్తేకాని, ఇవాళ కాలేజీకి వెళ్ళలేను.
ఫీజు తీసుకురాకుండా రావద్దన్నారు."

"వెళ్ళు, రేపు కడతానని చెప్పు."

"డబ్బు లేకుండా వస్తే నిన్ను వెంటపెట్టుకుని తీసుకురమ్మన్నారు.
ఇవాళ లేని డబ్బు రేపు మాత్రం ఎక్కడనించి వస్తుంది?"

"అంతా శివబాబా దయ" గొణిగింది సుందరాంబాళ్.

"నాకు నలుగురిలో తల తీసేసినట్లుగా వుంటోంది. మనకీ దరిద్రం
ఇంకా ఎంతకాలం మమ్మీ?" అడిగిందా అమ్మాయి బాధగా.

"అది నాకూ అర్ధంకావడంలేదు తల్లీ!"

కొరియర్ మెసెంజర్ వచ్చి ఓ కవర్‌కి స్టేపిల్ చేసి వున్న రెండు రసీదులమీద సంతకం తీసుకుని, వాటిని చింపుకుని ఆ కవర్‌ని సుందరాంబాళ్‌కి ఇచ్చి వెళ్ళాడు. కవర్‌మీద చిరునామాని చదివి అది 'శివబాబా ఆశ్రమం' నించి వచ్చిందని గ్రహించగానే ఆత్రంగా దాన్ని చింపి ఓ ఉత్తరం బయటకి తీసింది. చీరల ప్రకటన పాంప్లెట్‌కి వెనకపక్క రాసివున్న శివబాబా చేతిరాతని గుర్తుపట్టి చదివింది.

"అయ్యయ్యో!" అరిచింది సుందరాంబాళ్ వెంటనే బాధగా.

"ఏమిటి? ఎవరినించి అది?" అడిగింది కూతురు తల్లిని.

అప్పటికే మనసు స్థబ్దం అవడంతో ఆవిడ నోరు పెగల్లేదు. కూతురు ఆ కాగితం తీసుకుంది.

శివ,

ఈ శనివారం నా దేహత్యాగం. వీలుంటే రా.

—శివబాబా

అయితే ఆ అక్షరాలు తమిళంలో వున్నాయి.

"ఇవాళేం వారం?" అడిగింది సుందరాంబాళ్ తేరుకుంటూ.

"గురువారం."

"ఎల్లుండికల్లా నేనక్కడ వుండాలి." కన్నీరు కారుతూంటే స్థిరంగా చెప్పింది సుందరాంబాళ్.

"శివబాబా దగ్గరకా? ఇంట్లో వున్నది పద్నాలుగు రూపాయలే. ఈ నెలయినా ఫోన్ బిల్ కట్టాలి కదా?"

"అదంతా నాకు తెలీదు. నేను ఖచ్చితంగా వెళ్ళాలి. అందుకు నాకు తొమ్మిది వందలు వెళ్ళిరావడానికి కావాలి" బలహీన కంఠంతో చెప్పింది సుందరాంబాళ్.

ఇంట్లోని ఏ వస్తువు అమ్మాలా అని ఆవిడ ఆలోచిస్తోంది. అంత ఖరీదయింది స్టెతస్కోపే పావుగంట తర్వాత ఒకతను లోపలికి వచ్చి సుందరాంబాళ్‌ని పలకరించి చెప్పాడు.

"అమ్మా! మా అనాథ శరణాలయం పిల్లల్ని ట్రీట్ చేస్తున్నందుకు

మీకు ఇవ్వాల్సినడాంట్లో కొంత ఇస్తున్నాను. గవర్నమెంట్ గ్రాంట్ రిలీజయింది."

ఓచర్‌మీద సంతకం తీసుకుని ఆ డబ్బిచ్చాడు అతను.

"ఎంత?" అడిగింది కూతురు తల్లిని ఆత్రంగా.

"తొమ్మిది వందలు" ఆ ప్రశ్నకి అతను జవాబు చెప్పాడు.

"నాకు తెలుసు, ఇది శివబాబా దయే" ఈసారి కృతజ్ఞతగా బాబా ఫోటోవంక చూస్తూ బయటకి పెద్దగా చెప్పింది సుందరాంబాళ్.

* * * *

"హైదరాబాద్‌కి దాదాపు పదిహేను కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న గ్రామం అది. పేరు మణికొండ.

ఒకప్పుడు అది ఓ చిన్న గ్రామమే. అయినా నేడది దాదాపు సిటీలో కలిసిపోతోంది. దాంతో సిటీబస్సులు కూడా నడుస్తున్నాయి. ఇంకా సిటీ పద్ధతులు ఆ గ్రామాన్ని పూర్తిగా ఆక్రమించుకోలేకపోవడంతో అక్కడ పల్లెటూరి వాతావరణమే కనిపిస్తూంటుంది. ఎక్కువ భాగం పెంకుటిళ్ళే.

మణికొండలో ఈశాన్య దిక్కున వున్న ఓ చిన్న ఇల్లది. వందేళ్ళ క్రితం కట్టిన ఆ పెంకుటింటి మధ్యలో సీలింగ్ లేదు కాబట్టి లోపలకి గాలి, వెలుతురు ధారాంగా వస్తూంటాయి.

ముందు గదిలోంచి ఆ చావిట్లోకి వెళితే దానికి అటు, ఇటు నాలుగు పెద్దగదులు. వెనకాల గోశాలలో నాలుగు ఆవులు, ఒక్క ఎలక్ట్రిసిటీ తప్ప ఆ ఇంట్లో. ఈ వందేళ్ళలో వచ్చిన ఏ ఆధునిక సౌకర్యం, పరికరం లేదు.

ఆ ఇంటి బయటి గుమ్మానికి మామిడి తోరణాలు వేలాడుతున్నాయి. ఇంటి గుమ్మానికి అటు ఇటు పసుపు రాసి కుంకుమబొట్లు పెట్టిన రెండు ఇత్తడి చెంబుల్లో నీళ్ళు. పిలక పైకి కనబడేలా వుంచిన కొబ్బరికాయలు. వాటికి నాలుగు పక్కలా ఆ చెంబుల్లోంచి నాలుగు మామిడాకులు.

లోపల ముందు గదిలో నేలమీద జంఖానాలు పరిచి వున్నాయి.

ఆ గదిలో గోడలకి చాలాకాలం క్రితం ఫ్రేమ్ కట్టించిన వాక్యాలు కొన్ని వేలాడుతున్నాయి.

'దేహాన్ని నమ్మద్దు
దైవాన్ని వదలద్దు.'
'నువ్వు ఏది నాటుతావో
దాని ఫలాన్నే కోసుకుంటావు.'
'నిద్ర కోసం పరుండేవాడు సంసారి
నిద్ర వచ్చినప్పుడు పరుండేవాడు సన్యాసి.'

ఆ ఇంటి వెనక పచ్చగా అరటిచెట్లు, కొబ్బరిచెట్లు, పూలచెట్లతో కళకళలాడే తోట. ఆ తోటలో ఈశాన్య దిక్కులో పదిహేనుమందిదాకా పట్టే ఓ చిన్న కుటీరం. నేల పేడతో అలికి వుంది.

నేలమీద పరిచిన జింకచర్మం మీద ఉత్తరం వైపు చూస్తూ కూర్చుని వున్నారు శివబాబా.

ఆయన మొహంలోని బ్రహ్మ వర్చస్సు చూపరులని ఇట్టే ఆకర్షిస్తోంది. డెబ్బయి ఏళ్ళు పైబడ్డ ఆ మొహంలో ఎలాంటి కల్మషం కాని, లౌక్యం కాని, మాలిన్యం కాని మచ్చుకైనా కనిపించదు. వాటి స్థానంలో అమాయకత్వం, పవిత్రత గోచరిస్తాయి. సన్నగా వున్న ఆయన, ఎంతో ఆరోగ్యంగా కనిపిస్తున్నారు. జడలు కట్టిన జుట్టు, పెరిగిన గడ్డం, నుదుట కుడివైపు ఉసిరికాయంత గడ్డ. పద్మాసనంలో కళ్ళు మూసుకుని కూర్చున్న ఆయన ఒంటిమీద నూలుపోగు కూడా లేదు.

అక్కడి వాతావరణం ఎంతో ప్రశాంతంగా వుంది.

ఆయన ఎదుట జంబుఖానా మీద కూర్చుని వున్నారు, హైదరాబాద్ నించి కారులో వచ్చిన ఓ కుటుంబసభ్యులు. వాళ్ళు వచ్చి గంటవుతోంది.

పావుగంటసేపు ఆయన దర్శనం చేసుకుని వెళ్దామనుకుని వచ్చిన రామ్‌లాల్, అతని కుటుంబసభ్యులు గంటయినా కదల్లేకపోయారు. అక్కడి వాతావరణంలోని గంభీరమైన ప్రశాంతత వాళ్ళకి అంతకుమునుపు ఎన్నడూ ఎక్కడా అనుభవంలోకి రాలేదు. అది తొలిసారి కాబట్టి వాళ్ళకి అక్కడనించి కదలాలనిపించడంలేదు.

"బాబా ఎప్పుడు కళ్ళు తెరుస్తారన్నారు?" అడిగాడు రామ్‌లాల్, బాబా బాగోగులని చూసే ఓ కాషాయాంబరధారిని.

అతను ఆస్ట్రేలియన్ కాబట్టి చర్మం తెల్ల రంగులో వుంది. అతని వంటిమీది కాషాయవస్త్రం ఎక్కడా కుట్టబడలేదు. కొంతభాగం లుంగీలా కట్టుకుని మిగతాది వీపుమీంచి ఛాతీమీద కప్పుకున్నాడు. నలభై ఏళ్ళ వయసున్న అతని మొహంలో కూడా పవిత్రత తొంగిచూస్తోంది.

"బాబా సమాధి స్థితిలోకి వెళ్ళి ఇవాల్టికి నాలుగో రోజు. ఎప్పుడైనా మళ్ళీ ఈ ప్రపంచంలోకి రావచ్చు."

"ఆయన మొహంలోని ఆ తేజస్సు సమాధి స్థితిలోనే వుంటుందా లేక ఎప్పుడూనా?" ప్రశ్నించాడు.

"ఎప్పుడూ."

"ఓ మ్ మ్ మ్ మ్ మ్..."

కొద్దిక్షణాల తర్వాత వినబడ్డ ఆ మంద్రస్వరానికి అంతా బాబావైపు కళ్ళు తిప్పి చూసారు. ఆయన అతి సుదీర్ఘమైన ఓంకారం చేసి నెమ్మదిగా కళ్ళు తెరిచారు. ఆయన దృష్టి సరిగ్గా ఆ కుటుంబసభ్యుల మీదకే ప్రసరించింది. మందహాసం చేసారు.

కళ్ళు.

విశాలమైన ఆ తెల్లటి నేత్రాలు సూదంటురాయిలా చూపరులను ఆకర్షించేలా వున్నాయి.

"దగ్గరకి వెళ్ళండి" చెప్పాడు కాషాయాంబరధారి.

వెళ్ళి నలుగురూ ఆయనకి పాద నమస్కారాలు చేసారు.

"శివార్పణం."

ఆయన చిరునవ్వుతో వాళ్ళవంక వాత్సల్యంగా చూసారు.

"బాబా, నా పేరు రామ్‌లాల్" చెప్పాడు రామ్‌లాల్.

ఆయన తన కుడిపక్కన వున్న గంపలోంచి నాలుగు అరటిపళ్ళు తీసి తలొకటి ఇచ్చి కుడి అరచేత్తో మౌనంగా ఆశీర్వదించారు.

"బాబా...."

ఉన్నట్లుండి రామ్‌లాల్‌లోంచి ఏడుపు తన్నుకువచ్చింది. ఆయన పాదాలమీద పడి బిగ్గరగా ఏడవసాగాడు. శివబాబా ఆయన మెడకింద, వీపు మీద చేత్తో రాస్తూ చెప్పాడు.

"ఓం శాంతిః"

అప్పటికే అతని భార్య కూడా కంటతడి పెట్టింది. ఆమె గొంతుకలో ఏదో అడ్డుపడ్డట్లుగా అయింది.

"అంతా జయమే జరుగుతుంది. వెళ్ళిరండి."

ఆయన చెయ్యెత్తి మరోసారి ఆశీర్వదిస్తే విడవలేక, విడవలేక ఆయన్ని విడిచి వెళ్ళారు.

బాబా పాదాలకి నమస్కారం చేసాడు ఆ కాషాయాంబరధారి.

"వంటయిందా?" ఆయన నవ్వుతూ అడిగాడు.

"అయింది బాబా."

"ఇంకో నలభై మందికి కూడా చెయ్యండి."

"అలాగే బాబా!"

బాబా సమాధిలోంచి బయటకి వచ్చారని ఆ గ్రామస్తులకి తెలియగానే ఒక్కొక్కరు ఆ కుటీరంలోకి వచ్చి ఆయనకి పాదనమస్కారాలు చేసి, ఆయనిచ్చిన ప్రసాదం తీసుకెళ్ళసాగారు.

వంట సగంలో వుండగా రాత్రి పదకొండుకి శివబాబా ఇంటిబయట ఓ బస్సు ఆగింది. అందులోంచి పదకొండుమంది దిగి లోపలకి నడిచారు. మిగిలినవాళ్ళు లోపలే వుండిపోయారు. ఒకతను వాళ్ళని ప్రేమగా పలకరించి ఇంటి బయట బావి దగ్గర కాళ్ళు కడుక్కోడానికి అందరికీ నీళ్ళిచ్చాడు.

"శివబాబా వున్నారా?" అడిగాడు ఒకతను.

"ఉన్నారు."

"అమ్మయ్య. ఉన్నార్ట" చెప్పాడు అతను బస్సులోని వాళ్ళతో.

అంతా లోపలకి వెళ్ళారు.

శివబాబాకి అంతా పాద నమస్కారాలు చేసాక చెప్పాడు ఆయన.

"ముందు వెళ్ళి భోంచెయ్యండి. ఎప్పుడు షిర్డిలో బయలుదేరారో."

వడ్డించే ఆ గది గోడమీద తెల్లరంగుతో ఇలా పెయింట్ చేసి వుంది. భోజనానికి మునుపు స్మరించాల్సిన శ్లోకం.

అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణ వల్లభే
జ్ఞాన వైరాగ్య సిద్ధర్థ్యం
భిక్షాందేహిచ పార్వతి॥

అరటి ఆకుల్లో వడ్డించిన భోజనాల దగ్గర అడిగారు ఒకరు తమని అక్కడికి తీసుకువచ్చినతన్ని.

"మనం షిర్డినుంచి వస్తున్నట్లు ముందుగా బాబాకి ఎప్పుడు కబురు పంపావు?"

వడ్డిస్తున్న కాషాయాంబరధారి అది విని చెప్పాడు.

"ఏ కబురూ రాలేదు. కాని బాబాకి తెలుసు మీరిప్పుడు ఆకలితో ఇక్కడికి వస్తున్నారని."

"ఎలా తెలుసు?"

"పరిపూర్ణ జ్ఞానులకి తెలియనిదేముంటుంది?"

"ఎలా తెలుసు? సరాసరి జగ్గయ్యపేట వెళ్ళిపోవాలనుకున్నాం ముందు. మేమే అనుకోకుండా వచ్చాం" చెప్పారొకరు.

"బాబా మీరొస్తున్నారని చెప్తేనే అన్నం వండాం."

అందరి మొహాల్లో ఎంతో ఆశ్చర్యం. కొందరి మొహాల్లో అపనమ్మకం కూడా.

• • • •

ఆ రాత్రి నిద్ర పోబోయే ముందు అడిగింది రామ్‌లాల్‌ని అతని భార్య.

"ఇందాక బాబా దగ్గర ఎందుకేడ్చారు?"

"ఏమో మరి? నాకు తెలీకుండానే చిత్రంగా ఏడుపు వచ్చేసింది" చెప్పాడాయన.

"నాకూ్కడానండి" చెప్పింది ఆవిడ.

"నా కొలీగ్‌కి కూడా అలాగే జరుగుతుందిట. ఆయన దగ్గరకి వెళ్ళిన వాళ్ళల్లో అధిక భాగం ఏడుస్తారని చెప్పాడు."

"ఆయనలో మొత్తానికి ఏదో పవర్ వుందండి" చెప్పిందావిడ.

2

గుంటూరు జిల్లాలోని వెంకటపాలెంలో నిద్రపోతున్న గురవయ్యకి కల పూర్తవకుండానే మెలకువ వచ్చేసింది. కళ్ళు తెరచి లేచి కూర్చున్నాడు. పక్కనే కిటికీలో వున్న మరచెంబు మీది మూతని తీసి నీళ్ళు కొద్దిగా తాగాడు. పక్క మంచంమీద పడుకుని వున్న భార్యని లేపాడు.

"ఏమిటండీ ఇంత రాత్రి?" విసుక్కుందామె.

"బాబా స్వప్న సందేశం ఇచ్చారు.

బాబా పేరు వినగానే ఆవిడ చిరాకంతా మాయమైంది. వెంటనే లేచి దూరంగా ఓ చెక్కబల్ల మీద వున్న బాబా పాదుకలకి దూరం నించే దణ్ణం పెట్టి అడిగింది.

"ఏమని?"

"ఆయన మనిద్దర్ని రమ్మన్నారు."

"దేనికింత హఠాత్తుగా?"

"శనివారం తను దేహత్యాగం చేస్తున్నానని చెప్పారు."

"ఛ ఊరుకోండి. ఏదో పీడకలై వుంటుంది."

"నాకలా అనిపించడం లేదు."

"కాళ్ళు కడుక్కు వచ్చి పడుకోండి."

ఆయన లేచి వెళ్ళి కాళ్ళు కడుక్కుని తులసి మాలతో అలంకరించిన బాబా పటానికి, ఆయన పాదుకలకి దణ్ణం పెట్టుకుని వచ్చి పడుకున్నాడు.

తెల్లవారుఝామున గురవయ్య భార్య తన భర్తని నిద్ర లేపింది.

"మీ కొచ్చిన కల నిజమేనండి."

"ఇందాక పీడకల అన్నావుగా?"

"శివబాబా నాకూ కలలో కనిపించి, మీకుచెప్పింది నిజమేనని చెప్పారిప్పుడే.... అయ్యో, బాబా లేకుండా మనకెలా?" ఏడవసాగిందావిడ.

గురవయ్యకి కూడా ఏడుపాగలేదు.

* * * *

కర్నాటకలో చిక్‌మగుళూర్ జిల్లాలోని ఓ చిన్న గ్రామం అది. ఓ ఇంట్లో రోజులా శివబాబా ఫోటోకి హారతి ఇస్తున్నాడో పధ్నాలుగేళ్ళ కుర్రాడు. అతని పేరు శరవణ్ణ. అతనికి చెవిలో కన్నడంలో వినిపించింది.

"శివా, నేను దేహత్యాగం చేయబోతున్నాను. వెంటనే బయలు దేరు."

అతనికి క్షణకాలం విస్మయం, తర్వాత దుఃఖం కలగాయి. ఏడుస్తూ గబగబ బయటికి వచ్చి చెప్పాడు తన నాయనమ్మతో.

"నాయనమ్మా, శివ బాబా నన్ను రమ్మని పిలుస్తున్నారు. ఆయన సమాధి చెందబోతున్నారుట."

"ఛ! ఊరుకో పాడు మాటలు...."

"నిజం నాయనమ్మా. బాబాకి హారతి ఇస్తుంటే ఆయన కంఠం నా చెవిలో వినిపించింది."

ఆవిడ తన మనవడి మాటలని భ్రమ కింద కొట్టి పారేసింది. కాని కొద్దిసేపటిలో చేతిలో టెలిగ్రాంతో ఆ కుర్రాడి తండ్రి హడావిడిగా వచ్చాడు.

'బాబా మహాసమాధి చెందబోతున్నారని, శరవణ్ణని వెంటబెట్టుకుని రమ్మని టెలిగ్రాం వచ్చింది' చెప్పాడు.

వెంటనే నాయనమ్మ 'శివ శివ' అంది. కొద్ది నిముషాల్లో ఆ వార్త పాకిపోవడంతో ఆ గ్రామంలోని వారంతా శోక సముద్రంలో మునిగిపోయారు.

"మనకేమయినా అయితే ఇంక పెద్ద దిక్కు ఎవరు?"

శివ బాబాని చూడడానికి ఆ గ్రామస్థుల్లో చాలామంది వెళ్ళాలను కున్నారు.

* * * *

మహారాష్ట్రలోని సతారాకి ముప్పై కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న గ్రామం అది. ఆ గ్రామంలో ఎక్కువ భాగం పందేళ్ళ క్రితం కట్టిన ఇళ్ళే. ఇంకొన్ని ఇంకా ఎక్కువ వయసు గలవి.

ఓ ఇంట్లో నివసించే శారదామా అధ్యాత్మికంగా ఉన్నతస్థితిలోకి చేరుకుందని తేజస్సుగల ఆమె మొహం చూస్తే కొత్తవాళ్ళు కూడా ఇట్టే కనుక్కోగలరు. ఆమె ఇంటి ముందు నాలుగు కార్లు, కొన్ని స్కూటర్లు, సైకిళ్ళు ఆగి వున్నాయి. ఆ రోజు ఆమె బాబా పూజ ముగించి బయటికి వచ్చేసరికి బాంబే, పూనాల నుంచి వచ్చిన పదిమంది దాకా ఆమె రాక కోసం ఎదురుచూస్తూ కూర్చుని ఉన్నారు. రావడం మొదటిసారైన వారి దగ్గరికి వెళ్ళింది శారదామా.

ఆమె చూపుల్లోంచి వర్షించే ప్రేమని వారు తేలిగ్గా గుర్తించారు. ఒక్కొక్కరు తమ ఆరోగ్య సమస్యలని వివరిస్తుంటే, శారదామా తన చేతిలోని విబూధితో వాళ్ళ కనుబొమ్మల మధ్య బొట్టుపెట్టి, నోరు తెరవమని నాలుకమీద చిటికెడు విబూధివేసి, గొంతు దగ్గర ఇంకో బొట్టుపెట్టి చెప్ప సాగింది.

"పోతుంది. శివ బాబా దయ."

కొందరికి ఇంక రానవసరం లేదని, ఇంకొందరికి నాలుగు రోజులాగి రమ్మని చెప్పింది. కొందరు డబ్బివ్వబోతే తల అడ్డంగా ఊపి, "ఇంటికెళ్ళే లోగా దాంతో పళ్ళో, బిస్కట్లో, అన్నమో కొని రోడ్డు పక్కన గుడిసెల్లోని వారికి పంచండి. అలా చేస్తే ఇంకాస్త త్వరగా నయమౌతుంది" చెప్పింది తప్ప బలవంతం చేసినా డబ్బు అంగీకరించలేదు.

బయటి నుంచి ఆమె భర్త రాగానే అడిగింది.

"టిక్కెట్లు దొరికాయా?"

"దొరికాయి. ఇంక కంగారు లేదు" చెప్పాడు ఆమె భర్త గోఖలే.

శివబాబాని తమ ఆప్తుడిగా దైవసమానంగా భావించే అందరూ, శని వారం ఆయన మహాసమాధి చెందడం గురించి తెలియగానే దుఃఖానికి లోనవుతున్నారు. కాని తెల్లవారుఝామున ఆవిడ కళ్ళు మూసుకుని ధ్యానంలో వుండగా, బాబా ఆవిడ కనుబొమల మధ్య, ఆజ్ఞా చక్రంలో కనబడి ఆ విషయం చెప్పినా, ఇతరులలో కలిగిన లాంటి దుఃఖం శారదామాలో కలగలేదు. ఆ వార్తని చాలా ఉదాసీనంగా తీసుకుని ధ్యానంలోంచి బయటికి రాగానే తన భర్తతో చెప్పింది-హైదరాబాద్‌కి తమ ఇద్దరికి రైలు టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకుని రమ్మని.

"ఏమిటి? నీకసలు దుఃఖమే లేదా? అడిగాడు గోఖలే.

"లేదు" చెప్పిందావిడ.

"ఎందుకు లేదు?"

"భగవద్గీతలో శ్రీకృష్ణుడు రెండో అధ్యాయం దాకా నోరు మెదప లేదు. అర్జునుడు ఏమేం వాగాలనుకుంటున్నాడో అంతా వాగనిచ్చాక నోరు విప్పి మొదటగా చెప్పింది దీని గురించే."

"ఓ! అదేనా?"

అశోచ్యాన్ నవ్వశోచ స్త్వం, ప్రజ్ఞా వాందాశ్చ భాషసే!
గతాసూన గతాసూంశ్చ, నాను శోచంతి పండితాః!!

ఆశ్చర్యంగా అడిగాడు భగవద్గీత కంఠతా వచ్చిన గోఖలే.

"అవును."

"శారదా! పండితులు మరణించిన వారి గురించి కాని, జీవించి వున్న వారి గురించి కాని బాధపడరని దానర్థం. ఏడాది క్రితం మన మనవడు పోయినప్పుడు నువ్వు ఎంత రోదించావో గుర్తుందా? ఈ ఏడాది కాలంలో ఆ శ్లోకార్థాన్ని నువ్వు అనుభవపూర్వకంగా ఆచరించగలుగు తున్నావంటే ఆధ్యాత్మికంగా ఎంత ఎదిగావో?" అబ్బుర పడ్డాడాయన.

"అంతా ఆ పాండురంగ విఠల్ దయ, శివబాబా దయ" చెప్పింది శారదామా.

3

"ఎనీ డ్రింక్స్ సర్?" ఎయిర్ హోస్టెస్, రాఘవరెడ్డిని మూడోసారి అడిగింది.

చిరునవ్వుతో తల అడ్డంగా ఊపాడతను.

విమానం బయలుదేరి నాలుగు గంటలైనా, విమానంలో సర్వ్ చేసే ఏవీ తీసుకోని ఏకైక వ్యక్తి రాఘవరెడ్డి. సాధారణంగా ప్రయాణీకులు— ముఖ్యంగా ఇండియన్ ప్రయాణీకులు— విమానంలో ఉచితంగా ఇచ్చే దేన్నీ వదలరు. డిమాండ్ చేసి మరీ తీసుకుంటారు. అలాంటిది బ్రేక్‌ఫాస్ట్ కాని, టీ, కాఫీలు కాని, మినియేచర్ స్కాచ్ బాటిల్, సోడాటిన్ కాని ఏవి ఆఫర్ చేసినా అతను చిరునవ్వుతో నిరాకరించడం గుర్తించిన ఆ ఎయిర్ హోస్టెస్‌కి అతని ప్రవర్తనమీద ఆసక్తి కలిగింది.

మూడోసారి కూడా డ్రింక్స్‌ని నిరాకరించడంతో అడిగిందామె.

"ఎనీ హెల్త్ ప్రాబ్లం సర్?"

"నోనో, ఐ జస్ట్ డోంట్ నీడ్ ఎనీథింగ్. థాంక్ యు."

"మే బి సమ్ ఫ్రూట్ జ్యూస్ సర్?"

"నో థాంక్స్."

"యూ నీడ్ టు హేవ్ సమ్ థింగ్ సర్....లాంగ్ వే."

ఆమె కదలగానే రాఘవరెడ్డి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. అతని మనసు ఎంతో ప్రశాంతంగా వుంది. ఆవాళ ఆ టైంలోనే కాదు, గత రెండేళ్ళుగా ఆ ప్రశాంతతని అనుభవిస్తున్నాడతను.

క్రిందటిరోజు జరిగిన సంఘటనని అతను మరోసారి గుర్తుచేసుకున్నాడు.

న్యూయార్క్‌లోని యూనివర్శిటీలో రాఘవరెడ్డి గత నాలుగేళ్ళుగా మేథమేటిక్స్ ఫేకల్టీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు.

రోజులా క్వీన్స్‌బరోలోని తన ఇంటి నుంచి కారులో యూనివర్శిటీకి ఉదయం ఏడు-అయిదుకల్లా బయలుదేరాడు. కారు కొద్దిదూరం ప్రయాణించాక అకస్మాత్తుగా పక్క ప్రయాణీకుడి సీట్‌లో ప్రత్యక్షం అయిన

శివబాబాని చూసి తన కన్ను చెదిరిందనుకున్నాడు. కాని క్షణాల్లోనే నగ్నంగా వున్న శివబాబా తన పక్కన 'నిజంగా' వుండడం గుర్తించాడు.

"బాబా! నేను కలగంటున్నానా?" ఆశ్చర్యంగా అడిగాడు.

బదులుగా ఆయన రోడ్డువంక చూస్తూ తల అడ్డంగా తిప్పాడు.

"శివా....నీకో ముఖ్యమైన విషయం చెప్పాలని వచ్చాను. మనం ఆఖరిసారి కలుసుకున్నప్పుడు ఏం చెప్పానో గుర్తుందా?"

"ఆ గంటసేపు మనం మాట్లాడుకున్నవన్నీ గుర్తున్నాయి బాబా. అన్నీ డైరీలో నోట్ చేశాను కూడా."

"ఈ కూలివాడు ఈ బరువుని దింపుకునే శుభగడియ వచ్చింది శివా. అది ఈ శనివారమే."

రాఘవరెడ్డికి బాబా ఏం చెప్తున్నాడో అర్థమైంది. ఆరేళ్ళక్రితం తను తన తమ్ముడి మరణం గురించి తెలిసి ఇండియా వెళ్ళినప్పుడు బాబా సన్నిధిలో ఓ రాత్రి గడిపాడు. అప్పుడు తన తమ్ముడు మరణించిన దుఃఖంలో వున్నాడు రాఘవరెడ్డి.

తనని ఓదారుస్తూ మృత్యువు గురించి బాబా వేదాంతం చెప్పారు. తను ఇంకా ఎత్తుకి ఆధ్యాత్మికంగా ఎదగని స్థితిలో వున్నాడప్పుడు.

"నాకు మా వాళ్ళందరిలోకి నా తమ్ముడితోనే ఇంటిమసి ఎక్కువ బాబా. తెలీకుండా పోవడం వేరు. కేన్సర్ వ్యాధి సోకి, తను ఇంక కొన్ని వారాల్లో మరణిస్తాడని ముందే తెలిసి, మానసికంగా, శారీరకంగా ఎంతో బాధ అనుభవిస్తూ చావడం ఎంత నరకం! నేను వాణ్ని గుర్తుపట్టలేక పోయాను. పుల్లలా అయ్యాడు. కుంచించుకుపోయిన వాడి మొహం వాడిదేనని గుర్తుపట్టేలా లేదు...." ఏడుస్తూ చెప్పాడు రాఘవరెడ్డి.

"శివా! నువ్వు ఆ దేహాన్ని నీ తమ్ముడిగా భావిస్తున్నంత కాలం నీకీ దుఃఖం తప్పదు. ఏదైతే ఉన్నంత కాలం ఆ దేహం నడిచిందో, ఏదైతే పోయాక ఆ దేహం కట్టెతో సమానమైనా అది పోకుండా వుంటుందో అదే అసలు కీలకం. ఇది గ్రహించుకోక ఆ రక్తమాంసాలతో కూడిన దేహమే నీ తమ్ముడని నువ్వు భావిస్తున్నంత కాలం నీకు దుఃఖం తప్పదు. ఆ దేహాన్ని నడిపించిన అందులోని బేటరి....దాన్నే ఆత్మ

అంటాం....ఎక్కడికీ పోలేదు. మళ్ళీ ఇంకో దేహంలోకి ఆ చైతన్యం ప్రవేశిస్తుంది. పోయింది ఆ చొక్కాగా, తొడుక్కున్న దేహమే తప్ప దాన్ని తొడుక్కున్న ఆ శివుడు ఎక్కడికీ పోలేదు."

మర్నాడు బాబా దగ్గర శెలవు తీసుకుంటూ చెప్పాడు రాఘవరెడ్డి.

"మీరు చెప్పినట్లు ధ్యానం చేయడానికి ఎక్కువ టైం కేటాయిస్తాను బాబా."

"రోజుకి కనీసం నాలుగు గంటలు ఆసనం మీంచి లేవకుండా ధ్యానం చేయడం అలవాటు చేసుకో. నేనందరికీ చెప్పేది ఇదే. అలా చేస్తే కొంత కాలానికి దేహాన్ని దేహంగా, అందులోని శివుడ్ని శివుడుగా చూడగలవు. అప్పుడే చింతలుండవు."

"అలాగే బాబా."

"చూడు శివా. ఇన్ని కబుర్లు చెప్తున్న బాబాకి తను ఇంకో వారంలో పోతానని తెలిస్తే, చింతించకుండా వుంటాడా అని నిన్న రాత్రి నిద్రపోయే ముందు ఆలోచించావు కదా?" నవ్వుతూ అడిగాడు శివబాబా.

"మీతో ఇదే చిక్కు బాబా. మా మనసుల్లోవన్నీ మీకెలా తెలుస్తుంటాయి? మీరు జ్ఞాని కనకనా?"

"ఓ కూలివాడు తనది కాని వస్తువుని నెత్తిన మోస్తూ, నడుస్తున్నప్పుడు దాన్ని దించే చోటు ఎంత త్వరగా వస్తుందా, ఎప్పుడు బరువు పోయి విశ్రాంతి దొరుకుతుందా అని ఎలా ఎదురు చూస్తూంటాడో, అలాగే మనిషి పుట్టుకకి లక్ష్యం అయిన ఆత్మ సాక్షాత్కారం పొందాక, జ్ఞాని కూడా తన పూర్వజన్మల ప్రారబ్ధ కర్మ వశాన తయారై తగులుకున్న ఈ కట్టెని ఎంత త్వరగా విడిచిపెట్టి వెళ్ళగలడా అని ఎదురు చూస్తూ, దీన్ని అనాసక్తిగా మోస్తూంటాడు."

చాలా ఏళ్ళక్రితం జరిగిన ఆ సంభాషణ రాఘవరెడ్డికి ఇంకా స్పష్టంగా గుర్తుండటంతో శివబాబా ఇందాకటి మాటలని అర్థం చేసుకోగలిగాడు.

"బాబా....మీరు ఈ శనివారం మరణిస్తున్నారా?" అడిగాడు రాఘవరెడ్డి.

"అవును. నీకు వీలుంటే ఆ సమయానికి రమ్మని పిలుద్దామని వచ్చాను."

"బాబా...." అంటూ ఏదో చెప్పబోతూ, పక్క సీటు అకస్మాత్తుగా ఖాళీగా వుండడం చూసి ఆగిపోయాడు రాఘవరెడ్డి.

కారుని సబ్‌వే పార్కింగ్ స్లాట్‌లో పార్క్ చేసి సబ్‌వే రైల్లో వెళుతుంటే రాఘవరెడ్డికి అనుమానం వచ్చింది, తనేమైనా ఈ విషయంలో భ్రాంతికి లోనయ్యాడా అని.

యూనివర్శిటీకి చేరుకున్నాక లిఫ్ట్‌లో పైకి వెళుతుంటే మళ్ళీ శివబాబా అకస్మాత్తుగా కనబడ్డాడు.

"భ్రాంతి కాదు శివా. ఇందాక కారులో నువ్వు విన్నదంతా నిజం. లుఫ్తాన్సా ఎయిర్‌వేస్‌లో రేపటికి బొంబేకి ఒక్కటే టిక్కెట్టు మిగిలివుంది. వెంటనే రిజర్వ్ చేయించుకో."

ఫోన్ చేస్తే అది నిజమే. ఆ ఒక్క టిక్కెట్టు వెంటనే బ్లాక్ చేశాడు.

రాఘవరెడ్డి తన ఆలోచనలలోంచి బయటికి వచ్చి కళ్ళు తెరిచి చూసాడు. ఎదురుగా నిలబడ్డ ఎర్‌హోస్టెస్ ఫ్రూట్ జ్యూస్ వున్న గ్లాస్ ఇస్తూ చెప్పింది.

"ఫ్రెష్ ఫ్రూట్ జ్యూస్ సర్. మే బి యు లైకిట్."

తనేమీ తీసుకోకుండా ఆమె వదలదని గ్రహించి దాన్ని అందుకుని చెప్పాడు.

"థాంక్స్."

"వెల్‌కం సర్."

రాఘవరెడ్డి కేరీబేగ్‌లోంచి తన భార్య చేసిన చపాతీలు పేకట్‌ని తీసి దానికున్న అల్యూమినియం ఫాయిల్‌ని విప్పి అవి తినసాగాడు. అతను తన భార్య వండింది తప్ప ఇతరులు చేసింది తినడం మానుకుని చాలా ఏళ్ళయింది.

విమానం ఇండియా వైపు దూసుకుపోతోంది. తనా విమానంలో

వున్నాడన్న సంగతి బాబాకి తెలిసే వుంటుందని రాఘవరెడ్డికి తెలుసు. తను మధ్యలో చదువుతూ ఆపిన జ్యోతిష శాస్త్రగ్రంథం తెరిచాడు. ఎప్పుడెప్పుడు బాబాని చూస్తానా అని వుందతనికి.

4

శుక్రవారం పడమటి కొండల్లోకి జారుకున్న సూర్యనారాయణుడు తిరిగి శనివారం ఉదయించే సమయంలో మణికొండలోని శివబాబా ఆశ్రమంలోని ఆయన ముఖ్య శిష్యులు అంతకు గంటన్నర ముందు నించే ధ్యానంలో వున్నారు.

రోజుకి అరగంట మించి నిద్రపోని శివబాబా నిద్రలేచి, రోజూలా గోశాలలోకి వెళ్ళాడు. లోపల రెండు నల్లటి ఆవులు, ఓ తెల్లటి ఆవు, ఓ గోధుమరంగు ఆవు, నాలుగు దూడలు వున్నాయి. ఆయన కపిలగోవుల చుట్టూ మూడుసార్లు తిరిగి ప్రదక్షిణం చేస్తూ ఓ శ్లోకం మనసులో చదువుకున్నారు.

గోవః పుణ్యాః పవిత్రాశ్చ గోధనం పావనం తథా।
గోవో భవిష్యం భూతంచ గోషుసర్వం ప్రతిష్ఠితమ్॥

ఆ గోశాలలో గోవులు దురద తీర్చుకోవడానికి వీలుగా నాటబడిన ఆరు అడుగుల ఎత్తుగల లింగాకారపు శిల వుంది. దాని మీద ఈ శ్లోకం రాసి, తాత్పర్యం కూడా రాసి వుంది.

తా॥ గోవులు పవిత్రములైనవి. గోధనమూ పావనమైనది. భూత భవిష్యత్ సంపదలు గోవులే. గోవులయందు సర్వ దేవతలు ప్రతిష్ఠితమై వున్నారు.

దాని తోకని ఎత్తి తన తల మీద కుచ్చుతో కొట్టుకుని, శివబాబా ఆవులముందు కుడితి పెట్టి, కట్టివున్న దూడలని వదిలేసారు. ఏ తల్లి దూడ ఆ తల్లి దగ్గరికి వెళ్ళి పొదుగులోంచి పాలు తాగసాగింది.

తను గోశాలలోని ఆవు పాలు లభ్యం కాకపోతే ఆయన కొబ్బరి నీరు, కొద్దిగా పళ్ళరసంతో వుంటాడు తప్ప వేరే గోవు పాలు తాగడు. అందుకో కారణం వుంది.

సాధారణంగా మనుషులు, దూడ కొంత తాగాక దాని ఆకలి తీర్చకుండానే బలవంతంగా తల్లినించి దూరంగా లాక్కెళ్ళి కట్టేసి, మిగిలిన పాలని తాము పితుక్కుంటారు. అయితే శివబాబా ఆశ్రమంలో అందుకు విరుద్ధంగా జరుగుతుంది. దూడ కడుపునిండా తాగి,వదిలేసే కొద్దిపాలనే పితుకుతారు. దాంట్లోంచి కొద్దిగా తాగాడాయన.

గోశాలలోని ఓ చిన్న పాత్రలో వున్న బియ్యాన్ని ఎండిన కొబ్బరి చిప్ప తీసుకుని బయటికివచ్చి ఓ మూల నేలమీద చల్లారు. వెంటనే పిచ్చుకలు, రామ చిలుకలు, గోరింకలు, అనేక ఇతర రకాల పిట్టలువచ్చి ఆ బియ్యాన్ని తినడానికి వాలాయి.

గోశాల పక్కనే వున్న చిన్న కూరగాయల తోటలో మొక్కలని చూస్తూ తిరిగాడు. కొన్ని మొక్కలకున్న ఎండుటాకులని, కుళ్ళుతున్న ఆకులని తుంపేశాడు.

కుక్కపిల్ల మొరుగుతున్న శబ్దం వినిపించింది. దాన్ని కొద్దిక్షణాలు ఆలకించి విన్నారు బాబా. వెంటనే వెనక తలుపు తెరుచుకుని రోడ్డుమీదికి వెళ్ళి రోడ్డువంక పరిశీలించి చూశారు.

ఓ గోతి దగ్గరకి వెళ్ళి అందులోపడి బయటికి రాలేక అవస్థపడుతూ అరుస్తున్న కుక్కపిల్లనొకదాన్ని చూసి వంగి దాన్ని ప్రేమగా బయటికి తీశారు.

అది చూసి ఇంటి గడపమీద కూర్చుని వేపపుల్లతో దంతావధానం చేస్తున్న ఒకాయన లేచొచ్చి నమస్కరించి చెప్పాడు.

"బాబా-మీకూ మాకూ ఇదే తేడా."

శివబాబా చిరునవ్వుతో చెప్పారు.

"ఇందులో నా గొప్పదనం ఏంలేదు శివా. ఆ కుక్కపిల్ల బాధ నన్ను బాధ పెట్టింది. దాని బాధని తొలగించి నా బాధని నివారణ చేసుకున్నానంతే."

ఉదయమే ఆ గ్రామంలోకి ప్రవేశించిన ఓ కారు వచ్చి ఆ ఇంటి ముందాగింది. అందులోంచి దిగిన ఓ యాభై ఏళ్ళతను లోపలికి నడి చాడు.

శివబాబా దగ్గరకివెళ్ళి పాద నమస్కారం చేశాడు.

"బాబా! ఏడేళ్ళక్రితం మీరు చెప్పింది నిజమైంది" శివబాబా చిరునవ్వు నవ్వారు.

"ఏమైంది శివా?" అడిగారు.

"సర్వజ్ఞాని అయిన మీకు తెలీదని కాదు. అయినా చెప్పాలని వచ్చాను. పదేళ్ళక్రితం మా ఇంట్లో ఓ దొంగతనం జరిగింది. అయిదారు లక్షలరూపాయల విలువ గల బంగారు నగలు పోయాయి. నేను మీ దగ్గరకు వచ్చి ఆ దొంగ ఎవరో చెప్పమంటే మీరు చెప్పకపోగా ప్రతిరోజు నిద్ర లేచాక, పడుకోబోయేముందు ఆ దొంగని దైవం సన్మార్గంలోకి మళ్ళించాలని ప్రార్థించమని చెప్పారు. గుర్తుందా బాబా? నేనీ ప్రార్థన చేస్తూనే వున్నాను. ఆ దొంగ మా దూరపు బంధువే. ఇంటికి వచ్చి ఆ నగని ఎంతకి అమ్మాడో ఆ మొత్తం నాకు తెచ్చి ఇచ్చాడు బాబా! నాకెంతో ఆశ్చర్యంగా వుంది."

"పవర్ ఆఫ్ ప్రేయర్ శివ. పాజిటివ్ ప్రార్థన బలం అంతా ఇంతా కాదు" చెప్పాడు శివబాబా.

ఆశ్రమం ముందాగిన ఓ జీప్ ముందు సీటులోంచి ఢిల్లీనించి వచ్చిన పృథ్వీరాజ్ దిగాడు. అతని తమ్ముడు హైదరాబాద్‌లో సి. ఐ. గా పని చేస్తూండడంతో తన జీపిచ్చి పంపాడు అతన్ని.

ఆశ్రమంలోకి నడిచాడు పృథ్వీరాజ్.

శివబాబా దగ్గర సన్యాసం తీసుకుని ఆరేళ్ళుగా వుంటున్న ఆస్ట్రే లియన్–పూర్వనామం జేమ్స్ రాబర్ట్‌సన్, సన్యాస నామం అమృతానంద గిరి-పృథ్వీరాజ్‌ని గుర్తుపట్టి పలకరింపుగా నవ్వి, అతని చేతిలోని ఎయిర్ బేగ్‌ని తీసుకుని లోపలికి వెళ్ళాడు. అతనిలోని విచారాన్ని పసిగట్టాడు పృథ్వీరాజ్. అతను లోపలికి వెళ్ళేసరికి శివబాబా కృత్రిమ జలపాతంకింద నుంచుని స్నానంచేస్తూ కనబడ్డాడు. బావిలోంచి మోటారుద్వారా తోడే నీరు పన్నెండు అడుగుల ఎత్తునించి, ఆరంగుళాల పైపులోంచి కిందికి ధారగా

పడుతుంటే, దానికింద నిలబడి స్నానం చేస్తున్నారు శివబాబా. ఆ నీరంతా కొబ్బరి, అరటి మొక్కలలోకి పోతోంది.

స్నానానికి ముందు ఆయన మనసులోనే ఈ శ్లోకాన్ని స్మరించారు.

గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి।
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు॥

పై శ్లోకం చదువుకుని నీటిక్రిందకి వెళుతూ-

'నమో గంగే నమో గంగే నమో
గంగే నమో నమః'

అని స్మరించుకుంటూ సాక్షాత్తు గంగానది నీటితో స్నానం చేస్తున్న భావనతో స్నానం చేయసాగారు శివబాబా.

ఆయన ఆ ధార కిందనించి బయటికివచ్చి మోటార్ స్విచ్ ఆఫ్ చేయగానే ఓ చెట్టుకొమ్మకున్న టవల్‌ని తీసి ఆయన ఒళ్ళు తుడవడానికి సిద్ధంగా నిలబడ్డాడు ముందే వచ్చిన శివకుమార్. అతను అమర్‌నాథ్ మిలటరీ కేంప్‌నించి ఢిల్లీకి సర్వీస్ హెలీకాప్టర్‌లో. అక్కడనించి విమానంలో హైదరాబాద్ చేరుకున్నాడు. రాత్రి బంధువుల ఇంట్లో వుండి వాళ్ళ స్కూటర్ తీసుకుని ఉదయం వచ్చాడు.

తన దేహాన్ని తుడవడానికి శివకుమార్ తయారయ్యాడని గ్రహించిన శివబాబా చెప్పాడు.

"టవల్ తీసినచోట పెట్టు శివ"

"నేను తుడుస్తాను బాబా"

"వద్దు శివా. అక్కడ పెట్టు. ఎవరి సేవ నేను తీసుకోను అన్న సంగతి నువ్వు మర్చిపోయినట్లున్నావు" చెప్పాడు బాబా.

ఒకరి తర్వాత ఒకరు పృథ్వీరాజ్, శివకుమార్ నేలమీద సాష్టాంగ నమస్కారం చేశారు.

"శివార్పణం" టవల్‌తో తుడుచుకుంటూ చెప్పాడు శివబాబా.

ఎలాంటి కుశల ప్రశ్నలు వేయకుండా ఆశ్రమం లోపలికి నడిచారు బాబా. ఆ ఇద్దరూ ఆయన్ని అనుసరించారు. శృతి తంబూరాతో మరొకరు విశాలమైన గదిలో కూర్చున్నారు. అప్పటికే తబలాతో ఒకరు, హార్మోనియంతో ఇంకొకరు, సిద్ధంగా కూర్చుని వున్నారు. రోజూలా ఉదయం అయిదున్నరకి శివబాబా పాడుతుంటే, మిగిలినవాళ్ళు గొంతు కలిపి సంకీర్తనలో పాల్గొన్నారు. ఆ గ్రామస్థులు కూడా దాదాపు పాతికమంది వచ్చి ఆ సంకీర్తనలో పాల్గొన్నారు. తన కిష్టమైన గీతం శ్రావ్యమైన కంఠంతో మంద్రస్థాయిలో పాడసాగాడు శివబాబా. మిగిలినవాళ్ళు దాన్ని కోరస్‌గా రిపీట్ చేయసాగారు.

చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమామ్
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమామ్

ఆ భజనకి తను రిథమిక్‌గా చప్పట్లు కొడుతూ అందరితో చెప్పాడు శివబాబా.

"కొట్టండి. మీకో సంగతి తెలుసా? నామ కీర్తన అనే చప్పట్లవల్ల మనసులోని పాపాలనే పక్షులు బెదిరి ఎగిరిపోతాయి. ఎవరైతే చప్పట్లు కొట్టడంలేదో అవి ఎగిరెళ్ళి వాళ్ళమీద వాలుతాయి కాబట్టి అంతా కొట్టండి."

ఆ తర్వాత అంతా కలిసి లింగాష్టకమ్ పాడుతుంటే, ఆయన కళ్ళు మూసుకుని శ్రద్ధగా వినసాగారు.

'బ్రహ్మ మురారి సురార్చిత లింగం
నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజ దుఃఖ వినాశక లింగం
తత్ ప్రణమామి సదాశివ లింగం'

తర్వాత నార్త్ ఇండియాలో బహుళ ప్రాచుర్యంలో వున్న 'బోల్ హరి బోల్' సంకీర్తన సాగింది. అది పూర్తయ్యేలోగా ఆ వూరికి వచ్చిన మొదటి సిటీబస్సులోంచి కోయంబత్తూర్‌నించి వచ్చిన సుందరాంబాళ్ చిన్న చేతి సంచీతో దిగింది. ఆటోలోంచి మహారాష్ట్రలోని సతారా దగ్గర ఓ గ్రామంనించి వచ్చిన గోఖలే శారదామాలు దిగారు. వీరంతా అరగంట

తేడాలో వచ్చి శివబాబాకి పాదాభివందనం చేశారు. సుందరాంబాళ్ స్నానం చేయడానికి లోపలికి వెళ్ళిపోయింది. మిగిలినవాళ్ళు ఆ భజనలో కూర్చుని భజన చేయసాగారు.

ఆరున్నరదాకా 'శ్రీరామ జయరామ జయ జయరామ' అనే తారక మంత్రం ఉచ్చరించారంతా. ఆ మంత్రోచ్చారణ వింటూంటే, కళ్ళుమూసుకుని వున్న శివబాబా కళ్ళవెంట ఆనందంతో నీరు కారసాగింది.

బాబా సరిగ్గా ఆరున్నరకి కళ్ళు తెరిచి గ్రామస్తులందరివంక చూశారు. ఎవరో ఒకరు ఏదో ఓ ఆధ్యాత్మిక ప్రశ్నని అడిగితే ఆయన కొద్దిసేపు వివరణ ఇవ్వడంతో ఆ సమావేశం ముగుస్తుంది. సంకీర్తనానంతరం ఆయన్ని సందర్శకులు ఆధ్యాత్మికంగా తమకున్న అనుమానాలు అడిగి నివృత్తి చేసుకోవడం ఆ ఆశ్రయంలో ఆచారంగా వస్తోంది.

"బాబా! మనుషులు కూడా జంతువులుగా పుడతారా? లేక మళ్ళీమళ్ళీ మనుష్య జన్మ వస్తుందా?" అడిగిందో మహిళ.

"మనిషి జీవించి ఉండగా చేసే పాపపుణ్యాలనిబట్టి జంతు జన్మ లేదా మనిషి జన్మ లభిస్తుంది. అందుకే మనిషి జన్మ లభ్యం కావాలంటే పుణ్యం ఎక్కువ వుండి తీరాలి. అందుకే అంటాడు "దుర్లభో మనుష్య దేహమ్, జంతూనాం నరజన్మ దుర్లభం అని."

"అయితే మన యాదగిరిగాడికి వచ్చే జన్మ జంతు జన్మ ఖాయం" నవ్వాడో పెద్దమనిషి.

"యాదగిరికి పంది జన్మ రావచ్చు" చెప్పాడు శివబాబా నవ్వుతూ.

"పందే అని ఎలా చెప్పగలరు బాబా?" అడిగింది ఇందాకటి మహిళ.

"వాడికి తిండిపిచ్చి. అక్కడా ఇక్కడా చిల్లర దొంగతనాలుచేసి దాంతో మెక్కుతాడుకదా. ఎక్కువ తిండిపిచ్చి గలవారికి పంది జన్మ వస్తుంది. నిజానికి మన దుష్టచర్యలన్నీ మన మనసుల్లో 'దుష్కర్మల ఇంప్రెషన్స్'గా నోట్ అయిపోతాయి. అవి వాళ్ళ మనస్సులోంచి పోయేదాకా ఆయా జంతు జన్మలు తప్పవు. ముక్కోపి తాచుపాముగా, ఇతరులని దోచుకుతినేవాడు పందికొక్కుగా, టక్కరివాడు నక్కగా, మాంసం ఇష్ట

పడేవాడు పులిగా లేదా పిల్లిగా, ఆడదాని సంపాదనమీద ఆధారపడ్డవాడు సింహంగా ఇలా పుడతారు. అందుకే సృష్టిలో ఇన్నిరకాల జీవులు."

"ఒకరికి ఒక్క దుర్గుణం కంటే ఎక్కువ వుంటే బాబా?"

"అప్పుడూ ఎప్పుడూ కూడా మరణ సమయంలో మనసు మీద ఏ విషయం తాలూకు ఇంప్రెషన్ తీవ్రంగా వుందో ఆ కర్మలని తీర్చుకోడానికి ఆ రూపంలో పుడతారు. ఒకదాని తర్వాత ఇంకో జంతు జన్మ వస్తుంది.

"ఛీ....పంది లెక్క పుడితే బురదలో తిరుగుతూ....ఛీఛీ" చెప్పింది ఇంకో మహిళ.

శివబాబా సన్నగా నవ్వి చెప్పాడు-

"మనిషిగా వుండగా మనకి పంది జన్మ నీచంగా తోస్తుంది. కాని ఓసారి పందిగా పుట్టాక తను ఒకప్పుడు మనిషి, ఇప్పుడు పంది అనే జ్ఞాపకం వుండకుండా ప్రకృతి జాగ్రత్తపడుతుంది. కనుక 'అరె! నేను పందిలా పుట్టానే' అనే బాధ వుండదు. పైగా ఆ జీవితాన్ని ఆనందంగా జీవిస్తుంది. ఇలా ఏ యోనిలో పుడితే ఆ జీవి లక్షణాలతో ఆ జన్మని యిబ్బంది లేకుండా జీవాత్మ జీవిస్తుంది. దీనికో కథ వుంది.

ఓ జ్ఞాని వచ్చేజన్మలో తను ఎదురింట్లోని ఓ పందుల మందలో ఓ పందికి పిల్లగా పుడతానని గ్రహించి తన కొడుకుతో చెప్పాడు.

"ఒరేయ్! నా తదనంతరం ఎదురింటి తెల్లమచ్చల పందికి నేను పిల్లగా పుడతాను. పుట్టిన వెంటనే దాన్ని చంపేయ్. దాంతో నాకు మళ్ళీ మనుష్య జన్మ రావడమే కాక, నికృష్టమైన పంది జీవితం గడపాల్సిన అవసరం వుండదు."

కొడుకు సరేనన్నాడు. కొంత కాలానికి ఈ జ్ఞాని మరణానంతరం ఆ తెల్లమచ్చల పందికి పుట్టాడు. జ్ఞాని కాబట్టి దానికి పూర్వజన్మ స్మృతి వుంది. తన కొడుకు చంపడానికి వస్తే చెప్పాడు-తనకి పంది జన్మ బావుందనీ, చంపద్దనీ. ఆ రాత్రి కొడుకు పంచభక్ష్య పరమాన్నాలు చేసి తన తండ్రి పందికి పెట్టి, పట్టెమంచం మీదకి తీసుకెళ్ళి పడుకోబెట్టబోతే అది నిరాకరించి చెప్పింది.

"నాయనా! మనిషిగా ఉన్నంతకాలం నాకు ఈ తిండి, ఈ మంచం సుఖంగా తోచాయి. ఇప్పుడు అశుద్ధం తిని, బురదలో పొర్లాడితే కాని సుఖం లేదు" అని వెళ్ళిపోయింది. కాబట్టి మనలోని శిపుడుకి ఏ జంతువు శరీరాన్ని ధరిస్తే ఆ శరీరం ద్వారా అందే సుఖమే హాయిగా వుంటుంది."

"మరి యాదగిరి పంది జన్మని తప్పించుకోలేడా?" అడిగింది ఓ మహిళ జాలిగా.

"మనిషి తనకున్న పంచేంద్రియాల్లో ఎక్కువగా బానిస అయ్యేది నాలికకే. పట్టుమని అంగుళంన్నర కూడా వుండని ఆ నాలుకకి అనంతమైన రుచులు కావాలి. అందుకే అంటారు. 'నాలికని నియంత్రించిన మనిషి సర్వాన్ని నియంత్రించగలడు' అని. యోగులు ఆహారం విషయంలో నాలికని నియంత్రించడానికి ఎన్నో నియమాలు పాటిస్తారు. కొందరు మూడు ముద్దలు మించి తినరు. కొందరు మారు వడ్డించుకోరు. కొందరు రుచులు తెలీకూడదని అన్ని పదార్థాలు కలుపుకుని తింటారు. మరికొందరు వండని అపక్వ పదార్థాలే తింటారు. ఉప్పే అన్నిటికీ రుచి కాబట్టి నేను కొంత కాలం ఉప్పు లేకుండా వండినవే తినేవాడిని. యోగం ఏం చెప్తోందంటే తినుట కొరకు జీవించువాడు బద్ధుడు. జీవించుట కొరకు తినేవాడు ముక్తుడు."

"బాబా! బంధం అంటే అసలేమిటి?" అడిగాడు ఒకడు.

"బంధం అంటే ఈ కథ వింటే అర్థం అవుతుంది. నదీ స్నానం చేస్తుంటే ఒకడికి అందులో ఓ ఖరీదైన వజ్రాల గొలుసు దొరికింది. దాన్ని అమ్మితే తను, తన పిల్లలు జీవితాంతం హాయిగా జీవించవచ్చన్న ఆలోచనతో ఎంతో ఉల్లాసంగా స్నానం ముగించాడు. కాని నదిలోంచి బయటకి వచ్చాక చూస్తే తన చేతిలోని ఆ గొలుసు కనపడలేదు. అది తిరిగి నదిలోకి పడిపోయిందని గ్రహించి నీళ్ళల్లోకి దిగి దానికోసం చాలాసేపు వెదికాడు. కాని అది దొరకలేదు. దాంతో ఎంతో దుఃఖం వచ్చింది వాడికి. చూడండి చిత్రం. వాడు కష్టపడి సంపాయించిన నగ కాదది సంతోషపడటానికి. అలాగే అది పోయిందని విచారించడానికి అది వాడి తండ్రి తాతల నుంచి వచ్చినదీ కాదు. కొద్ది నిమిషాలక్రితం యాదృచ్ఛికంగా దొరికిన

సొత్తది. తన ఆధీనంలో కేవలం కొద్ది నిముషాలసేపే వున్న ఆ పరాయి సొత్తుమీద మరొకడికి ఏర్పడిన మమకారమే బంధం అంటే మానవులంతా ఇలా కొన్ని నిముషాలనించి కొన్ని ఏళ్ళపాటు అనుబంధంగల ఎన్నిటినో, ఎందరినో 'తమ స్వంతం' అనే భ్రమలోపడి అనేక బంధాల్లో చిక్కుకుంటున్నారు. ఈ బంధం కారణంగానే సుఖదుఃఖాలని అనుభవిస్తున్నారు."

"మరి ఇది మాకందరికీ సహజమేకదా! బంధంలో చిక్కుకోకుండా వుండాలంటే ఎలా బాబా?"

"ఈ చిక్కుముళ్ళన్నిటికీ మనసే కారణం. ఉప్పు, చక్కెర కలిపేస్తే చీమ చక్కెరని తిని కేవలం ఉప్పుని వదిలేసినట్లు మనం మనల్ని బంధాల్లో చిక్కుకునేలా చేసే ఉప్పుని వదిలేసి, బ్రహ్మ పదార్థానికి దైవానికి దగ్గరకి తీసుకెళ్ళే చక్కెరనే తీసుకుంటే బంధాల్లో చిక్కుకోం. కోరుకునే ముందు 'ఇది నన్ను దానికి బంధితుడ్ని చేస్తుందా?' అని ప్రశ్నించుకుని తర్వాత అది కావాలో వద్దో నిర్ణయించుకోవాలి. మనం ఎంత బంధితులమంటే పైంకి కాఫీ లేదా వక్కపొడి లేదా దినపత్రిక చేతికి అందకపోతే వూరుకోలేం. మజ్జిగ లేదా పెరుగుతో భోజనం ముగించకపోతే చాలా మందికి అన్నం తిన్నట్లే వుండదు."

"నిజమే" ఒప్పుకున్నాడొకడు.

"మనం చూస్తుంటాం. కుక్కలు కలిసి ఆడుకుంటూ వుంటాయి. కాని ఆహారం దగ్గరికి వచ్చేసరికి కొట్లాడుకుంటాయి. మానవ ప్రేమలన్నీ అలాంటివే. తమ ఆనందం కోసం ప్రేమిస్తారు. ఆ ఆనందం లభ్యం అవడం ఆగిపోతే మానేస్తారు. పైగా ద్వేషిస్తారు. తమ స్వలాభానికి, స్వార్థానికి అడ్డుపడ్డవాళ్ళని ప్రేమించలేరు. దైవ ప్రేమ అలాకాదు. ప్రతిఫలం కోరకుండా యిస్తుంది. చాలా ఏళ్ళుగా దీన్ని మీకు అనేక రకాలుగా చెపుతున్నాను. మీరే నిర్ణయించుకోండి మీకేరకం ప్రేమ కావాలో."

సమయ పాలనకి విలువ ఇచ్చే బాబా చెప్పారు. "టిఫిన్ రెడీ అయింది చల్లారకుండా వెంటనే వెళ్ళి తినండి."

అంతా లేచి ఆ ఇంటి మధ్యలో వున్న చావిట్లోకి నడిచారు.

5

మణికొండ గ్రామంలో మరోవైపున చిన్న పెంకుటిల్లది.

అందులో నివశించే మల్లేష్ తాపీమేస్త్రీ పని చేస్తున్నాడు. అతని భార్య యాదమ్మ అతని చేతిక్రింద అడ కూలిగా పనిచేస్తూ అతనితోపాటు పనికి వెళుతుంటుంది. యాదమ్మ అప్పుడే నిద్రలేచిన భర్తతో చెప్పింది.

"ఇందాక పద్రంగాయన చెపుతున్నాడు. ఇవాళ బాబా కాలం చేస్తారని అంతా అనుకుంటున్నారట."

"చావు చెప్పి వస్తుందిటే నీ పిచ్చిగానీ."

"ఆయన్నోసారి పూర్వం మనింటికి పిలిస్తే వస్తామన్నారు. కాని ఇంతదాకా రానేలేదు చూశావా? ఆయనొస్తే ఓ పండో, ఫలమో ఇద్దాం అనుకున్నాను" చెప్పిందావిడ బాధగా.

"పేదోళ్ళ ఇళ్ళకి ఎందుకు వస్తాడే నీ పిచ్చిగానీ. చూస్తున్నావుగా. ఆశ్రమం ఎదుట రోజూ పట్నం నించి వచ్చే కార్లు, మోటార్ బస్సునూ!"

మల్లేష్ లేచి దంతావధానానికి వెళ్ళాడు.

అతను కొద్ది నిమిషాల్లో బాత్‌రూమ్‌లోంచి టవల్‌తో మొహం తుడుచుకుంటూ బయటికి వచ్చేసరికి అక్కడి దృశ్యం అతన్నాశ్చర్యపరిచింది.

ఎదురుగా చెక్క కుర్చీలో శివబాబా కూర్చుని వున్నాడు. ఆయన రెండు కాళ్ళు ఓ జర్మన్‌సిల్వర్ పళ్ళెంలో వున్నాయి. యాదమ్మ ఆయన కాళ్ళని కడుగుతోంది. ఎన్నడూ తన ఇంటికిరాని ఆయన్ని చూడగానే మల్లేష్ అప్రయత్నంగా రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టాడు.

"నీవు పొరబడ్డావ్ శివ! పేదవారు ధనవంతులు అన్నది నాకు పట్టని విషయం. భగవంతుని నివాస స్థలమైన భక్తుని ఇంటికి పిలవకున్నా వస్తాను. ఇది అటువంటి ఇల్లే. నెల నెలా సత్యనారాయణ వ్రతం ఎంతో భక్తిగా చేస్తారు మీరిద్దరూ. నాకు తెలీదనుకుంటున్నారా? మీరు ప్రతీ శివరాత్రికి ఉపవాసం వుండి జాగరణ చేసి కీసరగుట్టలోని శివాలయానికి వెళ్తుంటారు."

ఎంతో విభ్రాంతిగా చూశాడు మల్లేష్.

"నేను ఇవాళ ఈ సమయానికి నీ ఇంటికి రావాలని దేముడు నిర్ణయిస్తే ముందుగా ఎలా రాగలను చెప్పు?"

"బాబా, పాలు తీసుకోండి" పాలగ్లాసుతో వచ్చిన యాదమ్మ చెప్పింది.

"అవొద్దు. అవి నీ బిడ్డకోసం దాచినవి. బుట్టలో పండిన టమోటాలున్నాయి కదా. అందులో ఓ పండివ్వు చాలు."

అది తిన్నాక ఆయన లేస్తూ చెప్పారు.

"మీరు విన్నది నిజమే. ఈ రోజే నా మరణం. రాత్రి పదిన్నరకి ఇద్దరూ రండి. వెళ్తాను. అక్కడ నా కోసం చాలామంది వేచి వున్నారు."

వెళ్ళిపోతున్న ఆయనవంక ఇద్దరూ చూస్తుండిపోయారు.

"ఎంత చిత్రం! ఇక్కడ మన మాటలన్నీ ఆయనకి ఎలా తెలిసాయో!" చెప్పాడు మల్లేష్.

"బుట్టలో టమోటాల మాట ఎలా తెలిసిందో?"

ఆయన వెళ్ళగానే ఆయన పాదోదకాన్ని ఇద్దరూ భక్తిగా నెత్తిన చల్లుకుని ఇంకా నిద్ర లేవని తమ ఏడాదిన్నర పిల్లాడి నెత్తిమీద కూడా చల్లారు.

* * * *

శివబాబా నిర్యాణ వార్త అనేక రకాలుగా అందుకుని మణికొండకి చేరుకున్న ఆయన శిష్యులు ఉదయపు ఫలహారం చేస్తున్నారు. ఇత్తడి గిన్నెలో వండిన పులగాన్ని సుందరాంబాళ్ అందరికీ, కుట్టిన బాదం ఆకుల విస్తళ్ళలో వడ్డించింది. వారితోపాటు ఆ ఆశ్రమంలో వుండే దాదాపు వది మంది శిష్యులు, కొందరు గ్రామస్తులు కూడా కూర్చున్నారు.

తినబోయే ముందు కళ్ళు మూసుకుని అంతా ఒకేసారి బయటికి చదివారీ శ్లోకాలు.

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ
బ్రహ్మణాహుతం।
బ్రహ్మైవతేనగంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా॥
అహంవైశ్వానరోభూత్వా ప్రాణినాందేహమాశ్రితః।
ప్రాణాపానసమాయుక్తం పచామ్యన్నం చతుర్విధమ్॥

భగవద్గీతలో ఈ రెండు శ్లోకాలు భోజనానికి ముందు స్మరించుకుని తినాలన్న శివబాబా శిక్షణని వారు చాలాకాలంగా తు.చ తప్పకుండా ఆచరిస్తున్నారు.

వారు అల్పాహారం ముగించుకుని కాఫీ తాగేలోగా మల్లేష్ ఇంటినించి శివబాబా వచ్చారు. ఆయన హాల్లోని జింకచర్మం మీద కూర్చోగానే శిష్యుడు నిరంజనానందస్వామి ఉదయం శివబాబా స్వయంగా పితికిన కపిల గోవు పాలని చిన్నమట్టి పిడతలో తెచ్చాడు. ఆయన దాన్ని తెచ్చిన శిష్యుడివంక ప్రసన్నంగా చూసి అందుకున్నాడు. నిరంజనానందస్వామి కళ్ళు తడిగా, వదనం విచారంగా వుండడం గమనించాడు శివబాబా.

పాలు తాగబోయే ముందు కళ్ళు మూసుకుని ఈ శ్లోకం మనసులో చదువుకున్నాడాయన.

అన్నపతే అన్నశ్యనోదేహి అన్నమీవశ్య సుస్మిణః।
ప్రపదా తారంతారిష్ ఊర్జంనో దేహిద్విపదే
చన్ చతుష్పదే॥

దానర్థం 'నీవు ఇచ్చే ఈ అన్నం, ప్రాణాన్ని కాపాడుతుంది. ప్రపంచంలోని అన్ని జీవరాశులకి కూడా ఆహారం ప్రసాదించు స్వామీ! రెండు కాళ్ళ వాళ్ళకిలాగే నాలుగు కాళ్ళ జంతువుకి కూడా ఆహారం ఇమ్ము."

ఆయన పాలని నెమ్మదిగా తాగాక ఆ ఖాళీ మట్టి పిడతని తీసుకున్నాడు నిరంజనానందస్వామి.

మళ్ళీ రాత్రి పడుకోబోయేముందు అంతే పాలని తాగుతాడు శివ బాబా. మధ్యలో ఇంకేం తీసుకోడు. ఎవరైనా భక్తులు ఇచ్చిన పండో, ఫలమో అరుదుగా కొద్దిగా తిని ఇస్తే, ఆ ఉచ్ఛిష్టాన్ని (ఎంగిలిని) భక్తులు కళ్ళకద్దుకుని తింటారు. అరుదుగా కొద్దిగా కొబ్బరినీరు తీసుకుంటారు.

ఉపాహారం అయ్యాక అంతా ముందు గదిలోకి వచ్చి బాబా చుట్టూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. గ్రామస్తులు కొందరు వెనక వరసలో కూర్చు న్నారు. అందరి మొహాల్లోకి ఆప్యాయంగా చూసాడు బాబా. వివిధప్రాంతాల నించి వచ్చిన తన ఇరవై అయిదుగురు ప్రియశిష్యుల వదనాల్లో విచారం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కొందరి కళ్ళల్లో గంగా, గోదావరులు కనిపిస్తు న్నాయి. ఒక్క శారదామా ముఖం మాత్రం ఎలాంటి విచారం లేకుండా ప్రశాంతంగా వుంది.

తన ముఖ్య శిష్యుల్లో ఒకరు తప్ప అంతా వచ్చారని గ్రహించాడు శివబాబా. యు.పిలోని ఆలీఘర్ నించి వచ్చిన సంతోష్‌కుమార్ అడిగాడు ఏడుస్తూనే.

"బాబా! మీరు నాకు స్వప్నంలో కనబడి, ఈరోజు దేహత్యాగం చేస్తున్నానని చెప్పింది నా భ్రమనుకుని బయలుదేరాను. తీరా ఇక్కడికి వచ్చాక నిజమని అంటున్నారు. అది నిజమేనా?"

"అవును శివా" అతనివంక ఆప్యాయంగా చూస్తూ చెప్పాడు శివ బాబా.

ఆయన ఆ విషయం కన్ఫం చేయగానే సుందరాంబాళ్ ఏడుపు స్థాయి పెరిగింది. మరికొందరికి కూడా.

"బాబా! మరి మాకింక దిక్కెవరు?" రోదిస్తూ అడిగాడు పృథ్వీ రాజ్.

సన్నగా మందహాసం చేశాడు శివబాబా.

"ఎవరినీ దిక్కు లేకుండా చెయ్యడా పరమాత్ముడు. నేను చెప్పిన రీతిలో అంతా ధ్యానం చేసుకుంటూండండి. ఎవరికైనా అదే పెద్ద దిక్కు. ఆ పెద్ద దిక్కే. ఈ జీవుడ్ని ఈ దశకి తెచ్చింది. ఎన్నోసార్లు మీకందరికీ చెప్పాను. 'నిత్యం స్నానంతో మనం దేహానికంటిన మురికిని ఎలా శుభ్ర

పరుస్తున్నామో అలా ధ్యానంతో ఆత్మ చుట్టూ ఆవరించే కల్మషాన్ని శుద్ధి చేస్తుండాలి' అని.

"బాబా! మీరు మరణిస్తున్నారంటేనే బాధగా వుంది" చెప్పాడు గోవా నించి వచ్చిన డిసౌజా.

"పిచ్చివాడా! నేను మరణించడానికి అసలు పుట్టిందెప్పుడు? అనాదిగా అనంతకాలంగా వుంటూనే వున్నాను. ఎంత చెప్పినా మీరింకా దేహాత్మ బుద్ధిని, ఈ శరీరమే నేను అనే స్పృహని వదలడంలేదు. పంచభూతాలతో తయారైన ఈ దేహం నేను కాను. దీన్ని ఆవిష్కరించుకున్న, ఇందులో తాత్కాలికంగా వున్న పరంజ్యోతినే నేను. ఈ జ్యోతి ఎన్నటికీ ఆరేది కాదు. ఇదివరకు ఈ జ్యోతి ఓ శరీరాన్ని వదలగానే ఈ దేహంలోకి ప్రవే శించింది. ఇలా ఎంతోకాలంగా అనేక దేహయాత్రలు చేస్తూనే వుంది. కాని మొదటిసారిగా ఈ జ్యోతి ఆ దేహయాత్రని చాలిస్తోంది. ఇదివరకటి మరణాలన్నీ తాత్కాలిక మరణాలు. ఇప్పుడు నేను పొందబోయే శాశ్వత మరణం, ఆఖరి మరణం, అఖండ మరణం."

"బాబా! ఆత్మ సాక్షాత్కారం పొందిన గురువు భౌతికంగా లభ్యం అయితే కాని శిష్యులకి ప్రయోజనం వుండదని అంటారు కదా?" ప్రశ్నిం చింది శారదామా.

"అవును. అందుకు కారణం భౌతికంగా వుండే గురువుని ప్రశ్నించి అన్ని అనుమానాలు, సందేహాలు తీర్చుకోవచ్చు. అతను దేహత్యాగం చేశాక ఈ అవకాశం వుండదు. తన శిష్యులని దేహత్యాగం చేసినప్పటికీ సద్గురువు ఆదుకుంటాడు. అందుకు మాస్టర్ సి.వి.వి. గొప్ప ఉదాహరణ. వారు సిద్ధి పొందినా నిత్యం వేలాది శిష్యులచేత ధ్యానం చేయించి సద్గతికి తీసుకెళుతున్నారు.

శివబాబా ఓసారి కళ్ళు మూసుకుని దీర్ఘ ఓంకారం చేసి మళ్ళీ కళ్ళు తెరచి చూస్తూ చెప్పాడు.

"అసలు ఆత్మ అంటే ఏమిటి బాబా?" అడిగాడు ఎర్నాకుళం నుంచి వచ్చిన నాయర్.

"ఆత్మ అంటే ఏమిటో వివరిస్తాను. మీకు పరమాత్మ ఆత్మల గురించి క్షుణ్ణంగా అర్థం అయి తీరాలి."

అంతా ఆసక్తిగా చూశారు ఆయన ఏం చెప్తాడా అని.

శివబాబా మరోసారి కళ్ళు మూసుకుని ఓంకారం చేశాక అందరివంక చూస్తూ చెప్పాడు.

"నేనడిగే ఒకో ప్రశ్నకి సమాధానం తెలిసిన వాళ్ళంతా జవాబు చెప్తూండండి. ఇలా ప్రశ్నోపనిషత్తులోలాగా ప్రశ్నోత్తరాలతో మీకు జీవాత్మ, పరమాత్మల గురించి విశదం అయ్యే ప్రయత్నం చేస్తాను."

తన చుట్టూతా వున్న ఖాళీని చేత్తో చూపిస్తూ చెప్పాడు.

"ఇదే ఆత్మంటే. ఈ శూన్యం, ఈ ఖాళీప్రదేశమే ఆత్మంటే."

"ఇదా ఆత్మ?" నివ్వెరపోయాడు శివకుమార్.

"ఒక్కొక్కరిలో ఒక్కో ఆత్మ వుంటుందని అంటారు. మళ్ళీ ఆత్మ ఒక్కటే అంటారు. ఇది గజిబిజిగా వుంది కదా బాబా?" ప్రశ్నించాడు గురవయ్య.

మరోసారి మందహాసం చేసి శివబాబా తన చుట్టూ వున్న శూన్యాన్ని చేత్తో చూపిస్తూ అడిగాడు.

"ఇక్కడ ఇల్లు కట్టక మునుపు ఏం వుండేది?"

"శూన్యం."

"మణికొండ గ్రామం ఏర్పడక మునుపు?"

"శూన్యం."

భూమిమీద అసలు మనిషి పుట్టుక, ఇన్ని దేశాలు ఏర్పడక మునుపు?"

"శూన్యమే."

"అసలు భూగోళం, నక్షత్రాలు, సూర్య చంద్రులు ఇంకా మన కంటికి కనబడే సమస్త దృశ్య పదార్థం లేనప్పుడు ఈ విశ్వం నిండా ఏం వుంటుంది?"

"శూన్యం."

"అంటే ఈ సృష్టి ప్రారంభంకాక మునుపు అంతటా ఏముంటుంది?"

"శూన్యం."

"అప్పుడు సృష్టి జరగాలంటే, అది ఎక్కడ నించి జరగాలి?"

"ఈ శూన్యం లోంచే."

"సృష్టి చేసేందుకు శక్తి అప్పుడు ఎవరికి ఉన్నట్లు?"

"శూన్యానికే."

"ఈ సకల చరాచర సృష్టి ఎవరిచేత జరుగుతోందని శాస్త్రాలు చెపుతున్నాయి?"

"పరమాత్ముడి చేత. 'సర్వ భూతాని కౌంతేయ....' అనే భగవద్గీతలో తొమ్మిదవ అధ్యాయంలో ఏడో శ్లోకం ద్వారా, కల్పాంతంలో, తనలో లీనమైన సర్వజీవులని, ప్రకృతిని, తిరిగి కల్పారంభంలో మరల నేనే సృష్టిస్తున్నాను అన్నాడు శ్రీకృష్ణుడు" చెప్పాడు గోఖలే.

"అంటే అప్పుడు పరమాత్ముడు ఎవరన్నమాట?"

"శూన్యం."

"మనకి ఆత్మ సాక్షాత్కారానంతరం మన ఆత్మ దేంట్లో కలుస్తుంది?"

"పరమాత్మలో."

"పరమాత్మలో అంటే ఎవరిలో?"

"శూన్యంలో."

"శూన్యంలో కలిసే ఆత్మ ఎలా వుండాలి?"

"శూన్యంలో శూన్యమే కలుస్తుంది కాని భౌతికపదార్థం కలవదు. కాబట్టి శూన్యంగానే వుండాలది."

"శూన్యానికి రూపం వుండగలదా?" ప్రశ్నించాడు శివబాబా.

"ఊహూ. ఉండదు."

"పరమాత్మ నిర్గుణుడు లేదా రూపం లేనివాడు అని విన్నారా?"

ఆ సంభాషణని ఆసక్తిగా వింటున్న అందర్నీ ఉద్దేశిస్తూ, చిరునవ్వుతో ప్రశ్నించాడు శివబాబా.

"విన్నాం బాబా."

"పరమాత్మ ఎందుకు రూపరహితుడో ఇప్పుడు అర్థమైందా?"

"అయింది బాబా. శూన్యానికి రూపం వుండదు కాబట్టి పరమాత్మ రూపరహితుడు."

"పరమాత్మ సర్వాంతర్యామి అని కూడా విన్నారా?"

"విన్నాను బాబా" అందరితోపాటు చెప్పింది సుందరాంబాళ్.

"ఈ భౌతిక పదార్థ సృష్టికి మునుపుండే శూన్యం సర్వాంతర్యామేనా? అంటే అది లేనిచోటు వుండదుకదా!"

"అవును బాబా" చెప్పారంతా.

"అంటే అప్పుడు సర్వత్రా వుండే శూన్యమే పరమాత్మ అని మళ్ళీ తేలుతోంది కదా?"

"అవును బాబా" చెప్పాడు గురవయ్య.

"పరమాత్మ సర్వసమర్థుడు అని కూడా విన్నారుగా?"

"అవును బాబా."

"అతనెలా సర్వసమర్థుడో చెప్పగలరా?" ప్రశ్నించాడు శివబాబా.

"తాను శూన్యమై, శూన్యంలోంచి ఈ సకల చరాచర భౌతికసృష్టి చేశాడు కాబట్టి సర్వసమర్థుడే" చెప్పాడు రామ్‌లాల్.

"భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వసమర్థుడు అంటుంటాం. ఈ మూడు లక్షణాలు శూన్యానికి ఉన్నట్లేగా?"

"అవును బాబా."

"శూన్యంలో సృష్టింపబడ్డ ఈసృష్టి మొత్తం కల్పాంతంలో తనలో లయమౌతుందని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. శ్రీకృష్ణుడే ఆ శూన్యం. ఆ శూన్యంలోకి తిరిగి మొత్తం లయమైపోతుంది. గీత ఎనిమిదో అధ్యాయంలోని పద్దెనిమిదో శ్లోకంలో....

అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః...

ఇదే చెప్పాడు కృష్ణపరమాత్మ. అన్నిచోట్లా శూన్యం వుంటుంది కాబట్టి దైవం సర్వవ్యాపి కూడా. ఆ శూన్యంలోంచే ఈ సృష్టంతా జరిగింది కాబట్టి సర్వజ్ఞుడు. మళ్ళీ తిరిగి లయం చేసుకోగలడు. కాబట్టి 'సర్వసమర్థుడు. నిరాకార పరమాత్మ అంటే ఇప్పుడు మీకు కొద్దిగా బోధపడిందా?" అడిగాడు శివబాబా.

"బాగానే బోధపడింది బాబా" నవ్వుతూ చెప్పాడు పృథ్వీరాజ్.

"ఇక ఆత్మ అంటే ఏమిటో చూద్దాం. మీరు మీ ఇంటి దగ్గర ఓకారు ఎక్కారు. అందులో అప్పుడు శూన్యం కూడా వుంటుంది కదా?" ప్రశ్నించాడు శివబాబా.

"ఉంటుంది."

"కారు కదిలి మీ ఆఫీస్‌కి వెళ్ళేదారిలో ఓ ట్రాఫిక్ లైట్ల దగ్గర కారాగింది. అప్పుడు కూడా అందులో శూన్యం వుంటుందా?"

"వుంటుంది బాబా" చెప్పాడు శివణ్ణ.

"మీ ఇంటి ముందు కారెక్కినప్పుడు వున్న శూన్యమే మీ వెంట వచ్చిందా? లేక ఇది వేరే శూన్యమా?"

ఆ ప్రశ్నకి ఎవరూ వెంటనే సమాధానం చెప్పలేదు.

"వేరే శూన్యం" స్థిరంగా చెప్పాడు శివకుమార్.

"ఆ కారు మీ ఆఫీస్‌కి వెళ్ళి ఆగాక కూడా కారులో శూన్యంవుంది. అది ఇంటి దగ్గర శూన్యం. ట్రాఫిక్ ఐలండ్ దగ్గర శూన్యాలలో ఒకటా లేక వేరా?" ప్రశ్నించాడు శివబాబా.

"వేరేది" చెప్పింది కేరళ నించి వచ్చిన సుధాపాణి.

వెంటనే శారదామా చెప్పింది జవాబు.

"ఉన్నది ఒక్కటే శూన్యం. ఆ శూన్యంలోనే కారు ఇంటినించి ఆఫీస్‌కి ప్రయాణించింది. లోపలి శూన్యం అవిచ్ఛిన్నం. ఎలాగంటే, అసలు సృష్టే జరగక మునుపు మొత్తం ఉన్నది ఒక్కటే శూన్యం. ఆ ఒక్క శూన్యంలోనే ఏ కారు ప్రయాణించినా."

"అర్థమైందా?" చిరునవ్వుతో ప్రశ్నించాడు శివబాబా అందర్నీ.

అర్థమైందన్నట్లుగా కొందరు తలలూపితే మరికొందరు నోటితో చెప్పారు.

"ఆ కారు అనే వాహనం బదులు ఆ శూన్యంలో మీరు మానవ దేహాన్ని లేదా చీమ దేహాన్ని ఇలా సమస్త జీవరాసుల దేహాలని ఊహించు కోండి. ఇప్పుడు ఆయా దేహాలతో వుండే శూన్యం ఒక్కటా? లేక వేరు వేరా?" ప్రశ్నించాడు శివబాబా.

"ఒక్కటే. ఆ ఒక్క శూన్యంలోనే సృష్టించబడ్డ అనేక దేహాలు తిరుగుతున్నాయి" చెప్పాడు శివకుమార్.

"కదా? ఇలా వివిధ ప్రాణుల దేహాల్లో వుండే ఆ శూన్యాన్ని ఆత్మ అంటాం. దేహంలో ఆ శూన్యం ఉన్నంత కాలం అది ఆత్మ. ఒక దేహం లోంచి, ఇంకో దేహంలోకి ఆత్మ ప్రయాణిస్తుందంటే, ఆ శూన్యం పాత దేహంలోంచి ఇంకో కొత్తదేహంలోకి మారుతుంది. అవునా?"

"అవును. గీత రెండో అధ్యాయంలో ఇరవై రెండో శ్లోకంలో 'వాసాంసి జీర్ణాని యధావిహాయ....' ఇదే చెప్తోంది" చెప్పాడు గీతమీద పట్టువున్న గోఖలే.

"అంటే మరణించేది దేహమా? ఆత్మా?"

"దేహమే."

"దేహం మరణించాక శూన్యం లేక ఆత్మ కూడా మరణించిందా?"

"లేదు. ఆత్మ ఎప్పుడూ వుండేదే" చెప్పింది సుందరాంబాళ్.

"అంటే ఆత్మకి లేదా శూన్యానికి మరణం లేదనేగా?" ప్రశ్నించాడు శివబాబా.

"ఎన్నటికీ ఉండదు."

"ఆ ఆత్మని నీరు తడపగలదా? అగ్ని దహించగలదా? ఆయుధం ఛేదించగలదా? వాయువు ఆరిపోయేట్లు చేయగలదా?"

"లేదు. 'నైనం ఛిందంతి శస్త్రాణి, నైనం దహతి పావకః' అని భగవద్గీతలో సాంఖ్య యోగంలో ఇరవై మూడో శ్లోకంలో శ్రీకృష్ణుడు చెప్పింది నాకు ఇప్పుడు అర్థమైంది" చెప్పింది సుందరాంబాళ్.

"అంతేకాదు-దాని తర్వాత శ్లోకంలో 'నిత్యః సర్వగతః స్థాణు రచలోయం సనాతనః' అని కృష్ణుడు ఆత్మ తత్వం నిత్యమని, సర్వవ్యాప్తి గలదని, చలింపనిది, అచలమైనది అని, స్థిరమైనది, శాశ్వతము, సనాతన మని కూడా చెప్పాడు. ఇవన్నీ ఈ స్పేస్‌కి, ఈ శూన్యానికి, ఈ ఆత్మకి వర్తిస్తాయా లేదా?" ప్రశ్నించాడు శివబాబా.

"వర్తిస్తాయి" చెప్పారంతా.

"ఆ అనంత శూన్యాన్ని చెవులతో వినగలమా?"

"లేదు."

"నాలుకతో రుచి చూడగలమా?"

"లేదు."

"భౌతికరూపంగల వస్తువులని తప్ప శూన్యాన్ని కళ్ళతో కన గలమా? చర్మంతో స్పర్శించగలమా? ముక్కుతో వాసన చూడగలమా? లేదు. అది ఇంద్రియాలకి గోచరం కాదు. అందుకనే ఆ తర్వాతి శ్లోకంలో శ్రీకృష్ణుడు 'అవ్యక్తోయమ చింత్యో యమ వికార్యోయముచ్యతే' మనసుకి కూడా అందదన్నాడు. ఇవన్నీ ఈ శూన్యానికి అప్లయ్ అవుతాయి కదా?" ప్రశ్నించాడు శివబాబా.

"అవుతాయి."

"ఇప్పుడు ఎవరైనా చెప్పండి. ఆత్మకి, పరమాత్మకి భేదం ఏమిటి?"

అందరికన్నా సూక్ష్మగ్రాహి అయిన డిసౌజా చెప్పాడు వెంటనే.

"బాబా! ఉన్నది ఒక్క శూన్యమనే పరమాత్మే. అందులో కారు లోని స్పేస్‌లాగా, దేహాల్లోని శూన్యం ఆత్మ. ప్రాణి దేహంలోని శూన్యం కూడా పరమాత్మే. అయినా దాన్ని గుర్తుకోసం జీవాత్మగా పిలుస్తున్నాం. ఆ ప్రాణిదేహం ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా అందులోని శూన్యం ఈ అఖండ శూన్యం లోదే."

"ఇప్పుడు ముక్తి అంటే చెప్పడం ఏమిటో తేలికనుకుంటాను? ఓ దేహంలోంచి ఇంకో దేహంలోకి ప్రయాణించే ఆ శూన్యం ఇంకో దేహం

అంటూ లేకుండా, అలా దేహంలో బంధింపబడకుండా, ఆ అఖండ శూన్యంలో కలిసిపోవడమే ముక్తి.

"అప్పుడు ముక్తి పొందిన వాడి శూన్యం లేదా ఆత్మ అఖండ శూన్యంలో కలిసిపోయి దానితోపాటు అంతటా వుంటుంది. అప్పుడే పుట్టిన తాచుపాము పిల్లకి, పదడుగుల తాచుపాము లక్షణాలన్నీ ఎలా వుంటాయో అలా ఈ మహాశూన్యంలో కలిసిపోయిన ఆ ప్రాణి ఆత్మ లేదా శూన్యంకి ఆ పరమాత్మ లక్షణాలన్నీ అంటే 'సర్వ వ్యాపకత్వం, సర్వజ్ఞత, సర్వ సమర్థత' వస్తాయి. అయితే ఆ మహాశూన్యంలోని ఈ జీవి శూన్యానికి లేదా ఆ పరమాత్మలో కరిగిపోయిన ఈ ఆత్మకి 'తాను ఫలానా' అనే ఐడెంటిటీ ఎప్పటికీ గుర్తుంటుంది.

"అనాదిగా ఇంతదాకా ప్రపంచంలో ఎన్ని కోట్లమంది ముక్తి పొందారో అన్ని కోట్ల ఆత్మలకి తాము ఫలానా అనే స్పృహ నిలిచే వుంటుంది."

శివబాబా చెప్పేది అంతా ఆసక్తిగా వింటున్నారు.

"రామకృష్ణ పరమహంస దాన్నే ఇంకో విధంగా తన శిష్యులకి వివరించారు. సముద్రంలో మునిగిన కడవలోని నీరు, కుండ పెంకుద్వారా వేరుగా వున్నట్లు కనిపిస్తుంది. కాబట్టి ప్రత్యేక నీరుగా గోచరిస్తోంది. కాని ఆ కడవకున్న పెంకు పగిలితే, ఆ నీరు మహాసముద్రంలో కలిసిపోతుంది. అదే ముక్తి. పెంకుగా ఈ దేహం వున్నంతకాలం ఆ దేహధారకి 'నేను' అన్న అహం వుంటుంది. అదే భగవంతుడి నించి దేహధారి ఆత్మని వేరు చేసేది. అహం అన్నా మనస్సు, బుద్ధి అన్నా చిత్తం అన్నా ఒక్కటే. ఆ పెంకుపోతే పరమాత్మలో కలిసిపోతుంది.

"దీన్ని రమణమహర్షి వుప్పుబొమ్మ సముద్రంలోతు తెలుసుకోడానికి అందులో మునిగితే ఇంక బొమ్మ ఎక్కడుంటుంది? సముద్రంలో కరిగిపోతుంది' అన్నారు. ఆదిశంకరాచార్య ఆకాశం, కుండ వుపమానంతో దాన్ని పోల్చారు. నేలమీద వివిధ కుండల్లోని నీళ్ళలో ఆకాశం ప్రతిఫలిస్తూ ఎన్నో ఆకాశాలున్నట్లుగా కనిపిస్తుంది. కాని కుండ పగిలిపోగానే

అందులో ప్రతిబింబించే ఆకాశం నాశనం కాలేదు. ఉన్నది వున్నట్లుగానే వుందని చెప్పారు."

తను చెప్పిన వివరాల గురించి మనసులో మననం చేసుకోవడానికి కొద్దిగా టైమిచ్చి చెప్పాడు శివబాబా.

"నాది అఖండ మరణం అన్నానిందాక. శాశ్వతమరణం, అసలు మరణం అన్నాను. అదేమిటో దీన్నిబట్టి ఎవరికైనా అర్థమైనవారు చెప్పండి."

అమెరికా నుంచి వచ్చిన రాఘవరెడ్డి చెప్పాడు వెంటనే.

"దేహాన్ని విసర్జించాక మీ ఆత్మ విశ్వాత్మలో లీనమై కూడా మా అందరి హృదయాల్లోని శూన్యంతో కలిసి ఏకత్వంగా వుంటుంది. బాబా- ఇప్పుడర్థమైంది నాకు. అందరి హృదయాల్లో వున్న పరమాత్మ అంటే ఏమిటో, ఉన్నది ఒకే ఒక్క ఆత్మ అంటే ఏమిటో, మీరు మరణానంతరం కూడా మా హృదయాంతరాళాల్లో వుంటారంటే ఏమిటో అర్థమైంది బాబా."

"'ఏకపరమాత్మ బహుదేహకర్త' అంటే పరమాత్మ ఒక్కరే అనేక దేహాల్లో వుంటాడని శాస్త్రం. నేను మరణించాక కూడా మీ అందరి హృదయాల్లో ఏక కాలంలో ఎలా వుండగలనో అర్థం చేసుకోండి" చెప్పాడు శివ బాబా.

గురవయ్యతో చెప్పాడు.

"సాంఖ్య యోగంలో రెండవ అధ్యాయంలో 'అవ్యక్తాదీని భూతాని' అనే శ్లోకం ఇప్పుడు అర్థమైంది బాబా. 'అర్జునా! ప్రాణులన్నీ పుట్టుకకి ముందు మరణానంతరం ఇంద్రియ గోచరాలు కాని అవ్యక్తాలు. ముందు అంటే జీవితకాలంలోనే అవి వ్యక్తాలు. అంటే మనం ఇంద్రియాలతో వాటిని గ్రహించగలం' అంటూ శ్రీకృష్ణుడు చెప్పాడు."

"నేను ఇప్పుడు చెప్పినది సదా స్ఫురణలో వుంచుకుంటే, భగవద్గీతలోని చాలా శ్లోకాలు మీకు తేలిగ్గా అర్థమవుతాయి. ఈశ్వరః సర్వ భూతానాం, హృద్దేశేర్జునతిష్ఠతి' అంటే అన్ని జీవరాసులకు నేనే ఆది అన్నాడు. అలాగే ఏడవ అధ్యాయంలోని ఇరవై నాలుగో శ్లోకంలో 'అవ్యక్తం వ్యక్తి

మావన్నం' నేను శాశ్వతమైనవాడ్ని, సర్వోత్తముడ్ని, ఇంద్రియాలకి, మన స్సుకి గోచరించనివాడ్ని' అని చెప్పాడు. ఆ పరమాత్ముడు సమస్త ప్రాణుల హృదయమునందున్న ఆత్మను నేనే. సకల ప్రాణుల, ఆది, మధ్య, స్థితి అంతయూ నేనే అన్నాడు. 'యచ్చాపి సర్వభూతానాం బీజం....' సర్వ ప్రాణుల ఉత్పత్తికి కారణమైన బీజాన్ని నేనే. నేను లేనిదే ఈ చరాచర ప్రాణి ఏదీలేదు....' అని పదో అధ్యాయంలో ముప్పై తొమ్మిదో శ్లోకంలో అన్నాడు."

"బాబా! ఈ శూన్యమే కృష్ణుడు, రాముడు ఇతర అవతారాలు ధరించాయి కదా?"

"అవును. అవసరాన్నిబట్టి ఆ శూన్యంలోని ఓ అంశ అవతార మూర్తిగా రూపం దాలుస్తుంటుంది."

"మరి ఆ శూన్యానికి పేరేం లేదా?"

"ఎందుకులేదు. అవతారమూర్తి శ్రీకృష్ణుడు గీత పదిహేడో అధ్యాయంలో 'ఓం తత్సదితి నిర్దేశో....' అని ఇరవైమూడో శ్లోకంలో శూన్య మనే ఆ సచ్చిదానంద పరబ్రహ్మకు 'ఓమ్, తత్, సత్' అనే మూడు పేర్లున్నాయని చెప్పాడు."

"బాబా! గీతా వాక్యాలయిన 'యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వ మిదంతత్వమ్' ఇంకా కర్మయస్తః శరీరస్థం భూతగ్రామచేతసః మొద లయిన వాక్యాల ద్వారా నేనే సర్వజీవుల ఆత్మని అని శ్రీకృష్ణుడు ఎందుకు చెప్పాడో అర్థం అయింది" చెప్పాడు గోఖలే.

శివబాబా చిరునవ్వు నవ్వి చెప్పాడు.

"మన కంటికి కనిపించే కోట్లాది దేహాలు ఎవరికివారు వేరు అను కోవడంతో రాగద్వేషాలు వచ్చి మనల్ని తగులుకుంటున్నాయి. 'అంతా ఒక్కటే! ఎదుటివాడి శరీరంలోని ఆత్మను నేనే' అని భావించగలిగితే రాగ ద్వేషాలు, ఇష్టా యిష్టాలుండవు. అవే జన్మ బంధానికి కారణాలు" శివబాబా పదమూడో అధ్యాయంలోని ముప్పైమూడో శ్లోకం శ్రావ్యంగా చదివాడు.

"యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।
క్షేత్రం క్షేత్రీ తథాకృత్స్నం ప్రకాశయతి భారత॥

అంటే, ఓ అర్జునా! ఒక్క సూర్యుడే ఈ సమస్త జగత్తుకంతటికీ వెలుగునెలా ఇస్తున్నాడో అలా ఒకే ఆత్మ సర్వ ప్రాణులయందును వుండి వాటిని చైతన్యవంతులుగా చేస్తుంది" దాన్నే ఓ జ్ఞాని శ్లోకం ద్వారా చెప్పాడు.

మృత్పిండమేకో బహు భాండరూపం
సువర్ణమేకం బహు భూషణాన్ని
గోక్షీరమేకం బహు ధేనుజాతి
ఏకపరమాత్మ బహుదేహవర్తే।

"అంటే మట్టి ఒకటే. దాంతో చేసే కుండల రూపాలనేకం. బంగారం ఒకటే. ఆభరణాలు అనేకం. అనేక రంగుల ఆవులనించి వచ్చే పాలు ఒకటే. అలాగే దేహాలు అనేకం. అయినా అందుండే ఏకాత్మ ఒక్కడే"

ఇదే విషయాన్ని ఒక్కో వుపనిషత్తుని ఒకోవిధంగా వివరించింది. ఏ తత్వశాస్త్రం తీసుకున్నా చెప్పేది ఈ సారాంశమే. వాసు దేవసర్వమితి."

శారదామా సన్నగా నవ్వి చెప్పింది.

"షిర్డీ సాయిబాబా చరిత్రలో ఈ కథ నాకిప్పుడు వివరంగా అర్థమైంది బాబా. ఓ భక్తురాలింటికి భోజనానికి వస్తానంటాడు సాయి. కానీ అతనురాడు. వాళ్ళింటికి వచ్చిన ఓ కుక్కకి ఆ చపాతీలు పెడుతుంది ఆమె. మర్నాడు సాయి ఆ భక్తురాలితో 'నా కడుపు నింపావమ్మా' అంటాడు. 'అదేమిటి మీరు రాలేదుగా' అని ఆమె ఆశ్చర్యపోతే, కుక్కరూపంలో వచ్చానంటాడు. నాకర్థం కాలేదు. సాయిగా మానవరూపంలో వెళ్ళకుండా కుక్క రూపంలో ఎందుకెళ్ళాడా అనుకున్నాను. నిజానికి కుక్క దేహంవేరు. సాయిదేహంవేరు. స్వామి మారు వేషంలో కుక్కలా పోలేదు. ఆ రెండు దేహాల్లోని ఆత్మ ఒక్కటే కాబట్టి సాయి ఆమె కుక్కకి చపాతీలు పెట్టడం గురించి తెలుసుకోగలిగాడు."

ఆమెవంక వాత్సల్యంగా చూశాడు శివబాబా.

"బాబా. మీరు నాకు స్వప్న సందేశం ఎలా ఇవ్వగలిగారో కూడా అర్థమైంది. మీ ఆత్మ, ఆ అనంత పరమాత్మలో కలిసిపోబట్టే, మీరు జీవన్ముక్తులయ్యారు. దాంతో మీకు సర్వ వ్యాపకత్వం, సర్వజ్ఞత, సర్వసమర్థత రాబట్టి వేల మైళ్ళ దూరంలో వున్న నాకు చెప్పగలిగారు" చెప్పింది గురవయ్య భార్య.

శివబాబా చిరునవ్వుతో అవునన్నట్లుగా తలూపి చెప్పాడు.

"అందుచేత నేను దేహాన్ని అనే భావం పోగొట్టుకునే అభ్యాసం చేయండి. మీ అందరూ మీ దేహాన్ని మీరుగా భావన చేయడం బదులు, ఆ దేహంలోని శూన్యం లేదా జీవాత్మ లేదా పరమాత్మ మీరని భావిస్తూండండి. ఏ మనిషిని చూసినా అతని దేహాన్ని చూడకండి. అది అతని దేహంలోని పరమాత్మకి అడ్డుగా వుందని భావించండి. అలా భావిస్తుంటే, ఆ బుద్ధి స్థిరపడుతుంది. అది ముక్తికి దగ్గర దారి అవుతుంది.

"నాకో సందేహం బాబా. ఏమీలేని శూన్యంలోంచి ఈ భౌతిక పదార్థాలు ఎలా ఉత్పన్నమయ్యాయసలు? భౌతిక పదార్థాల ఉత్పత్తికి ఏదైనా ఆలంబన కావాలిగా?" అడిగాడు రాఘవరెడ్డి.

"ఇందాక శూన్యం మూడు ప్రధాన లక్షణాలేమిటనుకున్నాం?" ప్రశ్నించాడు శివబాబా వెంటనే.

"సర్వ వ్యాపకత్వం, సర్వజ్ఞత, సర్వ సమర్థత" చెప్పాడు శివకుమార్.

"సర్వ సమర్థత అంటే అర్థం ఏది సంకల్పిస్తే అది నెరవేరడం. ఆ పరమాత్మ సృష్టిని సంకల్పించాడని దాంతో సృష్టి మొదలైందని వేదాలు చెపుతున్నాయి. గీతలో నవమోధ్యాయంలో నిరాకార పరబ్రహ్మమైన నా సంకల్పంతోనే పుట్టి తిరిగి నాయందే ఈ సృష్టి అంతర్గతమవుతున్నదని కదా చెప్పాడు".

"నా డౌట్ క్లియర్ అయింది బాబా" చెప్పాడు రాఘవరెడ్డి.

"తత్ అంటే పరమాత్మ. త్వం అంటే జీవాత్మ. జీవాత్మ పరమా

త్మల మధ్య భేదం తెలుసుకోవడమే తత్వజ్ఞానం. ఇప్పుడు నేను మీకు బోధించిందంతా తత్వజ్ఞానం."

"నాకూ ఓసారి ఇలానే వివేకానందస్వామిలా 'అసలు భగవంతుడంటే ఎవరు?' అన్న అనుమానం వచ్చింది. ఆ ప్రశ్నని ఎందరిని అడిగినా తృప్తికరమైన జవాబు రాలేదు. నా సద్గురువు, ఓంకారానంద బాబాని అడిగాను. ఆయన భగవంతుడంటే శూన్యం అని చెప్పారు. అది చాలా ఆసక్తికరమయిన సమాధానం. అయితే ఆ వివరణ ఇప్పుడు నేను చెప్పిందానికి చాలా భిన్నంగా వుంది."

"బాబా! మీరు మీ గురువు గురించి ఎప్పుడూ పూర్తిగా చెప్పనే లేదు మాకు" చెప్పింది శారదామా వెంటనే.

"అవును. మీ జీవితంలోని కొన్ని ముఖ్య సంఘటనలని మీరు సందర్భోచితంగా చెప్పడమే తప్ప అసలు మీ చరిత్ర మాకు తెలీదు. అది వివరించండి బాబా" అడిగింది సుందరాంబాళ్ కూడా.

"అవును బాబా, దాన్ని నేను గ్రంథస్థం చేస్తాను" చెప్పాడు రచయిత అయిన డిసౌజా.

"లోకంలో చాలామంది మోక్షగాములకి అది ఎంతో ప్రేరణగా వుంటుంది" దాన్ని బలపరిచాడు నాయర్.

"అవును బాబా! జీవితంలో జరిగిన అద్భుత సన్నివేశాలు, ముక్తిని పొందడానికి మీరు పడ్డ శ్రమ, విశ్వమంతా మీరే నిండి వున్నారన్న సంపూర్ణ ఏకత్వ భావనని అనుభవ పూర్వకంగా గ్రహించిన ఆ క్షణంలో కలిగిన మీ అనుభూతులు, అన్నీ చెప్పండి. మీరు మాట్లాడే ప్రతీ పలుకు మా జ్ఞాపకాల్లో పదిల పరుచుకుంటాం" అర్థించాడు శివణ్ణ తండ్రి కూడా.

శివబాబా చిన్నగా తల పంకించాడు. తర్వాత చెప్పాడు.

"నాకు శిష్యులు తక్కువ. ఎవరూ నా దగ్గరకి శిష్యరికం కోరి వచ్చినా నేను పెట్టే నియమాలకి వారు తట్టుకుని నిలబడలేరని మీకందరికీ తెలుసు. భగవద్గీతలో ఏడు వందల శ్లోకాలు, కఠోపనిషత్తులోని నూట పంతొమ్మిది శ్లోకాలు, భగవాన్ శ్రీరమణ మహర్షి ఉపదేశ సారంలోని నలభై శ్లోకాలు కంఠస్థం చేసినవారినే నేను శిష్యులుగా స్వీకరిస్తాను. ఇంకా

వారు మాంసం, మద్యం, పరస్త్రీతో సహాగం చేయకూడదన్నది నిబంధనని పాటించాలని దేహ యాత్రకి అవసరం లేనివేమీ అంటే వక్కపొడి, సిగరెట్, నశ్యంలాంటివేం తీసుకోకూడదన్న నియమం గట్టిగా పాటించాలని నేను చెపుతుంటానని, ఇందువలన నా దగ్గరకి ఎక్కువమంది చేరలేదు."

చిన్నగా నవ్వి మళ్ళీ చెప్పసాగాడు.

"మీరంతా కష్టపడి ఆ గ్రంథాల్లోని శ్లోకాలు కంఠస్థంచేసి నాకు అప్పగించాకే మీరు నా శిష్యులయ్యారు. అయితే ఇది చాలాకాలంక్రితం. మీలోని అందరికీ అవి ఇంకా గుర్తున్నాయో లేదో మీకే తెలియాలి."

కొందరు వెంటనే సిగ్గుగా తలలు వంచుకున్నారు.

"అయితే మీ బిజీ జీవితంలో కూడా మీరు నా శిష్యులవ్వాలనే కోరికతో, తీవ్ర వాంఛతో అప్పట్లో వాటిని ఎందుకు కంఠస్థం చేశారో తెలుసా? మనం నాలుగైదు జన్మలుగా కలిసి వస్తున్నాం. గత జన్మలో మన మధ్యగల ఋణశేషం. అంటే కర్మబంధం తీర్చుకోడానికే తిరిగి ఈ జన్మలో కలిసాం. ఇక్కడున్న నా ఇంకారాని ఇద్దరు శిష్యులు, వెరసి ఈ ఇరవై ఏడుమందితో నాకు గత జన్మ సంబంధాలుండబట్టే మనం ఈ జన్మలో తిరిగి కలిసాం. ఎటొచ్చీ నాకీజన్మలో ఆ కర్మబంధాలన్నీ గుర్తున్నాయి. మీకులేవు. అంతే తేడా."

ఆ మాటలు వినగానే శివబాబా శిష్యులంతా ఆయన్ని ఎంతో విస్మయంగా చూశారు. 'ఈయనకీ నాకు గత జన్మలో ఎలాంటి బంధం వుండి వుండవచ్చు?' అని కూడా కొందరు ఆలోచించారు. అది గ్రహించినట్లుగా చెప్పారాయన.

"అదీ చివర్లో చెపుతాను."

ఆ ఆలోచన వచ్చిన వారికే శివబాబా చెప్పిన ఆ మాటలు అర్థం అయ్యాయి.

"బాబా, మీ ఇంకో శిష్యుడు ఎవరు?" ఇరవై ఆరుమంది మాత్రమే తప్ప ఇరవై ఏడో శిష్యుడుతో పరిచయం లేని నాయర్ ప్రశ్నించాడు.

ఆయన అతనివైపు వాత్సల్యంగా చూస్తూ చెప్పాడు.

"సాయంత్రంలోగా చూద్దురుగాని. ఒకరు వస్తారు. మరొకరు రారు."

తర్వాత ఆయన కళ్ళు మూసుకుని ఓంకారం చేసి కళ్ళు తెరవకుండానే తన జీవిత చరిత్ర చెప్పనారంభించారు. అంతా చెవులు రిక్కించి వినసాగారు.

"ఈ జాతకుడు రాయలసీమలోని కర్నూలు జిల్లా కోయిలకుంట్ల సమీపంలో వున్న భీమునిపాడు అనే చిన్న గ్రామంలో నరసింహయ్య, మహాలక్ష్మమ్మ అనే దంపతులకి నాలుగవ సంతానంగా, రక్తాక్షరి నామ సంవత్సరం, కార్తీక శుద్ధ పౌర్ణమినాడు రోహిణీ నక్షత్రంలో కుంభలగ్నంలో పుట్టాడు."

6

నవంబర్ 12, 1934న నరసింహయ్య, మహాలక్ష్మమ్మలకి బిడ్డ పుట్టడానికి కొద్దినెలల ముందు మహాలక్ష్మమ్మకి స్వప్నంలో ఓ యోగి కనిపించి ఆశీర్వదీస్తూ, మంచి సంతానమే కలుగుతుందని చెప్పడంతో మెలకువ రాగానే ఆ స్వప్న వృత్తాంతం, వెంటనే భర్తని నిద్రలేపి చెప్పింది.

పుట్టిన బిడ్డ ఇరవై ఒకటోరోజు బారసాల చేయబోయే ముందు నరసింహయ్య బిడ్డ జాతకం గీసి పేరు నిర్ణయించడానికి, తమకి వాడుకగా వున్న ఆళ్ళగడ్డలోని శేషాద్రిశాస్త్రి అనే ఓ పండితుడిని రెండెడ్లబండి పంపి పిలిపించాడు.

ఆయన తన కుమారుడు, ఇద్దరు శిష్యులతో వచ్చి ఆ బిడ్డ పుట్టిన సమయం ప్రకారం జాతకం రాసి అనేక లెక్కలు వేశాడు. అది పూర్తయ్యాక శేషాద్రిశాస్త్రి నరసింహయ్యని పిలిచి చెప్పాడు.

"అబ్బాయిని ఇంకోసారి చూస్తాను."

మహాలక్ష్మమ్మ బిడ్డని ఎత్తుకు వస్తే చెప్పాడాయన.

"ఓసారి బాబుని నేలమీద పడుకోబెట్టండి."

ఆవిడ అలా చేయగానే శేషాద్రిశాస్త్రి అమాంతం నేలమీద బోర్లా పడుకుని ఆ బిడ్డడి పాదాలమీద తన తలని ఆన్చి బయటకి చెప్పాడు.

"మహాప్రభో! ఈ దీనుడ్ని కరుణించండి! నేనే జన్మలో వున్నా నాకు భవరోగ చికిత్స చేసి ఈ సంసార సముద్రాన్ని దాటించండి."

ఆయన చేసిన పని చూసి ఇంటిల్లిపాది ఆశ్చర్యపోయారు.

శేషాద్రిశాస్త్రి జ్యోతిష శాస్త్రం క్షుణ్ణంగా చదివిన పండితుడని నరసింహయ్యకి ఆయన మీద ఎనలేని గౌరవం. డబ్భయ్యవ పడిలో పడ్డ ఆయన పసికందుకి అలా నమస్కారం చేయడం అనాచారం అని, పిల్ల వాడికి ఆయుక్షీణమని అనిపించి ఆయన్ని భుజాలు పట్టుకుని లేపాడు.

"ఎంత చక్కటి పుత్రుడ్ని కన్నావయ్యా. అదృష్టవంతుడివి" చెప్పాడాయన ఆనందంగా.

"మీరేం అంటున్నారో నాకు అర్థం కావడం లేదు స్వామీ" చెప్పాడు నరసింహయ్య సంభ్రమంగా.

"ఇప్పుడే జాతకం చూసాను. నీ కొడుకు అసాధారణ విశేష పురుషుడవుతాడు"

"అంటే స్వామీ?"

ఇతను పారమార్థిక చక్రవర్తి అయి, ఆధ్యాత్మిక చింతనతో తన దగ్గరికి వచ్చే అనేకమంది ప్రజానీకాన్ని ఉద్ధరిస్తాడు. ఐహిక వాంఛలతో వచ్చే ఎవరూ ఇతని దయని పొందలేరు. శిష్టాచార్యులు, ఆస్తికులు అయి వుండి పరచింతన గలవారే ఇతని కృపకి పాత్రులవుతారు. అరికాళ్ళు చూడండి. జాతకం ప్రకారం శంఖు చక్రాల గుర్తులుండాలి."

చూస్తే పసికందు అరిపాదాల్లో నిజంగా ఆ గుర్తులు కనబడ్డాయి. శేషాద్రిశాస్త్రి మరోసారి వాడి కాళ్ళకి తలని సున్నితంగా ఆనించి సమస్క రించాడు.

"వద్దండి. మీరు పండితులు" వారించాడు నరసింహయ్య.

ఆ పసికందుని ఉద్దేశించి చెప్పాడు శేషాద్రిశాస్త్రి.

"ఓ మునివర్యా! నన్ను తరింపచేయండి. వివిధ వాసనా సంస్కారాల వల్ల నాలో చెలరేగిన ఐహిక వాంఛలతో సంసార చక్రంలో చిక్కు

కునివున్నాను. నాలోని ఆ వాసనా సంస్కారాలని క్షయం చేయండి. నేను ఏ జన్మలో వున్నా నాకు చేయూతనివ్వండి."

ఆయన లేచి కళ్ళు తుడుచుకుని చెప్పాడు.

"చూస్తుండండి. నేను చెప్పేది నిజం అయే రోజుకు ఈ కాయం వుండదు. అప్పుడు నేను మీకు గుర్తుకు వస్తాను."

గ్రామాల్లో ఇలాంటివి దాగవు. పాలేరు ద్వారా ఆ విషయం అందరికీ తెలిసింది. వెంటనే అంతా వచ్చి ఆ పసికందు పాదాల్లో వున్న శంఖు చక్రాలని చూసారు. శేషాద్రిశాస్త్రి లాంటి ఆయన వాడికి సాష్టాంగ నమస్కారం చేసారన్న సంగతి తెలియడంతో వాళ్ళూ నమస్కారం చేశారు.

ఆ రాత్రి మహాలక్ష్మమ్మ తన భర్తతో చెప్పింది దిగులుగా.

"ఆ శాపం మన కుటుంబంలో కూడా నిజమయ్యేలా వుందండీ."

"నాకా భయం మొదటినుంచీ వుంది" చెప్పాడాయన చిన్నగా నిట్టూరుస్తూ.

దాదాపు రెండొందల ఏళ్ళ క్రితం ఓసారి నరసింహయ్య ముత్తాత ఇంటికి భిక్షకు వచ్చిన ఓ సాధువుని చూసి ఆయన దారుఢ్యంగా పున్నావు. పనిచేసుకుని బతక్క ఎందుకీ సోమరి బ్రతుకు" అని కసిరాడు. భోజనం చేస్తున్న అతను జాపోనపట్టి మధ్యలో లేచేసి క్రోధంగా ఇలా చెప్పాడు.

"నీవు చెప్పింది నిజమయితే సరే....అది అబద్ధమై నేనీ గుడ్డలతో సన్యాసిని కాక, గుణాలలో సన్యాసినైతే భౌతికంగానే కాక మానసికంగా కూడా నేను సన్యాసినయిన పక్షంలో, నీ కుటుంబంలో ప్రతీతరంలోను ఒకరు సన్యాసి అవుతారు. ఇదే గుర్తు."

అతని పెద్ద కొడుకు, నాలుగో మనవడూ సన్యాసులయ్యారు. నరసింహయ్య తమ్ముడు కూడా సన్యాసం తీసుకున్నాడు.

మర్నాడు శేషాద్రిశాస్త్రి పసుపు, గంధం రాసిన జాతక చక్రం పంపాడు. దాంతో పాటు ఆయన రాసిన లేఖలో ఇలా వుంది.

నక్షత్ర ప్రకారం ఫలానా అక్షరంతో పేరు మొదలవ్వాలన్న నిబంధనని ఈ జాతకుని విషయంలో మొదటిసారిగా పాటించటంలేదు.

జాతకుడి నక్షత్రం గాక జాతక లక్షణాలని పరిగణలోకి తీసుకుని మొదటిసారి నామ నిర్ణయం చేసాను. ఈ జాతకుడు మునుల్లో రత్నం లాంటి వాడు. కాబట్టి ఈ జాతకుడి పేరు 'మునిరత్నం'గా నిర్ణయించడమైనది.

నరసింహయ్య బావమరిది కేశవులుకి మొదటి నించి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. అక్కడ యోగులున్నారని, ఇక్కడ సిద్ధపురుషుడున్నారనీ తరచూ గ్రామాంతరం వెళుతుంటాడు. ఒక్కోసారి నెలదాకా తిరిగి రాడు.

కేశవులు అలా అనేకమంది అవధూతల చుట్టూ తిరిగాక భగవాన్ శ్రీరమణ మహర్షి దగ్గర కుదురు వచ్చింది. సాధ్యమైనంత వరకు ఎక్కువ కాలం కేశవులు భగవాన్ సన్నిధిలో గడపసాగాడు.

తన మేనల్లుడికి అన్నప్రాసన చేద్దామనుకుంటున్నామని తిరువన్నామలైలో, రమణాశ్రమంలో వున్న బావమరిదికి నరసింహయ్య లెటర్ రాసాడు. బదులుగా అతన్నించి టెలిగ్రాం వచ్చింది. ఆ కార్యక్రమం భగవాన్ రమణ మహర్షి చేత చేయించడం ఉత్తమం అని అంతా ఆశ్రమానికే రమ్మనమని, మహాలక్ష్మమ్మ పుట్టింటివైపు వారికి కూడా రమణ మహర్షి మీద భక్తి మెండు. దాంతో భర్తని అందుకు ఒప్పించింది. మునిరత్నంతో వారు తిరువన్నామలై వెళ్ళారు.

భగవాన్ శ్రీ రమణ మహర్షి స్వయంగా అన్నప్రాసన చేసారా పసికందుకి. ఆ రోజే పౌర్ణమి కాబట్టి అంతా భగవాన్‌తో అరుణాచలం గిరి ప్రదక్షిణానికి వెళుతుంటే, కొడుకునెత్తుకుని మహాలక్ష్మమ్మ కూడా, ఎనిమిదిమైళ్ళని తెలిసినా జంకకుండా, వారి వెంట బయలుదేరింది.

మర్నాడు వారికి ఆశ్రమంలోని ఓ మహోన్నతమైన తెలుగు వ్యక్తితో పరిచయం అయింది. జ్యోతిష శాస్త్రంలో అపారమైన జ్ఞానంగల ఆయన పేరు గణపతిముని. 'కావ్యకంఠ' అనే బిరుదుందాయనకి.

భగవాన్ శ్రీ రమణ మహర్షికి ఆ పేరు పెట్టింది ఆయనే. రమణులు ఆయన్ని 'నాయన' అని పిలుస్తుంటారు.

మునిరత్నం జాతకాన్ని శ్రద్ధగా పరిశీలించాక చెప్పాడు గణపతి ముని. ఆయన చెప్పిన విశేషాలకి మహాలక్ష్మమ్మ గుండె గుభేలుమంది.

"ఇది అపూర్వమైన జాతకం. ఈ జాతకుడు నిస్సందేహంగా, ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితికి వెళ్ళే ఎన్నో సూచనలు జాతకంలో కనిపిస్తున్నాయి."

"ఈ సంగతే ఈ జాతకం రాసినాయన కూడా అన్నారు. ఇంకాస్త వివరంగా చెప్పగలరా?" ప్రశ్నించాడు నరసింహయ్య వినయంగా.

"ఈ జాతకుడు పుట్టిన దినమే అద్భుతమైంది. లోకకళ్యాణానికి బుద్ధుడికి జ్ఞానోదయమైన పౌర్ణమి దినాన, ఆత్మ దర్శనతత్వాన్ని బోధించిన జగద్గురువైన శ్రీకృష్ణుడు పుట్టిన రోహిణి నక్షత్రంలో పుట్టాడు. రామకృష్ణ పరమహంస తదితర యోగులు ఉదయించిన కుంభ లగ్నంలో పుట్టాడు. మనిషికి 'మోక్షాన్నిచ్చే శివుడికి ప్రీతికరమైన కార్తీకంలో పుట్టాడు. వ్యయంలో కేతువు, లగ్నాధిపతి శని, ఇవన్నీ శుభ సూచకాలు."

ఇవన్నీ వింటూంటే మహాలక్ష్మమ్మ వదనం విషాదంగా మారడం గమనించిన సూక్ష్మగ్రాహి అయిన కావ్యకంఠ గణపతి ముని, ఆ తల్లి మనసు ఎందుకు బాధపడుతుందో ఇట్టే గ్రహించి, అలౌకిక విషయాలు చెప్పడం మాని ఇలా చెప్పాడు.

"చదువు బాగా అబ్బుతుంది. సంస్కృతాంగ్లాలు చదివించండి. చేతిలో పైసా నిలువ వుండదు. కాని ఎప్పుడూ లేమి వుండదు. అంటే సంపాదించింది సంపాదించినట్లుగా ఖర్చు చేసేస్తాడు శత్రువులు లేరు. పదింట గురుదున్నాడు కాబట్టి మంచి గురువు అవచ్చు. కాలేజీ అధ్యాపకుడులాంటి పదవి చేపట్టచ్చు. మానవులకి సాధారణంగా సంతానం వల్లకాని, కళత్రం వల్లకాని వచ్చే కష్టనష్టాలకి అతీతుడు."

వ్యయంలో కేతువు కాబట్టి సన్యాసి అవుతాడన్న సంగతి చివరి వాక్యంలో చెప్పకనే చెప్పాడాయన.

మహాలక్ష్మమ్మ అడిగిన కొన్ని సందేహాలకి నిజం దాచకుండా చమత్కారంగా సమాధానాలు చెప్పి ఆ తల్లి మనసుని ఉపశమింపచేసాడాయన.

మర్నాడు భీమునిపాడు తిరిగి వెళ్ళబోతూ, హాల్లో కూర్చుని, ఉ
తలకి వేరుశనగలు తినిపిస్తున్న కౌపీనధారి అయిన రమణ మహర్షి దగ్గ
శెలవు తీసుకోవడానికి అంతా వెళ్ళారు.

"వెళ్ళొస్తాం స్వామీ. బిడ్డని ఆశీర్వదించండి" చెప్పింది మహా
లక్ష్మమ్మ.

మౌన సంభాషణలో దిట్ట అయిన రమణ మహర్షి ఆమె కనులలో
ఎంతో కరుణతో చూసి చిన్నగా నవ్వాడు. కొద్ది నిముషాల నిశ్శబ్దం తర్వా
మళ్ళీ చెప్పింది మహాలక్ష్మమ్మ.

"మీ ఆశీర్వాదం మాకెప్పుడూ కావాలి భగవాన్."

"అదెప్పుడూ వుండనే వుంది. వెళ్ళిరండి. స్టేషన్‌దాకా బ
మాట్లాడుకున్నారా?" ప్రశ్నించాడాయన.

"శ్రీరామకృష్ణ అయ్యర్ ఆ ఏర్పాటు చేసారు" చెప్పాడు మహా
లక్ష్మమ్మ అన్న కేశవులు.

రమణుడి దగ్గర శెలవు తీసుకుని అంతా రమణాశ్రమంలో
గుర్రపు బండిలో స్టేషన్‌కి చేరుకున్నారు. వాళ్ళు వెళ్ళిన పావుగంటకి
బండి వచ్చింది.

* * * *

క్రమేపీ మహాలక్ష్మమ్మ తన కొడుకు మునిరత్నం ఆధ్యాత్మిక జీవిత
లోకి వెళ్తాడన్న దిగులును మర్చిపోసాగింది. అందుకు ప్రధాన కారణ
మునిరత్నం జీవితం ఎలాంటి ప్రత్యేకతలు లేకుండా సాధారణ పిల్ల
జీవితంలా సాగిపోవడం. అతనిలో ఆ విధమైన ఎలాంటి ఛాయలూ వ్యక్త
కాకుండా, సాధారణ పిల్లల్లాగే ఆటపాటలతో పెరగసాగాడు. చురుకుతన
ఓ పాలు ఎక్కువేమో, భరించలేని అల్లరి.

శేషాద్రిశాస్త్రిని ఇంటికి పిలిపించి అయిదో ఏట అక్షరాభ్యాస
చేసారు. కోయిలకుంట్ల నించి నిత్యం ఓ పండితుడు వచ్చి మునిరత్నాని
సంస్కృతాంధ్రాలు నేర్పించడానికి ఏర్పాటు చేయించాడు నరసింహయ్య.

తండ్రి దగ్గరకన్నా మునిరత్నానికి బాబాయి రామావతారం దగ్గ

ఎక్కువ చనువు. ప్రాపంచిక సుఖాలమీద విసుగుచెందిన రామావతారం
సన్యాసం తీసుకున్నాడు. ఆయన సన్యాసం తీసుకున్న తీరు విచిత్రం.

రామావతారం తోడల్లుడు శ్రీనివాస దీక్షితులుకి సన్యాసం మీద
మోజు. నిత్యం ఆ విషయం యోచిస్తుండేవాడు. తన భార్య తనకి అందుకు
అనుమతి ఇవ్వడంలేదని, ఇచ్చి వుంటే ఈపాటికి కాషాయాంబరధారినయ్యే
వాడినని తరచు మిత్రులతో చెపుతుండేవాడు.

ఆ రోజు ఉగాది. రామావతారం భార్య అతని నెత్తిమీద నువ్వుల
నూనె పోసి, చేత్తో అంటుతోంది. ఆ సమయంలో వాళ్ళ సంభాషణ శ్రీని
వాస దీక్షితులు మీదకి మళ్ళింది.

"ఆయన తప్పకుండా ఏదో ఓ రోజు సన్యాసుల్లో కలిసిపోతాడు"
చెప్పింది అతని భార్య.

"ఏం కలవడు. భార్య అనుమతి ఇవ్వడంలేదని అంటూంటాడు కాని
ఇచ్చినా ఆ పని చేయలేడు. దానికెంత గుండెధైర్యం కావాలి? నా అనే
వస్తువు కాని, మనిషి కాని లేకుండా స్వతంత్రంగా జీవించడం ఆయనవల్ల
కాదు."

"కాదండి. ఆయనకా ఉబలాటం బాగా వుంది."

"పిచ్చి మొహమా! పెళ్ళిలా ఓ ముహూర్తం నిర్ణయించుకుని ఆ
రోజు తీసుకునేది కాదే సన్యాసం అంటే. చావులా చెప్పకుండా వచ్చేది. ఏ
సమయంలో ఆ భావన బలంగా కలిగితే, ఆ క్షణంలోనే తీసుకునేదది.
మామూలు బట్టల బదులు కాషాయం కట్టుకోవడం కాదు సన్యాసం అంటే.
'నాది' అన్న మమకారం అన్నిటా, సర్వత్రా వదులుకోగలగడమే నిజమైన
సన్యాసం అంటే."

"కొన్నిటిని తప్ప అలా అన్నీ వదులుకోవడం ఏ సంసారికీ
సాధ్యం కాదు."

"ఎందుకు కాదు? నువ్వు నాకు సన్యాసానికి అనుమతి ఇవ్వు.
ఎందుకు సాధ్యంకాదో చూపిస్తాను."

"మీ వల్ల కాదు. బోలెడు పొలం వుంది. పెళ్ళికి ఇద్దరమ్మాయి
లున్నారు."

"మానసికంగా ఇవన్నీ వదులుకోవడమే సన్యాసం అంటే, నేనెప్పు వదులుకున్నాను. తామరాకుమీద నీటిబొట్టులా సంసారంలో వున్నానంటే

అంతదాకా తనకి సన్యాసం తీసుకోవాలని వుందని ఎన్నడూ రామ తారం అనకపోవడంతో అతని భార్యకి నవ్వొచ్చింది.

"మీరా? సన్యాసమా? అటు పుల్ల తీసి ఇటు పెట్టమన్నా పెట్ట ఇంట్లోలా బయట గడ్డ పెరుగు దొరకదు. మీవల్ల కాదు" చెప్పిందా నవ్వి.

"నువ్వు సరేనను. ఎందుకు కాదో చేసి చూపిస్తాను" నవ్వు అన్నాడాయన.

"సరే- మీరు సన్యాసం తీసుకోడానికి వప్పుకుంటున్నాను. సన్యసించండి చూద్దాం" చెప్పింది అతని చెవిలో నూనె పోస్తూ.

"ఒకసారి కాదే. మూడుసార్లు అనాలే. మూడుసార్లు ఎందుక మన్నారంటే, మధ్యలో మనసు మార్చుకునేందుకు అవకాశం వుంటుంద

"సరే, మీరు సన్యసించండి. మీరు సన్యసించండి, మీరు స సించండి. మూడుసార్లు అన్నాను. చాలా....ఒళ్ళంతా నూనెతో జిడ్డు వుంది కాని వెంటనే నీళ్ళు తోడమనకండి. ఓ అరగంట నానాక నీ పోస్తాను. కాగుకింద మంట ఆరనేలేదు. నీళ్ళు వేడిగా వుంటాయి."

ఆమె మాట్లాడుతూనే వుంది. రామావతారం లేచి బయటకి చాడు.

ఆ ఇల్లాలు వేరే పనుల్లో పడి భర్త సంగతి మర్చిపోయింది. రెం గంటల తర్వాత స్నానం కోసం పిలిస్తే ఇంట్లోలేదని తెలిసింది. ఒంటి తలకి నూనె జిడ్డుతో, గోచీతో బయటకెక్కడికెళ్ళాడబ్బా అని ఆశ్చ పడిందావిడ. సాయంత్రమైనా రాలేదు.

వాకబు చేస్తే ఆయన పొలం గట్లవెంబడి నడుచుకుంటూ వెళ్తూండ చూసామని కొందరు చెప్పారు. ఆ అవతారంతో వెళ్తున్నారేమిటి అప్పుడే ఆశ్చర్యపోయామన్నారు.

అది వినగానే తనకి, భర్తకి మధ్య జరిగిన సంభాషణని తోటి లికి, బావగారికి గాభరాగా వివరించింది.

"కొంప మునిగాడయితే" చెప్పాడు నరసింహయ్య.

అలా తలంటి స్నానం మధ్యలో, ఒంటినిండా నూనె జిడ్డుతో, స్నానమయేదాకా కూడా ఆగకుండా, సంసారపు జిడ్డుని వదిలించుకుని సన్యాసాశ్రమం స్వీకరించాడు రామావతారం. అతను నడుచుకుంటూ కంచికి చేరుకున్నాడు.

ఆయన అక్కడ లేరు. కొన్ని రోజులకి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి చాతుర్మాస దీక్షలో తమిళనాడులోని ఫలానా గ్రామంలో వున్నారని తెలిసి అక్కడికి వెళ్ళాడు రామావతారం.

ఆయన కాళ్ళమీద పడి తనకి సన్యాస దీక్ష ఇప్పించవలసిందిగా కన్నీళ్ళతో వేడుకున్నాడు.

"ఒంటిమీద బట్టలైనా లేకుండా ఎక్కడనించి వచ్చావు?" ప్రసన్నంగా చూస్తూ ప్రశ్నించారు శ్రీ చంద్రశేఖర సరస్వతి అతన్ని.

తన పేరు, ఊరు పేరు, భార్యకి తనకి మధ్య జరిగిన సంభాషణని తు చ. తప్పకుండా వివరించాడు రామావతారం.

"నీకెంతమంది పిల్లలు? వాళ్ళలో ఎవరంటే నీకు ఎక్కువ ఇష్టం? ఎంత పొలం వుంది? అందులో క్రితం ఏడు ఎకరానికి ఎన్ని కుంచాల ధాన్యం పండింది?" నిదానంగా ప్రశ్నించారు స్వామి.

రామావతారం జవాబు చెప్పకుండా మిన్నకున్నాడు.

మళ్ళీ అదే ప్రశ్న అడిగారు స్వామి. ఈసారి రామావతారం పెదవి విప్పకపోవడంతో పక్కనున్న శిష్యులు స్వామికి సమాధానం యివ్వమని చెప్పారు.

"నా భార్య నాకు సన్యాస దీక్షకి అనుమతి ఇవ్వగానే మానసిక సన్యాసినైన నాకు గతం ఎక్కడుంది స్వామీ? లేని ఆ గతంలో ఓ జీవితం ఆ జీవితంలో నా అనేవాళ్ళు, ఆస్తిపాస్తులు ఎక్కడనించి వచ్చాయని సమాధానం చెప్పను? దైవచింతన తప్ప నాకు వేరు చింతన వద్దనుకుని వచ్చిన నాచేత తిరిగి పాత చింతనలు చేయించడం సబబేనా స్వామీ?" ప్రశ్నించాడు రామావతారం.

స్వామి మధురంగా నవ్వి చెప్పారు.

"నీకు సన్యాసానికి అర్హత వచ్చిందా, లేదా అని పరీక్షించడానికే
అ ప్రశ్నలడిగాను. వాటిలో ఏ ఒక్కదానికి జవాబు చెప్పినా, ఇంటికెళ్ళమని
చెప్పేవాడిని. మమతానుబంధం వదిలించుకున్నాక నీకు నేనిచ్చే దీక్ష శాస్త్ర
ప్రకారం నామమాత్రం. నిజమైన సన్యాసి తన గత జీవితం గురించి
మాట్లాడకూడదు."

అలా తమిళనాడులోని పుదుక్కోట సంస్థానంలో వున్న 'కూత్త
త్తూరు' గ్రామంలో, 1925లో కంచి స్వామి చేతుల మీదుగా రామావతారం
సన్యాసదీక్షని తీసుకున్నాడు. అతనికి 'నిరంజనానంద భారతి' అనే పేరు
పెట్టారు.

ఆ తర్వాత స్వామివారి సలహా ప్రకారం కాలినడకన దేశంలోని
అనేక పుణ్యక్షేత్రాల దర్శనం చేసుకున్నాడు.

రామావతారం కర్ణాటకలో సముద్రం ఒడ్డున వున్న మురుదేశ్వర్
అనే శైవక్షేత్రానికి వెళ్ళగా, అతని గ్రామస్థుడొకడు గుర్తుపట్టి న
సింహయ్యకి టెలిగ్రాం ఇచ్చాడు.

ఆయన తన భార్య, మరదలు, రామావతారం పిల్లలతో ఉ
పడ్డాడు. రామావతారం ఓ పట్టాన ఇంటికి రావడానికి ఇష్టపడకపోయినా
అంతా కలిసి బ్రతిమాలితే శ్రీ చంద్రశేఖర సరస్వతి ఎలా చెప్తే అ
వింటానని, ఆయన దగ్గరకి అందరినీ బయలుదేరదీసాడు.

ఆయన సంగతంతా విని ఎవరికి చెప్పాల్సింది వాళ్ళకి చెప్పి రా
కుదిర్చారు. ఆ ప్రకారం రామావతారం ఇంటి ఆవరణలో వేసే కుటీరంలో
నివాసం వుండేట్లు, నిత్యం భిక్షగా భార్య అన్నం పెట్టేట్లు, ఎట్టి పరిస్థితుల్లో
ఆవిడ రామావతారాన్ని ఇంట్లోకి రమ్మని పిలవకూడదని, సంసారపు గొ
వలు, ఆస్తిపాస్తుల విషయాల్లో సలహాలు, సంప్రదింపులు చేయకూడదని
అతను ఇష్టంవచ్చినప్పుడల్లా కేవలం తీర్థయాత్రల నిమిత్తం మాత్రమే ఇ
వదలి వెళ్ళాలని తీర్పు చెప్పారు. అందుకు అంతా సంతోషంగా ఒప్పు
కున్నారు.

"అతన్ని తీర్థయాత్రలకి వెళ్ళనివ్వండి. బహూదకుడైన తర్వా
కుటీచకుడవుతాడని శాస్త్రం. అనేక వుదకాలు, అంటే తీర్థాలు తిరిగా

అంతా తనలోనే వుందని గ్రహించి ఓ కుటీరంలో స్థిరపడతాడట" నవ్వుతూ
చెప్పారు ఆయన.

ఆ ప్రకారం మునిరత్నం చిన్నతనంలో తన ఇంటి వెనక కుటీరం
లోని, తన పినతండ్రి రామావతారం అనే పూర్వ నామంగల నిరంజనా
నంద భారతి దగ్గరకి తరచూ వెళుతుండేవాడు. ఆయన చెప్పే భారత, భాగ
వతాలు, రామాయణంలోని కథలు వినేవాడు. ఆయన చేసిన తీర్థయాత్రల
వివరాలు చెపుతుంటే ఆసక్తిగా వినేవాడు.

నిత్యం తన దగ్గరికి వస్తున్న మునిరత్నం ఓరోజు రాకపోతే ఆయన
పట్టించుకునేవాడు కాదు. చిన్నప్పుడు అమ్మవారుపోస్తే, ఇంటిల్లిపాదీ
కంగారుపడ్డా, నిరంజనానంద భారతి మాత్రం మునిరత్నం ఆరోగ్యం విష
యంలో ఏమాత్రం అదుర్దాని ప్రకటించలేదు. మహాలక్ష్మమ్మకి అది కించిత్
మనస్తాపంగా వుండి, దాన్ని ఆయనముందు వ్యక్తంచేస్తే ఆయన చిన్నగా
నవ్వి, "ప్రకృతి తనపని తాను చేసుకుంటోంది. చివరికేమవుతుందో అని
నాటకంలో ప్రేక్షకుల్లా చూడ్డం నేర్చుకో! ఎందుకు అనవసరపు వేదనలు?"
అని బదులిచ్చాడు.

గ్రామస్థులు వచ్చి మంచి మాటలేమయినా చెప్పమని కోరితే, "నేనం
దుకు కాదు సన్యాసం తీసుకున్నది. ఆసక్తిగలవారు వచ్చి భజనలు, కీర్తనలు
పాడుకుంటూండండి. నేను విని ఆనందిస్తాను" అనేవాడు.

ఆధ్యాత్మిక పుస్తకాలని నరసింహయ్య తమ్ముడి కోసం తెప్పించే
వాడే తప్ప, నాకిది కావాలని ఎన్నడూ నిరంజనానంద నోరు తెరిచి అడిగి
ఎరగడు. తన భార్య మరణానికి పెద్దగా స్పందించలేదాయన.

"ఆ జీవి పాత్ర అంతమైంది. మళ్ళీ ఎక్కడో ఆరంభానికే ఈ
అంతం" నిర్లిప్తంగా అన్నాడు.

ఆచారం ప్రకారం సన్యాసి మృతదేహాన్ని పూడ్చిపెట్టాలి తప్ప
కాల్చకూడదు కాబట్టి, ఆయన మరణించాక ఆ కుటీరంలోనే ఆయన
దేహాన్ని సమాధిచేసి, పక్కనే ఆయన కొలిచే కామాక్షి అమ్మవారి ఆలయం
కట్టారు. గ్రామస్థులు నిత్యం ఆ గుడికి వచ్చి సాయంత్రాలు భజనలు
చేస్తూండటం అనవాయితీ.

ఇంటికి వచ్చే అధ్యాపకుడి దగ్గర సంస్కృతాంధ్రాలు నేర్చుకుంటూ తీరిక వేళల్లో ఈతలు కొడుతూ మిత్రులతో కబాడీ, గోటింబిళ్ళ ఆటలు ఆడుతూ గడిచింది మునిరత్నం బాల్యం.

ఇంటి వెనకేవున్న కామాక్షి ఆలయానికి ఎప్పుడోకాని వెళ్ళేవాడు కాడు. తల్లే శుక్రవారంనాడు వెళ్ళిరమ్మని చెపుతుండేది. వెళ్ళినా మొక్కుబడిగా దణ్ణం పెట్టుకుని వచ్చేవాడు.

ఒకందుకు మహాలక్ష్మమ్మకది నచ్చేది. భగవత్ శక్తి అనే మత్తులో పడకపోతే అందరిలా మునిరత్నం కూడా సాధారణ జీవితం గడుపుతాడని నమ్మేది. సంస్కృతాంధ్ర భాషల పాండిత్యం కూడుపెట్టదని, ఇంగ్లీష్ చదువుల్లో చేర్చమని పోరసాగింది.

ఫలితంగా మునిరత్నంని తొమ్మిదోఏట, పంతొమ్మిదివందల నలభై మూడులో నంద్యాలలోని ఓ స్కూల్‌లో చేర్పించారు. ఆటల్లో, చదువులో చురుకుగా వుండే మునిరత్నం ఆ స్కూల్ హెడ్ మాస్టర్ అయిన తెల్లదొర దృష్టిలో పడ్డాడు.

ఫలితంగా పాఠశాల వార్షికోత్సవం సందర్భంలో, కింగ్‌జాన్ నాటకంలో మునిరత్నం ప్రిన్స్ ఆర్థర్ పాత్రలో నటించాడు. పెద్ద క్లాసుల్లో వాళ్ళని కూడా కాదని ఆయన మునిరత్నాన్ని ఆ పాత్రకి ఎంపిక చేయడం అప్పట్లో విశేషంగా చెప్పుకున్నారు. అతని హావభావప్రదర్శనకి, ఆంగ్లంలో అతని ఉచ్చారణకి కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

అభినయంలో ప్రథమ బహుమతి మునిరత్నానికే లభించింది. తర్వాత మునిరత్నం ప్రతిభని కొందరు నరసింహయ్య దగ్గిర పొగిడారు.

పదిహేడో ఏటదాకా శెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు తండ్రితో పాటు పొలానికి వెళ్ళి ఆ పని చూస్తుండేవాడు. ఏడాదిన్నరపాటు ఉప్పలూరు గణపతిశాస్త్రి అనే సంస్కృత, జ్యోతిష్య పండితుడింటికి వెళ్ళి, గోదావరి జిల్లాలోని శివల గ్రామంలో వాళ్ళింట్లో వుండి సంస్కృత వ్యాకరణం నేర్చుకున్నాడు.

ఆయన మొదటగా నేర్పింది ప్రాతఃస్మరణ శ్లోకాలు, నిత్యస్మరణ శ్లోకాలు.

ఉదయం నిద్రలేవగానే, మంచం దిగకుండా స్మరించాల్సిన మూడు శ్లోకాలు మునిరత్నానికి నేర్పాడాయన.

"మనం ఎంత పవిత్రంగా, ధర్మంగా వుండాలనుకున్నా కలి పురుషుడి ఛాయపడ్డాక అది కుదరదు కాబట్టి నిద్ర లేచీలేవగానే కళ్ళు విప్పకుండా ఈ క్రింది శ్లోకం మనసులో పఠిస్తే ఆ రోజుకి కలి ప్రభావం ఉండదని శాస్త్రం. నలచరిత్రలో నలుగురు పుణ్యపురుషులున్నారు. నలుడిలోకి ప్రవేశించిన కలిని తొలగించింది కర్కోటకుడనే దివ్య సర్పం. ఋతుపర్ణుడో రాజర్షి. నలదమయంతులు అన్యోన్య దాంపత్యానికి ప్రసిద్ధులు కాబట్టి ఆ నలుగుర్నీ స్మరించే శ్లోకం నిత్యం నిద్రలేవగానే స్మరించాలి.

కర్కోటకస్య నాగస్య దమయంత్యాః నలస్యచ।
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలి నాశనం॥

అలాగే నిద్రలేవగానే ముగ్గురమ్మలని తలచుకుని లేవాలి. మనిషికి అవసరమైన విద్య, ధనం, ఆరోగ్యాలని ప్రసాదించేది వాళ్ళే కాబట్టి ఈ శ్లోకం చదువుకుని కళ్ళు విప్పి కుడిచేతివంక చూడాలి.

కరాగే వసతేలక్ష్మీ కరమధ్యే సరస్వతి।
కరమూచే స్థితాగౌరి ప్రభాతే కరదర్శనం॥

చేతివేళ్ళల్లో లక్ష్మీదేవి వుంటుంది కాబట్టి డబ్బుని సూచించడానికి మనం చూపుడువేలుని, బొటనవేలుని కలిపి కదుపుతాం. అలాగే పుస్తకం, సౌంజ్ఞ చేయడానికి రెండుచేతులు కలిపి వాటి మధ్యలోకి చూస్తాం....ఇక మంచం దిగబోయే ముందు మనం పాదాలతో తన్నుతూ నడిచే భూదేవిని అందుకు క్షమించమని ప్రార్థించి మంచం దిగాలి.

సముద్రవసనేదేవి పర్వత స్తనమండలే।
విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే॥

వాటిని ఆసక్తిగా నేర్చుకుని పాటించసాగాడు మునిరత్నం. అలాగే భోజనం ముందు భగవద్గీతలోని రెండు శ్లోకాలు స్మరించడం, భోజనానంతరం భీమ కుంభకర్ణాదులని ఆహారం తేలిగ్గా జీర్ణం చేయడానికి సహాయపడ

మనే శ్లోకం, సాయంత్రం దీపాలు పెట్టగానే పరంజ్యోతి స్మరించే శ్లోకం మొదలగునవి మునిరత్నానికక్కడ పట్టుబడ్డాయి.

ఇలా కాలం గడుస్తుండగా జరగబోయేదానికి సూచనలా ఓ సంఘటన జరిగిందో రోజు.

7

కవ్వంతో పెరుగు చిలుకుతున్న మహాలక్ష్మమ్మకు గుమ్మం బయట నుంచి ఓ సాధువు పిలుపు వినిపించింది.

"భవతీ భిక్షాందేహి!"

మహాలక్ష్మమ్మ చేస్తున్నపనిని ఆపి లేచి ఆ సాధువుకి అన్నం వడ్డించింది. నరసింహయ్య తాత ఓ సాధువు గురించి పరిహాసంగా మాట్లాడి శాపానికి గురైనప్పటినించి ఏ భిక్షువు వారింటికి యాచనకి వచ్చినా అన్నం పెట్టి పంపే ఆచారం వాళ్ళింట్లో పాటిస్తున్నారు.

భోజనం అయ్యాక వర్షం మొదలవడంతో ఆ సాధువు ఆగిపోయాడు. చినుకులు ఆగలేదు. నల్లటి దట్టమైన మేఘాలవల్ల త్వరగా చీకటి పడసాగింది. అతను ఇంట్లోంచి కదలనందుకు నరసింహయ్యకి చికాగ్గా వుంది.

రాయలసీమలోని ఇళ్ళల్లో అప్పట్లో ప్రత్యేకంగా పడకగదులుండేవి కావు. గేదెలు, ఎద్దులులాంటి పశువులతోసహా అంతా ఒకే విశాలమైన కప్పు కింద పడుకునేవారు. కొత్తవాళ్ళు వస్తే ఇరకాటంగా వుండేది నరసింహయ్య ఇల్లు.

ఆ కారణంగా వాళ్ళింట్లో ఏ భార్యాభర్తల మధ్యయినాసరే, సంతానం కోరుకున్నప్పుడు మాత్రమే మైధునం జరిగేది. అది ఆ ఇంట్లో కాదు. ఏ తీర్థయాత్రకో వెళితే, ఆ పుణ్యక్షేత్రంలో కలిసేవారు. ఇంటికి తిరిగివచ్చాక మళ్ళీ ఆడవాళ్ళంతా ఓ వైపు, మగాళ్ళంతా ఇంకోవైపు నిద్రించేవారు.

"ఈ రాత్రి మీ ఇంట్లో పడుకోనిస్తారా? వేకువనే అహోబిలం వెళతాను" అడిగాడు సాధువు ఆయన్ని.

"కుదరదు. ఇదేం ధర్మసత్రం కాదు" చెప్పాడు నరసింహయ్య తండ్రి.

వెంటనే ఆ సాధువు ఫక్కున నవ్వుకుంటూ బయటకి నడిచాడు. ఆయన ఆ సాధువుని ఆపి అడిగాడు.

"ఎందుకలా నవ్వుతున్నావు?"

"మీరు మాట్లాడినదానికి నవ్వొచ్చి."

"నే మాట్లాడిందాంట్లో నవ్వొచ్చేది ఏం వుంది?"

"ఈ ఇల్లు ఎవరు కట్టించారో చెప్తారా?" ప్రశ్నించాడు సాధువు.

"మా నాన్నగారు."

"ఇప్పుడీ ఇంటి యజమాని మీ నాన్నగారా? మీరా?"

"నేనే! ఆయన పోయాక నాదైంది."

"మీ తర్వాత దీనికి యజమాని ఎవరవుతారు?"

"నా కొడుకు."

"ఆ తర్వాత?"

"నా మనవలు."

మళ్ళీ సాధువు నవ్వాపులేకపోయాడు.

"అంటే, ఈ ఇంటికి శాశ్వత యజమాని అంటూ ఎవరూ లేరన్న మాటే కదా? అంతా కొంతకాలం వుండిపోతున్నారు. ధర్మసత్రంలో జరిగేది కూడా ఇంతేకదా? మరి మీరు ఇది ధర్మసత్రం కాదంటే నాకు నవ్వొచ్చింది."

"స్వామీ! మీరెవరో జ్ఞానిలా వున్నారు. ఈ రాత్రికి పడుకుని వెళ్ళండి" అర్థించాడు నరసింహయ్య వెంటనే.

మర్నాడు వెళ్తూ చెప్పాడు ఆ సాధువు, మునిరత్నాన్ని చూస్తూ.

"ఈ ఇంటి మొత్తంలో దీన్ని ధర్మసత్రంగా భావించే ఒకే ఒక్కడు వీడు."

"అదేమిటి స్వామి అలా అంటున్నారు?"

"అవును. పదిహేడవ ఏడు తర్వాత మీ బిడ్డ మీ బిడ్డ కాదు" చెప్పాడు సాధువు.

"పిల్లలందరికీ రామాయణ, భాగవత, భారతాలు కథలుగా తల్లులు తమ పిల్లలకి బాల్యంలో బోధించడం, హనుమాన్ చాలీసా, లింగాష్టకమ్, ఆదిత్య హృదయమ్, నృసింహకవచమ్ పిల్లలకి నేర్పించడం నరసింహయ్య ముత్తాతనించి వాళ్ళ వంశంలో ఆచారంగా వస్తోంది. ఏ గుళ్ళో ఎవరు ఏ స్తోత్రం పారాయణ చేసినా, వీళ్ళు దాన్ని వినగానే వాళ్ళతో శృతి కలపడం అనవాయితీగా జరిగేది.

కానీ రామావతారం సన్యాసం తీసుకోవడంతో మహాలక్ష్మమ్మకి భయం పట్టుకుంది– నాలుగుతరాల క్రితం ఓ సాధువు ఇచ్చిన శాపం ఫలించి, తనకున్న ఒక్కగానొక్క కొడుకు కూడా సన్యాసి అవుతాడేమోనని. అంచేత తన ముగ్గురు కూతుళ్ళకి తప్ప మునిరత్నానికి ఏనాడు దైవ సంబంధమైన శ్లోకాలు, కీర్తనలు నేర్పించలేదు. అక్కలకి నేర్పి నాకెందుకు నేర్పవని మునిరత్నం కూడా ఏనాడు అడిగి ఎరగడు. కాని విని విని అవి అతనికి పట్టుబడ్డాయి.

తన సోదరుడు కేశవులు రమణ మహర్షి ఆశ్రమానికి మునిరత్నాన్ని పంపమని ఎన్నిసార్లడిగినా మహాలక్ష్మమ్మ భయంతో కొడుకుని అక్కడికి పంపలేదు. ఆ ఆశ్రమంకి వెళ్ళాక ఆ రకం జీవితంమీద ఇష్టం ఏర్పరచుకుంటాడేమోనన్న అనుమానం.

ఓ రోజు మునిరత్నం వచ్చి అడిగాడు.

"అమ్మా, నాకో స్తోత్రం నేర్పించమ్మ."

"ఏ స్తోత్రం నాయనా?"

"ఏదైనా మంచి అర్థం గల దేవుడి స్తోత్రం."

"దేనికి?"

"స్కూల్లో ఆఖరిరోజు అందరి ముందు పాడడానికి. తప్పనిసరిగా బైబిల్‌ని నిత్యం చదివిస్తున్నారు తప్ప మన దేవుళ్ళ స్తోత్రాలు నేర్పించడం లేదు. మన హిందూదేశంలో వుండి వాళ్ళ మతాన్ని మనమీద రుద్దుతున్నారు తెల్లదొరలు."

ఈశ్వరేచ్ఛ అలా వుండగా మహాలక్ష్మమ్మ ఎందుకు కాదంటుంది? తన కొడుకుని పూర్తిగా లౌకికుడుగా తీర్చిదిద్దాను అన్న నమ్మకం గల

మహాలక్ష్మమ్మ, క్రితం ఏడాది కింగ్ ఆర్థర్ పాత్రలో తన కొడుకు మంచి నటుడుగా పేరు తెచ్చుకున్నట్లుగా, ఈసారి మంచి గాయకుడిగా పేరు తెచ్చుకుంటాడన్న ఆశతో 'దేవ్యపరాధ క్షమాపణా స్తోత్రం' నేర్పించింది. సరిగ్గా మూడంటే మూడుసార్లు వినగానే అతనికది కంఠతా వచ్చేసింది.

"అబ్బ! ఈ స్తోత్రం అర్థం ఎంత అద్భుతంగా ఉందో కదమ్మా?" చెప్పాడు తల్లికి దాన్ని అప్పగించాక మునిరత్నం.

"అవును. ఆదిశంకరాచార్యులంటే మాటలా? ఆధ్యాత్మిక లోకాన్ని చక్కదిద్దడానికి వచ్చిన సాక్షాత్తు శివుని అవతారం. నీకోటి తెలుసా? అతను సన్యాసం తీసుకోదలచుకున్నా తల్లి అనుమతి లేదు కాబట్టి చాలా కాలం సన్యాసం తీసుకోలేదు."

"సన్యాసం తీసుకోవడానికి తల్లి అనుమతి కావాలా?" అది తెలీని మునిరత్నం అడిగాడు.

"అవును. పెళ్ళయితే భార్య అనుమతి కూడా కావాలి. లేకపోతే ఏడు జన్మలదాకా ఆ పాప ఫలం అనుభవించాలి.

తల్లికి శాస్త్రం అంత గౌరవం ఇచ్చింది.

"భూప్రదక్షిణ షట్కేన కాశీయాత్రాయుతేనచ।
సేతుస్నాన శతైర్యశ్చ తత్ఫలం మాతృ వన్దనే।

అంటే ఆరుసార్లు భూప్రదక్షిణం చేసినా, వదివేలసార్లు కాశీయాత్ర చేసినా, అనేక వందలసార్లు సముద్ర స్నానం చేసినంత ఫలితం కంటే ఎక్కువ ఫలితం ఓసారి తల్లికి నమస్కరిస్తే వస్తుందిట."

"తల్లి మరణించాక శంకరులవారు సన్యాసం తీసుకున్నారా?" ప్రశ్నించాడు మునిరత్నం.

"కాదు. నదిలో స్నానం చేస్తుండగా శంకరుడ్ని మొసలిరూపంలో సాక్షాత్తూ ఆ శివుడు వచ్చి పట్టుకున్నాడు. అప్పుడు ఎలాగూ మరణిస్తున్నాను కదా, సన్యాసానికి అనుజ్ఞ ఇమ్మని తల్లిని కోరాడు. ఆమె సరే అన్నాక మొసలి మాయం అయింది. ఇతనికి సన్యాసం దక్కింది."

స్కూల్ డే రోజు ఒథెల్లో వేషం వేయమన్నా వేయకుండా మునిరత్నం 'దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం' చదివి వాటికి అర్థం చెప్పాడు.

తర్వాత వాటిని రాసిన శంకరాచార్యుల జీవితంలోని ముఖ్య ఘట్టాలని కొద్ది నిముషాలు ప్రసంగించాడు.

శంకరాచార్య తల్లి అనుమతి పొందాకే సన్యాసదీక్ష తీసుకున్న తంతుని వివరిస్తూ మునిరత్నం తను చదివి, తల్లి గొప్పదనం వివరించే ఈ కథ చెప్పాడు.

అది ఫ్రెంచ్ విప్లవంరోజులు. గ్రామాల నుంచి ఎందరో తరిమి వేయబడ్డారు. గ్రామీణులు అష్టకష్టాలు పడసాగారు. ఒక స్త్రీ, తన ఇద్దరు పిల్లలతోనూ రోడ్డున పడింది. ఇల్లూ, వాకిలీ లేకుండా పోయాయి. ప్రాణం దక్కించుకోవటానికి అడవుల్లో ఎన్నో రోజులు దిక్కుతోచక తిరగ సాగారు. ఒకరోజు వాళ్ళకి దగ్గరగా గుర్రాల చప్పుడు వినిపించింది. భయంతో ఆమె, పిల్లలూ పరిగెత్తుకుంటూ వెళ్ళి ఒక పొదలో దాక్కున్నారు. హఠాత్తుగా ఒక సైనికాధికారీ, కొంతమంది సైనికులు అక్కడకు చేరుకొన్నారు. గుర్రాల పైనుంచి క్రిందకు దిగారు. చుట్టూ చూసారు. పొదలలో ఏదో కదలికలు కనిపించగా, వెతకమన్నాడు అధికారి. ఆ విధంగా ఆ తల్లీ, పిల్లలూ బయటపడ్డారు. ఎన్నో రోజులుగా తిండి లేకుండా మాడుతున్న ఆ సంగతి వాళ్ళ ముఖాలు చూడగానే ఆ సైనికాధికారి గుర్తించాడు. వెంటనే తన సంచీలో వున్న ఒక రొట్టె ముక్కని తీసి ఆ స్త్రీకి ఇచ్చాడు. ఆత్రుతతో ఆ రొట్టెముక్కని తీసుకొన్నది ఆమె. దాన్ని రెండు ముక్కలుచేసి ఇద్దరు పిల్లలకి చెరొకముక్కా ఇచ్చింది.

ఒక సైనికుడు, ఆ రొట్టెముక్క ఇచ్చిన అధికారికేసి తిరిగి అడిగాడు.

"ఆ తల్లికి ఆకలిగా లేదా? మొత్తం అంతా వాళ్ళకి ఇచ్చేసింది?"

"కాదు. దానికి కారణం ఆకలి లేకపోవటం కాదు. ఆమె తల్లి కనుక!" అని కెప్టెన్ జవాబిచ్చాడు.

"ఈ స్తోత్రం శంకరులవారు రాయలేదన్న వాదనకూడా వుంది. ఎందుకంటే అయిదో స్తోత్రంలో 'పంచాశీతేరధిక మపనీతే తువయసి' అని వుంది. దీన్ని చెప్పేవారి వయసు ఎనభై అయిదు అనర్థం. కాని శంకరాచార్యులు ముప్పై రెండేళ్ళు మించి బ్రతకలేదు కాబట్టి ఇది ఆయన రాసి

వుండరన్నది వారి భావన. ఇది ఎవరి మస్తిష్కంలోంచి వచ్చినా సరే, వారు గొప్పశక్తి గల కవి అని చెప్పవచ్చు."

* * * *

మునిరత్నానికి పెళ్ళి సంబంధాలు రాసాగాయి. ఆ రోజుల్లో ఆడపిల్ల సమర్తాడక మునుపే వివాహం జరిపించేవారు. ఓసారి సమర్తాడితే ఇక ఆ పిల్లకి పెళ్ళి కావడం కష్టం. ఏడెనిమిదేళ్ళ పిల్లకి, ఏ పదహారు పదిహేడేళ్ళ కుర్రాడితోనో వివాహం జరిపించేవారు. వాళ్ళ మధ్య, వయసులో ఆ మాత్రం తేడా వుండేలా చూసేవారు.

మునిరత్నం చురుకుదనం అప్పటికే బంధువర్గాల్లో అందరికీ తెలిసింది కాబట్టి పోటాపోటీగా పెళ్ళిసంబంధాలు రాసాగాయి. పిల్లల అనుమతి తీసుకునే ఆచారం అప్పట్లో లేదు. 'ఇది నీ పెళ్ళాం, దీని మెళ్ళో తాళి కట్టు' అంటే, మాట్లాడకుండా పిల్లలు మూడు ముళ్ళు వేసే కాలం అది. మునిరత్నం తన పెళ్ళికి జరిగే ప్రయత్నాల విషయంలో ఏ మాత్రం ఆసక్తి చూపించలేదు. చదువుతో, మిత్రులతో, ఆటలతో కాలం గడపసాగాడు.

దసరా సెలవులకి, పంతొమ్మిది వందల నలభై ఒకటో సంవత్సరంలో మునిరత్నం తన ఈడువాడైన తన పెద్ద బావ తమ్ముడు మురళికి తోడుగా, మంగుళూరు బయలుదేరారు. మునిరత్నం బావ మంగుళూర్ పోర్ట్‌లో ఉద్యోగంలో వున్నాడు.

రెండు రోజుల ప్రయాణం కాబట్టి దారిలో ఒకటి రెండు పుణ్యక్షేత్రాల దర్శనం చేద్దామనుకున్నాడు మురళి మునిరత్నానికి ఆ ఉత్సాహం లేదు. అయితే అతని మాటని తీసేయలేకపోయాడు.

ముందు సముద్రపు ఒడ్డున వున్న గోకర్ణం వెళ్ళారు. ఆ రోజుల్లో అక్కడ యాత్రికులకీ, సాధువులకి ఉచిత భోజనం పెట్టే కుటుంబాలనేకం వుండేవి. గోకర్ణంనించి వెళుతూంటే చెప్పాడు మునిరత్నం నవ్వుతూ.

"దేవుడెలా వున్నా, భోజనాలు మాత్రం అదరగొట్టారు. కొబ్బరి కోరు కలిపి పొట్లకాయ వండితే అంత రుచికరమైన కూరవుతుందని మా అమ్మకి తెలీదు."

దారిలో సముద్రపు ఒడ్డున వున్న ఇంకో శివాలయం అయిన మురుదే శ్వర్ ఆలయానికి వెళ్ళారు. అక్కడ అన్నదాన సత్రాలు లేకపోవడంతో భోజనానికి అవస్థ పడ్డారు. తన బాబాయ్ ఇంట్లోంచి వెళ్ళిపోయాక భో కింది అక్కడే అన్న సంగతి గుర్తు తెచ్చుకున్నాడు మునిరత్నం.

"ఇది పిచ్చిక్షేత్రం. సరైన భోజనంలేదు. భక్తుల సమాచారం చూసు కోనక్కర్లేదా? దేవుడు కూడా పిచ్చి దేవుడు" నవ్వుతూ చెప్పాడు ముని రత్నం.

రాత్రికి కొల్లూరు అనే గ్రామంలో ఆగారు. ఓ ఇంటి అరుగుమీద ఆ రాత్రి నిద్ర చేశారు. ఉదయాన్నే స్నానాలు ముగించాక కొల్లూరులోని మూకాంబికాదేవి ఆలయం చూసి వెళ్ళమని మురళి చెప్తే, 'ముందు సాపాటు సంగతి చూడు' అని విసుక్కున్నాడు మునిరత్నం.

గుళ్ళోనే ఉచిత భోజనాలున్నాయని తెలిసాక అక్కడికి వెళ్ళారు.

పూర్వజన్మలో తను ఆర్జించిన పుణ్యఫలం మొత్తం అక్కడ ఫలించబోతుందని తెలీని మునిరత్నం లోపలి వెళ్ళాడు.

అమ్మవారికి నేతి దీపారాధన చేయాలని ఎవరో చెప్తే మునిరత్నం డబ్బు దండగని విసుక్కున్నాడు. కాని అతని బంధువు బలవంతంమీద ఇద్దరూ నేతి దీపారాధనకి తలో కాణీ చెల్లించి దీపారాధన చేశారు.

పెద్దగా జనం లేరారోజు. ఇద్దరూ సాక్షాత్తు శంకరాచార్య శ్రీచక్ర స్థాపించిన ఆ పురాతన దేవాలయంలోకి వెళ్ళారు. మునిరత్నం కళ్ళప్పగించి ఆ దేవి విగ్రహంవైపు తేరిపార చూస్తుండిపోయాడు.

పూజారి ఇచ్చిన హారతిని యాంత్రికంగా కళ్ళకి అద్దుకున్నాడు. తర్వాత బయటికి వెళుతున్న మురళి వెంట నడిచాడు కాని అతని అడు గులు తడబడ్డాయి. మల్లయుద్ధం కుస్తీపట్లు అతనికి బాగా ఆసక్తి. ఆలయం పక్కనే వున్న భోజనశాలలోకి దారితీశారిద్దరూ. ఎప్పుడూ గలగల మాట్లాడే మునిరత్నం అకస్మాత్తుగా నిశ్శబ్దం అవడం గమనించాడు అతని బంధువు.

"ఏమిటి మాట్లాడవు?" అడిగాడతను– ఏదో చెప్తే అతను ఎంతకీ జవాబు చెప్పకపోవడంతో.

మునిరత్నం నెమ్మదిగా చెప్పాడు.

"ఇంకోసారి ఆ దేవి దర్శనం చేసుకోవాలని వుంది."

"భోజనం అయ్యాక వెళదాంలే."

విస్తరిముందు కూర్చున్న వారికి వడ్డిస్తున్నారు. పూర్తి వడ్డన కాకుం డానే మునిరత్నం లేస్తూ చెప్పాడు.

"నేను దర్శనానికి వెళుతున్నాను."

"అదేమిటి? భోజనం ముందునించి అలా లేవకూడదు."

"ఇప్పుడు నాక్కావలసింది ఈ అన్నపూర్ణాదేవి కాదు."

బలమైన అయస్కాంత శక్తి ఇనుప వస్తువుని ఆకర్షించిన విధంగా మునిరత్నాన్ని ఆ ఆలయంలో చల్లని తల్లి అయిన మూకాంబికాదేవి రూపంలో వున్న దైవశక్తి ఆకర్షించింది.

మునిరత్నం అడుగులు వేగంగా పడ్డాయి. అతను మళ్ళీ దర్శనానికి వెళ్ళాడు. రెండు చేతులూ జోడించి ఆ విగ్రహాన్ని చూస్తూ నిలబడ్డాడు. కాళ్ళు నేలకి అతుక్కుపోయాయి. ఈసారి పూజారికి అతని మొహంలోని ఆర్తి కనబడింది. మూకాంబికాదేవిని తనివితీరా చూస్తున్న మునిరత్నాన్ని అతను డిస్టర్బ్ చేయదలచుకోలేదు. అతని వెంటే వచ్చిన మురళి కూడా మునిరత్నం మొహంలోని మార్పుని గుర్తించి ఆశ్చర్యంగా చూడ సాగాడు.

అలా కొద్దిసేపు విగ్రహంవైపు చూసాక మునిరత్నం కళ్ళు మూతలు పడ్డాయి. అతని కంటివెంట నీరు కొద్దికొద్దిగా కారసాగింది. ముని రత్నం నోట్లోంచి కొద్దినెలల్రకితం నేర్చుకున్న 'దేవ్యపరాధ క్షమాపణ స్తోత్రం' అతని గుండె లోతుల్లోంచి తన్నుకు రాసాగింది.

5)

న మంత్రం నో యంత్రం తదపి చ న జానేస్తుతి మహో
న చాహ్వానం ధ్యానం తదపి చ న జానే స్తుతి కథాః
న జానే ముద్రాస్తే తదపి చ న జానే విలపనం
పరం జానే మాతః త్వదనుసరణం క్లేశహరణం

(తల్లీ! నాకు మంత్రం, యంత్రం తెలీదు. అకతేగాక నిన్ను స్తుతించడం తెలీదు. నిన్ను అహ్వానించడం కాని ధ్యానం కాని తెలీదు. ఇతరులు చేసే స్తోత్రాలు కూడా తెలీదు. నీ యొక్క ముద్రలూ తెలీవు. నీకోసం ఏడవడం కూడా తెలీదు. ఓ తల్లీ! నాకు తెలిపిందొక్కటే. నీ యొక్క పాద సేవ కష్టాన్ని పోగొడుతుందని)

విధేర జ్ఞానేన ద్రవిణ విరహేణాలసతయా
విధేయా శక్యత్వాత్ తవ చరణ యెర్యాచ్యుతిర భూత్
తదేతత్ క్షంతవ్యం జనని! సకలోద్ధారిణి! శివే!
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి.

(ఓ జననీ! విధివల్ల, అజ్ఞానంవల్ల, డబ్బు లేకపోవడంచేత, సోమరితనంవల్ల, నిర్లక్ష్యంవల్ల, అశక్తతవల్ల నీ పాదాలనుండి దూరమయ్యాను. సకలాన్నీ ఉద్ధరించే ఓ తల్లీ! అయినా నన్ను క్షమించగలవు. ఎందుకంటే చెడ్డ పుత్రులు పుట్టచ్చు కాని ఎప్పుడూ కూడా చెడ్డ తల్లి ఉండదు కదా?)

మునిరత్నం కంటి వెంట ధారగా వస్తున్న కన్నీటిని చూస్తూ దగ్గత్తికతో అతను లయబద్ధంగా చదివే ఆ స్తోత్రాన్ని ఆశ్చర్యంగా వింటున్నారు మురళి, పూజారి.

పృథివ్యాం పుత్రాస్తే జనని! బహవః సన్తి సరళాః
పరం తేషాం మధ్యే విరళ తరళోహం తవ సుతః
మదీయో యం త్యాగః సముచిత మిదం నో తవ శివే!
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి.

(అమ్మా! ఈ భూమియందు నీకు అనేకమంది మంచి వాళ్ళయిన పుత్రులున్నారు. కాని నేను పనికిరాని వాళ్ళల్లో మొదటివాడిని. నువ్వు నా కోసం చేస్తున్న త్యాగం గొప్పది. ఎందుకంటే చెడ్డపుత్రులుండవచ్చు. కానీ చెడ్డ తల్లిఉండరు కదమ్మా!)

జగన్మాతర్మాతః తవ చరణ సేవా న రచితా
న వా దత్తం దేవి! ద్రవిణమపి భూయస్తవ మయా,
తథాపి త్వం స్నేహం మయి నిరుపమం యత్
ప్రకురుషే
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి

(తల్లీ, నీ చరణసేవ చేయలేదు. ధనం ఖర్చుపెట్టి నీకు ఉత్సవం చేయలేదు. అయినప్పటికీ నువ్వు నా మీద నిరుపమానమైన ప్రేమని చూపిస్తున్నావు. ఎందుకంటే అమ్మ, లోకంలో చెడ్డ పుత్రులుండవచ్చు కానీ చెడ్డ తల్లి ఉండదుకదా!)

పరిత్యక్తా దేవా వివిధవిధి సేవాకులతయా
మయా పంచాశీతేరధిక మపనీతే తు వయసి,
ఇదానీం చౌనాత్మః తవ యది కృపా నాపి భవితా
నిరాలంబో లంబోదర జనని! కం యామి శరణమ్.

(విషయ వాంఛలలో పడి అందరు దేవతలని వదిలేసాను. అమ్మా! ఈ వృద్ధాప్యంలో నువ్వు నన్ను దయతో చూడకపోతే, ఓ పార్వతీదేవి, మరి నన్నెవరు దయతో చూస్తారు?)

శ్వపాకో జల్పాకో భవతి మధుపాకోపమగిరా
నిరాతంకోరంకో విహరతి చిరం కోటికనకైః
తవాపర్ణే! కర్ణే విశతి మను వర్ణే ఫలమిదం
జనః కో జానీతే జనని! జపనీయం జప విధౌ

(అమ్మా! నీయొక్క మంత్రాక్షరాలు చెవుల పడిన వెంటనే కుక్క మాంసం తినేవాడు తేనె పలుకులతో వాక్చాతుర్యం కలవాడవుతాడు, దరిద్రుడు కోటీశ్వరుడవుతాడు. మరి నీ జపాన్ని శ్రద్ధగా చేస్తే, ఓ తల్లీ ఇంకెంత ఫలం వస్తుందో కదా!)

చితాభస్మాలేపో గరళమశనం దిక్పటధరో
జటాధారీ కంఠే భుజగపతిహారీ పశుపతిః
కపాలీ భూతేశో భజతి జగదీశైక పదవీం
భవాని! త్వత్పాణిగ్రహణ పరిపాటీ ఫలమిదమ్

(చితాభస్మం వంటికి పూసుకునేవాడు, విషం తినేవాడు, దిక్కులే దుస్తులుగా గలవాడు, జడలు కట్టిన జుట్టు గలవాడు, కంఠంలో సర్పాన్ని వేసుకునేవాడు, పశువులని పాలించేవాడు, కపాలం చేతిలో గలవాడు, భూత నాయకుడు, ఇన్ని అవలక్షణాలుండీ అతడ్ని జగదీశ్వరుడని ఎందుకు కొలుస్తామో తెలుసా తల్లీ, నిన్ను పెళ్ళి చేసుకోవడం వల్లనే ఆయనకా పదవి వచ్చింది.)

న మోక్షస్యాకాంక్షా భవవిభవవాంఛాపి చ న మే
న విజ్ఞానాపేక్షా శశిముఖి! సుఖేచ్ఛాపి న పునః
అతస్త్వాం సంయాచే జనని! జననం యాతు మమవై
మృడానీ రుద్రాణీ శివ శివ భవానీతి జపతః

(నాకు మోక్షం వద్దు, వైభవం మీద కోరిక లేదు. విజ్ఞానం మీద అపేక్షలేదు తల్లీ! నాకు సుఖపడదామన్న కోరిక కూడా లేదు. నేనేమి అడుగుతున్నానో తెలుసా? నా జన్మంతా నీ జపంతో జరిగిపోతే చాలు.)

నారాధితాసి విధినా వివిధోపచారైః
కిం రూక్షచింతనపరైః నకృతం వచోభిః
శ్యామే! త్వమేవ యది కించన మయ్యనాథే
ధత్సే కృపాముచిత మంబ! పరం తవైవ

(అమ్మా! శాస్త్రోక్తంగా అన్ని ఉపచారాలతో నిన్ను ఆరాధించలేదు. చక్కటి మాటలతో నిన్ను స్తుతించలేదు. అయినప్పటికీ తల్లీ నీవు ఎంతో కృప నా మీద చూపిస్తున్నావు.)

ఆపత్సు మగ్నః స్మరణం త్వదీయం
కరోమి దుర్గే! కరుణార్ణవే! శివే!
నైతచ్ఛఠత్వం మమ భావయేథాః
క్షుధా తృషార్తా జననీం స్మరన్తి

(అమ్మా! ఆపదలో వున్నప్పుడు నిన్ను స్మరిస్తున్నాను. ఓ దయగల తల్లీ, నన్ను దుర్మార్గుడనుకోవద్దు. మూర్ఖుడనీ అనుకోవద్దు. ఎందుకనగా ఆకలి వేసినప్పుడే కదా అమ్మ గుర్తుకొస్తుంది.)

జగదంబ! విచిత్రమత్ర కిం। పరిపూర్ణా కరుణాస్తి చేన్మయి
అపరాధ పరంపరావృతం నహి మాతా సముపేక్షతే. సుతమ్

మత్సమః పాతకీ నాస్తి పాపఘ్నీ త్వత్సమా నహి
ఏవం జ్ఞాత్వా మహాదేవి! యథా యోగ్యం తథాకురు.

(అమ్మా! నా వంటి పాపాత్ముడు వేరొకడుండకపోవచ్చు. అయినా నీ కరుణ నా మీద ఉండడం విచిత్రం కాదు. ఎందుకంటే అపరాధం చేసిన కొడుకును తల్లి వదిలెయ్యదు.)

మధ్య మధ్యలో దుఃఖంతో నోరు పూడుకుపోతుంటే, మునిరత్నం విభాయించుకుంటూ తన స్మృతిపథంలోని ఆ దేవ్యపరాధక్షమాపణ స్తోత్రం చివరి దాకా చదివాడు.

ప్రయాణంలో అతను అనేక విషయాలని మురళితో చమత్కారంగా చెప్పిన కంఠం కాదది. భక్తితో కూడిన, ఆర్తితో కూడిన కంఠం అది. పూజారి నమ్మలేనట్లుగా తల అడ్డంగా తిప్పుతూ కన్నడంలో చెప్పాడు.

"ఇంతటి భక్తిపరుడ్ని నేనెన్నడూ చూడలేదు. ఎవరితను?"

ఆ మాటలు అర్థం కాలేదు మురళికి.

మునిరత్నం అలా కదలకుండా కన్నీరు కారుస్తూ చాలాసేపు ని బడ్డాడు. వెనక వచ్చిన భక్తులు అతని వదనంలో గూడుకట్టుకున్న భక్తి అందువల్ల వచ్చే అశ్రువులని చూస్తూ వెళ్ళారు.

అతను తేరుకునే దాకా పూజారి కూడా డిస్టర్బ్ చేయలేదు. ము రత్నం కళ్ళు విప్పాక అతనివంక కరుణతో చూస్తూ చేతిలో ఓ కొబ్బ చిప్ప పెట్టి చెప్పాడు.

"అమ్మ ప్రసాదం."

భక్తిగా శిరసు వంచి ఆ కొబ్బరి చిప్పకి నుదురు తాకించి అం కున్నాడు మునిరత్నం. ఓసారి, మరోసారి, ఇంకోసారి తల్లి విగ్రహా సాష్టాంగ ప్రణామం చేశాడు. మునిరత్నం. అయినా తృప్తికలగలేదతని మురళి అతని భుజం చుట్టూ చేతులు వేసి- "పద" అని తీసుకువెళుతుం ఆ ప్రాంతాన్ని విడవలేక, విడవలేక విడిచి బయటికి వచ్చేశాడు. ప్రసాదం తిన్నాక చెప్పాడు మురళి.

"పద. భోజనం చేద్దాం."

"నాకింక ఆకల్లేదు" చెప్పాడు మునిరత్నం.

"అదేం?"

"ఊహూ. ఇక నాకు ఆకలి వేరు. అది ఎవరూ తీర్చేది కాదు. అంతట నేను తీర్చుకునేది. నువ్వు తినిరా."

"అలాగే కాని వచ్చి నా పక్కన కూర్చో."

మునిరత్నం ఆ చిత్రమైన మాటలకి భయపడి అతని చేతిని ప కుని చెప్పాడు మురళి. అతను భోజనం చేస్తున్నంతసేపు మునిరత్న కళ్ళు మూసుకుని మహిషాసుర మర్దిని స్తోత్రం చేయసాగాడు. ఇందాకటి కంటిలో నీరు.

"ఇంక పోదాం పద" భోజనం అయ్యాక చెప్పాడు మురళి.

"అమ్మని విడిచి రావాలని లేదు నాకు."

"ఇక్కడ ఉండనివ్వరు."

మునిరత్నం ఏం మాట్లాడలేదు.

"నీకేమైంది?"

"ఏమో? నాకే తెలీదు."

"మనం తిరిగి ఇంటికి వెళ్ళిపోదాం. మంగుళూరు వద్దు."

"అమ్మ హారతి పళ్ళెంలో మసిగానైనా మారి అమ్మ దగ్గరే ఇక్కడే వుండిపోవాలని వుంది." కన్నీరు కారుస్తూ చెప్పాడు మునిరత్నం.

సాయంత్రం దాకా మునిరత్నం మూకాంబికాదేవి ఆలయంలోంచి కదల్లేదు. కాసేపు కళ్ళు మూసుకుని బయట నేతి దీపాలు వెలిగించే వెండి కుందుల దగ్గర కూర్చుంటాడు. లేచివెళ్ళి కాసేపు విగ్రహాన్ని చూస్తాడు. ఏదో తెలియని ఆరాటంలో వున్న మునిరత్నాన్ని చూస్తే మురళికి అతన్ని అక్కడనించి ఎలా తీసుకెళ్ళడమా అని భయం వేసింది. 'వెళదాం' అంటే, 'కొద్దిసేపాగి' అన్న ఒక్కటే జవాబు.

చీకటి పడుతుండగా మురళి గదమాయించి, ఆఖరి బస్సు వెళ్ళిపోతోందని బయలుదేరదీశాడు. తనని మురళి ఎక్కడికి తీసుకెళుతున్నాడో కూడా మునిరత్నం పెద్దగా పట్టించుకోలేదు. తిరిగి భీమునిపాడుకి చేరుకున్నాక కాని మురళికి స్వాంతన కలగలేదు. దారిలో ఎక్కడ దిగి వెనక్కి వెళ్ళిపోతాడో అని భయపడుతూనే వున్నాడు.

"అదేమిటి? అప్పుడే వచ్చేశారు?" ప్రశ్నించాడు ఇంటి బయట అరుగు మీద కూర్చుని, గ్రామస్తులతో ఊసుపోక కబుర్లు చెపుతున్న నరసింహయ్య, పొద్దున్నే వచ్చిన ఆ ఇద్దర్ని చూసి.

"మేం మంగుళూరు పోనేలేదు మామా" చెప్పాడు మురళి.

"ఎందుకు వెళ్ళలేదు?"

"లోపలికి రా మామా. అక్కడ చెప్తాను."

కొద్దినిముషాల్లో లోపలికి వెళ్ళిన నరసింహయ్య, మురళి మహాలక్ష్మికి చెప్పేది వినసాగాడు.

"ఇక లాభం లేదని మంగుళూరు పోకుండా మునిని వెనక్కి తీసుకొచ్చానత్తా."

"ఏమిట్రా! ఇదంతా నిజమేనా?" అడిగింది మహాలక్ష్మమ్మ బాధగా. కొడుకుని అప్పటికే ఆవిడ విసుర్రాయి మీద జొన్నలని విసిరే పని ఆపేసింది.

"నిజమేనమ్మా" నిర్లిప్తంగా జవాబు చెప్పాడు మునిరత్నం.

"ఏం జరిగింది? ఎందుకు గుడిని వదిలి రానన్నావు?" ప్రశ్నించింది ఆవిడ.

"ఏమో మరి? నాకంతా అయోమయంగా వుంది. అక్కడ ఏదో శక్తి వుందమ్మ. అదేమిటో చెప్పలేను కాని అక్కడ నాకు ఏదోలా అయిపోయింది."

మునిరత్నంలో వెనకటి చురుకుదనం లేదు అని రెండు రోజుల్లో అతని తల్లిదండ్రులు గుర్తించారు. అక్కని హాస్యం చేసి ఏడిపించడం లేదు. కళ్ళు మూసుకుని ఓ మూల కూర్చుని వుంటాడు.

"కొంపదీసి వీడు కూడా సన్యాసం అంటాడేమోనండి?" తన మనసులోని భయాన్ని రహస్యంగా వెళ్ళగక్కింది మహాలక్ష్మమ్మ మూడో రోజు.

"నాకూ అదే భయంగా వుంది. చూద్దాం ఏం జరుగుతుందో."

"చూద్దాం కాదు. వెంటనే ఉయ్యాలవాడ వెళ్ళి మన పెద్దమ్మాయితో మాట్లాడి దాని కూతురు ధనలక్ష్మితో నిశ్చితార్థం చేసుకునే ఏర్పాట్లు చూడండి. పెళ్ళి చేసుకుంటేకాని ఈ తిక్క కుదరదు. ముహూర్తాలు చాలా వున్నాయి."

దగ్గరే వున్న ఉయ్యాలవాడకి ఆయన ఉదయం వెళ్ళి రాత్రికి తిరిగి వచ్చాడు. నిశ్చితార్థం జరపడానికి తేదీని నిర్ణయించుకుని వచ్చాడు. మునిరత్నానికి జరిగింది చెప్పలేదు.

8

అంతకు నాలుగేళ్ళక్రితం శ్రీ కాళహస్తి సమీపంలోని ఏర్పేడునించి మలయాళ స్వామి నంద్యాల వచ్చి కొద్ది రోజులు గీతాయజ్ఞం చేసారు. నంద్యాలలో మునిరత్నం చదివే స్కూల్ ఆటస్థలంలోనే సాయంత్రాలు ఆ

యజ్ఞం జరిగింది. అప్పుడాయన కొందరికి సన్యాసదీక్ష ఇచ్చారని కూడా మునిరత్నానికి గుర్తొచ్చింది.

కొల్లూరునుంచి తిరిగివచ్చిన నాలుగు రోజులకి కోయిలకుంట్లకి వెళ్ళి, ఏర్పేడు ఆశ్రమానికి మలయాళస్వామి పేర ఓ కార్డు రాసాడు. తన పేరు, వయసు రాస్తూ, తనకి సన్యాసం తీసుకోవాలని ఉందని, ఆ దీక్ష ఇప్పించమని రాసాడు.

ఆశగా జవాబుకై ఎదురుచూడసాగాడు. నిత్యం కామాక్షి ఆలయంలో కూర్చుని, తనకి వచ్చిన స్తోత్రాలు కళ్ళు మూసుకుని చదువుకుంటూ ధ్యానమగ్నుడవసాగాడు.

వారం తర్వాత తండ్రి ఓ రోజు పిలిచి కోపంగా ఓ కార్డు చూపిస్తూ అడిగాడు.

"నువ్వు వ్యాసాశ్రమానికి లెటరేమన్నా రాసావా?"

"అవును."

"ఏమని?"

"ఓ విషయం మీద. ఏం జవాబు రాసారు?" ఎదురుప్రశ్న వేశాడు మునిరత్నం.

"మలయాళస్వామి సమాధి చెందారని ఏమని రాసావు?" మళ్ళీ ప్రశ్నించాడు నరసింహయ్య.

"సమాధా? అరెరె!"

"నీ వ్యవహారం నాకు నచ్చడంలేదు. నీకు, ధనలక్ష్మికి త్వరలో పెళ్ళి జరపబోతున్నాం. వచ్చే శుక్రవారం నిశ్చితార్థం కూడా."

"నాకిప్పుడు పెళ్ళొద్దు నాన్నా."

"ఏం?"

"నాకసలు పెళ్ళంటే ఇష్టంలేదు. పిల్లలు, వాళ్ళ పోషణ, అనేక వ్యాపకాలు."

"పెళ్ళి చేసుకోక ఏం చేస్తావు?"

"బాబాయ్‌లా సన్యాసం తీసుకుందామనుకుంటున్నాను."

ఆయన గుండెల్లో రాయి పడింది.

"సన్యాసం అంటే ఏమిటో తెలుసా అసలు? కాషాయం బట్టలు వేసుకోవడం కాదు. నీకంటూ ఇంకో జత బట్టలు తప్ప ఇంకేం లేకుండా ఉండడం. ఎవరైనా పెడితే తినడం, లేదా పస్తుండడం. పూర్వం సన్యాసులంటే గౌరవం వుండి ఇంత పెట్టేవారు కాని ఈ రోజుల్లో ఆ విలువ లేదు. పనిచేసుకుని బ్రతకరాదా అని తిడతారు. గుళ్ళపక్కన బిచ్చగాళ్ళతో పాటు కూర్చుని అడుక్కుతినాలి."

"అమ్మ దయుంటే, రోజుకింత భోజనం దొరక్కుండా పోదు."

"అమ్మ నీ వెంట కుంపటి, జొన్న సంకటి, ఉల్లిపాయ పచ్చడి పట్టుకుని రాదు."

"ఆ అమ్మ గురించి కాదు నేను చెప్పింది."

ఆయన అసహనంగా కొడుకు ముఖంలోకి చూస్తూ చెప్పాడు.

"నాకిలాంటివి నచ్చవు. నా మాట విను. పెళ్ళి చేసుకో. పొలం పని చూసుకో. లేదా చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగంలో వేయిస్తాను."

"నాకవేం ఇష్టంలేవు నాన్నా!"

"ఎందుకిష్టంలేదు?"

"వేపకి చేదెందుకు వచ్చిందంటే ఏం చెప్పను? ఇదీ అలాగే ప్రకృతి సహజంగా వచ్చింది. నేను మాత్రం పెళ్ళిచేసుకోనుగాక చేసుకోను."

తన కొడుకుకి అంత సూటిగా తనకి సమాధానం చెప్పేంత వ్యక్తిత్వం రావడం ఆయనకి అనూహ్యం కనుక షాకయ్యాడు. భయంతో మాట్లాడతాడనుకున్నాడు. కాని ఇలా ధైర్యంగా మాట్లాడతాడనుకోలేదు.

భార్యతో ఆ విషయం ప్రస్తావించాడు. ఆవిడ కన్నీళ్ళు పెట్టుకుని చెప్పింది.

"ఒక్కడే కొడుకు. వీడు సన్యాసి అయితే ఇక మన వంశం ఇంతటితో సరి. ఈ ఆస్తిపాస్తులన్నీ అల్లుళ్ళ పాలవుతాయి. లోకం నవ్విపోతుంది."

రెండు రోజులాగి మహాలక్ష్మమ్మ చెప్పింది కొడుకుతో.

"ఎల్లుండే శుక్రవారం. నిశ్చితార్థానికి మనమంతా ఉయ్యాలవాడ వెళుతున్నాం. కొత్త పంచె, ఉత్తరీయం నాన్న నంద్యాలనించి తెప్పించారు. నువ్వు పీటలమీద వాటితో కూర్చోవాలి."

"మళ్ళీ ఈ గొడవేంటి? మొన్న నేను చెప్పింది నీ తలకెక్కలేదామ్మా? మళ్ళీ చెప్తున్నాను. నాకు పెళ్ళంటే ఇష్టంలేదు" విసుక్కున్నాడు మునిరత్నం.

"నేను కాదు గొడవ చేసేది. నువ్వే. ఏమిట్రా ఇది? సన్యాసం తీసుకుని ఏం బావుకుంటావు? బిచ్చగాడికి, సన్యాసికి తేడాలేని రోజులివి."

"అమ్మా! మీరంతా అజ్ఞానంలో వున్నారు. ఎంత చెప్పినా మీ తలకెక్కదు. మనం పుట్టింది పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కని, పొలం దున్నుకోవడానికో, ఉద్యోగం కోసమో కాదు. అందువల్ల ఇంకొన్ని దుష్కర్మలు వెంట తీసుకుని వెళ్ళాలి. మనం పుట్టింది పూర్వజన్మల్లో చేసిన అలాంటి సంచిత కర్మలని వదిలించుకోడానికే. ఇలా కొన్ని జన్మలు చేసుకుంటూ పోతేనే ముక్తి."

"ముక్తంటే ఏమిటసలు?"

"అనంతమైన ఆనందం."

"పెళ్ళి, పిల్లలూ ఆనందం కాదా?"

"కాదు. ఆనందం అని భ్రమపడడమే అవి. ఆనందం అంటే దుఃఖం లేనిదని అర్థం. పెళ్ళిచేసుకుంటే ఎన్నో దుఃఖాలు. నిన్ను, నాన్నని చూడటంలా నేను? ఆకలి తీరడం సుఖం. కాని ఆ సుఖం వెనక ఎంత కష్టం? జొన్నలని కడగాలి, రోటిలో వేసి దంచి పొట్టు తీయాలి, ఆరబెట్టి రవ్వ విసరాలి, దాన్ని వండాలి. అందులోకి పప్పు, ఉల్లి పచ్చడి లేకుండా తినలేం. ఇలా ఏ సుఖానికయినా కష్టం తప్పదు. రోజూ పశువులకి గాడిద చాకిరీ చేస్తే కాని పాలు పితుక్కోలేవు. ప్రతి ఆనందానికి వెనుక దుఃఖం దాక్కుని వుంటుంది."

"నీ సన్యాసానికి నేను అనుమతించను. తల్లి అనుమతి లేకుండా నీకెవరు సన్యాస దీక్ష ఇస్తారో చూస్తాను."

"నువ్వే కాదంటే ఇంకో తద్దినం ఎందుకు తెచ్చుకుంటాను? రేప
ధనం కూడా భార్యగా తన అనుమతి ఇవ్వనంటుంది. అందుకే నాక
పెళ్ళొద్దు."

"వద్దంటున్నా నిన్ను మంగుళూరుకి బయలుదేరదీయడం నా
తప్పైంది. ఆ మహాతల్లి నా కొడుకునేం చేసిందో?" కళ్ళనీళ్ళు పెట్టుకుంది
మహాలక్ష్మమ్మ.

తల్లివంక జాలిగా చూసి చెప్పాడు మునిరత్నం.

"మీరంతా పేరుకి రమణ భక్తులు. కానీ ఆయన చెప్పింది ఆచ
రించరు. ఆయన తల్లి వచ్చి ఇంటికి రమ్మని ప్రతిమాలితే ఏం చెప్పాడో
గుర్తుందా?"

"ఏం చెప్పాడు?"

"వారి వారి ప్రారబ్ధ కర్మలననుసరించి జీవుల గతిని జగన్నియంత నడుపుచుండును. ఏది జరుగరాదని నిర్ణయింప బడినదో అది జరుగదు. ఏది జరగవలసివున్నదో అది మీరెంత ఆపవలెనని ప్రయత్నించిననూ జరిగితీరును. ఇది సత్యం. కాబట్టి సర్వోత్తమమైన మార్గము మౌనమే.

అలాగే నా విషయంలో కూడా ఏది రాసి వుంటే అదే జరుగు
తుందని నాకు నిశ్చింత."

"పెళ్ళి రాసి వుంది. ఎల్లుండిపాటికి నిశ్చితార్థం అవుతుంది. నిన్ను
కట్టేసే వయసూ కాదూ, కొట్టే వయసూ కాదు. నువ్వు పారిపోయి, గిరి
పోయి పిచ్చి పనులు చేయకు. అప్రదిష్ఠ."

"మళ్ళీ ఆ దుష్కర్మ దేనికి? పారిపోను. నీ అనుమతి లేకుండా
సన్యాసినయితే ఆ పాపంతో ఏడు జన్మలదాకా నాకు మోక్షం శూన్యం.
అయినా నాకు దిగులు. అంతా అమ్మ దయ ప్రకారం జరుగుతుంది."

"ఆపాటి శాస్త్రం తెలుసుకున్నందుకు సంతోషం" కోపంగా చెప్పింది
మహాలక్ష్మమ్మ.

సాధారణంగా అలాంటి స్థితిలో పడే టెన్షన్ ఏదీ మునిరత్నాన్ని
ఆవరించలేదు. రమణ మహర్షి చెప్పిన ఆ మొదటి బోధన తనకి ఎందుకు
అకస్మాత్తుగా గుర్తొచ్చిందో కూడా మునిరత్నం ఆలోచించలేదు.

గుళ్ళోకి వెళ్ళి కామాక్షి అమ్మవారి విగ్రహం ముందు కూర్చుని
కళ్ళు మూసుకుని ప్రార్థించాడు.

"తల్లీ....నాలోని పూర్వజన్మ సంస్కారాన్ని రేకెత్తించావు. ఫలి
తంగా సన్యాసం మీద అకస్మాత్తుగా మక్కువ ఏర్పడింది. ఏం చేస్తావో నీ
ఇష్టం."

9

'రాయలసీమ నిండా మఠాలు, ముఠాలు' అనే నానుడి వుంది.
ఎక్కువమంది అవధూతలు, సిద్ధపురుషులు గల సీమ అది. అలాంటి ఆధ్యా
త్మిక నేలలో పుట్టిన కృష్ణారెడ్డి, మలయాళస్వామి ఆశ్రమంలో ఆరేళ్ళుండి,
సంస్కృతం నేర్చుకుని, చివరికి ఆయన దగ్గర సన్యాసదీక్ష తీసుకున్నాడు.
విస్తృతంగా ఆశ్రమాలుండాలన్న గురువుగారి సూచన ప్రకారం తన
గ్రామంలో చిన్న ఆశ్రమ ఏర్పాటుచేసుకుని అక్కడే భగవత్ ధ్యానంలో
తన శేషజీవితం గడుపుతున్నాడు. ఆయన సన్యాసనామం శ్రీరామకృష్ణా
నందగిరి.

మునిరత్నం కొద్దిమైళ్ళ దూరంలో వున్న జోలదరాసి అనే
చిన్న వూళ్ళోని శ్రీరామ కృష్ణానందగిరి దగ్గరికి సైకిల్ మీద వెళ్ళాడు.
ఆయన దగ్గిర సేవ చేసుకుంటూ వుండే ప్రసంగి అనే చిత్రమైన పేరుగల
అతన్ని కలిపాడు. మునిరత్నం జరూరు పనిమీద వచ్చాడని ప్రసంగి,
స్వామితో చెప్తే ఆయన దర్శనమిచ్చాడు.

పూర్తిగా బ్రహ్మజ్ఞానం కలగకపోయినా, ఆ మార్గంలో వున్న
ఆయన ముఖంలో ఎంతో ప్రశాంతత, దివ్యత్వం కనిపించాయి ముని
రత్నంకి. ఆయన పాదాలమీదపడి భోరున ఏడవసాగాడు. ఆయన ఏం

ప్రశ్నించకుండా అప్యాయంగా మునిరత్నం వెన్ను నిమురుతూ వుం
పోయాడు.

మునిరత్నం తేరుకుని లేచాక అడిగాడు.

"ఏమిటి తండ్రీ నీ బాధ?"

"నాకు సన్యాసం తీసుకోవాలని వుంది. కానీ నా తల్లి అందు
అనుమతి ఇవ్వడంలేదు స్వామీ."

"ఈ వయసులో సన్యాసమా? నీ తల్లి అనుమతివ్వకపోవడం సహ
జమే!"

"కానీ నాకు బలవంతంగా పెళ్ళి చేస్తున్నారు."

"సన్యాసం అంటే మాటలుకాదు. ఆ నియమాలకి జడిసే నేను ఈ
ఆశ్రమం విడిచి వెళ్ళడంలేదు. ఎక్కడా మూడు రాత్రులుమించి నిద్ర చేయ
కూడదు. రేపటికోసం ధనం ఉంచుకోకూడదు. ఏ రోజు వచ్చిన ధనం ఆ
రోజే దానం చేసేయాలి. భిక్షాన్నమే తినాలి. ఇంకా ఇలా ఎన్నో కఠోరమైన
నియమాలున్నాయి."

"సంసారంలో కూడా ఎన్నో కఠోర నియమాలున్నాయి కదా
స్వామి? అది కష్టమని పెళ్ళిళ్ళు ఎలా ఆగడంలేదో, నా సన్యాసం కూడా
అలాగే ఆగకూడదు స్వామి. నాకేదైనా మార్గం చూపించండి."

"మీ అమ్మ అనుమతి పొందడం ఒక్కటే మార్గం."

"ఆవిడ నా అంత పట్టుదలగా వుంది. బ్రహ్మరుద్రాదులు దిగి
వచ్చినా వినేలాలేదు."

"చూడు నాయనా! సన్యాసం గురించి ఇప్పటినించే తాపత్రయపడ
క్కరలేదు. గృహస్థాశ్రమం చక్కగా నిర్వహించాకే నేను సన్యాసి
నయ్యాను. నీకు తొందరవద్దు. సన్యాసాశ్రమం బహు కష్టమార్గం. అది
తీసుకున్నాక ఒక్కసారి స్త్రీతో తప్పు చేసినా ఏడు జన్మలదాకా ఎంత సాధన
చేసినా ముక్తి లభించదని శాస్త్రం చెబుతోంది."

"శారీరక కోరికలు ఎంత తుచ్ఛమైనవో నాకు తెలుసు స్వామి."

"చూడు బాబూ! హృదయగ్రంధివల్ల ఇల్లు, సంసారం, సంతానం,
బంధువర్గం, విత్తంలాంటివి కలిగి 'నేను, నాది అనే భావం హృదయంలో

స్థిరపడి వుంటుందని' శ్రీమద్భాగవతం చెపుతోంది. వీటన్నిటికీ నాంది స్త్రీ.
మోక్షమార్గంలో స్త్రీ ఆకర్షణ పెద్ద అవరోధం. ఆ ప్రతిబంధకాన్ని తొల
గించడానికే నాలుగు ఆశ్రమాలు ఏర్పాటు చేసారు. అవే బ్రహ్మచర్యం,
గృహస్థాశ్రమం, వనప్రస్థం, సన్యాశాశ్రమం. ఇంద్రియ వేగాన్ని అణచ
టానికి గృహస్థాశ్రమం ఒక్కటే చక్కటి ఔషధం. మైధున భోగాన్ని
జన్మ జన్మలనించి అనుభవిస్తున్నా కామం తగ్గదు."

"అందుకు వైరాగ్యం ఇంకో చక్కటి ఔషధం" చెప్పాడు ముని
రత్నం.

"ఎంతటి శక్తివంతుడినయినా ఈ భౌతిక జగత్తులో బంధించడానికి
మరో కామాన్ని సృష్టించింది. కాబట్టి ఈ లోకాన్ని 'మైధునాగారం'
అన్నారు పెద్దలు. ఒక్కగుక్క కల్లుతో స్పృహ తప్పదుకదా? కొద్దిపాటి
వైరాగ్యంతో కామేచ్ఛని వదలగలవా?"

"వదలగలను. స్త్రీ ఛాయ సోకని ఏ అడవిలోనో వుంటే ఇంక
ధ్యానమే లోకంగా మారుతుంది కదా!"

మరో పావుగంట చర్చించాక మునిరత్నం ఈ విషయంలో గట్టి
పట్టుదలతో వున్నాడని గ్రహించాడు ఆయన.

"ఇంత చిన్న వయసులో, అసలు నీకా కోరికెందుకు కలిగింది?"
ప్రశ్నించాడాయన.

మూకాంబికాదేవి ఆలయంలో తనకి జరిగిన అనుభవం వివరించాడు
మునిరత్నం. అది చెపుతుంటే మునిరత్నం కళ్ళల్లో మళ్ళీ నీళ్ళు.

"కళ్ళమ్మట నీళ్ళు రావాలంటే, మనకి మనసులో ఏదైనా దుఃఖం
వుండి తీరాలి. నాకలాంటి విచారం! ఏం లేకుండా వచ్చే కన్నీళ్ళవి, దుఃఖం
బదులు ఓ విధమైన ఆనందం కూడా వుంటుందప్పుడు నాలో" చెప్పాడు.

"ఎవరబ్బాయివి నువ్వు?"

తన వివరాలు చెప్పగానే ఆయన మొహం విస్మయంతో విప్పా
రింది.

"నువ్వు పురుషోత్తమయ్య మనవడివా? మీ నాన్నని నేనెరుగుదును.
వరసింహయ్యకి నువ్వొక్కడివే కొడుకనుకుంటాను?"

"అవును స్వామి."

"నాకిప్పుడు అంతా అర్థమైంది. మీ వంశ చరిత్ర నాకు తెలుసు. బాబాయ్ చాలా చమత్కారంగా మీ పిన్నమ్మనించి అనుమతి తీసు సన్యాసం తీసుకున్న విధం నాకు తెలుసు. నీకు అమ్మ దయ వుంది. అమ్మకి చెప్పి చూస్తాను."

"రేపే నా పెళ్ళి నిశ్చితార్థం."

"చూడుబాబూ! మానసిక సన్యాసం చేసిన ఓ సాధువు మీ ము నరసింహయ్యకిచ్చిన శాపం శక్తి ఇంకా వుంటే నీకు సన్యాసం ఎవరూ ఆగదు. సన్యాసంలో నాలుగు రకాలున్నాయి. ఒకటి "విద్వత్ సన్యా బలిష్ఠమైన పూర్వజన్మ సంస్కారంవల్ల, ఈ జన్మలో వివాహం చేసు కుండా సన్యాసపుతారు అలాంటివారు. రెండోది 'వివిదిషా సన్యా శాస్త్రాధ్యయనం, సాధనలవల్ల, ఆత్మజ్ఞానం పొందాలన్న తపన కర్మలు చేయడం ఆపాలన్న వాంఛవల్ల, తీసుకునే సన్యా అది. ఇక మూడోది 'మర్కట సన్యాసం' అత్యంత ప్రీతి పా లయిన వారి మరణం వల్ల కలిగే దుఃఖవల్ల సన్యాసాశ్రమం అలాంటివారు వెళతారు. చివరగా నాలుగోది 'ఆతుర సన్యాసం లేదా ఆ సన్యాసం' మరణశయ్యమీద వుండి ప్రాణాలమీద ఆశ వదులుకున్న తీసుకునేదది. పవిత్ర సన్యాసదీక్ష తీసుకుని మరణిస్తే ఆ పుణ్య ఫల తర్వాతి జన్మలో ఫలించి ఉత్తమమైన పునర్జన్మ ప్రాప్తి కలుగుతు తీసుకుంటారు. కాబట్టి నీకు ఏది శ్రేష్ఠమో ఆ జగన్మాతే నిర్ణయిస్తు మృత్యువు కొద్దిఘడియల ముందు సన్యాసం తీసుకున్నా చాలు."

"అంతదాకా ఆగడం నాకిష్టంలేదు. మీరు నాకు దీక్ష ఇప్పం లేకపోతే కాయం పోయాక మిగిలేది కర్మలే స్వామీ."

"ముందు మీ అమ్మ అనుమతి తీసుకురా. సాక్షాత్తూ శంకరాచా తల్లే అతను సన్యాస దీక్ష తీసుకోడానికి వప్పుకోలేదు. ఇక మనమెం

ఉపాధ్యాయన్ దశాచార్య ఆచార్యాణాంశతం
సహస్రంతు పితార్‌మాతా గురవేణా తిరిచ్యతే॥

అని శాస్త్రం. అంటే పదిమంది వుపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, వందమంది ఆచార్యులకంటే ఒక తండ్రి గౌరవించదగ్గవాడు. తండ్రికంటే తల్లి వెయ్యిరెట్లు అధికంగా గౌరవించదగ్గదిట. కాబట్టి తల్లి అనుమతి సన్యాస దీక్ష తీసుకోదలచుకున్న వారికి తప్పనిసరి. 'కుపుత్రో జాయేత కచిదపి కుమాతానభవ' అనికదా శాస్త్రం? చెడ్డపుత్రుడుండచ్చుకాని చెడ్డతల్లి ఈ భూమ్మీద వుండనే వుండదుట."

కొద్ది వారాలముందే తల్లినించి ఆ కథ విన్న మునిరత్నానికి మనసులో చటుక్కున ఏదో మెరుపులా స్ఫురించింది.

"ఇందాక ఆపత్ సన్యాసం గురించి చెపుతున్నారు. అది మీ ద్వారా తీసుకోవచ్చా స్వామీ?" ప్రశ్నించాడు మునిరత్నం వెంటనే.

"దానికి గురువక్కర్లేదు. మరణ సమయంలో గురువు, సరంజామా ఎక్కడినించి వస్తాయి? మనస్ఫూర్తిగా ఆ సమయంలో మూడుసార్లు 'సన్యాస్తోహం' అని బయటికి కాని, మనసులో కాని ఉచ్ఛరిస్తే చాలు. మన ఆత్మే అప్పుడు మనకి గురువు. సాధారణంగా ఆకస్మిక మరణ సందర్భంలో దీన్ని పూర్వులు మంచి జన్మకోసం తీసుకునేవారు.

'సన్యాస్తోహం' అంటే నేను సన్యసించాను అని అర్థమని సంస్కృతం చదువుకున్న మునిరత్నానికి తెలుసు.

కళ్ళు తుడుచుకుని ఆయనకి పాదాభివందనం చేసి, ఎంతో ప్రసన్న మనసుతో బయటకి నడిచాడు.

సైకిల్ మీద వెళుతుంటే, తిరుగు దారిలో అతనికి ఓ పథకం తట్టింది. దాని బాగోగుల్ని ఆలోచించుకుంటూ తన గ్రామం చేరుకున్నాడు.

* * * *

మర్నాడు ఉయ్యాలవాడ నించి అతని అక్కయ్య, బావ వచ్చారు మునిరత్నాన్ని నిశ్చితార్థానికి ఆహ్వానించడానికి. నిర్లిప్తంగా ఉన్నాడు తప్ప అతను వాళ్ళతో ఊఁ అనలేదు, ఆఁ అనలేదు.

"ఊళ్ళో అందర్నీ పిలుస్తున్నాం. నువ్వు ఏ వెర్రివేషాలు వేసినా మా పరువుపోతుంది. ధనాన్నింక చేసుకునేవాడు వుండడు. మేనమామకే

సరిపడనిది మాకెందుకని ఎవరూ దాన్ని చేసుకోడానికి రారు." కన్నీ
చెప్పింది అక్క, తల్లి అన్ని విషయాలు చెప్పడంతో.

అతను మౌనాన్ని వీడలేదు. ఆ సాయంత్రం మురళీ ఇంటికి
అడిగాడు.

"నువ్వు నాకో సహాయం చెయ్యాలి" చెప్పాడు.

"ఏమిటది?" ప్రశ్నించాడు మురళీ.

మునిరత్నం అతన్ని బయటికి తీసుకెళ్ళి అది వివరించగానే ము
భయంగా చెప్పాడు.

"చెయ్యను. నీకేమయినా పిచ్చెక్కిందా?"

"నువ్వు ఈ సహాయం చేసితీరాలి."

"చెయ్యను. అందర్నీ మోసం చేయడం నావల్లకాదు" జవా
చెప్పాడు మురళీ.

"మోసం కాదిది...." శంకరాచార్యుడు ఎలా సన్యాస దీక్ష
కున్నాదో ఆ కథ వివరించి చెప్పాడు.

"ఆ మొసలి ద్వారా శంకరాచార్యులకి సన్యాసం దక్కినట్లు, నా
పాము ద్వారా దక్కుతుందని రాసిపెట్టి వుందనుకో."

మురళీ ఓ పట్టాన ఒప్పుకోలేదు. ముప్పావుగంట తర్వాత కొ
మెత్తబడ్డాడు. గంటన్నర తర్వాత అంగీకరించాడు.

"చూడూ. నేను ఆధ్యాత్మికంగా బాగా పైకి వెళ్ళాక నీకు తప్ప
ప్రత్యుపకారం చేస్తాను."

"సన్యాసి అయ్యాక ఇక నువ్వేం చేయగలవు?" నవ్వాడు మురళీ

"ఏమో! ఎవరికి తెలుసు? నీకున్న ఎన్నో అవసరాల్లో నేను ఒక్క
దైనా తీర్చలేనా?"

"ఏమోకాని నీకేదైనా అయినా, ఇది బయటపడ్డాక నాకుంటుం
చెప్పాడు మురళీ.

"నేనుగా ఎవరికీ చెప్పను. నాకేదైనా అయినా మరేం ఫర్వాలేదు
అందుకు వచ్చే పాపం నీది కాదు, నాది. సరేనా?"

ఇద్దరూ మునిరత్నం వాళ్ళ పొలంలోకి వెళ్ళారు. ఈశాన్యమూలలో
ఉన్న పుట్టలో చాలా పాములున్నాయి. వాటిలో అతి ముసలిదయిన ఓ శ్వేత
నాగు పదడుగుల పైనే పొడవుంటుంది. అది దివ్యసర్పం అని అందరి
నమ్మకం. దాని బుసలు అప్పుడప్పుడూ వినిపిస్తుంటాయి. కాని ఎంత వెది
కినా ఎప్పుడూ ఎవరి కంటా పడదు. పడిన రోజు వాళ్ళకి శుభం జరుగు
తుంది అన్నది చాలామంది అనుభవం.

మురళికి చిన్నప్పట్నించీ పామంటే భయం లేదు. చిన్నప్పుడు తన
అక్క కొడుకుని ఓ పాము కాటేసి, అతను మరణించినప్పటి నుంచి,
వాటిని పట్టుకుని కోరలు విరిచేసి తిరిగి వదులుతుంటాడు. అలా కొన్ని
వందల తాచు పాముల కోరలు తీసేశాడు. అందువల్ల తను లోకానికి మేలు
చేస్తున్నాడని అతని ఉద్దేశం.

పాము ఉనికి ఇట్టే తెలుసుకోగలడు మురళీ. అట్టే శ్రమపడకుండానే
ఓ పొదలోని నల్లతాచుని లాఘవంగా పట్టుకున్నాడు. దాని నోరు తెరిచి
కోరల దగ్గర గట్టిగా పిండుతూ చెప్పాడు.

"ఇలా ఎన్నిటి విషాలను తీసానో తెలుసా?"

పిండితే, పచ్చటి చిక్కటి ట్రాన్స్‌పేరెంట్ ద్రవం చుక్కలు,
చుక్కలుగా బయటికి వచ్చింది. ఆ కోరలని జాగ్రత్తగా తన చొక్కా
అంచుతో తుడిచాడు. తర్వాత మునిరత్నం పొలం గట్టుమీది చెట్టు నించి
కోసిన ఓ పచ్చి బొప్పాయి కాయని పాము తల దగ్గర నేల మీద ఉంచాడు.
దాని తలని కొద్దిగా కిందకి సడలించాడు మురళీ. వెంటనే దాని తల కదిలి
సంత మేరకి పడగని సాచి అది రౌద్రంగా కాటు వేసింది. దాని కోరలు
పచ్చి బొప్పాయిలో నాటుకున్నాయి.

ఇంకోసారి, మరోసారి అలా మూడుసార్లు అది బొప్పాయిని కాటు
వేశాక అడిగాడు మునిరత్నం.

"ఇంక భయంలేదుగా?"

"లేదు."

మోకాలి మడమని ఆ పాము తల ముందు వుంచాడు. కళ్ళు మూసు
కుంటూ మూకాంబికా తల్లిని తలుచుకున్నాడు.

చురుక్కుమనడంతో దాని కాటు అతని మడమమీద గుచ్చుకో స్పష్టంగా తెలిసింది. తర్వాత మురళి దాని కోరలు విరిచేసి పుట్టవైపు కాడు.

"ఏమైనా అనిపించిందా?" అడిగాడు మురళి.

"జివ్వుమంది. అంతే."

"విషం ఎక్కుతున్నట్లుగా అనిపిస్తోందా?"

"పిండాకేమంటుంది? బాగా మంటగా వుంది."

మురళి మునిరత్నం సైకిల్ దగ్గరికి నడిచాడు. మునిరత్నా ముందు కూర్చోపెట్టుకున్నాడు మురళి. పదిగజాల దూరం వెళ్ళా తక్కున బ్రేక్ వేసి సైకిల్ ఆపి కుడివైపు చూపించాడు.

బాటకి కొద్దిదూరంలో కుడివైపు నేలమీద చుట్టచుట్టుకుని పడగ ఆడుతున్న తెల్లటి ఆ ముసలి శ్వేత నాగుని చూసారిద్దరూ. రెండు చేతులు కదిపితే ఎంత విస్తీర్ణం వుంటుందో అంతుంది దాని పడగ. న కృష్ణ పాదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇద్దరూ అప్రయత్నంగా రెండు చేతులతో నమస్కరించారు. అది పడగ దించి నేల పాక్కుంటూ వాళ్ళకి దూరంగా వెళ్ళిపోయింది. ఇంటిదారి పట్టారు వా

మురళి భుజాలు పట్టుకుని కుంటడం నటిస్తూ లోపలికి వస్తున్న రత్నాన్ని చూసి అడిగింది అతని అక్కయ్య కంగారుగా.

"ఏమైందిరా?"

"పాము కాటేసిందిట" చెప్పాడు మురళి.

"ఏమిటి? పామే? ఎక్కడ?" అదిరిపడుతూ అడిగిందామె.

"దారిలో మూత్రానికి రోడ్డు దిగి డొంకలోకి వెళ్లాను" బలహీన చెప్పాడు మునిరత్నం బాధ నటిస్తూ.

మునిరత్నం బావ ఆ గాయం మీద గుర్తులు పరీక్షించి, అక్కడ నల్లగా కమిలివుండటంతో అది తాచుపాము కాటై వుండచ్చని చెప్పా క్షణాల్లో ఆ సంగతి ఊరంతా పాకింది. అంతా వచ్చి నిజంగా బా మూలుగుతున్న మునిరత్నాన్ని చూసారు. పాము మంత్రం వేసే ఒక వచ్చాడు.

మహాలక్ష్మమ్మ ఏడుపుకి అంతులేదు. అక్కయ్య మునిరత్నం తలని ఒళ్ళో పెట్టుకుని పెద్దపెట్టున ఏడుస్తోంది. ఒకరు ఏదో ఆకు పసరు తెచ్చి గాయం మీద వేసి కట్టుకట్టారు.

మునిరత్నం నోట్లో ఉమ్మిని చేర్చి దాన్ని బయటికి నోటి పక్కనించి వదులుతూ చెప్పాడు.

"అమ్మా! విషం మోకాలిదాకా ఎక్కింది. అది నల్లతాచు. ఇక నా పనైపోయింది."

"అట్లా అనకురా" అంది మహాలక్ష్మమ్మ ఏడుస్తూ.

"అబ్బా! లోపలంతా నిప్పులా కాలుతూ పైకి ఎక్కుతున్నట్లుగా వుంది. ఏమైనా చెయ్యమ్మా" దీనంగా అడిగాడు మునిరత్నం.

"ఏం చెయ్యనురా? ఆసుపత్రి దగ్గర్లో లేదాయె."

"నిజంగా విషం ఎక్కుతోందా?" మురళి ఆదుర్దాగా అడిగాడు.

"అవును!"

"అయ్యయ్యో!"

మళ్ళీ కాస్తంత ఉమ్మిని నోటివెంట కిందకి జార్చాడు. కొందరు ఊరి మధ్యలోని మర్రిచెట్టు కింద వున్న నాగుల శిలలకి కొబ్బరి కాయలు, కోడిగుడ్లు కొట్టసాగారు.

ఆ రోజుల్లో పాము కాటుకి పాము మంత్రం, పసర్లు తప్ప వేరే చికిత్స ఎరగరు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు లేవు. ఎక్కువగా గ్రామంలోని ఆయుర్వేద వైద్యుడి మీదే ఆధారపడేవారు. ఆయన వచ్చి పెళుసాకుగా పిలవబడే తెల్లని ఈసరి ఆకు రసాన్ని మునిరత్నం చేత తాగించాడు.

మునిరత్నానికి కొద్దిగా మగతగా, మత్తుగా వుంది. అతనింక నటించాల్సిన అవసరం లేకపోయింది. మురళి మొహంనిండా ఆదుర్దా. "ఎక్కుతోందా? ఎంతదాకా ఎక్కింది?" అని బాధగా అయిదునిముషాలకోసారి అడుగుతున్నాడు. ఎక్కడిదాకా ఎక్కిందో మునిరత్నం చేత్తో చూపిస్తున్నాడు. అబద్ధమా నిజంగానా అని అడుగుతూ కక్కలేక, మింగలేక మురళి మునిరత్నం కోసం తపనపడసాగాడు.

మునిరత్నానికి తను నిజంగా చచ్చిపోతానేమోనన్న భయం మొ లైంది. విషం పైకి ఎక్కుతున్న భావన అధికం కావడంతో ఆ పా కోరల్లో ఇంకా విషం మిగిలివుండి వుంటుంది అనుకున్నాడు. తల్లి చెప్పాడు.

"అమ్మా! నేనోటి అడుగుతాను. ఇస్తావా?"

"ఏం కావాలి బాబూ?"

"ఇస్తానని మాట ఇస్తే చెప్తాను."

"ఇస్తా బాబూ! అడుగు."

"ఇస్తానంటేనే అడుగుతాను."

"ఇస్తాను. ఏం కావాలి?"

"అనుమతి.... నేను సన్యాస దీక్ష తీసుకోడానికి అనుమతివ్వు."

ఆ కోరికకి ఆవిడ నిర్ఘాంతపోయింది.

"నేనెలాగూ పోతున్నాను. ఇప్పుడైనా ఒప్పుకోమ్మా" అప్పటి మునిరత్నం చర్మం స్వల్పంగా నీలం రంగులోకి మారింది. ఆవిడ వెంట చెప్పింది.

"అలాగే కన్నా, తప్పక ఇస్తానుండు."

లేచి ఇంటి వెనక వున్న కామాక్షి అమ్మవారి గుళ్ళోకి వెళ్ళి దేవి దణ్ణం పెట్టుకుంటూ మనసులో కోరుకుంది.

"తల్లీ! సన్యాసానికి తల్లి అనుమతి తీసుకున్న శంకరుడు బ్రతి నట్లు నా అనుమతి తీసుకున్న మా మునిరత్నాన్ని కూడా మృత్యు ముఖం లోంచి బయటపడేలా చూడు తల్లీ. వాడి ప్రారబ్ధం తీరితే, కనీసం నా ఆయు ర్దాయంలోంచి కొంత వాడికి కలుపు.

కామాక్షి అమ్మవారి కుంకుమ తీసుకుని, తమ పూజా మందిరంలోని వెంకి నరసింహ విగ్రహానికి దణ్ణం పెట్టుకుని వచ్చి మునిరత్నం నుదుట ఆ కుంకుమ బొట్టుపెట్టి చెప్పింది.

"మునిరత్నం! నువ్వు సన్యాసం తీసుకోవడానికి అనుమతి ఇస్తు న్నాను. ఆ దేవి దయ వుంటే నీకేం కాదు. సన్యాస దీక్ష తీసుకుని శంక

రుడు బ్రతికి బట్టకట్టినట్లు నువ్వు ఈ అనుమతితో అమ్మ దయతో బ్రతకాలి. నీకు సన్యాస దీక్షకి అనుమతి ఇస్తున్నాను."

"సన్యాస్తోహం, సన్యాస్తోహం, సన్యాస్తోహం" మూడు సార్లు గట్టిగా చెప్పాడు మునిరత్నం.

"అమ్మ! నేనిప్పుడు సన్యాసయ్యాను. నిజంగా సన్యాసినయ్యాను" చెప్పాడు ఆనందంగా.

వెలుగురేఖలాంటి ఓ చిరునవ్వు అతని మొహంలో చోటు చేసు కుంది. తర్వాత మగతతో అతని కళ్ళు మూతలుపడ్డాయి.

* * * *

ఇరవై నాలుగు గంటలపాటు మునిరత్నానికి స్పృహలేదు. జ్వరంతో ఒళ్ళు కాలిపోసాగింది. గంధం అరగదీసి నుదుట, పొత్తి కడుపుమీద పట్టి స్తున్నారు.

క్రమేపీ అతని చర్మం రంగు మామూలు అవడంతో ఇంక భయం లేదని చెప్పాడు ఆయుర్వేద వైద్యుడు. అందుకు అందరికన్నా ఎక్కువ సంతోషించింది మురళి.

నాలుగురోజుల్లో పూర్తిగా కోలుకున్నాడు. నీరసం తగ్గడానికి మరో రెండు రోజులు పట్టింది. మునిరత్నం సన్యాసం తీసుకోవడంతోనే బ్రతి కాడని భీమునిపాడు గ్రామం మొత్తం అనుకోసాగింది. అతనూ శంకరా చార్యులంతటి వాడవుతాడని కొందరు పెద్దలు జోస్యం చెప్పారు.

నరసింహయ్య మాత్రం ఆ సన్యాసాన్ని ఆషామాషీగా కొట్టిపారే సాడు. కాని అందుకు మునిరత్నం ఒప్పుకోలేదు. తను నిజంగా సన్యాసి నని, ఇక ఎలాంటి ఐహికబంధాలు తనకి లేవని చెప్పి, ఇంటివెనకవున్న తన బాబాయి సమాధి మందిరంలోకి మారాడు.

వారంరోజులపాటు తండ్రీ కొడుకుల మధ్య ఈ విషయంమీద వాగ్యుద్ధం జరిగింది. ఒకరిద్దరు పెద్దలు కల్పించుకుని సన్యాస దీక్ష విర మించుకుంటే మళ్ళీ ఆ పాము వచ్చి కాటేసి చంపే అవకాశం లేకపోలేదని చెప్పాక నరసింహయ్య వెనక్కు తగ్గాడు. అయినప్పటికీ ఆయనకి ఈ సన్యాస దీక్ష పేలాకోళంగానే తోచసాగింది.

తన తమ్ముడికి సన్యాస దీక్ష ఇచ్చిన కంచి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర సరస్వతి దగ్గరికి వెళ్ళి, ఈ ధర్మసందేహం తీర్చుకు రమ్మని భార్య మహాలక్ష్మమ్మ ఇచ్చిన సలహా నరసింహయ్యకి నచ్చింది. ఆయన దగ్గరికి వెళ్ళి ఆయన ఏం చెప్తే, అది వినే ఒప్పందంమీద మునిరత్నాన్ని వెంట తీసుకుని నరసింహయ్య కంచికి ప్రయాణం అయ్యాడు.

"ఒకవేళ స్వామి నేను సన్యాసినని ఒప్పుకుంటే అప్పుడు ఆయన సన్యాస దీక్ష ఇస్తారేమో కనుక్కో నాన్నా" చెప్పాడు మునిరత్నం దారిలో.

ప్రయాణ కాలమంతా నరసింహయ్య ఆందోళనగానే వున్నాడు. వాళ్ళ అదృష్టం కొద్దీ చంద్రశేఖర సరస్వతి కంచిలో వుండడమే కాక, ఆ సాయంత్రం వాళ్ళు ఆశ్రమానికి చేరగానే ఆలస్యం లేకుండా దర్శనం కూడా లభించింది.

ఆ సమయంలో కంచి పీఠాధిపతి సందర్శకులతో మాట్లాడుతూ హాల్లో కూర్చుని వున్నారు.

"....రామ అన్నది ఒక్క పేరే కాదు. మంత్రం కూడా. రామ మంత్రాన్ని ఎందుకు తారకమంత్రం అంటారంటే అది మనిషిని తరింప చేసేది. ముక్తినిచ్చేది. ఓ కవి ఈ విషయాన్ని ఎంత చమత్కారంగా చెప్పాడో చూడండి.... ఓ అడవిలో కొందరు దొంగలు తాము చేద్దామను కున్న పనిని గురించి మాట్లాడుకుంటూనే ముక్తి పొందారు. ఎందుకంటే అనుకోకుండా వాళ్ళు ప్రతి మాటలో రాముడి పేరుని స్మరించారు.

వనే చపి రామః వసు చాహరామః
నదీం స్తరామః నభయం స్మరామః।
వనే కిరాతః ముక్తిం గతాః షంగాతే॥

ఆ దొంగలు ఈవిధంగా మాట్లాడుకుంటున్నారుట. "వనే చరామః.... చరామః అన్నది ఒక్కటే పదం.... సంచరిద్దాం.... నివశిద్దాం అని అర్థం. 'అడవిలో నివశిద్దాం' అన్నారుట. ఆ పదంలోని 'రామ' పదం అను కోకుండా పలికారు వాళ్ళు. అలాగే వసు చాహరామః దారిన వెళ్ళే ప్రయాణీకులనించి ధనాన్ని, బంగారాన్ని దొంగిలిద్దాం అనుకున్నారట. వసు అంటే

భూమినించి వచ్చే సంపద బంగారమేగా వసుంధర.... వసువుని ధరించేది అంటే భూమి, వసు చాహరామః లోని చాహరామః లో కూడా అనుకో కుండా రామ పదం వుంది. తర్వాత వాళ్ళు అనుకున్నారు, నదీః స్తరామః అంటే 'దొంగిలించాక నదిని దాటేద్దాం. వాళ్ళు మనలా వేగంగా ఈదు కుంటూ వచ్చి మనల్ని పట్టుకోలేరు' అనుకున్నారు. స్తరామః లో కూడా రామ పదం వుంది. ఆ తర్వాత అనుకున్నారు. నభయం స్మరామః 'ఇక నదిని దాటితే మనం పట్టుబడతామన్న భయాన్ని మర్చిపోదాం' అను కున్నారు. స్మరామఃలో కూడా రామ పదం వుంది.

"ఇలా నాలుగు పదాలలో రామ పలకడంతో ఏమైందిట? వనే కిరాతః ముక్తి గతాః షంగాతే.... ఆ అడవిలోని దొంగలు మరణించాక ముక్తిని పొందారుట.... చూసారా? రామ అనే పదం విడిగా కాకపోయినా, ఇతర పదాలతో చెప్పినందుకే పాపులైన ఆ దొంగలకి ముక్తి లభించిందంటే, ఇక భక్తితో శ్రద్ధగా రామపదాన్ని స్మరిస్తే ఇంకెంత లాభం వుంటుంది?అందుకే రామమంత్రం ఒక్కటే తారకమంత్రం అయింది. శివుడూ జపం చేసేది రామనామమే."

స్వామి తన మనోహర కంఠంతో భావయుక్తంగా చెప్తున్న ఆ భవ హర మంత్రం గురించి వినడంలో లీనమైపోయాడు నరసింహయ్య, తను వచ్చిన పని మరిచి.

"రామమంత్రం ఎందుకంత గొప్పదైందంటే రామ అక్షరాలని రెండు గొప్ప, అతిశక్తివంతమైన మంత్రాలనించి తీసుకోబట్టే. అష్టాక్షరీ మంత్రం అందరికీ తెలిసిందే. అలాగే పంచాక్షరీ మంత్రం కూడా. ఓం నమో నారాయణాయ. ఇందులోని 'రా'ని, ఓం నమశ్శివాయ లోని 'మ' తీసుకుంటే, 'రామ' అన్న మంత్రం వచ్చింది. ఓం నమ శ్శివాయలో 'మ' తీసేస్తే ఏమవుతుంది? నశ్శివాయ అంటే శివుడు లేడని. ఆ మంత్రానికి గుండెకాయ 'మ' అక్షరం. అలాగే ఓం నమో నారాయణలోని 'రా' తీసేస్తే 'ఓం నమోనాయణాయ.... నాయణాయకి అర్థమే లేదు. శక్తివంతమైన 'రా' వల్లే అర్థం వస్తుంది. 'రామ' అన్న రెండు చిన్న అక్షరాలు మనిషి మోక్షానికి తాళంచెవులు. ముక్తి కోసం

సన్యాసం తీసుకుని, అడవుల వెంటబడి కొండగుహల్లో నివశిస్తూ కంద మూలాలు తినాల్సిన పనిలేదు. ఇంట్లో కూర్చుని 'రామ' అనుకుంటే చాలు

'హరే రామ హరే రామరామ హరే హరే. హరే కృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే' మంత్రం కలిసంతరణోపనిషత్తు లోనిది. ఇది నారదుడు ఉపదేశించిన మంత్రం.... ఉట్టి 'రామ' అనుకున్నాచాలు. దాన్ని తిరగేసి 'మరా'గా దీక్షఇస్తే దోపిడీదొంగ అయిన రత్నకరుడు వాల్మీకి కాలేదా!

రామ మంత్ర మహిమకి ఇంతకిమించిన సాక్ష్యం అనవసరం.

"ఆది శంకరాచార్య పుట్టినరోజుల్లో సన్యాసాశ్రమానికున్న విలువ ఇప్పుడు లేదు. కారణం కొందరు మోసగాళ్ళు కూడా కాషాయాంబరాన్ని వేషంగా వేసుకోవడం మనం చూస్తున్నాం.

జటిలో ముణ్డీ లుంచిత కేశః కాషాయంబర బహుకృత వేషః

పశ్యన్నపి చ నపశ్యతి మూఢః ఉదరనిమిత్తం బహుకృత వేషః॥

ఆదిశంకరుడు భజగోవిందం శ్లోకాల్లో ఆనాడే చెప్పాడు. ఆయన కారణజన్ముడు కాబట్టి సన్యాసాశ్రమం కోరుకున్నాడు. తల్లికిది తెలీదు కాబట్టి అందుకు అనుమతినివ్వనంది. అయితే పరమేశ్వరుడి ముందు ఆ తల్లి ఏపాటి? ఆయన మొసలి రూపంలో వచ్చి బాలశంకరుడి కాళ్ళు పట్టుకున్నాడు. ఏమైంది? ఆపత్ సన్యాస దీక్ష తీసుకోవడానికి తల్లిని అనుమతి అడిగాడు ఆ బాలుడు. పుత్రుడు ఇష్టపడి అడిగితే ఆఖరి సమయంలో ఆఖరి కోరికని ఏ తల్లి కాదనగలదు? అనుమతి ఇచ్చింది.

'సన్యస్తోహం' అని మూడుసార్లు ఉచ్ఛరించాడా బాలుడు. సన్యాసయ్యాడు. తను వచ్చినపని పూర్తవడంతో మొసలి రూపంలోని శివుడు మాయమయ్యాడు. ఆదిశంకరుడి బంధువుల్లో కొందరు అతను శాస్త్రం చెప్పిన రీతిలో తిరిగి గురువుద్వారా సన్యాసదీక్ష తీసుకోవాలన్నారు 'హనుమంతుని ముందా కుప్పిగంతులు' అన్నట్లు అప్పటికే వేదాలన్నీ బాపోసన పట్టి తర్కశాస్త్రంలో దిట్ట అయిన శంకరుడు అది విని నవ్వి 'నేను మర

ణించి వుంటే, నాకు సన్యాసదీక్ష లభించినట్లా? కాదా?' అనడిగాడు. లభించినట్లే అన్నారు. 'కాబట్టి నేను బ్రతికివున్నా, నాకు సన్యాసదీక్ష లభించినట్లే కదా. ఓసారి వివాహం అయినవారికి అదే భార్యతో రెండోసారి ఎలా వివాహం చేయరో, అలాగే ఓసారి సన్యాసి అయినవాడికి మళ్ళీ సన్యాసదీక్ష ఏమిటి?' అని కొట్టిపారేశారు. కొందరు అనుకుంటారు, గోవింద భగవత్పాదులు శంకరుడికి సన్యాసదీక్ష ఇచ్చారని. అబద్ధం....ఆయన కేవలం మంత్ర దీక్ష మాత్రమే ఇచ్చారు."

ఆయన చెప్పే ఆధ్యాత్మిక ప్రబోధాలని ఎంతో పరవశంగా విన్నాడు మునిరత్నం. అది పూర్తయ్యాక స్వామి లేచారు. వెళుతూ ఆయన నరసింహయ్య వంక మందహాసంతో చూస్తూ అడిగారు.

"మీ వంశం మీద ఆ సాధువు పెట్టిన శాపం మీ మునిరత్నంతో పూర్తయిందన్న మాట."

అది విన్న నరసింహయ్య, మునిరత్నాలిద్దరూ షాకయ్యారు. తాము ఏం అడగదలుచుకుని వచ్చారో అది అడక్కుండానే చెప్పడమే కాకుండా, తన సంగతి మొత్తం తెలిసినట్లు మాట్లాడడం ఆయన సర్వజ్ఞతకి నిదర్శనంగా భావించాడు నరసింహయ్య. ఆ రాత్రి అక్కడ మఠంలో నిద్రచేయమని మర్నాడు ఉదయం దేవికి తను చేసే పూజ చూసి ప్రసాదం తీసుకోమని చెప్పి లోపలికి వెళ్ళిపోయారు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి.

మునిరత్నానికి అదే మొదటిసారి ఆశ్రమం చూడడం అదంతా తిరిగి చూసాడు. గోశాల, వేద పాఠశాల, ఆలయం అన్నీ. మర్నాడు ఉదయం శ్రీ చంద్రశేఖర సరస్వతి అమ్మవారికి చేసే షోడశోపచార పూజని దూరంనించి చూశారు.

మధ్యాహ్నం భోజనాలకి ముందు స్వామివారు తండ్రీ కొడుకులిద్దరికీ కబురుచేస్తే వెళ్ళి కలిసారు. వీళ్ళతో వంటరిగా భేటీ అయిన స్వామి చెప్పారు.

"ఏం పనిమీద వచ్చారు?"

"స్వామీ! ఎందుకీ పరీక్ష? మీకు తెలీదా? అసలు మేం బయలుదేరి

నప్పుడే ఆ సంగతి తమకు తెలుసు. నాకు ఇక సందేహాలు లేవు" చెప్పాడు నరసింహయ్య తలవంచి నమస్కరిస్తూ.

చిన్నగా మందహాసం చేసి చెప్పారు స్వామివారు.

"జరిగిందంతా మంచికే. భోజనం చేసి వెళ్ళరండి."

"ఇక చదువుకోనంటున్నాడు."

"చదువులలోకెల్లా పెద్ద చదువు దొరికిందిగా. ఇంక ఈ చిన్న చదువుల ఆవశ్యకతేముంది?"

"కానీ...." ఆగిపోయాడు నరసింహయ్య.

"సంప్రాప్తే సన్నిహితే కాలే, నహినహి రక్షతి డుకృఞ్ కరణే...." అని పూర్తిచేశారు స్వామి.

"....ఈ డుకృఞ్ కరణేల గురించి ఇక బాధపడకు."

"స్వామీ! మూకాంబికా దేవి ఆలయంలో నాకేమైంది?" అక్కడ జరిగింది వివరించి, ప్రశ్నించాడు మునిరత్నం.

"ఆ తల్లి కరుణ నీమీద ప్రసరించింది. పూర్వ జన్మలో కూడా నీవు యోగివై వుంటావు. ఇంకా మిగిలిన కర్మలతో నీకీ కాయం లభ్యం అయింది. ఎక్కడ ఆపావో ఈ జీవితంలో మళ్ళీ అక్కడినించి ధ్యానం మొదలవుతుంది. సన్యాసికి పూజా ధ్యానాలు తప్ప చేయాల్సినదింకేం వుండదు. నంద్యాల నవనందులు వున్న ప్రదేశం. చుట్టుపక్కల ఎన్నో దివ్యక్షేత్రాలు వున్నాయి. వీలయితే ధ్యానం అక్కడ చేసుకో. తరించడానికి పుట్టావనుకో. ఇదే ఆఖరి జన్మ చేసుకో. శుభమస్తు. జయమస్తు."

ఇద్దరూ వారి పాదుకలకి నమస్కారాలు చేసారు. భోజనానంతరం తిరిగి స్వగ్రామం బయలుదేరారు. నరసింహయ్యకి అన్ని అనుమానాలు పటాపంచలవడంతో మనసు ప్రశాంతంగా అయింది.

శివబాబా తన జీవిత కథని చెప్పడం ఆపారు. నెమ్మదిగా కళ్ళు తెరచి, తన ముందు అర్ధచంద్రాకారంలో కూర్చున్న తన శిష్యులందరి వంకా, వారి వెనకనే కూర్చుని ఆయన చెప్పేది శ్రద్ధగా వింటున్న గ్రామస్థులవంక చూసారు.

"అదీ నా పుట్టుక, మరణం, తిరిగి పుట్టిన వైనం."

"పాము విషంవల్ల మరణించి, మళ్ళీ బ్రతికారా బాబా?" అడిగాడు శివణ్ణ ఆశ్చర్యంగా.

శివబాబా మందహాసం చేసి బదులు చెప్పారు.

"లేదు. సన్యాసం అంటే మళ్ళీ పుట్టడం. సన్యాసాశ్రమం తీసుకునే వారు తమకి తామే తద్దినం పెట్టుకునే కర్మకాండ చేసుకోవాలి. అది ఆ దీక్షలో భాగం. ఆ తర్వాత గత జీవితంలోని ఎవరితోనూ, ఎలాంటి బంధాలు వుండవు. గత జన్మలోని వాళ్ళతో మనకి ఇప్పుడు బంధాలుంటాయా? ఉండవుగా. సన్యాసికీ అంతే."

"కాని చాలామంది సన్యాసులు ఇప్పుడలా ఉండడం లేదు కదా బాబా?" అడిగాడు నాయర్.

"అలా వుంటే వారు నిజమైన సన్యాసులు కారని అర్థం. మీ క్రిందటి జన్మ గురించి మీరెప్పుడూ ఎలా మాట్లాడరో, సన్యాసదీక్ష తీసుకున్నాక మళ్ళీ గత జీవితం గురించి కూడా మాట్లాడకూడదు. అసలు పూర్వ నామమే చెప్పకూడదు. అది శాస్త్రనిషేధం."

"మీరు పూర్ణ సిద్ధపురుషులు కాబట్టి మీకిలాంటి కర్మలేం అంటవు కాబట్టి మీరు మీ గతం గురించి చెప్తున్నారు కదా బాబా?" అడిగింది సుందరాంబాళ్.

"అవును" చెప్పాడు శివబాబా.

"సన్యాసం విషయంలో మీరు మీ తల్లిగార్ని మోసం చేసినట్లు కాదా బాబా?"" ప్రశ్నించింది శారదామా.

"అవును. కాని అది ఆదిశంకరుడికే తప్పలేదు. అంతెందుకు? రమణమహర్షి- అప్పట్లో వెంకట్రామన్- ఇల్లు విడిచి వెళ్ళిపోతూ, మధ్యాహ్నం స్కూల్లో విద్యుచ్ఛక్తిమీద ప్రత్యేక పాఠం వుందని అన్నగారితో అబద్ధం చెప్పి వెళ్ళారు. మళయాళస్వామి తల్లి అనుమతి లేకుండా దేశాటన కోసారి, తిరుమలలోని గోగర్భంలో తపస్సు చేయడానికోసారి వెళ్ళారు. కొందరికిలాంటివి కొన్ని సందర్భాల్లో తప్పవు."

"స్వామీ! ఇందాక మీరు మనం నాలుగైదు జన్మలుగా కలిసివస్తున్నా

మని చెప్పారు. గత జన్మలో మనిద్దరి మధ్యా ఏ సంబంధం వుంది?" అడి
గాడు రాఘవరెడ్డి.

మరోసారి మందహాసం చేసి చెప్పారు శివబాబా.

"గత జన్మలో నువ్వు శేషాద్రిశాస్త్రివి. నా జీవిత చక్రంరాసిం నువ్వే. నువ్వు నన్ను గాఢంగా నీ గురువుగా భావించావు కాబట్టి ఈ జన్మలో మనిద్దరికీ ఆ బంధం మిగిలిపోయింది. అందుకే నీకు ఈ జన్మలో జ్యోతిషం మీద అభిరుచి వుంది. నన్ను మొదటగా నీవు కలిసింది జ్యోతిషశాస్త్రం నేర్చుకోవాలనే."

"మరి నేను బాబా?" ప్రశ్నించాడు శివణ్ణ.

"మనిద్దరం నా మునుపటి జన్మలో ఒకే తండ్రికి పుట్టినవాళ్ళం. తల్లులు వేరు. నేను గత జన్మలో కూడా సన్యాసినే. కాని నువ్వు గృహస్థువి. ఆ జన్మలో ఆధ్యాత్మికంగా నేను మణిపూరకం దాకా చేరాను. నేను గర్వంతో కొన్ని సిద్ధులని నీకు చూపించేవాడిని. అందువల్ల నా చివరి కాలంలో నువ్వు నలభై రోజులపాటు నీ ఇంట్లో వుంచుకుని సేవచేశావు. దానికి ప్రతిఫలాన్ని నేనిప్పుడు నీకు గురువుగా చెల్లిస్తున్నాను."

శివబాబా తన పక్కనున్న పెద్ద రాగిచెంబులోని నీటిని కొబ్బరి చిప్పతో చేసిన చిన్న పాత్రలోకి వంచుకుని తాగాక తన జీవితచరిత్ర చెప్పడం కొనసాగించాడు.

అదే సమయంలో....

10

న్యూఢిల్లీ.

రాష్ట్రపతి భవన్.

ఇండియా వచ్చిన ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆ రోజు రాష్ట్రపతి భవన్‌కి విందుకి వచ్చాడు. ఇది కొన్ని వారాలముందు నిర్ణయింపబడిన కార్యక్రమం కాబట్టి, భారత రాష్ట్రపతి అబ్రహాం, రాష్ట్రపతి భవన్‌లో పనిచేసే పృధ్వీరాజ్‌లా, తన ఆధ్యాత్మిక గురువైన శివబాబాని ఆయన నిర్యాణానికి ముందు మరోసారి చూడాలన్న కోరికను తీర్చుకోలేకపోతు

న్నాడు. ఢిల్లీ వదిలివెళితే ఆస్ట్రేలియన్ ప్రధానమంత్రిని అవమానపరిచి నట్లవుతుంది.

విందు ముగిసింది. అబ్రహాం తన అతిథితో, అతని భార్యా పిల్లలతో మర్యాదకోసం ముచ్చటిస్తున్నా, అతని మనసంతా మణికొండలోని శివబాబా మీదే వుంది. ఈపాటికి అక్కడ ఏం జరుగుతుందో అని పదే పదే ఆలోచిస్తున్నాడు.

విందు ముగిసాక అతిథులంతా వెళ్ళిపోయారు. అబ్రహాం తన గదిలోకి వెళ్ళాడు. శివబాబా ఆశ్రమంలో తను టెలిఫోన్ పెట్టిస్తానని ఎన్నిసార్లు అన్నా ఆయన నిరాకరించినందుకు అబ్రహాంకి తన గురువు మీద కించిత్ కోపం కూడా వచ్చింది. లేకపోతే ఫోన్‌చేసి అక్కడి సమాచారం తెలుసుకుని వుండేవాడు. ఈజీ ఛెయిర్‌లో కూర్చుని కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు.

తన గదిలోని రాకింగ్ ఛెయిర్ కదులుతున్న శబ్దం విని ముందు అది తన భ్రాంతి అనుకున్నాడు. కానీ భ్రాంతి కాదని తెలిసాక ఆశ్చర్యంగా తలతిప్పి దానివైపు చూసాడు. అది నిజంగా కదులుతోంది. అందులో కూర్చుని నవ్వుతూ చూస్తున్న శివబాబా కనబడగానే అబ్రహాంకి ఎంతో ఆశ్చర్యం వేసింది.

"బాబా! మీరేనా? ఎలా వచ్చారిక్కడికి?" లేచి అడిగాడు సంభ్రమంగా.

"సెక్యూరిటీ వాళ్ళ కన్నుకప్పి రహస్యంగా లోపలికి రాలేదు. తలుపు లోపల బోల్ట్ పెట్టుకున్నావుకదా! నువ్వు నన్ను చూడాలని ఎంతో తపించిపోతున్నావని ఓసారి కనబడదామని వచ్చాను."

"బాబా! నా మీద ఎంత దయ మీకు?"

అబ్రహాం అప్పటికే పరమహంస యోగానంద రాసిన 'ఒక యోగి ఆత్మకథ'ని అనేకసార్లు చదివాడు. అందులో ఓ అధ్యాయంలో, చిన్న కుర్రాడిగా వున్న యోగానంద ఒకేసారి రెండుచోట్ల, రెండు దేహాలతో కనబడే యోగిని గురించి చదివాడు.

"నువ్వు వూహించింది కరెక్టే! నేనిప్పుడు మణికొండలోనూ

పున్నాను. నీ ఎదుట వున్నాను. అబ్రహాం, మనిషిచేసే నేరాల్లోకెల్లా అ
పెద్ద నేరం ఏమిటో తెలుసా? తను ఆత్మ అని తెలుసుకోలేక, 'కనిపించే ఈ దేహం నేను' అనుకోవడం. దానికెన్నో పేర్లు. మాయ, మనసు అజ్ఞానం, అహంకారం.... నువ్వు చూడాలనుకుంది నా భౌతిక దేహాన్ని కాని నేను అంతటా ఉన్నానన్న సంగతి నువ్వు గ్రహించలేకపోతున్నావు ఈ విశ్వంలో నేను లేనిచోటులేదు. ఈ విశ్వమే నేను. నేనే ఈ విశ్వాన్ని."

"బాబా! మీరిది చాలాసార్లు చెప్పారు. కాని నాలోని ఈ దేహ బుద్ధిపోవడం లేదు" బాధగా చెప్పాడు అబ్రహాం.

"నిజమే! నీ ఆత్మ చుట్టూ ఆవరించుకుని బలంగా వున్న బహు జన్మార్జిత వాసనా సంస్కారాలు నాశనమైతే కానీ అది నీకు అనుభవపూర్వకంగా తెలీదు. ధ్యానం బాగా చేస్తున్నావా?"

"చేస్తున్నాను తండ్రీ! ఇదే నా చివరి జన్మ చేయమని నిద్ర లేవగానే, పడుకోబోయేముందు మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను."

"ఇంకా?"

"బాబా?" అర్థంకాక అడిగాడు అబ్రహాం.

"నేను నీకు చెప్పిన అతి ముఖ్యమైన ఉపదేశం గుర్తుందా?"

"అదా బాబా! గుర్తుంది. నేనేది చేసినా ఆ పనిమీద ఆసక్తితో కాని, దాని ఫలితం కోసం కాని చేయక, నాలో ప్రకృతి సిద్ధంగా కలిగిన సత్త్వ, రజస్తమోగుణాలు అవి నాతో చేయిస్తున్నాయని, వాటి ప్రతిఫలాన్ని భగవదర్పం చేస్తున్నానని భావించి ఏదైనా చేయమని మీరు నాకు పలుమార్లు ఉపదేశించారు. అలాగే భావించి చేస్తున్నాను."

"కొత్త కర్మలు ఏర్పడకుండా ఉండడానికి ఇది చక్కటి దారి. నేను దేహం అనే అహంకారంతో ఏం పని చేసినా, ఆ కర్మ మనకి బంధమే అవుతుంది. ఆ బంధాన్ని తీర్చుకోవడానికి మళ్ళీ పుట్టాలి. అసలా కర్తృత్వ భావన లేకుండా చేస్తే ఏదీ నీకు అంటుకోదు....నీకిప్పుడు చెపుతున్నాను విను. గతజన్మలో నువ్వు చేసిన పుణ్యఫలం బంధమై భారత రాష్ట్రపతి అయ్యావు."

"బాబా! నేనెప్పుడూ అనుకుంటూండేవాడిని. నేను ఏ జన్మలో ఏ పుణ్యం చేసానో, నాకీ మహోత్కృష్టమైన పదవి వచ్చింది అని."

గత జన్మలో నువ్వు తమిళనాడులో కుంభకోణం దగ్గర పరమానల్లూరు అనే గ్రామంలో నిరుపేద బ్రాహ్మణుడిగా జన్మించావు. ఒక వంట బ్రాహ్మణుడి దగ్గర సహాయకుడిగా పనిచేసావు. నువ్వు నిరతాన్న దానశీలివి. మనం వున్నచోట ఎవరూ ఆకలితో ఉండకూడదన్నది నువ్వు నమ్మి ఆచరించిన విషయం.

"ఆ ఊళ్ళో నరసింహాలయానికి ఏటా ఉత్సవాలు జరిపేవారు. వేల మంది ఆ ఉత్సవాలకి వచ్చేవారు. నీకున్న కొద్దిపాటి భూమిని అమ్మి అన్నదానం ప్రారంభించావు. నాలుగేళ్ళలో డబ్బంతా అయిపోయాక నీ భార్య అలిగి పుట్టింటికి వెళ్ళింది. మరి తిరిగిరాలేదు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ధర్మాధికారి నీమీద జాలితో నిన్ను ఆలయ వంటవాడిగా తీసుకున్నాడు. చివరిదాకా నీకంటూ రెండు తువ్వాళ్ళుతప్ప ఏంలేదు. మాసిన ఓ తుండుని కట్టుకుని, ఇంకోటి భుజంమీద వేసుకుని నువ్వు ఉత్సవాల సమయంలో అనేక వేలమందికి భోజన సదుపాయం తలపెట్టావు.

"పెద్ద బజారుకిపోయి వర్తకులని 'నువ్వో బస్తా బియ్యం పంపు, నువ్వు పప్పు, నువ్వు నెయ్యి పంపు' అంటూ సరంజామా తెప్పించేవాడివి. ఏ మిరాసీదారు ద్వారానో పాళ్ళ బాకీ ఏడాది తిరిగేలోగా తీర్చేసేవాడివి. చిత్రం ఏమిటంటే ఆ దుకాణదారులకి నువ్వడిగింది ఇచ్చినప్పుడల్లా అంతకి అంతా లాభం వచ్చేది. అందరూ కడుపునిండా తిన్నాక, మిగిలిన సంబరాలన్నీ మఠానికో, గుడికో ఇచ్చేసి పై గుడ్డ దులుపుకుని వెళ్ళిపోయేవాడివి. ఏ మధ్యాహ్నానికో రెండు ముద్దలు మజ్జిగన్నం మాత్రం తిని కుంభకోణంలోని ఓ మఠం అరుగుమీద పై గుడ్డ పరుచుకుని పడుకునేవాడివి.

"1897, 1909, 1921, 1933లలో మహా ముఖానికి వచ్చే లక్షలాది ప్రజలకి విపరీతమైన అన్నదానాలు చేసావు. నీకంటూ ఏం లేకుండా అన్నార్తుల్ని ఆదుకోవడంలోనే ఆనందం పొందావు. నిశ్చింతతో పైకెక్క

తిరగమోతలు వేయాల్సి వచ్చేది. పెద్ద గంగాళాలతో సాంబారు వండే వాడివి. ఏనుగులు పట్టేటంత గంగాళాలతో కూటు, రసం చేసేవాడివి.

పులవకుండా వడ్డించాలన్న కోరికతో పెరుగును చెక్క పీపాలలో నింపి సీలువేసి చెరువులో ముంచి దాచేవాడివి. ఆ రోజుల్లో అదే రిఫ్రిజి రేటర్. నీ చేతివంట తిన్న లక్షలమంది వెయ్యి కాలాలపాటు నువ్వు సుఖంగా వుండాలని కోటి ఆశీర్వచనాలు చేసేవారు. నువ్వు చివరికి త్రిద వనం గుళ్ళోనే తనువు చాలించావు. నువ్వు మిగిల్చిన నగదుతో నీ కోరిక ప్రకారం హరిజనులు వాడుకునే పెద్ద నూతిని బాగుచేయించారు.

"ఈ రోజుకీ ఆ బావిని 'సదాశివం బావి' అని అక్కడివాళ్ళు పిలుస్తున్నారంటే, అది ఎంత పెద్ద బావో అనికాదు. నీ పేరు ఎందుకంతగా గుర్తుందంటే, ఆనాటి ప్రజలు నీ అన్న సంతర్పణని అంతగా గుర్తుంచుకున్నారు. నువ్వు మరణించావని తెలిసాక అంతా నువ్వు బ్రహ్మైక్యం చెంది వుంటావని భావించారు. కాని అలా జరగలేదు."

"ఎందువల్ల స్వామీ?"

"నేనీ జన్మలో నీకు చెప్పిన చిట్కా అప్పుడు నీకు బోధించే గురువు దొరక్కపోవడంవల్ల. నిజానికి అన్నదానం నువ్వు చేయలేదు. ఈ లోకాన్ని నడిపించే పరమాత్మే తన భక్తులకి అన్నం ఏర్పాట్లు చేయడంలో నిన్ను పరికరంగా వాడుకున్నాడు. నువ్వూ అలా భావించి ఉంటే ఆ పుణ్య ఫలం నీకు అంటక చిత్తశుద్ధి కలిగి జ్ఞానం అబ్బేది. కాని అందరు మనుష ల్లానే నువ్వు దేహాత్మ బుద్ధితో ప్రవర్తించావు.

'నేను చేస్తున్నాను' అన్న అహంతో ఆ అన్నదానం చేసావు. దాంతో ఆ పుణ్యకర్మ బంధంలో చిక్కుకున్నావు. నీ మరణ సమయంలో నువ్వు నీ కర్మబలంవల్ల రాజుగా పుట్టాలని కోరుకున్నావు. మరణ సమయంలో ఏం చింతిస్తే అదే లభిస్తుందని శ్రీకృష్ణుడు గీతలో చెప్పనే చెప్పాడుగా. దాంతో ఈ జన్మలో రాష్ట్రపతివయ్యావు. ఆ పుణ్యరాశి ఇలా తరుగుతోంది. నీతో గతజన్మలోని దైవభక్తి అనే సంస్కారం వుండడంతో ఆధ్యాత్మికత వైపు మరలావు."

"నాకిదేం గుర్తులేదు బాబా! బహుశా ఆ సంస్కారంవల్లనే అను

కుంటాను. వంట నా హాబీ. ఇంకా నా ఆస్తిలో మూడు వంతులు ఈ జన్మలో కూడా అన్నదానాలకి ఖర్చు చేసేసాను. అన్నధానం కోసం నేను చందా ఇవ్వని అలాంటి స్కీమ్‌గల దేవాలయం ఇండియాలో లేదనే చెప్పాలి."

"అదే అహం. అదే వద్దు....అదే చిక్కు, అదే బంధం....

ఆ జగన్నియంత "నువ్వు పుట్టకమునుపే, నువ్వు ఎలా వంపాదించాలో, ఎంత సంపాదించాలో, దాన్ని ఎలా ఖర్చు చేయాలో నిర్ణయించాడని, ఆ ప్రకారం జరుగుతోందని, ఇందులో నువ్వు కేవలం ఓ చిన్న పావువి మాత్రమే అని" సదాస్మరణ చేయి. అప్పుడు అహంపోయి, కర్మ ఫల త్యాగం చేసినట్లవుతుంది. మళ్ళీ బంధంలో చిక్కుకుంటున్నావు."

వెంటనే అబ్రహాం సిగ్గుపడ్డాడు.

"మీరెన్నిసార్లు బోధించినా ఈ బుద్ధిపోవడంలేదు బాబా."

మందహాసం చేసి చెప్పారు శివబాబా.

"కొన్ని లక్షల జన్మలనించి వచ్చే ఈ సంస్కారం ఓ పట్టాన పోదు. కొన్ని జన్మలు అందకు అభ్యాసం చేయాలి.... నూతిగట్టు పక్కన వుండే శిల ఎంత గట్టిదైనా, పల్లెపడుచులు దానిమీద పెట్టే మట్టి కుండల వల్ల కొద్ది కాలానికి ఆ కఠినశిల మధ్య కూడా అక్కడ ఎలా గుంట పడుతుందో అలా అభ్యాసం చేయగా చేయగా 'నేను ఆత్మని, ఈ దేహాన్ని కాదు' అన్న కొత్త సంస్కారం వస్తుంది. అభ్యాసం....అభ్యాసం....దానికి అదొక్కటే మార్గం. ఏదీ నేను చేయడంలేదు. పరమాత్మచేత చేయించబడుతున్నాను' అని సదా భావించడం. ఈ బంధాల్లోంచి బయట పడటానికి అదే చక్కటి తాళంచెవి."

"బాబా! క్రితం జన్మలో కూడా మనం కలిసామా?" ప్రశ్నించాడు అబ్రహాం.

"నీ చేతి వంట చాలాసార్లు తిన్నాను. సన్యాసినైన నేను ఎప్పుడు కుంభకోణం వచ్చినా నీ దగ్గరే భిక్ష చేసేవాడిని. ఆ జన్మలో నువ్వు వండిన కూటు రుచి నాకింకా గుర్తే" నవ్వారు శివబాబా.

అబ్రహాం కూడా నవ్వి చెప్పాడు.

"అందుకేనేమో, నేను ఉత్తరప్రదేశ్‌లో పుట్టినా, నాకు తమిళ… భోజనం ఇష్టం. బాబా! నేను గతజన్మలో నా భార్యా పిల్లలకి చేసిన అ… యంవల్లనే, నా ఈ జన్మలో నాకు చిన్న వయసులోనే భార్యా వియో… జరిగిందా?"

"అవును. నీకింకా రెండు జన్మలకి సరిపడే కర్మలున్నాయి. వా… క్షయం అవగానే మోక్షం రావచ్చు. మళ్ళీ జన్మలు ఎత్తడం దేనికి? ధ్యా… ద్వారా ఆ కర్మలని ఈ జన్మలో రద్దు చేసుకో. కనీసం ఓ జన్మ తగ్గు…

"నేను హైదరాబాద్‌కి రాలేకపోయానన్న దిగులు మీరిక్కడికి ర… దంవల్ల తీరిపోయింది బాబా."

ఆనందంగా లేచి వంగి బాబా పాదాలకి తన తలని స్పృశించా… అబ్రహాం. కొద్దిక్షణాల తర్వాత తన నుదిటికి పాదాల స్పర్శ తెలిసి… డంతో తలెత్తి చూసాడు అబ్రహాం.

రాకింగ్ ఛెయిర్ ఖాళీగా వుంది.

11

సన్యసించిన మునిరత్నం తన బాబాయి రామావతారం సమాధి ఉన్న… కప్పుకింద వుండసాగాడు. ఇంట్లోకి రమ్మని తల్లి ఎంత చెప్పినా వ… కోలేదు. ఆ రోజుల్లో రాయలసీమలో ఇంకా బియ్యం వాడకంలో లే… జొన్నరొట్టెలు, అందులోకి పప్పు లేదా వంకాయ ఉల్లిపాయలు కలిపిచే… కూర తినేవారు. బీదవాళ్ళు ఉల్లిపచ్చడితో సరిపెట్టుకునేవారు. రోజూ త… తెచ్చిచ్చే జొన్నరొట్టెలు, పప్పు, రాగి సంకటి తీసుకునేవాడు.

మీనాక్షి దేవి ఆలయంలో కూర్చుని ధ్యానం చేసుకుంటూ గడి… వాడు. రామావతారం చదివిన ఆధ్యాత్మిక పుస్తకాలని చదివేవాడు. చా… భాగం అర్థం అయ్యేవికావు. వివేకానంద భాష్యం రాసిన భగవద్గీత, వ… యాళస్వామి భాష్యం రాసిన వివేక చూడామణి, శ్రీపరశురామ పంతుల లిం… మూర్తి, గురుమూర్తి రచించిన 'సీతారామాంజనేయ సంవాదం'....

రామావతారం ఆ పుస్తకాల మార్జిన్‌లో రాసుకున్న ధ్యానానుభవాలు అనేకం చదివాడు మునిరత్నం.

"ఈ రోజు ధ్యానంలో ఆజ్ఞా చక్రంలో ప్రస్ఫుటంగా మెరుస్తూ జ్యోతి దర్శనం అయింది."

'కనుబొమల మధ్య అంతా హెవీనెస్. ధ్యానంలో కుడి చెవిలో నాదం వినిపించింది.'

'రెండు గంటల ధ్యానంలో ఎవరో మెదడులోని' ఆలోచనలని బలవంతంగా నిలుపు చేసినట్లు ఆలోచనలు లేవు. దాంతో కాలం తెలీలేదు. పావుగంట కూర్చున్నాననుకున్నాను. కానీ గంటన్నర దాటటం ఆశ్చర్యం"

"ఆవాళ నాకు శరీరం వున్నట్లు భావనలేదు. శ్వాస అతితక్కువ సార్లు సాగి కొన్నిసార్లు నిలబడటం గమనించాను స్పృహ వున్నదా అంటే వుంది, లేదా అంటే లేదు. ఈ స్థితినే సమాధి అంటారా? దీన్నేమంటారో గురువులే చెప్పాలి."

ఇవన్నీ చదివాక ధ్యానంలో తనకి ఎలాంటి అనుభూతులు లేకపోవడంతో మునిరత్నానికి తనసలు సరైన దారిలో వున్నాడా లేదా అన్న అనుమానం కలిగింది. దాన్ని తీర్చుకోవడానికి గ్రామంలోని ఒకరిద్దరు పెద్దలని అడిగాడు. పూజల్లోతప్ప వారికీ ధ్యానంలో ఎలాంటి అనుభవం లేని వాళ్ళవడంతో చెప్పలేకపోయారు.

పైకిలేసుకుని జోలదరాశి గ్రామం వెళ్ళి శ్రీ రామకృష్ణా నందగిరిని అడిగాడు. ఆయన కొద్దిసేపు మౌనంగా వుండి తర్వాత చెప్పాడు.

"గురువులేని ఏ విద్యయినా గుడ్డి విద్య. ముఖ్యంగా ఆధ్యాత్మిక మార్గంలోని వారికి సద్గురువు తప్పనిసరిగా వుండాలి. నీ గురువుకోసం వెదుకు."

"మీరు నా గురువుగా వుండండి స్వామి" ప్రార్థించాడు మునిరత్నం. ఆయన చిన్నగా నవ్వి జవాబు చెప్పాడు.

"సద్గురువు అన్నవాడు ఆత్మ సాక్షాత్కారం పొందినవాడై ఉండాలి తప్ప నాలాంటి మధ్యదారిలో ఉన్నవారు సరిపోరు."

"ప్చ! మళయాళ స్వామి బ్రతికుంటే బావుండేది. అలాంటివాళ్ళు ఎక్కడ దొరుకుతారు?" అడిగాడు.

"గురువు కావాలన్న తపన వుంటే, ఎక్కడున్నా ఆ సద్గురువే నిన్ను వెతుక్కుంటూ వస్తారు. ఇప్పుడు ఇంట్లోనే వుంటున్నావా?"

"లేదు స్వామి మా బాబాయ్ సమాధి మందిరంలో వుంటున్నాను."

"ఓ ఆడపిల్ల విసుర్రాయి విసిరే చేతికి పదిగాజులు వేసుకుంటే ఏమవుతుంది?" ప్రశ్నించాడాయన.

"శబ్దం వస్తుంది."

"రెండు గాజులుంచుకుని మిగిలినవి తీసేస్తే?"

"శబ్దం తగ్గుతుంది."

"ఒక్క గాజే వేసుకుంటే?"

"అసలు శబ్దమే రాదు."

"ఒక్కగాజులా నువ్వు ఏకాంతంగా ఏదైనా ప్రాచీన ఆలయంలో ఉండి ధ్యానం చేసుకోవడం మంచిది. కుటుంబ సభ్యుల మధ్య వుంటే అనవసరపు సంభాషణలు తప్పవు."

అతను చెప్పిన బోధ మునిరత్నం మనసుకి ఎక్కింది.

తల్లిదండ్రులు ముందు ఒప్పుకోకపోయినా, మూడు వారాలుండి తిరిగి వస్తానని చెప్పి మునిరత్నం కర్నూలు జిల్లాలోని ఆత్మకూరుకి వెళ్ళే దారిలో వున్న నల్లకాల్వ గ్రామంలో శ్రీరుద్రుడు 'స్వయం భూలింగ రూపంలో వెలసిన రుద్రకోటేశ్వర క్షేత్రానికి వెళ్ళాడు.

స్వామిని దర్శించి, తన గురువుని ప్రసాదించమని వేడుకున్నాడు. ఆ ఆలయం బయటవున్న మారేడు వృక్షం క్రింద ధ్యానం చేయసాగాడు.

రుద్ర కోటీశ్వరాలయం అడవిలో ఉండటంచేత భక్తుల రాక ఆ రోజుల్లో పలచగా వుండేది. ఆడవాళ్ళతో అక్కడికి రావాలంటే, ఎద్దుల బండి లేదా గుర్రబ్బండి ఒక్కటే శరణ్యం.

తనతో తెచ్చుకున్న మూటవిప్పి మునిరత్నం తల్లి చేసిచ్చిన తప్పిలెంట్లు నాలుగు, (జొన్నపిండి, బియ్యపిండి. కలిపి చేసే రాయలసీమకి

చెందిన రొట్టె) తర్వాత రాగి పిండితో చేసిన రాగి లడ్డూలు నాలుగు తిని మంచినీళ్ళు తాగాడు.

మొదటిరోజు మునిరత్నంకి ధ్యానంలో ఎలాంటి కుదురు కలగలేదు. రకరకాల ఆలోచనలు చుట్టుముట్టసాగాయి. తన తల్లి పదే పదే గుర్తుకు రాసాగింది. ఇంటి దగ్గర తన గురించి ఎవరేం మాట్లాడుకుంటారో వద్దనుకున్నా ఊహకు రాసాగింది.

దాహం అయినప్పుడు కళ్ళు తెరిచి ఎదురుగా వున్న ఇత్తడి చెంబులోని నీరు తాగి మళ్ళీ కళ్ళు మూసుకోసాగాడు. ఇంట్లో వున్న కుదురు తనకక్కడ దొరకడంలేదని గ్రహించిన మునిరత్నానికి కొద్దిసేపు అనిపించింది– తల్లితండ్రుల మాటవిని, ఇంటి దగ్గరే బాబాయి సమాధి మందిరంలో వుండి ధ్యానం చేసుకుని వుంటే బాగుండేదని. పైగా ఎక్కడికీ వంటరిగా వెళ్ళి ఎరగడు.

సాయంత్రం అయ్యేసరికి ఇంటికి వెళ్ళిపోదామనిపించసాగింది. ఆ ఆలోచన మొగ్గలోనే తుంచేసుకునే ప్రయత్నం చేసాడు. కాని అతనివల్ల సాధ్యం కాలేదు. "ఇంటికి వెళ్తే ఏం?" అనిపించసాగింది.

•   •   •   •

తన కొడుకు మునిరత్నంకి సహాయానికి ఉండడానికి నరసింహయ్య అతనివెంట తమ పాలేరు కొడుకుని పంపదలిచాడు. అయితే మునిరత్నం అందుకు ఒప్పుకోలేదు.

ఆ రాత్రంతా మహాలక్ష్మమ్మ. నరసింహయ్యలకి సరిగ్గా నిద్రలేదు. ఒంటరిగా కొడుకు అడవిలోని ఆ క్షేత్రంలో ఎలా వున్నాడో అని. వేకువ వేళే లేచి నరసింహయ్య తమ పాలేరు కొడుకు పధ్నాలుగేళ్ళ సాలన్నని (రాయలసీమలో పిల్లలు ఎక్కువమంది పుడితే కుటుంబనియంత్రణలేని ఆ రోజుల్లో ఇక సంతానం చాలని కొడుక్కయితే 'సాలన్న' అని కూతురికి అయితే 'సాలమ్మ' అని పేరుపెట్టే ఆచారం ప్రకారం ఆ పేరు పెట్టారతనికి.) కొడుకు దగ్గరికి వెళ్ళి సాయంగా వుండి అతనితో తిరిగిరమ్మని పంపాడు నరసింహయ్య.

జొన్న రొట్టెలని నువ్వులువేసి చేసిన నూనె వంకాయ కూరని, కందిపప్పు, గోరుచిక్కుడు కలిపి చేసిన పప్పును యిచ్చింది మహాలక్ష్మమ్మ.

బళ్ళు దొరికి సాలన్న నల్లకాల్వ గ్రామానికి చేరుకునేసరికి చీకటి పడుతోంది. అక్కడ సవారిబండి కట్టించుకుని నల్లమల అడవుల్లోని రుద్ర కోటికి ప్రయాణమై ఆ కబుర్లు మనసారా విన్నాడు.

"సర్లే! నా కోసం వాళ్ళంతగా ఏడుస్తుంటే, నాకిక్కడ జపం ఏం కుదురుతుంది? రేపు మధ్యాహ్నం మనం బయలుదేరదాంలే" చెప్పాడు మునిరత్నం.

సాలన్న సంతోషించాడు. మునిరత్నాన్ని పిలుచుకువచ్చిన ఘనత తనకి దక్కుతుందని. తెల్లారుఝామున లేచి కాలకృత్యాలు తీర్చుకుని, అక్కడే వున్న కొలనులో స్నానంచేసి రుద్రకోటీశ్వరుడి దర్శనానికి వెళ్ళాడు మునిరత్నం. ఆ రోజు సోమవారం. క్రితంరోజే వచ్చి నిద్రించిన కుటుంబాలకి చెందినవాళ్ళ నిమిత్తం పూజారి ఉదయమే వచ్చి లింగానికి మహాన్యాస రుద్రాభిషేకం చేస్తున్నాడు. వారితోపాటు కూర్చుని అది చూసాడు మునిరత్నం.

ఆ ఆలయ విశిష్టతని పూజారి వాళ్ళకి చెపుతుంటే విన్నాడు.

"ఇది భారతదేశంలోని ఏకైక రుద్రశైవక్షేత్రం. ఈ స్వామివారి దర్శనం కోసం కోటిమంది మహర్షులు, దేవతలు ఇక్కడ కఠోర తపస్సు చేస్తే వాళ్ళ భక్తికి మెచ్చి రుద్రుడు రుద్రలింగాకృతిలో దర్శనం ఇచ్చాడు. వాళ్ళకి ముక్తిమార్గం చూపాడు. ఈ రుద్రలింగ దర్శనమాత్రంతోనే పది వేల గోవులదానం చేసిన పుణ్యఫలం లభిస్తుందని మా నాయన చెప్పేవారు. నిత్యం ఈ కొలనులో స్నానం ఆచరించి రుద్రుడ్ని అభిషేకిస్తే, భక్తులు వాజపేయయాగ ఫలితం పొందుతారు. అలా నిత్యం చేసేవారికి సద్గతి తప్పదు. వెలుగోడు గ్రామానికి చెందిన లంక తిరుపతిరెడ్డి ఈ క్షేత్ర ప్రాంతంలో ఓ చెట్టుకింద నిద్రిస్తుండగా, ఆ పుణ్యాత్ముడికి సాక్షాత్తు ఆ శంకరుడు స్వప్న దర్శనం యిచ్చి సమీపంలోని పుట్టలో ఉన్న తనకి దేవాలయం కట్టించమని ఆదేశించాడు. తిరుపతిరెడ్డి తన మిత్రులతో కలిసి ఆ పుట్టని తవ్వగా, స్వయంభూలింగం కనిపించింది. మా నాయనకి స్వామి జ్యోతి

రూపంలో అనేకసార్లు దర్శనం యిచ్చారు. కల్పవృక్షంనించి నాగులపుట్టదాకా స్వామి జ్యోతి రూపంలో వెళుతుండగా అనేకసార్లు చూశారు. నాకో సారి నందీశ్వరుడి తల పైభాగంలో చెక్కబడ్డ పుష్ప రూపంలోంచి మిణుకు మిణుకుమంటూ మొదలైన వెలుగు జ్యోతిగా మారి పైకి వెళ్ళి పెరిగి పెద్దదై కొద్ది నిముషాలు కన్పించింది. ఒక్కోసారి పౌర్ణమికి నాగేంద్రుడు వచ్చి ఈ లింగానికి చుట్టుకుని కొన్ని గంటలపాటు వుండి వెళ్తుంటాడు. ఇది మోక్షస్థానం. ఇక్కడ ధ్యానంచేసిన కోటిమందికి మోక్షం లభించిందని మహాభారతంలో దీనిగురించి రాసారు...."

మునిరత్నానికి వెంటనే జ్యోతిరూపుడైన రుద్ర కోటీశ్వరుడి సన్నిధి లభించడం తన భాగ్యం అన్న నమ్మకం ఏర్పడి క్రమంగా అది బలపడింది.

మధ్యాహ్నం సాలన్నని తెచ్చిన ఎడ్ల బండికి ఎద్దులు జోడించాక చెప్పాడతను.

"బయలుదేరదామా సామి?"

"నేను రాను. నువ్వెళ్ళు. అమ్మా నాన్నలతో నాకిక్కడ ఎంతో బావుందని, సౌకర్యంగా వున్నానని చెప్పు."

"అదేమిటి? నిన్న రేతిరి వస్తానన్నావుగా?" ఆశ్చర్యపోయాడు సాలన్న.

"చీకట్లో వుండి చెప్పిన మాటలివి. వెలుగులోకి వచ్చాక చెప్పే ఇదే స్థిరమైంది."

సాలన్న ఎన్నో విధాల బ్రతిమాలాడు కాని మునిరత్నం ససేమిరా అనడంతో, సాలన్న మునిరత్నాన్ని వెంటతీసుకుని కాని వెళ్ళదలుచుకోలేదు. కనుక ఆగిపోయాడు. వరసగా మూడు రోజులు అక్కడే వున్నాడు. అతన్ని పట్టించుకోకుండా మునిరత్నం కళ్ళు మూసుకుని ధ్యానం చేసుకోసాగాడు. నాలుగో రోజు సాలన్న ఎంతో అసంతృప్తిగా అడిగాడు.

"ఇంటికి ఒక్కడే కొడుకువి. బోలెడు పొలం వుంది. రారాదన్నా?"

తల అడ్డంగా వూపుతూ చెప్పాడు మునిరత్నం-

"రాకూడదన్న తలంపే పెరిగిపోతోంది."

ఇక అతన్ని తనవెంట తీసుకువెళ్ళలేనని నిర్ణయం చేసుకు సాలన్న వెళుతుంటే చెప్పాడు మునిరత్నం.

"మా నాయనతో చెప్పు. ఇంక నా కోసం ఎవర్నీ పంపవద్దని. నే బుద్ధి పుట్టినప్పుడు వస్తుంటాను. నాకిక్కడే బావుంది."

మునిరత్నం చెరువులో స్నానం చేస్తూ, అడవిలో దొరికే పం ఫలాలు కోసుకుతింటూ, నిత్యం ఉదయం రుద్రలింగానికి అభిషేకం చేస్తూ ఎక్కువ సమయం ధ్యానంలోనే నిమగ్నమవసాగాడు. ఇంటి ఆలోచన తగ్గి ధ్యానంలో అతనికి కుదురు ఏర్పడింది.

ప్రతీ సోమవారం చాలామంది భక్తులు వస్తుంటారు. రెండో సోమ వారం ధ్యానంలో వున్న మునిరత్నానికి వారి మాటలు వినిపిస్తున్నాయి. అతనికి ఆ రోజు మనసు రుద్రలింగం మీద లేదు. తన ఎదురుగా వున్న ఇత్తడి చెంబుమీద వుంది. ఎవరైనా వాటిని ఎత్తుకెళితే? అన్న శంక కలగడంతో మాటిమాటికీ కళ్ళు తెరచి ఆ చెంబు వున్నదా, లేదా అని తనిఖీ చేసుకోసాగాడు.

అలా కొన్నిగంటలు గడిచాక మునిరత్నం మెదడులో మెరుపులా కలిగిందా ఆలోచన. "ఏమిటి? మోక్షం కోరి తల్లిదండ్రులనే వదిలి వచ్చిన నాకు ఈ ఇత్తడి చెంబు మీదా ఆపేక్ష? ఈ బంధం ఒక్కటి చాలదూ ముక్తి కాంత నన్ను ఈసడించుకోడానికి?"

అంతే!

ఆ చెంబు మీద ధ్యాసపోయిందతనికి. సాయంత్రం కళ్ళు తెరచి చూస్తే అక్కడే వుంది. మునిరత్నం వెళ్ళబోతున్న ఓ బీదభక్తుడ్ని దగ్గరికి పిలిచి దాన్ని అతని చేతిలో పెట్టి చెప్పాడు.

"తీసుకెళ్ళు."

ఆ పాత్ర బదులు భక్తులు వదిలి వెళ్ళిన కొబ్బరిచిప్పలని నీళ్ళు తాగడానికి వాడసాగాడు.

* * * *

మరో వారం తర్వాత మునిరత్నం తల్లిదండ్రులు, అక్కయ్యలు వచ్చారు. నన్నబడ్డ కొడుకుని చూసి దుఃఖించింది మహాలక్ష్మమ్మ. ఇంటికి

వెంటబెట్టుకుని వెళ్ళడానికి వచ్చానని చెప్పింది. మునిరత్నం ససేమిరా అన్నాడు.

"నాకిక్కడ ధ్యానం బాగా కుదురుతోంది. ఇంటి దగ్గరకన్నా ఇక్కడే బావుంది. చూడాలనుకున్నప్పుడల్లా మీరే వస్తూండండి."

వాళ్ళు వెళ్ళాక పూజారికి మునిరత్నం మీద ఆదరణ కలిగింది. భికారి కాడని, ఆస్తిపాస్తులు అన్నీ వదులుకుని వచ్చాడని తెలియడంతో. తన భార్యతో అతనికీ వంటచేయమని చెప్పాడు. నిత్యం నల్లకాల్వ నించి వస్తూ, జొన్న సంకటో, కొర్ర అన్నమో, లేదా అరికెల అన్నమో తెచ్చేవాడు.

ఓ పౌర్ణమి రాత్రి శివాలయంలో పడుకున్న కొందరు భక్తులు వచ్చి ధ్యానంలో వున్న మునిరత్నాన్ని పిలుచుకెళ్ళి, శివలింగాన్ని చుట్టుకున్న నాగేంద్రుడి విన్యాసం చూపించారు. నల్లటి నాగుపాము అది. రాత్రంతా అలాగే ఉండి ఉదయం వెళ్ళిపోయింది.

ఆ అడవిలో మునిరత్నానికి శరీర పోషణకి అవసరమయ్యే కనీస అవసరాలు తప్ప మరేం లభ్యం కావు. అయితే ఏమీ లేవే అన్న చింత లేదతనికి. మనసునిండా ఏదో సంతృప్తి.

తన బాబాయ్ పుస్తకాల మార్జిన్‌లలో రాసుకున్నలాంటి ఎలాంటిఅను భూతులూ అతనికి ధ్యానంలో కలగడంలేదు. శ్రీరామకృష్ణనందగిరి చెప్పిన 'గురువులేని విద్య గుడ్డి విద్య' అన్న వాక్యం పదేపదే స్ఫురిస్తోంది. తనకి సరయిన గురువు దొరికితే కాని ముక్తి లభించదు. కాని ఇలా ఈ అడవిలో కూర్చుంటే, తనకి గురువు ఎక్కడ దొరుకుతాడు? గురువు కావాలన్న తపన ఉంటే, ఆయనే వెదుక్కుంటూ వస్తాడు అన్న రామకృష్ణానందగిరి మాటలు కూడా మర్చిపోలేదు మునిరత్నం.

మూడు నెలల్లో ఏడుసార్లు వచ్చి చూసివెళ్ళారు మునిరత్నం కుటుంబసభ్యులు. ఓసారి వెంట క్షురకుడ్ని తీసుకువచ్చాడు నరసింహయ్య. జడలు కట్టిన జుట్టుని, పెరిగిన గడ్డాన్ని తీసేసాడతను. బిడ్డమీద ప్రేమతో అన్నం వండి తెచ్చింది మహాలక్ష్మమ్మ. ఆ రోజుల్లో రాయలసీమ అంతా జొన్న రొట్టే ప్రధానాహారం. ఇళ్ళల్లో పనిచేసే జీతగాళ్ళకు జొన్న సంకటి

పోసేవారు. పొలాల్లో పనిచేసే వాళ్ళకి జొన్న సంకటిలో ఉప్పు, పచ్చి కలిపి మెత్తగా పిసికి అంబలి తయారుచేసి దాన్ని దోసిట్లో పోస్తే తాగేవారు. వరి అన్నం పండగలకి వండుకునేవారు.

మరో మూడు నెలలు గడిచాయి. మునిరత్నానికి ధ్యానంలో ఎలాంటి అనుభూతులూ లేవు. కాని తన మనస్సు అక్కడికి వచ్చినప్పటి మీదట ఎంతో ప్రశాంతంగా మారిందని మాత్రం గుర్తించాడు.

ప్రతిరోజూ నిద్ర లేవగానే, మళ్ళీ నిద్రపోబోయేముందు మునిరత్నం రుద్రకోటీశ్వరుడ్ని తనకో సద్గురువుని ప్రసాదించమని ప్రార్థించసాగాడు.

* * * *

ఆ గుడి పూజారిది ఎవరితోనూ అనవసరంగా పోచుకోలు కబుర్లు చెప్పే మనస్తత్వంకాదు. ఎప్పుడో కాని మునిరత్నాన్ని పలకరించేవాడు కాదు.

ఓ రోజు ఉదయం రాగానే సైకిల్ దిగకుండానే చెప్పాడు మునిరత్నంతో.

"ఒకటి రెండు సార్లు నీకు గురువు కావాలని నాతో అన్నావు కదా?"

"అవును స్వామీ" చెప్పాడు మునిరత్నం.

"గుళ్ళదుర్తిలో ఓ గొప్ప యోగి వున్నాడుట. మా బావమరిదిది ఆ ఊరే. నిన్న మాటల్లో చెప్పాడు. వెళ్ళు. ఆయన నిన్ను శిష్యుడుగా స్వీకరిస్తాడేమో చూడు."

"గుళ్ళదుర్తి అంటే కోవెలకుంట్ల దగ్గరేగా స్వామీ?" ప్రశ్నించాడు మునిరత్నం.

"అవును— వచ్చి అప్పుడే వారమైందిట. ఇవాళ వెళతా, రేపు వెళతా అంటుంటే గ్రామస్థులు ఆపేసారుట. త్వరగా వెళ్ళి కలు."

మునిరత్నం వెంటనే లేచి గుళ్ళోకి వెళ్ళి సాష్టాంగపడి తన ప్రార్థనని ఆలకించినందుకు రుద్రలింగానికి నమస్కరించాడు. పునర్దర్శన భాగ్యం కలిగించమని అర్థించి రుద్రకోటీశ్వర క్షేత్రం వదిలి బయలుదేరాడు.

12

గుళ్ళదుర్తి గ్రామం చాలా కోలాహలంగా వుంది. చుట్టుపక్కల గ్రామాలనించి ఆ యోగి దర్శన నిమిత్తం చాలామంది వచ్చిన గుర్తుగా అనేక బళ్ళు కనిపించాయి. ఒక బండి వాడిని అడిగాడు మునిరత్నం.

"ఏ ఊరినించి వచ్చారు మీరు?"

"పొట్టిపాడునించి."

"ఈ గ్రామంలోకి గొప్ప యోగి వచ్చాడట. ఎవరింట్లో బసేమిటి?"

"ఇళ్ళల్లో వుండడట ఆయన. ఆదిలక్ష్మమ్మ పసుపు పొలంలో చిన్న పాక వేస్తే అందులో బస. అటెళ్ళు."

అతను చూపించిన దారివెంట ఆత్రంగా నడిచాడు మునిరత్నం. కాలిబాటలో అనేకమంది ఎదురుపడ్డారు. వాళ్ళు చెప్పుకునేది విన్నదాన్నిబట్టి ఆ యోగి ఎంతో గొప్పవాడనిపించింది.

పొలంలో దూరంగా కొత్తగా వేసిన చిన్న పాక కన్పించింది. దాని తలుపులు మూసి వున్నాయి. బయట గుమిగూడిన వారిలో తనతో నంద్యాలలో చదివిన తిరుపాలయ్యని గుర్తుపట్టి పలకరించాడు.

"ఏరా? నీకేదో అయ్యిందటగా? అలా చిక్కిపోయావేమిటి?" ప్రశ్నించాడు తిరుపాలయ్య.

"నా గురించేం లేదుకాని, ఈ వచ్చినాయన గురించి చెప్పు" అడిగాడు మునిరత్నం.

"ఈయన ఎంత గొప్పవాడో! ధ్యానంలో గాల్లోకి నాలుగడుగులు లేస్తాడు తెలుసా?" ఉద్వేగంగా చెప్పాడు తిరుపాలయ్య.

"నిజమా?"

"నిన్న నా కళ్ళతో చూసాను. వీపు మీద శివలింగం గుర్తుంది. ఒకేసారి రెండుచోట్ల కనిపిస్తాడట. నిన్న ఈయన కిష్టిపాడులోని తులసిరెడ్డికి కనిపించాడట. మంచినీరు తప్ప ఆహారం ముట్టడు."

అంత మహత్తు వున్న ఆయన తనని శిష్యుడుగా స్వీకరిస్తే బావుండునన్న ఆశ పుట్టింది మునిరత్నానికి.

"ఈయనకి శిష్యులున్నారా?" వెంటనే అడిగాడు.

"నలుగురైదుగురున్నారు. ఈయన తెలుగాయన కాదు. బీహార్ నుంచి వచ్చాడట. హిందీ మాట్లాడతాడు. తెలుగులో మనం చెప్తే శిష్యుడు హిందీలో ఆయనకి చెప్తే జవాబు చెప్తాడు. ఈ రోజు జయమ్మ, బాలమ్మ, చెన్నమ్మలు కలిసి అన్నదానం చేస్తున్నారు. ఈ స్వామి ఎక్కడుంటే, అక్కడ నిత్యాన్నదానం తప్పనిసరి. ఈయన మాత్రం ఆహారం తీసుకోడు. మునిమాపువేళకాని ఆయన దర్శనం లభించదు. ముందు భోంచెయ్యి."

మునిరత్నం గొంతుక్కూర్చుని నాలుగు వేడి వేడి జొన్నరొట్టెల్లో ఉల్లిపాయ పచ్చడి నంచుకుని తిన్నాడు.

చీకటి పడుతుండగా కిటికీ తలుపు తెరిచారు శిష్యులు. ఎదురుగా లాంతరు వెలుగులో, ఆవు పేడతో అలికిన నేల మీద పెద్దపులి చర్మంమీద కళ్ళు మూసుకుని, పద్మాసనం వేసుకుని కూర్చున్న అరవై ఏళ్ళాయన కనిపించాడు. నుదుట అడ్డంగా విబూది, దాని మీద కుంకుంబొట్టు, రెండు కనుబొమల మధ్య గంధపు బొట్టు, సన్నగా పీలగా వున్నాడు. అందరితో పాటు మునిరత్నం కూడా దణ్ణంపెట్టాడు.

కొద్దిసేపట్లో ఆయన గాల్లోకి లేస్తాడనుకోసాగారంతా. మునిరత్నం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూసాడు. బయట నిలబడ్డవాళ్ళు 'ఓం నమశ్శివాయ' మంత్రాన్ని ఆగకుండా జపించసాగారు. మునిరత్నం వాళ్ళతో గొంతు కలిపాడు.

పూర్తిగా చీకటి పడ్డాక ఆ యోగి నెమ్మదిగా పైకి కదలడం అంతా గమినించారు. అంగుళం, అంగుళం చొప్పున ఆ యోగి గాల్లోకి లేవసాగాడు. అంతా ఆయనకి దణ్ణం పెట్టి ఆ విడ్డూరం చూడసాగారు. అయిదు నిముషాల్లో అలా ఆయన నాలుగడుగులు లేచాడు. పదినిముషాల తరువాత మళ్ళీ క్రమేపీ భూమి మీద పరిచివున్న పులిచర్మం మీదికి చేరుకున్నాడు.

కళ్ళు తెరిచి కిటికీలోంచి బయటికి చూస్తూ ఆ జనాన్ని రెండు చేతులతో ఆశీర్వదించాడు ఆ ముని. అందరితోపాటు ఆయనకి నమస్కారం చేస్తూ మనసులో అనుకున్నాడు మునిరత్నం.

"స్వామీ. దయతో నన్ను మీ శిష్యుడిగా స్వీకరించండి."

అయితే అదంత తేలికగా సాధ్యం కాలేదు మునిరత్నానికి. ఆ స్వామి శిష్యుడు బయటికి వచ్చినప్పుడు మునిరత్నం అతని వెంటపడ్డాడు. స్వామితో తను మాట్లాడే అవకాశం కల్పించమని తను ఆయన శిష్యుడవ్వాలని కోరుకుంటున్నానని కోరాడు. కేరళ నుంచి వచ్చిన అతను చెప్పాడు.

"అందుకు స్వామి ప్రధాన శిష్యుడ్ని ఆశ్రయించు. అతనూ, స్వామి బీహార్‌లోని ఒక ప్రాంతం నుంచి వచ్చారు."

మునిరత్నం ప్రధాన శిష్యుడ్ని అర్థించాడు కాని, అతను అందుకు అంగీకరించలేదు.

"మాకున్న శిష్యులు చాలు. ఇంకెవరితో పనిలేదు."

మునిరత్నం బతిమాలినకొద్దీ అతను మునిరత్నం మీద ఇంకాస్త గట్టిగా అరవసాగాడు. చివరికి కోపం పట్టలేక కొడతానని చేయి కూడా ఎత్తాడు. పక్కనున్న ఇద్దరు శిష్యులు అడ్డుపడ్డారు.

గురువుకోసం ఆలమటించే మునిరత్నం ఆ తిరస్కారానికి లొంగలేదు. ఆ రాత్రి ఎనిమిదిన్నరకి స్వామికి హారతి ఇచ్చాక గుమ్మం ముందు కాపేసాడు- లఘుశంక తీర్చుకోవడానికి కాని, మరి దేనికయినా స్వామి బయటికి వస్తే అడగచ్చని. రాత్రంతా మేలుకున్నా, స్వామి పాకలోంచి బయటికి రాలేదు. తెల్లవారుఝామున మునిరత్నానికి నిద్రపట్టేసింది. ఏదో తన కాలికి చల్లగా తాకడంతో మెలకువ వచ్చింది. కళ్ళు విప్పి చూస్తే ఓ పందికొక్కు కనిపించింది. కాలు దులుపుకుని లేచాడు.

ఉదయం బయటికి వచ్చిన ప్రధాన శిష్యుడు ఇంకా అక్కడే వున్న మునిరత్నాన్ని కోపంగా చూసాడు. అది పట్టించుకోకుండా భక్తిగా అతనికి దణ్ణం పెట్టాడు మునిరత్నం.

ఉదయం తొమ్మిదికి కేరళతను వచ్చి మునిరత్నంతో చెప్పాడు.

"ఇందాకే స్వామికి నీ గురించి చెవిలో చెప్పాను. పిలుస్తారేమో చూద్దాం."

ఆ రోజంతా స్వామి పిలుపుకై ఆశగా ఎదురు చూసాడు మునిరత్నం. పిలుపు రానేలేదు. ఆ రోజు కూడా జనం తండోప తండాలుగా

వచ్చారు. రామకృష్ణానందగిరి దగ్గరున్న పరివ్రాజకుడు ప్రసంగి వ
వచ్చి మునిరత్నాన్ని చూసి పలకరించాడు. ఆ రాత్రి కూడా పాక బయ
మునిరత్నం మకాం వున్నాడు. కాని లాభం లేకపోయింది.

ఉదయం తొమ్మిదిన్నరకల్లా మునిరత్నం తల్లిదండ్రులు, అ
అక్కడ వున్నాడన్న సంగతి ప్రసంగి ద్వారా తెలుసుకుని వచ్చా
తండ్రికి తన మనసులోని కోరిక చెప్పాడు మునిరత్నం.

"నేను కుర్రాణ్ని కొట్టిపారేస్తున్నారు. మీరు చెప్తే స్వామి న
శిష్యుడుగా స్వీకరించచ్చు నాన్నా."

"సరే ప్రయత్నం చేద్దాం."

స్వామికి తన పొలంలో ఆశ్రయం ఇచ్చిన ఆదిలక్ష్మమ్మని ము
రత్నం గురించి స్వామితో మాట్లాడమని కోరాడు నరసింహయ్య. ఆమె
స్వామికి మధ్యాహ్నం ఆ సంగతి నివేదించింది. దాంతో స్వామి ము
రత్నాన్ని పిలిపించి పరకాయించి చూసాడు. చిన్నగా తల ఊటించా
కాని ఏ సైగా చేయలేదు.

గంట తర్వాత ప్రధాన శిష్యుడు మునిరత్నం తండ్రితో చెప్పాడు
గురు దక్షిణగా ఐదువందల పదహార్లు ఇచ్చుకుంటే పని అవుతుందని, అ
గురు సాంప్రదాయంలో భాగం అని. నరసింహయ్య ఆ డబ్బుని ప్రధా
శిష్యుడికి ముట్టచెప్పాడు.

ఆ రాత్రి స్వామి నుంచి మునిరత్నానికి కబురు వచ్చింది. పరిగెత్తి
కెళ్ళాడు మునిరత్నం. అతని నెత్తిమీద తన చేతిని వుంచి చిరునవ్వు నవ్వా
డాయన.

"అది అభయహస్తం. ఇక ఫర్వాలేదు" చెప్పాడు కేరళ శిష్యు
ఆనందంగా.

మర్నాడు స్వామి బృందంతో మునిరత్నం అక్కడినించి హిందూ
పురం దగ్గరవున్న పరిగికి ప్రయాణమయ్యాడు. తన కొడుక్కి తిండి, బ
లకి ఇక చింత వుండదని సంతోషించాడు నరసింహయ్య.

అప్పటికే మునిరత్నం తన బాబాయ్ పుస్తకాల్లోని గురుగీత
చదివి వున్నాడు. గురువుని ఎంతో భక్తితో మనసా, వాచా, కర్మణా సేవిం

చాలన్న దాని సారాంశం అతనికి బోధపడింది. అంచేత ఎంతో భక్తి శ్రద్ధ
లతో, గురుసేవ చేయసాగాడు. తను తినేవి ఏవైనా సరే- 'గురుపాదోదకం
పానం, గురోరుచ్ఛిష్ట భోజనం-' అన్న 'గురుగీత'లోని శ్లోకం ప్రకారం
ఆయన ఎంగిలి చేస్తే కాని, తినకూడదన్న నియమం పెట్టుకున్నాడు.

ఆయన కాళ్ళు వత్తడం, ఆయనకి కావలసింది చూడడంలాంటి సేవ
లన్నీ మునిరత్నం ఒకరు చెప్పకుండానే చేయసాగాడు.

పరిగిలోకూడా పొలంలోని ఓ పాకలోనే మకాం. అక్కడున్న
వారంరోజుల్లో మునిరత్నానికి గురువుమీదున్న భక్తి, తోటి శిష్యులందర్నీ
కదిలించింది. ప్రధాన శిష్యుడు కూడా మునిరత్నంలోని సేవాభావాన్ని చూసి
ఆశ్చర్యపోయాడు. అయితే గురువులో ఎలాంటి చలనం లేదు.

క్రమేపీ ప్రధాన శిష్యుడికి మునిరత్నంమీద కోపంపోయింది. అన్ని
పనులని మునిరత్నంకే అప్పగించసాగాడు. ధ్యానం మానేసి మునిరత్నం
గురుసేవలోనే నిత్యం గడపసాగాడు. పరిగినించి నెల్లూరు జిల్లాలోని
ఓ పల్లెటూరికి, అక్కడినించి ఒంగోలు దగ్గరున్న ఓ గ్రామానికి, ఆ తర్వాత
కృష్ణాజిల్లాలోని మరో గ్రామానికి వెళ్ళారు. ఆసరికి స్వామి కూడా ముని
రత్నంమీద వాత్సల్యం చూపసాగాడు. తూర్పుగోదావరి జిల్లాలోని గోదావరి
ఒడ్డున వున్న ఓ గ్రామానికి వచ్చారు. వీరెక్కడ వున్నా వీరి గురించి
తెలుసుకుని తమ గ్రామానికి రమ్మని అనేకమంది దూరప్రాంతాల నించి
కూడా వచ్చి కోరుతూనే వున్నారు. అయితే స్వామి ఎక్కువమంది ఆహ్వా
నాలని నిరాకరించసాగారు.

క్రమేపీ మునిరత్నం స్వామికి ఆప్తుడయ్యాడు. ఓసారి ఐదువేల
రూపాయల నగదు ఇచ్చి పోస్టాఫీస్‌కి వెళ్ళి తన భార్యపేర రిజిష్టర్డ్ ఇన్సూ
రెన్స్ కవర్ పంపవలసిందిగా మునిరత్నానికి ఆ పనిని అప్పగించాడు
స్వామి. అతనాపని సక్రమంగాచేసి రశీదు తెచ్చాడు. ఆ డబ్బు అందినట్లుగా
బీహార్ నుంచి టెలిగ్రాం రాగానే స్వామి మునిరత్నంమీద మరింత
వాత్సల్యం ప్రదర్శించాడు.

వారు శ్రీకాకుళం జిల్లాలోని ఓ గ్రామంలో వుండగా ప్రధానశిష్యు అర్జెంటుగా, తన స్వగ్రామం వెళ్ళాల్సిన అవసరం ఏర్పడింది. అతడు వెళ్ళిన మర్నాడు స్వామి మునిరత్నాన్ని పొలంలోని ఎవరూలేని చోటు తీసుకెళ్ళారు.

"సునో బేటా"

మౌని అయిన స్వామి మాట్లాడగానే మునిరత్నం ఆశ్చర్య పోయాడు. తనకి మంత్రదీక్ష ఇవ్వబోతున్నారని ఆనందపడ్డాడు.

"నేను మాట్లాడేది ఒక్కరితోనే. వాడు బీహార్ వెళ్ళిపోయాడు కాబట్టి నీతో మాట్లాడి తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేను చెప్పినట్లు నువ్వు చేస్తే, నీకు ఈ జన్మలోనే ఊర్ధ్వగతి, ముక్తి ప్రసాదిస్తాను. అలాకాక గురువుని మోసంచేస్తే ఏమౌతుందో తెలుసా?"

"అధోగతి తప్పదు స్వామీ. మీరేం చెప్పినా చేస్తూనే వున్నానుకదా. ఓ రోజంతా మీరు. మీ ఉచ్ఛిష్టం ఇవ్వకపోతే ఆరోజు భోజనం మానేసాను. మరో రోజు...."

"నా పరీక్షలన్నిటికీ నువ్వు తట్టుకున్నావు కాబట్టే, నిన్ను మా సమూహంలోకి ఈరోజునుంచి చేర్చుకుంటున్నాను."

స్వామి తన అరచేతిని చాపి అడిగాడు.

"మన విషయాలు ఎవరికీ చెప్పనని ముందు నాకు మాటివ్వు."

ఆయన చేతిలో చెయ్యివేసి స్వామికి మునిరత్నం ఆ మాట ఇచ్చాక ఆ విషయంమీద మరోసారి హెచ్చరించాడాయన.

"గురువుకిచ్చిన మాట తప్పితే, ఏడు జన్మలదాకా నాలుగు కాళ్ళ జన్మలు తప్పవు. అర్థమైందా?"

"చిత్తం స్వామీ."

"చూడు. నా సంపాదనలో నీకు కొంతభాగం ఇస్తాను. ఇంటికి పంపుకో. దగ్గర వుంచుకోకు. తేలిగ్గా డబ్బొచ్చే మార్గాలెన్నో నీకు చెప్తాను. నేను స్వామిత్వం చేసేది అందుకే. ఇంత సుఖంగా, తేలికగా డబ్బు సంపాదించే వృత్తి మరొకటి ఈ ప్రపంచంలో లేదు. కాషాయానికి మూర్ఖులైన

ప్రజలిచ్చే గౌరవం, విలువ అంతా ఇంతాకాదు. ఇక దిగంబరి అంటే తిరుగే లేదు."

"మీరు అబద్ధం చెప్తున్నారు స్వామీ. సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపులైన ఎవరైనా మట్టిని, బంగారాన్ని ఒకలాగే చూస్తారు" బాధగా చెప్పాడు మునిరత్నం.

ఆయన నవ్వి చెప్పాడు.

"నా మీద నీకున్న గురుభక్తికి నాకెంత ముచ్చటగా వుందో, నేను చెప్పిందంతా నిజం."

"మీరు పరబ్రహ్మ స్వరూపులు కాకపోతే నిరాహారంగా ఎలా వుండగలరు స్వామి?"

"అందుకే ప్రజలని మూర్ఖులన్నాను. అంతా అనుకుంటున్నట్లు నేను గాలి భోంచేసి బ్రతకడం లేదు. తిరువన్నామలై లోని అరుణాచల కొండ మీద దొరికే ఓ మూలికని సేవిస్తే వారందాకా ఆకలి దప్పులుండవు. ఆవ గింజకన్నా ఎక్కువ తీసుకుంటే మాత్రం చావుతప్పదు. నీకు దాని వివరాలు చెప్తాను."

తన గురువునుంచి ఇలాంటిది కల్లో కూడా ఎదురు చూడని మునిరత్నం ఎంతో అనీజీగా ఫీలయ్యాడు.

"ధ్యానంలో భూమ్యాకర్షణ శక్తిని కోల్పోయి పైకి లేవడం సామాన్యులకి సాధ్యమా స్వామి?"

"ఆ విషయంలో నీ సహాయం కోరే ఇదంతా చెప్తున్నాను. నా ప్రధాన శిష్యుడికి తప్ప ఈ రహస్యం ఇంకెవరికీ తెలీదు."

మునిరత్నం తనకి చేయాల్సిన సహాయం వివరించాడు స్వామి.

"మరి మీ వీపు మీద శివలింగాకారం, పొట్టమీద త్రిశూలం ఆకారం మాటేంటి స్వామి?" నమ్మనట్లుగా ప్రశ్నించాడు మునిరత్నం.

నన్నగా నవ్వి చెప్పాడు స్వామి.

"ఆ డిజైన్‌లో కట్ చేసిన నల్ల టిబట్టని అక్కడ కప్పుకుని, పాక కప్పులోంచి పడే ఎండ వీపుమీద పడేలా పడుకుంటే, కొన్నిరోజుల్లో

ఆ ఆకారాలు చర్మంమీద ప్రత్యక్షం అవుతాయి. రహస్యంగా పాకపై తాటాకులు ఎండపడేలా తొలగించి, మళ్ళీ అమర్చాల్సిన పని నీదే."

మునిరత్నం ఎంతో విస్మయం చెందాడు.

"మరి ఉంగరాలు, శివలింగాలు తెప్పిస్తారు కదా స్వామీ" ఆసక్తికంగా చూస్తూ ప్రశ్నించాడు.

మరోసారి నవ్వి జవాబు చెప్పాడు స్వామి.

"పాట్నాలో నేను మొదట్లో రోడ్డుమీద గారడీచేస్తూ బ్రతికేవాడ్ని. హస్తలాఘవంలో నేర్పరిని. వేళ్ళ మధ్య దాచుకున్న విబూది, ఉంగరాలు గాల్లోంచి సృష్టించినట్లుగా మభ్యపెట్టగలను. ఇక కుంకుమ సంగతి. నూనె రాసి దానిమీద అద్దిన కుంకుమ నా శిష్యుడి నడుంకివున్న బెల్టుకి వుంటుంది. నా వేళ్ళని ఎవరూ చూడకుండా ఆ కుంకానికి తాకించి బొట్టు పెడతాను. లేదా భక్తులు ఇచ్చిన కొబ్బరికాయను శిష్యుడు దాన్ని నాకిచ్చినప్పుడు నా వేళ్ళకి కుంకుమ అంటిస్తాడు. ఓ వారంరోజుల్లో నువ్వు ఇవన్నీ నేర్చుకోవచ్చు."

అదంతా వింటున్న మునిరత్నానికి మనసులో ఎంతో బాధగా వుంది.

"ఒకేసారి మీరు రెండు శరీరాలతో రెండుచోట్ల కనబడుతుంటారు కదా స్వామి? మరి ఇదెలా సాధ్యం?" ప్రశ్నించాడు.

"నేను బసచేసే ప్రతీ గ్రామంలో నా మనుషులున్నారు. వాళ్ళకి తగిన డబ్బు ఇస్తే, నేను పదిమంది ముందు ఓ చోట వుండగా, అదే సమయంలో తనకి నేను మరోచోట కనపడ్డానని అబద్ధం చెప్తారు. తమలోని వాడే ఇది చెప్పడంతో ప్రజలకి ఎలాంటి అనుమానం కలగదు."

గురువు ఒక్కో రహస్యం - బోధిస్తుంటే మునిరత్నం ఖిన్నుడయ్యాడు. తను కోరిందేమిటి? తనకి లభించేదేమిటి? గురువుమీద వున్న భక్తి మొత్తం క్రోధంగా మారింది. అయినా బయటపడలేదు.

ఆ రాత్రి గ్రామ కరణం చెవిలో అంతా గొణిగాడు. ఆయన అందరి ముందు దొంగస్వామి రహస్యం బట్టబయలు చేసాడు.

పద్మాసనంలో ధ్యానంలో స్వామి గాల్లో నిలిచి ఉండగా తాటాకులు తొలగించి పాకలోకి దిగిన ఒకరు, పాకలోని తడిక వెనక భాగంలో కట్టిన

త్రాసులో వుంచిన కొండరాళ్ళని తొలగించారు. దాంతో త్రాసు ఇవతలి వైపు కూర్చుని ఉన్న స్వామి చటుక్కున నాలుగడుగుల ఎత్తునించి కిందికి దిగాడు. ఆ త్రాసుకి కట్టిన నల్లటి తారు పూసిన సన్నటి ఉక్కు తీగలు ఆ చీకట్లో ప్రజలకి కనబడలేదు, కరణం వాటిని విప్పి చూపించేదాకా. వాటి బేక్‌గ్రౌండ్‌లో తడికమీద ఆరేసిన నల్ల దుస్తులు వీటిని కప్పి పుచ్చడానికే వేసారు.

ఆయనకి, వారి శిష్యులకి దేహశుద్ధి చేసారు గ్రామస్తులు. ఆయనని నమ్మి బంగారు గాజులు కూడా ఇచ్చిన ఆడవారు, అందుకు కోప్పడకపోగా, మెచ్చుకున్న భర్తలు నోళ్ళు వెళ్ళబెట్టారు. అంతా మునిరత్నాన్ని మెచ్చుకున్నారు. అతను శ్రీకాకుళం నించి తిరిగి భీమునిపాడు చేరుకున్నాడు.

ఈ అనుభవంతో మనసంతా చెదరడంతో దారిలోని పుణ్యక్షేత్రాలకి వెళ్ళాలనిపించలేదు. సరాసరి భీమునిపాడు చేరుకుని తండ్రికి జరిగింది మొత్తం వివరించాడు.

"అందుకే ఇంటిపట్టున ఉండమన్నది. లోకమంతా ఇంతే."

వారం రోజులు తన బాబాయ్ సమాధిమందిరంలో ఉన్న మునిరత్నానికి మనశ్శాంతి కలగలేదు. తనకి సద్గురువు దొరకాలన్న తపన ఇంకాస్త ఎక్కువైంది.

"నేను బెంగాల్ దేశంలో పుట్టి వుంటే బావుండేది" శ్రీ రామకృష్ణానందగిరి స్వామి దగ్గర వాపోయాడు ఓసారి.

"ఏం?" నవ్వుతూ ప్రశ్నించాడాయన.

"మహాత్ములు ఎక్కువగా పుట్టేది బెంగాల్‌లోనేకదా! చైతన్య మహాప్రభు, కుసుమహరనాథ్ బాబా, ఆనందమయి, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు-ఇప్పుడు అరవిందో పేరుకూడా వినబడుతోంది. అలాగే మహారాష్ట్రంలో కూడా సత్పురుషులు ఎక్కువ. సంత్ జ్ఞానేశ్వర్, భక్తతుకారాం, నామ్‌దేవ్, ఏక్‌నాథ్, సమర్థ రామదాసు, మెహర్‌బాబా, సాయి, ఉపాసనీ బాబా, బాబాజాన్, గజానన్....ఇంకా ఎందరో."

"మన రాయలసీమలో కూడా ఎందరో అవధూతలు జన్మించారు. పోతులూరి వీరబ్రహ్మం, సిద్ధయ్య, వేమన, రాఘవేంద్రస్వామి....గురువు

దొరకాలంటే ఒకటే మార్గం. తపన. నిజమైన తపన ఉంటే ఆ తరంగాలు ఆయన్ని తాకి, ఆయన్ని మన దగ్గరికి లాక్కొస్తాయి. గురువుని వెతుక్కుంటూ నువ్వు వెళ్ళక్కరలేదు. ఆయనే నీ దగ్గరికి వస్తాడు చూస్తుండు. నిజమో కాదో నీకే తెలుస్తుంది.. రోజూ నేను ధ్యానంలో నీకో సద్గురువుని ప్రసాదించమని ఇకనించి మా గురువుని ప్రార్థిస్తాను" చెప్పాడు రామకృష్ణ నందగిరి.

తన బాబాయ్ సేకరించిన అనేక ఆధ్యాత్మిక గ్రంథాలని చదవ సాగాడు మునిరత్నం. ప్రబోధ చంద్రోదయం, యోగ సుధాకరం, పంచదశి మొదలైన గ్రంథాలు చదివాడు. ఈశావాశోపనిషత్తులోని శ్లోకాలన్నీ బట్టీపట్టాడు.

ఓ రోజు తల్లి మునిరత్నంతో చెప్పింది-

"నాయనా! ఇంట్లో కట్టెలు నిండుకున్నాయి. పాలన్నకి జ్వరం. కాస్తంత కట్టెలు కొట్టిస్తే వంట పూర్తవుతుంది."

గొడ్డలి తీసుకుని మునిరత్నం కట్టెలు కొట్టాడు. తర్వాత తల్లినడిగాడు.

"అవి చాలా అమ్మా?"

"ఓ! చాలా కొట్టావే! వారందాకా సరిపోతాయ్" బదులు చెప్పిందావిడ.

"సరే! నేను వెళుతున్నాను."

"ఎక్కడికి?"

"ఏదైనా క్షేత్రానికి."

"ఇక్కడ నీకేం కష్టం నాయనా?" బాధగా అడిగిందావిడ.

"ఇందాకే పుస్తకంలో చదివాను. ఎవరైనా కర్మలు చేయకూడదను కునే సన్యాసి అయ్యేది. ఇంట్లో ఉంటే కర్మలు తప్పవు. ఈ కారణం వల్లనే అనుకుంటా-సన్యాసి ఇంట్లోకి రాకూడదన్న నియమం పెట్టింది.

"అరగంటలో వంటవుతుంది. తింటూ మీ నాన్నతో నిదానంగా అన్నీ మాట్లాడుదువుగాని."

"భోజనమా?" నవ్వాడు. "ఎక్కడ కర్మచేస్తే, సన్యాసి అక్కడ

భోజనం చేయకూడదు. నీకు కట్టెలు కొచ్చిచ్చి, దాంతో నువ్వు చేసే వంటలు తినడం సన్యాసి లక్షణం కాదు. సన్యాసి ఏదైనా ఉచితంగానే స్వీకరించాలి. వస్తాను."

మహాలక్ష్మమ్మ నెత్తీ నోరు బాదుకుంటున్నా లక్ష్యపెట్టకుండా మునిరత్నం వంటిమీది బట్టలతో, చెప్పుల్లేని కాళ్ళతో బయటికి ఒకనాటి రామావతారంలా బయటికి నడిచాడు.

13

ఏదైనా పుణ్యక్షేత్రానికి వెళ్ళాలని బయలుదేరిన మునిరత్నానికి ఎక్కడికెళ్ళాలో తోచలేదు. నందవరంలోని చౌడేశ్వరీమాత ఆలయం, యాగంటిలోని ఉమామహేశ్వరాలయం, ఇంకా నంద్యాల దగ్గరున్న ఓంకారేశ్వర ఆలయం, అహోబిలం, లేదా నాగలూటి వీరభద్రాలయం, మహానంది, కొలనుభారతి, సంగమేశ్వర ఆలయం మొదలైనవి ఆతని మనసులో మెదిలాయి.

ఎటు వెళ్ళాలో తేల్చుకోలేక నడుస్తుండగా ఓ సన్యాసి ఎదురు పడ్డాడు. అతని భుజాన నల్లటి కంబళితో చేసిన మూట, ఓ చేతిలో త్రిశూలం కనిపించాయి. అతని నుదుటికి అడ్డంగా దట్టించిన విబూదిరేఖలు మూడు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

విబూది, త్రిశూలం చూడగానే శివాలయానికి వెళ్ళాలనిపించింది. కానీ రుద్రకోటిలోని శివాలయంలో గురువుని ప్రసాదించమని వేడుకుంటే, ఆ పరమశివుడు తనకి కపట గురువు దగ్గరికి పంపడం గుర్తొచ్చింది. దాంతో శివక్షేత్రానికి వెళ్ళబుద్ధి కాలేదు.

పైగా తనని అనుగ్రహించింది శక్తిమాత కనక రెండు రోజులు నడిచి నందవరంలోని చౌడేశ్వరీదేవి ఆలయానికి చేరుకున్నాడు.

తనకోసం తండ్రి మనుషుల్ని వెదకడానికి పంపచ్చన్న భయంతో పగలు రోడ్డు పక్కన పడుకుంటూ, రాత్రిళ్ళు నడుస్తూ అక్కడికి చేరుకున్నాడు. కాళ్ళు కడుక్కుని వెళ్ళి అమ్మవారిని దర్శించుకున్నాడు.

"తల్లీ! ముకాంబికాదేవి రూపంలో నన్ను కటాక్షించావు. ఈ చౌడేశ్వరి రూపంలో ఆధ్యాత్మికంగా నన్ను మరింత ముందుకు తీసుకుపో, దేవి" అని మనసారా ప్రార్థించాక ఆలయం బయట ఎవరికీ అడ్డురానిచోట పద్మాసనం వేసుకుని కూర్చుని కళ్ళు మూసుకున్నాడు.

ఓ గంటన్నరదాకా మునిరత్నానికి ధ్యానంలో ఎలాంటి కుదురు దొరకలేదు. తను కపట గురువు చేతిలో ఎలా మోసపోయిందీ, అది తెలిసి తన గురించి అంతా ఎలా నవ్వుకుంటూంటారో అన్న ఆలోచనలు మనసు నిండా అలముకుని బాధించసాగాయి.

చీకటి పడేదాకా ఆ ఆలోచనలతో సతమతమయ్యాడు.

గుడి పూజారి గుడి కట్టేస్తున్నామని, ఇక లేచి వెళ్ళమని చెప్పాక లేచి బయటకి వచ్చాడు. ఉదయం నించి ఏం తినకపోవడంతో కడుపు నకనకలాడుతోంది. జనం ఎవరూలేరు. ఓ చెట్టుకింద చేతిని తలకింద వుంచుకుని ఆకాశంలోకి చూస్తూ పడుకున్నాడు.

'ఇదే రుద్రకోటి అయితే పళ్ళతో కనీసం కడుపు నిండేది. అమ్మవారు తన పొట్ట సంగతి చూడదేమిటి?' అనుకున్నాడు.

మనసంతా ఎంతో అశాంతిగా వుండడంతో వెంటనే నిద్రపట్టలేదు. చౌడేశ్వరీదేవి ఎంతో శక్తివంతమైన దేవతంటారు. ఇక్కడ తనకి ధ్యానం ఇంత చప్పగా వుందేమిటి అనిపించసాగింది.

"అమ్మా! నేనిక్కడ ధ్యానం చేసుకోవాలో, లేక వేరెక్కడికయినా వెళ్ళాలో స్వప్నసందేశం ఇవ్వు" అని మనసారా వేడుకుని పడుకున్నాడు.

అతనికే కలా రాలేదు. మర్నాడు ఉదయం ఎద్దులకి కట్టిన గజ్జెల సవ్వడికి మెలకువ వచ్చింది. బళ్ళనించి విప్పిన నాలుగు ఎడ్లు గడ్డి మేస్తున్నాయి. వాటి పక్కనించి నడిచి వచ్చే సన్యాసి ఒకతను కనిపించాడు.

భుజాన నల్లటి మూట, చేతిలో త్రిశూలం, నుదుట అడ్డంగా విబూది రేఖలు. తనకి రెండు రోజుల క్రితం మార్గంలో తారసపడిన సన్యాసేనని గుర్తించాడు. అతన్ని చూసాక తనకి శివాలయం వెళ్ళాలనిపించడం, కాని వద్దనుకోవడం గుర్తొచ్చింది మునిరత్నానికి. అమ్మవారు స్వప్న సందేశం ఇవ్వకుండా శివాలయంకి వెళ్ళమని ఇలా సూచించిందా? లేకపోతే కళ్ళు

తెరవగానే ఎందుకు మళ్ళీ కనబడ్డాడు? మీమాంసలో పడ్డాడు మునిరత్నం.

బళ్ళు కట్టించుకుని వచ్చినవాళ్ళు చౌడేశ్వరిదేవికి పూజలు చేయించుకుని వెళ్ళిపోయారు. ఆ రోజు భక్తులు పల్చగా వున్నారు. ఎవరూ ప్రసాదం పిసరంతయినా పెట్టలేదు.

ఆకలిగా వున్నవాడికి ధ్యానం ఎక్కడ కుదురుతుంది? మునిరత్నానికి ఆ సన్యాసి మూడోసారి కనబడ్డాడు మంచినీటి పంపు దగ్గర.

"ఇక్కడెక్కడైనా అన్నదానం జరుగుతోందా?" అడిగాడు మునిరత్నం అతన్ని.

అతను తల అడ్డంగా వూపాడుతప్ప జవాబు చెప్పలేదు. కొద్ది క్షణాల తర్వాత తన మూటవిప్పి అందులోంచి రెండు దోరగా పండిన జామకాయలని మునిరత్నంకిస్తూ చెప్పాడు.

"బ్రహ్మార్పణం."

ఓ జామకాయ కొరకగానే రుద్రకోటిలో తను తిన్న అలాంటి పళ్ళ రుచి గుర్తుకు వచ్చి అడిగాడు మునిరత్నం.

"రుద్రకోటిలో చెట్టువా?"

మళ్ళీ తల అడ్డంగా ఊపాడు అతను. కొద్దిక్షణాలాగి చెప్పాడు.

"గుండ్ల బ్రహ్మేశ్వరాలయ ప్రాంగణంలోనివి."

"బ్రహ్మేశ్వరాలయం అంటే, గుండ్లకమ్మనది పుట్టే దగ్గరా?" ప్రశ్నించాడు మునిరత్నం.

అవునన్నట్టుగా తల ఊపి, తన మూట సర్దుకుని లేచాడు సన్యాసి. మునిరత్నానికి ఎంతో చిత్రంగా తోచిందా సంఘటన. ఇక్కడ చౌడేశ్వరి మాత ఆలయం దగ్గర ఆకలిగా వున్న తనకి, ఎక్కడో అడవిలో వున్న శివాలయంలోని పళ్ళు అందడమేమిటి? ఆ రెండూ తినేలోగా స్ఫురించిందతనికి, సాక్షాత్తూ పరమశివుడే తన దగ్గరకి పిలుస్తున్నాడని.

తొమ్మిదో తరగతి చదువుతూండగా మునిరత్నం స్కూల్‌వాళ్ళతో ఎక్స్‌కర్షన్‌గా ఆ గుండ్ల బ్రహ్మేశ్వరాలయానికి ఓసారి వెళ్ళాడు.

తనని అమ్మవారు శివాలయానికి వెళ్ళమని స్వప్నంలో సందేశం ఇవ్వకుండా, ఇలా పళ్ళిచ్చి చెప్పిందనిపించసాగింది. ఇదివరకు ఏర్పడ

మీమాంస తీరింది. గుండ్ల బ్రహ్మేశ్వరాలయంకి రూట్ అడగడానికి మునిరత్నం ఆ సాధువుకోసం చూసాడు. కనబడలేదు. ఎంత వెదికినా అతను ఎక్కడా లేడు! చిత్రంగా ఇంతలో ఎలా మటుమాయం అయ్యాడు?

మునిరత్నానికి అది దైవప్రేరిత సంఘటన అని, తను చేరాల్సింది ఆ శివాలయానికే అని తోచసాగింది. క్రమంగా ఆ నమ్మకం బలపడింది. ఏదో శైవక్షేత్రానికి వెళ్ళడంకాక, ఫలానా చోటికేరమ్మని తనకి సాక్షాత్తు సదాశివుడు ఖబురు చేసాడనిపించింది. ఆ రోజు భోజనం దొరక్కపోవడంతో, ఇక సందేహించక, మర్నాడు ఉదయం మంచినీళ్ళుతాగి, అమ్మవారి గుళ్ళోకి వెళ్ళి దర్శనం చేసుకుని, "అమ్మా! నువ్వే నన్ను బ్రహ్మేశ్వరుడి దగ్గరికి పంపుతున్నావని నమ్ముతున్నాను. అది తప్పయితే, ఎక్కడికి వెళ్ళాలో అక్కడికి చేర్చే భారం నీదే" అని మొక్కి వెనక్కి తిరిగాడు.

తనకంటూ స్వయం ఆలోచన లేకుండా అలా దైవనిర్ణయంగా విశ్వసించిన మునిరత్నం, ఆత్మకూరుకి ఎలా వెళ్ళాలో విచారించి నడక సాగించాడు. అతనటు వెళ్ళగానే సాలన్న, నరసింహయ్య ఎక్కిన జీపు చౌడేశ్వరీ ఆలయం దగ్గర ఆగింది.

14

మునిరత్నం ఇల్లు వదిలి వెళ్ళిన చాలాసేపటికి కాని నరసింహయ్య ఇంటికి రాలేదు. మునిరత్నం మళ్ళీ వెళ్ళిపోయాడని తెలీగానే ఆయన, కొందరు గ్రామస్తులు వెంటనే ఎడ్లబండి కట్టుకుని మునిరత్నం కోసం నాలుగువైపులా వెళ్ళారు. ఎంత వెదికినా అతను కనబడలేదు.

వీళ్ళ బండి రోడ్డుమీద వెళుతూన్న సమయంలో మునిరత్నం ఈ ప్రమాదం గ్రహించే రోడ్డుపక్కన పడుకుని వున్నాడు. మునిరత్నం కోసం రుద్రకోటి క్షేత్రానికి వెళ్ళాడు నరసింహయ్య. అయితే మునిరత్నం రాలేదని చెప్పాడు నరసింహయ్యని గుర్తుపట్టిన అక్కడి పూజారి.

కూడా వచ్చిన సాలన్నని అక్కడే వుంచి, మర్నాడు సాయంత్రం దాకా చూసి, మునిరత్నం వస్తే వెంటబెట్టుకు తీసుకురమ్మన్నాడు. లేదా వచ్చి ఏ కబురూ ఇంటిదగ్గర చెప్పమన్నాడు.

సాలన్న ఆ ప్రకారం తిరిగివచ్చి, మునిరత్నం అక్కడికి రాలేదని, వస్తే పూజారి ఏదోవిధంగా టెలిగ్రాం పంపిస్తానని చెప్పాడని చెప్పాడు.

ట్రాక్టర్ మీద నంద్యాల చుట్టుపక్కల వున్న నవనందుల క్షేత్రాలన్నీ గాలించాడారోజు. ఎక్కడా మునిరత్నం జాడలేదు. ఊళ్ళోని దేవాలయాలు కూడా చూసాడు.

ఓ మిత్రుడి జీపు తీసుకొని నందవరం చౌడేశ్వరీమాత, కొత్తూరు సుబ్రమణేశ్వరస్వామి, యాగంటి ఉమామహేశ్వరుడు, బనగానపల్లిలోని బ్రహ్మంగారి నేలమఠం గాలించాడు. ఆయనకి ఎక్కడా మునిరత్నం జాడ దొరకలేదు.

ఈసారి దినపత్రికలో మునిరత్నం ఫోటోతోసహా ప్రకటన ఇచ్చాడు- తల్లికి జబ్బుగా వుందని, అది చూడగానే వెంటనే ఇంటికి తిరిగి రమ్మని.

ఎక్కడో అడవిలో మారుమూల వున్న గుండ్ల బ్రహ్మేశ్వరాలయంకి వెళ్ళి చూడాలన్న ఆలోచన ఎవరికీ రాలేదు.

• • • •

కర్నూలుజిల్లా ఆత్మకూరు దగ్గర వెలుగోడు అనే గ్రామంనించి ముప్పై కిలోమీటర్ల దూరంలో నల్లమల్ల కొండల్లో చిట్టడవిలో వున్న గుండ్ల బ్రహ్మేశ్వరాలయం దరిదాపులకి చేరుకున్నాడు మునిరత్నం. అక్కడికి ఏ దినపత్రికా రాదు.

సన్నగా, రివటలా వున్న ఆ కుర్రాడు ఒంటరిగా నడుచుకుంటూ రావడం చూసారు, ఆ ప్రాచీన దేవాలయానికి కొద్దిదూరంలో వున్న చెంచులు కొందరు.

కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో వ్యాపించిన నల్లమల పర్వతాలు ఆదిశేషుడి అవతారమని, శిరఃస్థానం తిరుమలకాగా, పచ్చాత్స్థానం శ్రీశైలమని బ్రహ్మపురాణంలో వుంది. తిరుమలలోని వెంకటాద్రిపైన శ్రీనివాసుడున్నట్లుగా, శ్రీశైలంలో వృషభాద్రిపైన మల్లేశ్వరుడున్నాడు. అహోబిలం, మహానందిలాంటి అనేక క్షేత్రాలు ఈ పర్వతశ్రేణుల్లోనే వున్నాయి. వాటిలో గుండ్ల బ్రహ్మేశ్వరాలయం ఇంకోటి.

అశ్వత్థామ ప్రతిష్ఠించాడని నమ్మే ఆ శివలింగం వున్న ఆలయ ప్రాచీనమైనది. చిన్నది దానికి సరైన ఆదరణ లేదు.

నల్లమల అడవుల్లో ఎన్నో వేలమంది చెంచులు నివశిస్తున్నార వాళ్ళు విల్లంబులతో అడవి జంతువులని వేటాడి వాటి మాంసం భక్షిస్తు జీవనం సాగిస్తుంటారు. తండాలుగా నివశిస్తూ గుడిసెల్లో వుంటారు. అడవిలో అడవిసంపదని నాగరికులకి అమ్మి, తమకి కావలసిన వస్తువులు తెచ్చు కుంటారు.

ఆ చెంచుల తండా తాలూకు గుడిసెలు దూరంనించే మునిరత్నం కళ్ళబడ్డాయి. తను దారి తప్పలేదని గ్రహించాడు. ఓ గుడిసెదగ్గర ఆగి, దాని బయట నిలబడి ఆసక్తిగా చూస్తున్న ఓ నలభై అయిదేళ్ళ వ్యక్తిని అడిగాడు మునిరత్నం.

"బ్రహ్మేశ్వరాలయం ఇటేకదా స్వామీ?"

"అవును. ఇంతదూరం కాలినడకన నువ్వొక్కడివే గుడికివచ్చావా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

మారు చెప్పకుండా మునిరత్నం పావుకిలోమీటరు దూరంలో వున్న ఆ ఆలయ శిఖరాన్ని చూసాడు.

"గుండ్లకమ్మ నది ఎక్కడుంది?"

అతను చేత్తో చూపించాడు.

"నువ్వు దాటి వచ్చిన వాగు ఆ నదిలోదే. ప్రమాదం అని ఎవరూ చెప్పలేదా? ఈ అడవిలో పులులు తిరుగుతూంటాయి."

"తెలుసు. వాగు పక్కన ఇసకలో పులి, దాని పిల్లల అడుగుల గుర్తులు చూసాను."

"అయినా భయం వేయలేదా?"

మునిరత్నం సన్నగా నవ్వాడు.

"నీకులేని భయం నాకెందుకు?"

"నా దగ్గర విల్లంబులుంటాయి కాబట్టి భయంలేదు."

"దేవుడు అనుమతిస్తే తప్ప ఏ పులీ నన్నేం చేయలేదన్న నమ్మకం నాకుంది కాబట్టి, నాకూ భయం లేదు."

అప్పటికే ఆ తండాలోని అనేకమంది పిల్లాపాప, ఆడవాళ్ళు మునిరత్నాన్ని చుట్టుముట్టి అతనివంక శ్రద్ధగా చూసారు.

"ఇంతదూరం దేనికి వచ్చావు?"

"దేవుడి దగ్గరకు ఎందుకు వస్తారు?"

మునిరత్నం ముందుకు నడిచాడు. కొద్దిదూరం వెళ్ళి ఆగి వెనక్కి తిరిగి ప్రశ్నించాడు.

"ఆలయం దగ్గర జామ చెట్టుందా?"

"బోలెడున్నాయి. కోతులు కోయగా ఎప్పుడూ ఇంకా చాలా వుంటాయి."

"నాలుగైదు రోజులక్రితం ఎవరైనా కాషాయ సన్యాసి వచ్చి వెళ్ళాడా? సన్నగా వుంటాడు. చేతిలో త్రిశూలం, భుజాన నల్లటి మూట వుంటాయి."

"రాలేదు.... మొన్న అమావాస్యనించి ఇంతదాకా ఎవరూ ఇటు రాలేదు. రేపే పున్నమి."

వెంటనే మునిరత్నం ఆ ఎగుడు దిగుడు మట్టినేల మీద ఆలయం దిక్కుకి సాష్టాంగపడి, చేతులు చాచి నమస్కారం చేస్తూ చెప్పాడు.

"అపరాధం మన్నించు స్వామి. నిన్ను కాదని అమ్మవారి దగ్గరకి వెళ్ళిన నా అల్పత్వాన్ని క్షమించు. నాకు తగిన గురువుని ప్రసాదించాల్సింది నువ్వే. పాహిమాం, పాహిమాం."

లేచి కూర్చున్న మునిరత్నంలో పొంగిన భక్తి పారవశ్యానికి మూకాంబికాదేవి క్షేత్రంలోలా ఒళ్ళంతా కంపించి, రోమాలు నిక్కబొడుచు కుని, కంఠం పూడుకుపోయింది. అది ఏడుపుగా బయటపడింది. ఆ స్థితి లోంచి తేరుకునేదాకా చెంచులు అతనివంక చూస్తుండిపోయారు.

మునిరత్నం చెట్ల చాటున మాయమయ్యేదాకా అతన్నే చూస్తూ అతని గురించి తమ భాషలో మాట్లాడుకోసాగారు. ఎప్పుడైనా, ఎవరైనా నెలకోసారి ఏ జీపుమీదో, ట్రాక్టరు మీదో ఉదయమే వచ్చి దైవదర్శనం చేసుకుని చీకటి పడేలోగా తిరిగివెళ్ళడం చూసారే తప్ప, సాధువు కాని వ్యక్తి ఇలా ఒంటరిగా మునిమాపువేళ రావడం చూళ్ళేదు. కాసేపాగి

కొందరు ఆసక్తిగా గుండ్ల బ్రహ్మేశ్వరాలయానికి వెళ్ళి చూసారు. విరి చెట్లకొమ్మలతో ఓ చెట్టుకింద రాలిన ఆకులు, చిన్నచిన్న కొమ్మల్ని కూ ఊడ్చి శుభ్రం చేసే మునిరత్నం వాళ్ళకి కనిపించాడు.

దగ్గరే వున్న ఏ పుణ్యాత్ముడో తవ్వించిన దిగుడు బావిలో దోసిళ్ళతో నీళ్ళు తెచ్చి లింగానికి తొమ్మిదిసార్లు అభిషేకం చేసి శు శుభ్రం చేసినచోట పద్మాసనం వేసుకుని కళ్ళు మూసుకుని కూర్చున్నా

"రాత్రంతా అక్కడే వుంటావా?" అడిగారు ఒకరు.

"ఈ రాత్రే కాదు- చాలా రోజులు ఇక్కడే వుంటాను" చెప్పా మునిరత్నం.

"తపస్సు చేయడానికి వచ్చావా?"

"అవును. నన్ను మాట్లాడించకండి."

మునిరత్నానికి చౌడేశ్వరీదేవి ఆలయం దగ్గర దొరకని శాంతి అక్కడ దొరికినట్లనిపించింది.

"బ్రహ్మేశ్వరస్వామి! నేను దేహాన్ని. దాని తొడుగు ఈ దేహం అన్న అనుభూతి నాకు కలిగించే సద్గురువు దొరికే కటాక్షాన్ని ప్రసాదించ స్వామీ! అనేక జన్మలుగా నాలో ఏర్పడిన ఉల్లిపొరల్లా, నా సూక్ష్మశరీరంగా చుట్టుకుని వున్న బలమైన వాసనా సంస్కారాలు ఒక్కొక్కటే కాలిపోయే ధ్యానాగ్నిని నాలో రగిలించు స్వామీ! అరుణాచలంలో రమణమహర్షిని ఏ కరుణామృతంతో కనికరించావో, శేషాద్రి శాస్త్రిని ఏ కరుణామృతంతో అనుగ్రహించావో, రుద్రకోటిలో కోటిమంది ముముక్షువులని ఏ కరుణా మృతంతో కటాక్షించావో ఆ కరుణామృతం నా మీద కూడా ఒకింత చూపించ స్వామీ! నా పూర్వజన్మలో నేను ఏ దేవుడ్ని ఉపాసించానో నాకు గుర్తు లేదు. ఈ జన్మలో నిన్నే నమ్ముతున్నాను స్వామీ" మనసారా చేతులెత్తి పరమశివుడ్ని ప్రార్థించాక కళ్ళు మూసుకుని 'ఓం నమశ్శివాయ' మంత్రం జపించసాగాడు.

నిద్ర వచ్చేదాకా అలా జపించి తర్వాత దారిలో కోసి తెచ్చుకున్న పళ్ళని తిని నేలమీద పడుకున్నాడు. రుద్రకోటిలో నేలమీద పడుకున్న తొలి రాత్రుళ్ళు పరుపుకి అలవడ్డ దేహం అవడంవల్ల నిద్రరాక నానా

అవస్థ పడ్డాడు కాని ఇప్పుడు మునిరత్నం దేహం అందుకు పూర్తిగా అలవడటంతో వెంటనే నిద్రపచ్చేసింది.

నడకతో అలసిసొలసి వున్న మునిరత్నానికి అడవిమృగాల అరుపులు వినిపించలేదు. రుద్రకోటికన్నా చిట్టడవి కాబట్టి నక్కల వూళలు, అపుడుగా పులి గాండ్రింపులు రాత్రంతా వినబడుతూనే వున్నాయి.

మర్నాడు ఉదయం నిద్రలేచి చూస్తే, చెట్టుకొమ్మలకి ఇరికించిన మండుతున్న కాగడా ఒకటి కనిపించింది.

రాత్రి తను నిద్రించాక దాన్ని చెంచులు తెచ్చి వుంచారని గ్రహించాడు.

దిగుడుబావి నీటితో కాలకృత్యాలు తీర్చుకుని మళ్ళీ తొమ్మిది దోసిళ్ళతో లింగాభిషేకం చేసాక మునిరత్నం పద్మాసనం వేసుకుని కూర్చుని శివధ్యానం చేయసాగాడు.

అరగంట తర్వాత అలికిడికి కళ్ళు విప్పి చూస్తే ఓ పదహారేళ్ళ చెంచు కుర్రాడు కనిపించాడు.

"రాత్రి నేనే దివిటీని ఇక్కడ వుంచింది. నిప్పంటే పులి కాని, ఎలుగుబంటి కానీ, ఏ అడవి జంతువూ దగ్గరకి రాదు."

మునిరత్నం బదులుపలకకుండా కళ్ళు మూసుకున్నాడు.

"నీ పేరు?"

"నా పేరు హనుమంతప్ప. మా నాయన తిమ్మప్ప. అమ్మ పేరు తులసమ్మ."

"నువ్విక్కడినించి వెళతావా?" అడిగాడు మునిరత్నం కళ్ళు తెరచి చూస్తూ.

"నీకు భోజనం?"

జామచెట్లవంక చూపించాడు.

"అవేనా? మాంసం అక్కర్లేదా?"

తల అడ్డంగా వూపాడు.

"కావాలంటే మా వేటలో కొంత కాల్చి తెచ్చిస్తాను."

"ఒద్దు."

"పుట్టతేనె."

"నాకేదీ వద్దు. వెళ్ళు నువ్వు."

ఓ బాకు మొల్లోంచి తీసి మునిరత్నం పక్కన నేలమీద గు కునేలా విసిరి చెప్పాడు.

"ఉంచు. పురుగో, పుట్రో వస్తే కష్టం."

ఆ రోజు చెంచులు కొందరు, అరిటాకులో జొన్న రొట్టెలు, పాయ వచ్చడి, కాల్చిన లేత మొక్కజొన్న కంకులు తెచ్చి మునిర ముందుంచారు. అతను కన్ను విప్పి చూసినా వాటిని ముట్టకుండా ధ్యానంలో వుండిపోయాడు. వాటిని కోతులు తినడం తర్వాత చెంచులు గుర్తింపా మునిరత్నం కేవలం పళ్ళు, ఫలాలమీదే ఆధారపడుతున్నాడని త్వరలో చెంచులు గుర్తించి అతనికి ఆహారం ఇవ్వడం విరమించుకున్నారు.

వారందాటినా మునిరత్నం కార్యక్రమం ఎప్పుడూ ఒక్కలా వుండడం గమనించారు తండాలోని వారంతా ఉదయం సూర్యోదయాని ముందే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని, లింగాభిషేకం చేసి తపస్సు కూర్చుంటాడు. మధ్యాహ్నం ఆకలయినప్పుడు జామపళ్లు, సీతాఫలాలు, సీమచింతకాయలు, వెలగపళ్ళు, లేదా కొండరేగిపళ్ళు కోసుకుంటాడు. మళ్ళీ కళ్ళుమూసుకుని కూర్చుంటాడు. రాత్రి నిద్రపోయేదాకా అంతే. తండాలోంచి తంబూర మీటే ధ్వని తరచు వినబడుతుంటుంది మునిరత్నానికి. క్రమేపీ మునిరత్నం మీదగల ఆసక్తి వాళ్ళకి తగ్గింది. అతన్ని పలకరించడం తగ్గించారు. ప్రతిరాత్రీ చెంచులంతా కలిసి నిద్రకి ముందు భజనచేయడము వినిపిస్తుంటుంది మునిరత్నానికి.

జయ శంభో జయ శంభో జయపరమేశ్వర జయ శంభో
సాంబ సదాశివ జయ శంభో పార్వతి ప్రియ జయ శంభో
కైలాసనాధ జయ శంభో త్రిశూలధారి జయ శంభో
సర్పాభరణ ధారి జయ శంభో మల్లికార్జున జయ శంభో
నీలకంఠేశ్వర జయ శంభో గంగాధరేశ్వర జయ శంభో
భక్త వత్సల జయ శంభో మోక్షప్రదాతా జయ శంభో
జయ శంభో జయ శంభో జయ శంభో జయ జంభో

ఆ సమయంలో మునిరత్నం కూడా ఇక్కడనుంచే వాళ్ళ భజనలో పాల్గొని క్రమేపీ తన్మయత్వం పొందుతూ ఒక్కోసారి తనకి తెలీకుండానే లేచి రిథమిక్‌గా నాట్యం చేస్తాడు. అప్పుడతని మొహంలో ఆనందంతో కూడిన చిరునవ్వో లేక ఆనందభాష్పాల్లోంచి వచ్చిన కన్నీరో తప్పవు.

"స్వామీ! ఈ రోజన్నా నాకు సద్గురువుని ప్రసాదించు స్వామీ. ఆయన లేనిదే ఏం లేదు. ఆయన ఎక్కడున్నాడో తెలిసే సమాచారం పంపు స్వామీ" అని మునిరత్నం శివుడ్ని ప్రార్థించకుండా ఏ రోజూ గడపడు.

అతను బ్రహ్మేశ్వరాలయం చేరిన మూడు నెలలకి బ్రహ్మేశ్వరుడు మునిరత్నాన్ని కరుణించాడు.

ఓ రోజు మునిరత్నం చెట్లమీద కోతులను, ఉడతలని, నెమళ్ళని, దూరంలో నిలబడ్డ ఎలుగుబంటి పిల్లని చూస్తూ రేగిపళ్ళని తింటున్నాడు. అతనికి సమీపంలోని తండాలోంచి కొమ్ముబూర వూదే ధ్వని వినిపించింది.

మునిరత్నం ఆ వాద్యగోష్ఠిని పట్టించుకోకుండా ధ్యానంలో నిమగ్నమయ్యాడు. తండాలోని ఎవరికైనా శుభకార్యం జరుగుతుండచ్చను కున్నాడు.

కొద్దిసేపటి తర్వాత అకస్మాత్తుగా ఆ వాయిద్య శబ్దాలు ఆగిపోయాయి. ఎప్పుడూ వినబడే తంబురా మీటే శబ్దం కూడా లేదు. ఓ అర గంట తర్వాత హనుమప్ప పద్నాలుగేళ్ళ చెల్లెలు ఈశ్వరమ్మ పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పింది మునిరత్నంతో.

"స్వామి వచ్చారు. నిన్ను పిల్చుకు రమ్మంటున్నారు."

"నువ్వెందుకు వస్తావు? నా దగ్గరికి రావద్దని చెప్పలా?" అరిచాడు మునిరత్నం. యవ్వనంలో అడుగుపెడుతున్న ఆ పిల్ల తరచు వచ్చి మునిరత్నానికి దూరంగా కూర్చుని తదేకంగా అతన్నే గమనిస్తూంటుంది. ఒంటరితనం అభిలషించి అంత దూరం వచ్చిన మునిరత్నానికి ఈశ్వరమ్మ ఉనికి ఎంతో చిరాగ్గా వుంటోంది. అయితే ఈశ్వరమ్మ మనసులో ఎలాంటి

కల్మషం లేదని, తమ తండ్రికి చెందని కొత్తవ్యక్తిని మొదటిసారిగా చూ
డంతో ఆ పిల్లకి తను, తన ధ్యానం ఆసక్తికరంగా కనిపిస్తూంది
యని మునిరత్నం అర్థం చేసుకున్నా, అతనికి ఆమెవల్ల ధ్యానభం
అవుతుందన్న కోపం మాత్రమే....

"నీకు తెలీదా? కమండలం స్వామి వచ్చారు. నిన్ను పిల్చుకు ర
న్నారు."

"నేను రానన్నానని చెప్పు."

వెనకే ఈశ్వరమ్మ అన్న హనుమప్ప వచ్చి చెప్పాడు.

"కమండలం స్వామి నిన్ను పిలుచుకురమ్మన్నారు. రా పోదాం."

"నేను రానని చెప్పు."

"ఆయన పిలిస్తే రావా?" ఆశ్చర్యపోయాడు హనుమప్ప.

"అందరూ దొంగస్వాములే. రానుపొండి."

ఈశ్వరమ్మ, హనుమప్ప వెళ్ళిపోయారు. మునిరత్నం ధ్యానాని
కూర్చున్నాడు. కొద్దిసేపటికి హనుమప్ప తన తండ్రితో వచ్చాడు. హను
మప్ప తండ్రి చెప్పాడు.

"ఏ త్రాసు లేకుండా గాల్లోకి లేచే స్వామిని కనక ఫర్వాలేదు రా
అని చెప్పమన్నారు నీకు."

మునిరత్నానికి ఆశ్చర్యమేసింది. ఎక్కడో శ్రీకాకుళంలో జరిగిన
సంఘటన ఈయనకెలా తెలుసు? ఒకవేళ ఆ కపటస్వామి వచ్చాడా? మారు
మాట్లాడకుండా మునిరత్నం కళ్ళు మూసుకున్నాడు. వాళ్ళవెంట వెళ్ళ
దలుచుకోలేదు. వాళ్ళు వెళ్ళిపోయిన కొద్దిసేపటికి ఎందుకో తన ఎదురుగా
ఎవరో నిలబడి వున్నారన్న భావన కలిగి, అది క్రమేపీ బలోపేతం కాసా
గింది. కళ్ళు తెరిచి చూశాడు. నిజంగానే ఎదురుగా నిలబడి ఒకరు తనవంకే
చూస్తున్నారు.

సన్నగా, పొట్టిగా వున్న ఆయన నల్లటి వంటిమీద తెల్లటి గోచీ
తప్ప ఇంకేంలేదు. మొహంలో సన్నటి నవ్వు, ఒంటినిండా విబూది, జడలు
కట్టిన జుట్టు, కుడిచేత్తో ఆశీర్వదిస్తున్నాడు. ఎడం చేతిలో ఇత్తడి కమండలం.
మొహంలో దివ్యతేజస్సు.

ఆయన్ని చూడగానే తెలీని పూజ్యభావం కలగడంతో మునిరత్నం
వెంటనే లేచి నుంచున్నాడు. అకస్మాత్తుగా రెండు చేతులూ జోడించి ఆయ
నకి నమస్కరించాడు.

"ఓ గుడ్డివాడు ఇంకో గుడ్డివాడికి దారి చూపితే పడేది గోతిలోనే
అని తెలిసిందా?" నవ్వుతూ ప్రశ్నించాడాయన.

మునిరత్నానికి అర్థంకాలేదా మాటలు.

"స్వామీ?" ప్రశ్నించాడు.

"పరమాత్మ ప్రాప్తిని పొందని వ్యక్తిని ఆశ్రయిస్తే జరిగేదంతే."

ఆయన చెప్పేది తాను కపట సన్యాసిని గురువుగా స్వీకరించడం
గురించి అని మునిరత్నానికి అర్థమైంది.

"ఆత్మసాక్షాత్కారం పొందిన గురువు ఎలా లభిస్తాడు స్వామీ?"
అడిగాడు వెంటనే.

"దైవానుగ్రహం లేకపోతే అది కడు దుర్లభం. నీకా అనుగ్రహం
ఇప్పటికి లభించింది. కూర్చో" ఆయన నేలమీద పద్మాసనంలో కూర్చు
న్నాడు.

"స్వామీ! మీరెవరు?" మునిరత్నం కూడా ఆయనకి అభిముఖంగా
కూర్చుని అడిగాడు.

"ఈ దేహాన్ని ఆవరించుకుని వున్న ఆత్మని."

"మీ పేరు?"

"నా గురువు పెట్టిన పేరు సదానందస్వామి. ప్రజలు పిలిచేది
కమండలంస్వామి. నా దగ్గర ఎప్పుడూ ఈ కమండలం వుంటుంది. కాబట్టి
అలా పిలుస్తూంటారు."

"మీ గురువుగారెవరు?"

ఆయనతో మాట్లాడుతున్నకొద్దీ మునిరత్నానికి ఆయన మీద శ్రద్ధ,
భక్తి, ఆసక్తి పెరగసాగాయి. ఆయన మహిమాన్వితుడు అనిపించసాగింది.

"నా గురుదేవులు సద్గురువు నిత్యానందబాబా."

"ఎక్కడ వుంటారు వారు?"

ఆ ప్రశ్నకి చిన్నగా నవ్వాడు కమండలం స్వామి.

"ఆయన లేనిదెక్కడ? నీలోనూ వున్నాడు, నాలోనూ వున్నాడు. ఈ అడవంతా ఆయనే. ఈ విశ్వమంతా నిండి వున్నదీ ఆయనే. కాళ్ళు కడుక్కువచ్చి కూర్చో. నీకు మంత్రోపదేశం చేస్తాను."

మునిరత్నం దిగుడు బావి దగ్గరకి వెళ్ళి కాళ్ళు, చేతులు, మొహం కడుక్కుని వచ్చి ఆయన ఎదురుగా కూర్చున్నాడు. కమండలం స్వామి ముందు గురు ప్రార్థన చేశాడు.

ఓం నమశ్శివాయ గురవే సచ్చిదానంద మూర్తయే
నిష్ప్రపంచాయ శాంతాయ నిరాలంబాయ తేజసే.

"ఇటు తిరుగు. తూర్పు ఇటు. కళ్ళు మూసుకో."

మునిరత్నం కళ్ళు మూసుకున్నాక కుడి చెవిలో ఆయన కంఠం మెల్లిగా వినిపించింది.

"తత్వమసి. ఇప్పుడు ఆ కనిపించేది నువ్వే."

"శూన్యం తప్ప నాకేం కనిపించడంలేదు స్వామీ?"

"అదే నిర్గుణ పరబ్రహ్మం. అది నువ్వే. నీకిప్పుడు నేను దీక్షగా ఇచ్చే మంత్రం అతి పవిత్రమైంది, అతి శక్తివంతమైంది. అజ్ఞానాన్ని ఖడ్గంలా ఛేదించి, అగ్నిలా దహించివేస్తుంది" ఒక్కోమాట ఎంతో మెల్లిగా మంద్రస్థాయిలో చెప్పసాగాడాయన.

"ఓం నమశ్శివాయ."

"ఓం నమశ్శివాయ" బయటికి ఉచ్చరించాడు మునిరత్నం దాన్ని అలాగే.

"ఇంతదాకా నువ్వు ఈ మంత్రాన్ని ఎన్నివేలసార్లు స్మరించినా లాభించలేదు, ఇకనించి ఒక్క స్మరణతోనే లాభిస్తుంది. మంత్రోపదేశం ఆత్మసాక్షాత్కారం పొందిన గురువు నించి ఉపదేశమైతేకాని దానికి విలువ వుండదు."

'తనీ మంత్రం స్మరిస్తున్నట్లు ఈయనకెలా తెలుసు?' అనుకున్నాడు మునిరత్నం.

"ఎలా తెలుసంటే, నీలోనూ, సర్వత్రా అన్ని జీవరాసుల్లోనూ వున్నది నేనే కనుక. ఇప్పుడు నేచెప్పేది శ్రద్ధగా విని ఆచరిస్తే తత్త్వమసి

(అది నువ్వే అయి వున్నావు) అన్న మాటలకి అర్థం, అనుభూతి పరంగా అహంబ్రహ్మాస్మి (నేనే పరబ్రహ్మన్ని) అని తెలుసుకుంటావు"

కళ్ళు మూసుకుని వున్న మునిరత్నం ఆయన ఎంతో మెల్లిగా చెప్పే ఆ మాటలని శ్రద్ధగా వినసాగాడు.

"కోపం జయించడానికి ఓర్పు, ఆశని జయించడానికి తృప్తి, అహాన్ని జయించడానికి సేవ ఆచరించు, ఇవి ఆధ్యాత్మికమార్గంలో ప్రగతికి సోపానాలు కాబట్టి వీటిని విడవకుండా అభ్యాసం చెయ్యి. ప్రపంచం అంటే అశాశ్వతం అనర్థం. 'జ' అంటే జనించేది 'గత్' అంటే వెళ్ళిపోయేది. జగత్ అంటే పుట్టి చనిపోయేదని దానర్థం. అలాంటి ఈ జగత్ దుఃఖవంతంగా కనిపించడానికి కారణం, నరుడ్ని జన్మపరంపరలోకి నెట్టేది, అహంతో కూడిన రాగద్వేషాలే. సాధకుడు ఆచరించాల్సిందంతా ఒక్కవాక్యంలో చెప్పచ్చు. 'పరోపకారాః పుణ్యాయ. పాపాయ పరపీడనం'

నీ శరీరంతోనే నీ శరీరంలోని ఆత్మారాముడ్ని వెదుకు. మానవ జన్మ లభించేది ఎన్నో జన్మల అనంతరం. దీన్ని శ్రద్ధగా సంరక్షించుకోలేక పోయినా, ఈ లక్ష్యసాధన పూర్తవకపోయినా మళ్ళీ పుట్టాల్సివస్తుంది జాగ్రత్త.

ఓంకారం పలికే విధానం.... 'ఓ' నాలుగువంతులు, 'మ్' రెండు వంతులు పలకడమే సరయిన ఓంకారం."

ఆయన చెప్పడం ఆపడంతో మునిరత్నం కళ్ళు తెరచి ఆయన వంక చూశాడు. ఆయన తన వంకే ఎంతో ప్రసన్నంగా, ఎంతో కరుణతో చూస్తుండటం గమనించాడు. వాత్సల్యం కుమ్మరిస్తున్నాయా అన్నట్లుగా వున్నాయా చూపులు. ఇంతకాలం తను గురువు కోసం పడ్డ తపనని అర్థం చేసుకుని, అనుగ్రహించడానికి వచ్చిన పుణ్యాత్ముడిలా కనిపించాడు మునిరత్నానికాయన.

ఆయన చూపుతో మునిరత్నం చూపు కలుసుకోగానే కొద్దిక్షణాలు మునిరత్నానికి ఏదో మగత కమ్మినట్లయింది. తన చూపుని ఆయన చూపు లోంచి మరల్చుకుందామన్నా అది సాధ్యం కాలేదు. ఆయన కళ్ళలోంచి తన కళ్ళల్లోకి చల్లటి ఏదో అదృశ్యశక్తి సోకిన భావన కలిగింది. తల

తిప్పుకుందామన్నా, చూపు మరల్చుకుందామన్నా, కనురెప్పలు వేద్దామన్నా ఏమీ చేయలేని ఆ స్థితి అలా కొంతకాలం సాగాక మునిరత్నంకి స్పృహ తప్పింది.

* * * *

తిరిగి అతనికి స్పృహ వచ్చేసరికి సాయంసంధ్యా సమయం అవు తోంది అని గ్రహించాడు. ఉదయం నుంచి సాయంత్రం దాకా తను ఇలా ఎలా మొద్దునిద్రపోయాడు అనిపించింది. ఆ కమండలం స్వామి చూపుతో తననేం చేసాడు?

ఏదో తెలీని, అంతదాకా ఎన్నడూ అనుభవంలోకి రాని అద్వితీయ ప్రశాంతత, తద్వారా అనిర్వచనీయమైన ఆనందంతో తన మనసు నిండి వుంది అని కూడా గ్రహించాడు. లేచి నాలుగడుగులు వేస్తే, తాగినవాడి లాగా ఎంతో మత్తుగా అనిపించి, ఎన్నడూ లేనిది తూలుతూపడ్డాయి అడుగులు.

ఆ కమండలం స్వామిమీద గురుభావం పెల్లుబుకసాగింది. వెంటనే తండా దగ్గరకి నడిచివెళ్ళాడు. కనబడ్డ ఒకర్ని అడిగాడు.

"కమండలస్వామి ఏరి?"

"వెళ్ళిపోయారు."

"ఎక్కడికి?"

"ఎవరికి తెలుసు?"

"ఎప్పుడొస్తారు మళ్ళీ?"

"ఎవరికి తెలుసు?"

"అంత త్వరగా వెళ్ళిపోయారేం?"

"వచ్చిన పని అయిందని వెళ్ళిపోయారు. ఆయన ఎప్పుడొచ్చినా ఎక్కువసేపు వుండరు."

"ఆయన్ని ఇంకోసారి చూడాలి నేను."

"వస్తే పిలుస్తాలే."

తన బాబాయ్ మందిరంలోని ఆధ్యాత్మిక గ్రంధాలు అనేకం చదవడం వల్ల మునిరత్నంకి చూచాయగా అర్థమైంది, మంత్రోపదేశం తర్వాత

ఆయన తనకి చూపు ద్వారా 'శక్తిపాతం' ఇచ్చారని. ఊర్ధ్వరేతస్కులైన వారే శక్తిపాతం ఇవ్వగల సమర్థులు అని కూడా చదివాడు.

ఛ! తను ఎన్నో నెలలుగా తపనపడుతున్న గురువు దర్శనం తనకి లభించినా, అది అతికొద్దిసేపే. ఆయన పాదపూజ చేసుకోలేదు. ఆయన ఉచ్ఛిష్టం తినలేదు.

"గురుదేవా, మళ్ళీ దర్శనం ఇవ్వండి" దీనంగా పిలిచాడు. అతని చెంపలు తడయ్యాయి.

* * * *

మునిరత్నం ఆ రాత్రి భోజనం చెయ్యలేదు. మర్నాడు తెల్లవారు ఝామున మెలకువ వచ్చింది. ఒళ్ళంతా నొప్పులు. శరీరం అంతా సూదులు గుచ్చుతున్న భావన. క్రితం రాత్రి నిద్ర వచ్చేదాకా అనుభవించిన తన్మయత్వం, ఆనందం, పారవశ్యం పూర్తిగా మాయమయ్యాయి. మనసంతా అశాంతిగా మారింది. శరీరమంతా బాధ. తల వేడెక్కినట్లుగా వుంది.

ఎన్నడూ లేనిది బారెడు పొద్దెక్కితే కాని లేవబుద్ధి కాలేదు. లేచి బద్ధకంగా మళ్ళీ పడుకుని మళ్ళీ లేచి, అలా సాయంత్రందాకా గడిపేసాడు. మనసంతా స్తబ్దత, ఏదీ చేయబుద్ధి కాని స్తబ్దత ఆకలిలేదు.

రోజుకొక్కసారైనా వచ్చే హనుమప్ప కూడా రాలేదారోజు. పొద్దు కుంగుతూండగా లేచి బావిలో నీరు కడుపునిండా తాగొచ్చి పడుకున్నాడు. ఆ రాత్రి నిద్రలో చాలాడు. స్వప్నాలు కలిగాయి. మాటిమాటికీ నిద్రలోంచి భయంతో లేచి కూర్చుని, చుట్టూ చూసాక అది పీడకలే అని తెలిసి స్థిమితపడి మళ్ళీ పడుకోసాగాడు.

లేచి కూర్చుని చెడు కల వచ్చినప్పుడు చదవాల్సిన శ్లోకం చదువు కుని పడుకోసాగాడు.

బ్రహ్మాణం శంకరం విష్ణుం
యమం రామందనుం బలిమ్
సప్తైతాన్ సంస్మరేన్నిత్యం
దుః స్వప్నం తస్య నశ్యతి

మరో కల- ఎదురుగా బారెడు పాము. నల్లటి కృష్ణ సర్పం.

కూర్చుని ధ్యానం చేసుకుంటున్న తనకి అదెలా కనిపిస్తోంది? కళ్ళు తెరచి చూసినా, మూసుకుని వున్నా చరచర పాకుతూ వస్తున్న అదే సర్పం కనిపిస్తోంది.

తన దగ్గరకి వచ్చి చటుక్కున కుడిచేతి మధ్య వేలి మొదట్లో కాటేసి వెళ్ళిపోయింది.

"అబ్బా!"

మెలకువ వచ్చి చటుక్కున లేచి కూర్చున్నాడు. అది కలే అని తెలిసాక మునిరత్నం గుండె కొట్టుకునే వేగం తగ్గింది. ఆ తర్వాత ఇక నిద్రపట్టలేదు. నిన్నటి ఒళ్ళు నొప్పులు లేవిప్పుడు. ఉత్సాహంగా వుంది. సూర్యుడు ఉదయిస్తున్న గుర్తుగా పక్షుల అరుపులు వినిపిస్తున్నాయి. కొద్ది సేపట్లో అరుణకాంతి తెల్లటి వెలుగుగా మారింది.

మునిరత్నం లేచి దిగుడుబావిలోకి వెళ్ళి ముఖ ప్రక్షాళనం చేసుకుని నీరు తాగాడు. ఎన్నడూ లేనిది దిగుడుబావిలో ఓ మూల చిన్న పాము కనిపించింది.

పరిశీలనగా చూసాడు దాన్ని. అది స్వచ్ఛమైన నాగు. దాని పడగ మీద కృష్ణ పాదాలు కనిపించాయి.

వెంటనే పాము కనిపించినప్పుడు స్మరించాల్సిన శ్లోకాన్ని, దానికి నమస్కరించి మనసులో చదువుకున్నాడు.

నమస్తే దేవదేవేశ
నమస్తే ధరణీధర
నమస్తే సర్వ నాగేంద్ర
ఆదిశేష నమోస్తుతే...

తొమ్మిదిసార్లు లింగాభిషేకం చేశాడు. కరకర ఆకలేస్తోంది. నేలకి అందేలా వాలిన జామచెట్టి కొమ్మలవించి పండిన జామపళ్ళు కోసుకు తిన్నాడు. తర్వాత కళ్ళు మూసుకుని ధ్యానానికి కూర్చున్నాడు.

చిత్రంగా ఇదివరకటిలా స్థిరంగా పద్మాసనంలో కూర్చోలేక పోయాడు. చేతులు, కాళ్ళల్లో క్రియలు మొదలయ్యాయి.

అంతదాకా తన ఆధీనంలో వుండి, తను శాసించిన రీతిలోనే పని చేసే కాళ్ళు, చేతులు, తన మెదడునుంచి, తనిచ్చే ఆజ్ఞలు అందుకోకుండానే కదలడం ఎంతో ఆశ్చర్యంతో గమనించాడు.

శరీరం నేలమీద వెల్లకితలా వాలిపోయింది. అరచేతులు వెనక్కి వెళ్ళి భూమిమీద ఆనాయి. శరీరం మొత్తం కాళ్ళు, చేతులమీద గాల్లోకి లేచింది. మెడ బాగా వెనక్కి వాలింది. కాళ్ళు భూమిని తొక్కిపెట్టాయి. అలా అర్ధచంద్రాకారంలో వుండిపోయాడు మునిరత్నం. అతనికి భయం వేయలేదు కాని జరిగేదానికి ఎంతో విచిత్రంగా అన్పించింది. ఎందుకిలా అవుతోంది? శక్తిపాత మహత్యమా?

గురువు శిష్యుడి శరీరంలోకి ప్రవేశపెట్టే శక్తివల్ల అతని పూర్వ కర్మలు కొన్ని దగ్ధం అయి, ధ్యానంలో ముందుకి వెళ్ళి, ప్రగతిని సాధించ దానికి శక్తిపాతం పనిచేస్తుంది అని చదివాడు. ఇది అందులో భాగమేనా? పది నిముషాలయ్యాక మామూలుగా కూర్చుందామన్న ప్రయత్నంతో కాళ్ళు, చేతులు కదల్చాలనుకున్నాడు కాని అవి అతని ఆధీనంలో లేవని గుర్తించాడు.

దాదాపు అరగంట తర్వాత ఆ ఆసనంనుంచి విడుదల లభించింది. శ్వాసలో మార్పు కలిగింది శ్వాస దీర్ఘంగా సాగుతోంది. దాంతో పొట్ట ఉబ్బుతోంది. మళ్ళీ శ్వాసని గట్టిగా వదులుతాడు. ఒక్కోసారి లోపలకి పోయిన శ్వాస కాసేపు అక్కడే నిలచిపోతోంది. దాంతో చచ్చిపోతానేమో ననే భయం కలిగిందతనికి.

మధ్యాహ్నందాకా మునిరత్నానికి అనేక క్రియలు జరిగాయి. తల దిమ్ముగా వుంది. ఒళ్ళంతా వేడెక్కిన భావన. శ్వాస లోపలికి వెళితే ఓ పట్టాన బయటకి రాదు. బయటకి వచ్చిన శ్వాస మళ్ళీ లోపలికి పోదు. నోరు తెరచి గట్టిగా అరవాలనిపించింది. అరవసాగాడు. అంతూ పొంతూ లేని ఆ అరుపు అలా చాలాసేపు సాగుతూనే వుంది. తన అరుపుకి, తన ప్రమేయం లేకుండా, తనే సాక్షిగా వుండిపోయాడు మునిరత్నం.

తనకారోజు చావు తప్పదనిపించింది మునిరత్నంకి. తన స్థితికి ఎంతో భయం వేసింది. తనకి ఏం జరుగుతోంది? ఎందువల్ల ఇలా జరుగు

తోంది? కొంపతీసి కమండలస్వామి ఇంకో కపట గురువు కాదు కదా మాంత్రికుడా? తనమీద ఏదైనా మంత్రం ప్రయోగించి వెళ్ళాడా? తను ఒప్పుకోస్తే తన ఆత్మని అతని అదుపులో పెట్టుకుని ఎవరిమీదైనా ప్రయోగించడానికా? మతిభ్రమణ కలగలేదు కదా తనకి? ఇంటికి వెళ్ళిపోవాలనిపించింది. పద్మాసనంలోంచి లేద్దామన్నా కాళ్ళు విడివడలేదు.

సూర్యాస్తమయ సమయానికి శ్వాస కాస్త కుదుటపడింది. లేవగలిగాడు.

హనుమప్ప పొగడచెట్టుకి కట్టిన ఉయ్యాలమీద కూర్చున్నాడు. మనసు ఉత్సాహంగా లేదు. ఏ వస్తువుమీదా దృష్టి లగ్నంకావడంలేదు. అశాంతిగా వుంది. విపరీతమైన దాహం. లేచి మంచినీళ్ళు తాగివచ్చాడు. ఒళ్ళంతా పొగలు సెగలు కక్కుతున్నట్లుగా వేడి. పొట్టలోపల ఏదో భగభగ మండుతున్న అనుభూతి. నాభి దగ్గర చేతినుంచుకుని చూస్తే, స్పర్శ తెలియని వేడి అది. ఇదంతా మానసిక చాంచల్యమనే భయం కూడా మునిరత్నానికి వేయసాగింది.

కమండలం స్వామి రూపం గుర్తుతెచ్చుకున్నాడు. ఆయన క్షుద్ర మాంత్రికుడు అని నమ్మబుద్ధి కావేడు. ఆయన కళ్ళల్లోని ప్రశాంతత, వదనంలో స్ఫుటంగా కనిపించే వర్చస్సు ఇదివరకు ఒక్క కంచి పరమాచార్య వారి దగ్గరే చూసాడు.

శివపంచాక్షరి మంత్రం స్మరణ మాత్రం వదల్లేదు మునిరత్నం.

'త్రాయతే సర్వభయతః తస్మాన్మంత్ర ఇతీరత'

అన్నట్లు అన్ని భయాలనించి తనని రక్షించేది మంత్రమే. అందులో బలోపేతమైన శివపంచాక్షరి మనసులో మననమవుతూండగా దేనికి భయం అనుకున్నాడు. ఎవరో తడిబట్టని పిండినట్లుగా నరాలన్నింటినీ పిండుతున్న భావన. శరీరం లోపలంతా పచ్చిపుండులా అన్పించసాగింది.

కాసేపు కూర్చుంటాడు. లేవాలన్పిస్తుంది. లేచాక కాసేపటికి నడవాలనిపిస్తుంది. నడిచాక నడుం వాల్చాలనిపిస్తుంది. పడుకున్నాక మళ్ళీ లేవాలనిపిస్తుంది. కూర్చున్నాక మళ్ళీ లేవాలనిపిస్తుంది.

ఆ రాత్రి పడుకోబోయేముందు మునిరత్నం శివాలయంలోకి వెళ్ళి ప్రార్థించాడు.

"స్వామీ! ఈ దేహం రాలిపోతే పోనీ. కాని లక్ష్యం నెరవేరేదాకా దీన్ని కాపాడాల్సిన బాధ్యత నీదే."

పడుకోబోయేముందు 'నృశింహ కవచం వక్షే్ప్రహ్లాదేవో....' అని తనకి రక్షణగా 'నృసింహ కవచం' చదువుకున్నాడు. ఎప్పుడూ లేనిది పడుకోబోయే ముందు చదవాల్సిన మంత్రం కూడా చదువుకున్నాడు.

రామం స్కందం హనుమంతం
వైనతేయం వృకోదరం
శయనే యః స్మరేన్నిత్యం
దుఃస్వప్నం తస్య నశ్యతి

మునిరత్నం ఎంతో ప్రశాంతంగా నిద్రపోయాడు.

15

మునిరత్నంకి మర్నాడు బ్రహ్మముహూర్తకాలంలో మెలకువ వచ్చింది. ప్రాతఃస్మరణ శ్లోకాలని చదువుకుని లేచాడు. అతనికెంతో ఉత్సాహంగా వుంది. ముందు ముఖప్రక్షాళనం చేసుకుని బ్రహ్మేశ్వరలింగానికి అభిషేకం చేసి తర్వాత ధ్యానానికి కూర్చున్నాడు. మనస్సులో 'ఓం నమః శివాయ' మంత్రం జపించసాగారు.

వెనక వెన్నుపాము కిందనించి ఓ అదృశ్య విద్యుల్లత పైకి వేగంగా పాకిన భావన. మెడ అటు–ఇటు తన ప్రమేయం లేకుండా అతివేగంగా కదలసాగింది. ఆ సమయంలో ఉయ్యాలలోంచి కిందకి కళ్ళు మూసుకుని దిగుతూంటే కలిగేలాంటి అనుభూతి కలిగింది. మునిరత్నానికెంతో భయంతో కూడిన ఆశ్చర్యమేసిందా కదలికకి. తను కావాలని మెడని అలా కదిపితే అది బెణకడం తప్పదు.

అకస్మాత్తుగా మెడ కదలడం ఆగి, నడుంనించి శరీరం పైభాగం పాములా అటు-ఇటు కదలసాగింది. మునిరత్నానికి అర్థమైంది. ధ్యాన

సమయంలో మాత్రం శరీరం తన ఆధీనంలో వుండకుండా ఏదో అదృశ్య శక్తి చెప్పినట్లుగా ప్రవర్తిస్తుందని. అయితే అందువల్ల అతనికేమాత్రం బాధ కలగలేదు. భయపడుతూనే వాటికి సాక్షిగా వుంటూ చూడసాగాడు.

ఆ రోజంతా అతని నోట్లోంచి గాలి బయటకి రాసాగింది. పీల్చిన గాలి ముక్కులోంచి కాకుండా బయటకి నోట్లోంచి 'బుస్' అన్న పాము బుస శబ్దంతో రాసాగింది. ఆ శబ్దానికి చుట్టుపక్కల పాములు, తన శత్రువుగా ఎంచి తనమీదకి దాడి చేస్తాయేమోనన్న భయం కలిగి తరచు కళ్ళు తెరచి చుట్టూ పాములేమైనా వున్నాయేమోనని చూసుకోసాగాడు. ఉరదుండి వెల్లకిలా పడుకుని కాళ్ల వెనక్కి వెళ్ళి తలకి అటు–ఇటు నేల మీద వాలి ఒకదాని తర్వాత మరొకటి నేలమీద కొట్టుకోసాగాయి. అలా కొద్దిసేపు జరిగాక తిరిగిలేచి కూర్చుంటాడు. తనకి తెలీకుండానే కాళ్ల పద్మాసనంలోకి వేసుకుంటాడు.

ఈ రకం క్రియలు దాదాపు వారం రోజులు సాగాక నోట్లోంచి గాలి రావడం ఆగిపోయింది. అతనికి పేరు తెలీని ఆ హలాసనం కూడా రావడం ఆగిపోయింది.

ఆ తర్వాత ఊర్ధ్వ పద్మాసనం వచ్చింది. శీర్షాసనం వేసి నెత్తిని నేలకి ఆగించి, గాల్లో పద్మాసనం వేసుకున్నాయి. పడిపోకుండా చేతులు తలకి ఇరుపక్కలా బేలన్స్ చేశాయి. మరో పది రోజుల్లో అతనికి పశ్చిమోత్తానసనం వచ్చింది. కాళ్ళని నేలమీద నిటారుగా సాచి, తలను, నడుం పైభాగాన్ని కాళ్ళమీదకి వంచి, రెండు చేతులతో రెండు కాళ్ళ వేళ్ళను పట్టుకున్నాక, తలని తొడలమీద నిలిచేట్లుగా వంచడం ఆ ఆసనం. యోగంలో సుషుమ్న నాడినించి కుండలినీశక్తి ప్రసారం కావడానికి ఇది తోడ్పడుతుంది.

ఆ తర్వాత మయూరాసనం వచ్చింది. బోర్లా పడుకుని శరీరాన్ని మొత్తం గాల్లో లేపి కేవలం రెండు అరచేతులమీద మొత్తం శరీరాన్ని బేలన్స్ చేస్తూ తలని పైకెత్తడం ఈ ఆసనం లక్షణం. పదిహేను క్షణాల నించి ఇరవై క్షణాలదాకా ప్రతీ ఆసనంలో శ్వాస బంధింపబడుతోందని గ్రహించాడు మునిరత్నం.

ఆ తర్వాత పాదహస్తాసనం వచ్చింది. కాళ్ళమీద నిలబడి నడుం దగ్గ వంచి, మోకాళ్ళు మాత్రం ఏ మాత్రం వంచకుండా, అరచేతులకి కాళ్ళకెదురుగా నేలమీద ఆనించి వుంచడం. రెండు చేతులతో రకరకాల హస్తముద్రలు అధికంగా రాసాగాయి.

చాలా తరచు తల కిందకివాలి, గడ్డం, మెడకింద ఛాతీకి ఆనుకోసాగింది. శ్వాస బంధింపబడి తిరిగి కొనసాగింది. నాలిక పైకిలేచి, దాని కొన తరచూ అంగిటకి ఆనుకుని అలాగే వుండసాగింది.

తనకీ ఆసనాలు ఎందుకు వస్తున్నాయి? వాటి ప్రత్యేకతలేమిటి? తెలుసుకోవాలన్న ఆసక్తి మొదలైంది. కాని 'ఈ అడవిలో చెప్పేవాడెవరు?' అనుకున్నాడు. వారం రోజులపాటు పిల్లిలా 'మ్యావ్ మ్యావ్' అన్న అరుపు వచ్చింది.

మునిరత్నం భోజనం, కాలకృత్యాలు, నిద్ర సమాయాల్లోతప్ప. రోజుకి పదహారు గంటలదాకా మిగిలిన సమయాన్నంతా ధ్యానంలోనే గడుపుతున్నాడు. రోజులు గడిచేకొద్దీ అతను ధ్యాన సమయంలో ఓ విధమైన హాయిని అనుభవించసాగాడు. ధ్యానంలోంచి లేవబుద్ధి కావడంలేదు.

ఓ రోజు అతని శరీరం నేలమీద బోర్లా పడుకుని వంకరలు తిరుగుతూ పాములా ముందుకి పాకింది. అతనికి తను పామునేమోనన్న చిత్తభ్రమ క్షణకాలం కలిగి భయం వేసింది.

ఓ రోజు రెండు అరచేతులు నేలమీద నొక్కిపట్టి పద్మాసనంలో ఉన్న శరీరాన్ని మొత్తం చేతులమీద పైకిలేపి, ఆ చేతులమీద ముందుకి వెనక్కి వడివడిగా నడిచాడు. అలా నాలుగైదురోజులు సాగాక, ఓరోజు పద్మాసనంలోకూర్చున్న మునిరత్నం శరీరంలోని ఏదో శక్తి అతన్ని గాల్లోకి లేపి కప్పగంతులు వేయించింది. భయంతో 'గురుదేవా' అని అరిచాడు మునిరత్నం.

•

అయినా తరచు కప్పగంతుల అనుభవం వస్తూనే వుంది.

హనుమంతప్ప, అతని చెల్లెలు వచ్చి జరిగేది చూసి తన తండాలోని వాళ్ళకి చెప్పారు. వాళ్ళు అప్పుడప్పుడూ వచ్చి దూరంగా నిలబడి

మునిరత్నం ధ్యానంలో వుండగా జరిగే క్రియలని వినోదంగా చూస్తుండే వారు. వాళ్ళ మాటలు అతనికి వినబడగానే వెళ్ళిపొమ్మని అరిచేవాడు.

క్రమేపీ మునిరత్నంకి ధ్యానంలో ఏదో తెలియని మత్తు, హాయి అనుభవం కాసాగాయి. మధ్యాహ్నం భోజనానంతరం కూర్చోగానే 'అప్పుడే పొద్దు గుంకిందా?' అనిపించసాగింది. ధ్యానంలో తరచూ తనకి తెలీకుండానే కాలం వేగంగా పరిగెత్తేది. అంతదాకా ఏ భౌతిక పదార్థం ఇవ్వలేని ఓ విధమైన మత్తు, హాయి ప్రశాంతత ధ్యానంలో ఏర్పడి, అది ధ్యానానంతరం కూడా చాలాసేపు అతని మనసుని అంటిపెట్టుకుని వుండేది. అంతేకాదు. ధ్యానం సమయంలో 'ఇంక ఆపుదాం' అనుకున్నా, 'ఇంకో అయిదు నిముషాల తర్వాత ఆపుతాను' అనుకుంటూ రాత్రి నిద్రలోకి జారిపోయేదాకా ధ్యానం కొనసాగిస్తూండేవాడు తప్ప అది ఆపాలనిపించేది కాదు. అందువల్ల ధ్యానంమీద మునిరత్నానికి ప్రత్యేక ఆకర్షణ కూడా ఏర్పడింది.

మధ్యలో రెండుసార్లు మునిరత్నానికి అనారోగ్యం కలిగింది. బాగా విరోచనాలై, ఆకలి మందగించింది. మరోసారి కడుపులో ఏం లేకపోయినా వాంతులవుతున్నట్లుగా లోపలినించి శ్లేషం బాగా బయటకి వచ్చింది. ఆ తర్వాత కూడా అప్పుడప్పుడు అదేవిధంగా జరగసాగింది.

దాదాపు నెలరోజులకి ధ్యానంలో వుండగా మునిరత్నం నోట్లోంచి పెద్ద అరుపు మొదలైంది. అది పులి గాండ్రింపు శబ్దాన్ని పోలివుందని గ్రహించాడు. దాదాపు అరగంటపైగా పులి గాండ్రింపు తన నోట్లోంచి వెలువడుతూండటం వింతగా, భయంగా గమనించాడు. చుట్టుపక్కల చెట్ల మీది కోతులు భయంతో కిచకిచలాడటం, అడవిలోని జంతువులు పారిపోవడం గమనించాడు. గూడెంలోని వాళ్ళు నిజంగా పులి వచ్చిందనుకుని ఆయుధాలతో పరిగెత్తుకొచ్చారు. అది మునిరత్నం అరుపని గ్రహించి ఆశ్చర్యపోయారు.

"ఎందుకలా అరుస్తున్నావు?"

వాళ్ళ ప్రశ్నకి మునిరత్నంకి జవాబు తెలీదు.

"ఎంత భయపెట్టావు? ఇలా అరిచేట్లయితే ఇక్కడినించి ఇంకోచోటికి వెళ్ళిపో" కోపంగా చెప్పారు వాళ్ళు.

'ఏమిటి గురుదేవా?' అని మనసులో బాధగా అనుకున్నాడు. అతనికెంతో చిన్నతనం వేసింది. కాని ధ్యానంలో కూర్చున్న కొద్దిసేపటికే మళ్ళీ అదే పులి గాండ్రింపు. దాంతో ధ్యానం ఆపేస్తాడు. ఆ రోజంతా ఎంతో చింతగా ఉండతనికి. చీకటి పడుతూండగా హనుమంతప్ప వచ్చి చెప్పాడు.

"తాతాజీ నిన్ను పిలుచుకు రమ్మంటున్నాడు."

"తాతాజీ ఎవరు?" ప్రశ్నించాడు.

"రోజూ తంబూరా వాయిస్తాడే, ఆయన."

"ఆయన్నే ఇక్కడికి రమ్మను."

"నువ్విలా అంటావని తెలుసట. పెద్దవాడ్ని. నేను నడవలేను. నిన్నే రమ్మన్నానని చెప్పమన్నాడు. నీకు ధ్యానం గురించి బోధిస్తాడట."

'ధ్యానం గురించి బోధ' అన్నమాట మునిరత్నంమీద బాగా పని చేసాయి. లేచి గూడెంలోకి వెళ్ళాడు. ఓ గుడిసెలోకి దారి తీసాడు హనుమంతప్ప.

ఆ చిన్న గుడిసెలో ఓ జింక చర్మంమీద కూర్చుని తంబూరా వాయిస్తున్న ఓ ముసలాయన కనిపించాడు. జడలు కట్టిన జుట్టు, తెల్లటి పొడుగాటి గడ్డం. వజ్రాసనంలో (మోకాళ్ళమీద) కూర్చుని వున్న ఆయన మొహంలో ఎంతో ప్రశాంతత. బాగా వృద్ధుడు.

"దా కూర్చో!" సాదరంగా ఆహ్వానించాడాయన.

ఆయన ఎదురుగా వున్న మరో జింక చర్మంమీద వినయంగా కూర్చున్నాడు మునిరత్నం.

"మీకు ధ్యానం గురించి ఏం తెలుసు....?" ప్రశ్నించాడు మునిరత్నం.

ఆయన బదులు చెప్పకుండా ఓ రామభజన పాటందుకున్నాడు. మునిరత్నం ఆయనవంక చిరాగ్గా చూస్తే చెప్పాడాయన.

"నువ్వు కూడా గొంతు కలుపు."

మునిరత్నం ఆయన పాడాక, ఆ బాణిలో తిరిగి పాడసాగాడు.

రామా రామా రఘురామా! పావన సీతా మానస రామా!
కౌసల్యా హృదయాం బుధిసోమా! భీకర రాక్షస బృందవి
సవనవ కోమల మేఘశ్యామా! పరశివ సన్నుత పావన నామ
ఖండనరంగ పరాక్రమ భీమా! దండకముని జనక మనోభిరా

ఇద్దరూ అది కాస్సేపు పాడాక చెప్పాడాయన.

"నిత్యం ధ్యాన సమయంలో నీకు కలిగే అనేకమైన ఆలోచన సతమతమౌతున్నావు కదూ? ఇదెందుకిలా వస్తోంది? అదెందుకలా తోంది? అన్న ఆలోచన నిన్ను బాధిస్తున్నాయి. సరే విను. నువ్వు కైవల్య పదాన్ని సిద్ధమార్గంలోపొందే ప్రయత్నంచేస్తున్నావు. సిద్ధ గురు శిష్యుడైన నీలో ప్రవేశించింది ఓ విత్తనంలో అందులోంచి మొల వృక్షం శక్తి అంతా ఎలా విక్షిప్తమై వుంటుందో, అలా తన శ గురువు శిష్యుడిలో బీజరూపంలో ప్రవేశపెట్టడం సిద్ధమార్గం. ఆ కుండలిని మేల్కొలిపి అనేకరకాల యోగసాధనలని శిష్యుడి శరీరం చేయిస్తుంది. గురుముఖంగా లభించిన మంత్రాన్ని జపించినప్పుడు గురు ఆ మంత్ర రూపంలో వుండి శిష్యుడ్ని క్రియాశీలుడ్ని చేస్తాడు."

ఆయన చెప్పేది ఆశ్చర్యంగా వింటున్నాడు మునిరత్నం. ఓ చెం వృద్ధుడికి ఇవన్నీ ఎలా తెలుసా అన్న విస్మయం కలిగిందతనిలో.

"నీలో ప్రవేశించిన గురుశక్తి పరమాద్భుతమైనది. నీకు మంత్ర దీక్ష ఇచ్చింది సదానంద బాబా. కానీ నీలో ప్రవేశించిన శక్తి వారి సద్గు మైన నిత్యానంద బాబాది."

"నిత్యానంద బాబా? ఆయన ఎక్కడ వుంటారు?"

"భౌతికంగా అయితే మహారాష్ట్రలో గణేష్‌పురి అనేచోట."

"ఆయన ఆత్మ సాక్షాత్కారం పొందిన గురులేనా?"

"నీకా అనుమానం వద్దు. ఆయనద్వారా ఎందరో ఆత్మసాక్షాత్కారం పొందారు. స్వామి ముక్తానంద, స్వామి సదానంద, స్వామి రేబాడి రా ఇంకా ఎందరెందరో."

"నిత్యానందబాబా గురించి నేను ఎక్కడా వినలేదు, చదవలేదు. ఆయన గురించి తెలిసింది చెప్పండి" ఆసక్తిగా అడిగాడు మునిరత్నం.

"ఆయన అసలుపేరు రామన్. కేరళలో శివభక్తులైన పిల్లలులేని దంపతులకి ఆయన బాల్యంలో ఓ శివాలయంలో చాలా అద్భుతంగా లభ్య మయ్యారు. చిన్నప్పుడే హిమాలయాలకి వెళ్ళి తపస్సు చేసారు. కేరళలోనే సిద్ధయోగాన్ని పునఃప్రచారం చేసిన శ్రీ శివానందపరమహంస దగ్గర శిష్యరికంచేసి నిత్యానందబాబా ఆత్మసాక్షాత్కారం పొందారు. ఆ ధ్యాన పద్ధ తిని అనేకమందికి వారు నేర్పుతున్నారు. శక్తిపాతం ఇవ్వడం దానిలోని ప్రత్యేకత."

తాతాజీ చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు మునిరత్నం.

"శక్తిపాతం అంటే మనలోని కొన్ని దుష్కర్మలని రద్దుచేస్తూ, కుండలినిమాతని మేల్కొపటం.

"నిత్యానందబాబా గురించి రెండు మూడు సంగతులు చెప్తాను విను. ఓసారి ఆయన ఓ ట్రంకురోడ్డు మీదకెళ్ళే బస్సుని చెయ్యిచాపి ఆప మన్నట్లుగా కోరితే, గోచీలో వున్న వారినిచూసి టిక్కెట్టుకి డబ్బులేదని అనుమానించి ఆ డ్రయివర్ బస్సాపలేదు. కొద్దిదూరం వెళ్ళాక మళ్ళీ ఆ కౌపీనధారి రోడ్డు పక్కన కనపడి ఇందాకటిలా చెయ్యిచాపి బస్సుని ఆప మన్నట్లు సౌంజ్ఞ చేసాడు. డ్రయివర్ ఈయన ఇంకొకరనుకుని ఆపలేదు. అలా దారిలో నాలుగైదుసార్లు జరిగాక బస్సుకన్నా ఆయన ముందుగా ఎలా వెళుతున్నారన్న ఆశ్చర్యం కలిగింది ప్రయాణీకులకి. ఆయన సామాన్యుడు కాదని గ్రహించాక డ్రయివర్ బస్సాపి తన అపరాధం మన్నించమని ఆయన పాదాలమీదపడ్డాడు" అది విన్న మునిరత్నానికి తన గురువుమీద ఆసక్తి కలిగింది.

"ఇంకోటి....ఇలాగే ఒకసారి రైలు ఎక్కిన బాబాని ఓ ఇంగ్లీష్ టిక్కెట్ కలెక్టర్ టిక్కెట్ లేదని దింపేశాడు.

ఆయన ఓ కాలుని స్టేషన్‌లోని లైటు స్తంభానికి ఆనించి జరిగే వింత చూస్తూ నిలుచున్నాడు. చిత్రంగా రైలు ఇంజన్ కదలదే? మెకా నిక్‌లు వచ్చిచూస్తే ఇంజన్‌లో ఎలాంటి లోపం కనపడలేదు. కాని నడవదు. ఎవరో ఆ టిక్కెట్ కలెక్టర్‌కి చెప్పారు.

ఆయన రైల్లోంచి దింపిన ఆ వ్యక్తి సిద్ధపురుషుడై ఆయన్ని తిరిగి రైలెక్కించి చూడమని. ఇలాంటివి నమ్మని పాగి 'సరే చూద్దాం' అనుకుని బాబాని రైలు ఎక్కమని కోరాడు. బాబా రైలెక్కగానే అది ఈమారు సతాయించకుండా వెంటనే క

"ఆయన్ని నేను దర్శించాలంటే ఎలా?" ప్రశ్నించా రత్నం.

"ఆయన దయ వుంటే తప్ప నీకు ఆయన దర్శనభాగ్యం చదు. ఏ అవధూత విషయంలో అయినా ఇంతే."

మునిరత్నం మనసులోనే నిత్యానందబాబాకి నమస్కారం చే ఆయన్ని భౌతికంగా చూసే భాగ్యం కలిగించమని వేడుకున్నాడు.

"ధ్యానానికి కూర్చుంటే జరిగేవన్ని పిచ్చి పిచ్చివి కాదన్నమ ప్రశ్నించాడు మునిరత్నం.

"ధ్యానంలో నీకు కలిగే క్రియల గురించి గూడెంవాళ్ళు నాకు చెబుతున్నారు. అవేమీ అర్థంలేనివికావు. ఆ క్రియల రూపంలో నీలో చేసేది పరమ సద్గురువే. రకరకాల ఆసనాలు, ప్రాణాయామం, నృత్య ముద్రలు, అంగవిన్యాసాలు, అరుపులు....వీటన్నిటి కోసం సత్ఫలితా టాయి."

"ఎందుకివన్నీ వస్తాయి స్వామి?" ప్రశ్నించాడు మునిరత్న ఆయన చెప్పే వివరణమీద నమ్మకం కలిగిందతనికి.

"స్థూల శరీరం, సూక్ష్మశరీరాల్లో ఉన్న మాలిన్యాలని పోగొట్టడాని ఈ క్రియల్లో కొన్ని రాజయోగానికి, కొన్ని హఠయోగానికి, కొన్ని భక్తి యోగానికి, కొన్ని మంత్రయోగానికి సంబంధించినవి. ఇలా నాలుగు యోగాలు కలిసి శిష్యుడిచేత క్రియలు చేయించే దీన్ని సిద్ధియోగం అంటారు. ఇదే సిద్ధమార్గం. మిగిలిన ధ్యానమార్గాలు వేటిల్లో ఇన్ని రకాల క్రియలు జరగవు. మనిషి కళ్ళు మూసుకుని నిశ్చలంగా కూర్చుంటాడు. కాని సిద్ధ యోగంలో శరీరంలోని నాడులలో వుండే అన్ని రోగాలు, మాలిన్యాలు ముందుగా తొలగింపబడి శుభ్రపరచబడతాయి. అందుకు కొన్ని హఠయోగ

సంప్రాప్తిస్తాయి. ఆ విధంగా శరీరం రోగరహితం అయి, గట్టిగా అయ్యాక అసలైన ధ్యానంలోకి ప్రవేశిస్తాం. నీవు దానికి సాక్షిగా జరిగేది చూస్తుండు. ఆ క్రియలని కలిగించే నిత్యానంద మీద భక్తి కలిగి వుండు."

"మీకివన్నీ ఎలా తెలుసు స్వామి?"

బదులుగా ఆయన చాలాసేపు బిగ్గరగా నవ్వుతూండిపోయాడు. కాని ప్రశ్నకి సమధానం చెప్పలేదు.

"గురువుమీద భక్తి, శ్రద్ధ కలిగి వుండు. అప్పుడే గురుశక్తి పూర్ణవికాసం లభిస్తుంది. అదే ఆధ్యాత్మిక ఉన్నతికి సోపానం. ఈ శక్తి పరమశివుడికి భిన్నంకాదు. జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయ కారణం అదే."

"ఇందాక నాకు పులి అరుపులు ఎందుకు వచ్చాయి స్వామి?" ప్రశ్నిం డు మునిరత్నం.

"ఈ జన్మలో నువ్వు బ్రాహ్మడిగా పుట్టినా నీలో గతజన్మల్లో ఏర్ప డున్న మాంసం తినే సంస్కారం వుంది. సందర్భంరాక ఈ జన్మలో అది బయటపడలేదు. నిత్యానందబాబా ఆ సంస్కారాన్ని నీలోంచి పూర్తిగా బయటికి వెళ్ళగొట్టారు. ఆ అరుపులతో అది పోయింది."

"మరి పిల్లి అరుపులు?"

"మీ ఇంట్లో మీ అమ్మకి తెలీకుండా నువ్వు దొంగతనంగా పాలు, వెన్నలు తినేవాడివా?"

"అవును! మీగడ బ్రతకనిచ్చేవాడినికాదు. వెదికి తినేవాడ్ని" సిగ్గు పడుతూ చెప్పాడు మునిరత్నం.

"ఆ కర్మల సంస్కారంపోయింది. కొన్ని పోతున్నప్పుడు నీకు చెడు వాసనలు కూడా వచ్చి వుండాలే?"

"అవును స్వామి. మురిక్కాలువ కంపు, మాగుడు వాసన, అశుద్ధం వాసన, జుట్టు కాలిన వాసన, రసి వాసనల్లాంటివి చాలా వస్తున్నాయి."

"గురుకృపతో వెడలిపోతున్న చెడు కర్మల వాసనలవి. మన దగ్గర లేని పదార్థం వాసన ముక్కుకి ధ్యానంలో వస్తోందంటే ఒకటే గుర్తు. ఆ

వాసనా సంస్కారాలుపోతున్నాయని, నువ్వింకా మూలాధారంలోనే వున్నావని."

షట్ చక్రాల గురించి వివరించాడు తాతాజీ. సూక్ష్మ శరీరంలో వుండే ఆ షట్చక్రాలు, భౌతికశరీరంలో ఏ స్థానాల్లో వుంటాయో వివరించాడు.

"మనం అనాదిగా చేస్తున్న కర్మలు ఈ చక్రాల్లో వుంటాయి. వాటిని ఒకదాని తర్వాత మరొకటి శుద్ధి చేసుకుంటూ, కుండలిని చివరి చక్రం అయిన సహస్రారంలోకి చేరుకున్నాకే మోక్షం. ఒకో చక్రం శుద్ధి అవగానే ఒకో రకం సిద్ధులు లభిస్తాయి. వాటిని పట్టించుకోకుండా వుండేవే క్రమం. జాగ్రత్త! లేదా ఈ జన్మకి అక్కడే ఆగిపోతాం."

ఆ సిద్ధుల గురించి మునిరత్నం చదివి వున్నాడు.

"మనసు మోక్షంమీద ఉంచు. జాగ్రత్తగా ధ్యానం చేసుకో. ఏదైనా అనుమానాలొస్తే నన్ను అడుగు."

"నాకు మధ్యలో ఓ వారం బాగా జబ్బు చేసింది. విరోచనాలు అయి బాగా నీరసించిపోయాను. మరోసారి ధ్యానంలో వుండగా వాంతులయ్యాయి. అలాంటిది జరక్కుండా మందేదైనా ఉందా?" అడిగాడు మునిరత్నం.

"లేదు. అవి కూడా ధ్యానం ఫలితాలే. చెప్పాగా-శరీరశుద్ధి అయ్యేప్పుడు ఇలాంటివి మొదట్లో సిద్ధమార్గంలో సర్వసాధారణం. వాటిని పట్టించుకోకు. నీ మేలుకే అవి. ఒక్కోసారి భరించలేని తలపోటు కూడా వస్తుంటుంది."

మునిరత్నం తనకి వచ్చిన ఆసనాలని వర్ణిస్తే, వాటిపేర్లు, వాటివల్ల శరీరంలోని ఏ భాగం కండరాలు, నరాలకి స్వస్థత చేకూరుతుందో వివరించాడు తాతాజీ.

"స్వామీ! ఇదే నాకు ఆఖరిజన్మ అవుతుందా? ఈ జన్మలో గత జన్మల్లో కర్మలన్నీ ప్రక్షాళన చేసుకోగలనా?" ఆశగా అడిగాడు మునిరత్నం.

"అనుమానం దేనికి? మనిషి జన్మ లభించడం ఎంతో కష్టం. అది పొందాక ముక్తి పొందాలన్న కోరిక కలగడం ఇంకా కష్టం. అదీ వచ్చాక గురువు లభించడం అతి కష్టం. ఈ మూడూ దైవానుగ్రహం వల్లనే లభిస్తాయి. నీకా అనుగ్రహం వుందో లేదో నువ్వే చెప్పు. ఎక్కడో వున్న నిత్యానందబాబా నీ దగ్గరకి తన ప్రియశిష్యుడ్ని పంపి నీకు ఎందుకు ప్రోత్సాహం, మంత్రదీక్ష ఇచ్చినట్లు? వాటికోసం ఆయన్ని ఎంతమంది ప్రార్థించినా వాళ్ళకి ఇవ్వడంలేదు. గణేష్‌పురిలోని వారి ఆశ్రమానికి వెళ్తే నీకే తెలుస్తుందది. ప్రయత్నం మానకు. సందేహించకు. ఈ జన్మకి రాకపోతే ఇంకో జన్మకి లభిస్తుందది."

"మళ్ళీ ఇంకో జన్మా? మరోసారి తల్లి కడుపున పుట్టకూడదన్నది నా ధ్యేయం" చెప్పాడు మునిరత్నం.

"నీలో కుండలిని జాగృతం అయింది కాబట్టి నీ ప్రయత్నంతో అది సాధించవచ్చు."

"అయితే నాలో కుండలిని నిద్ర లేచిందన్నమాట."

"నీకు కలలో సర్పం కనిపించిందా?" వెంటనే ప్రశ్నించాడు తాతాజీ.

"కనిపించింది. ఈ వేలు కాటేసినట్లుగా కల వచ్చింది." కుడిచేతి బొటనవేలుని చూపించి చెప్పాడు.

తాతాజీ మెచ్చుకోలుగా చెప్పాడు.

"కుండలిని నిద్రలేచాక కలలో తప్పక సర్పం కనిపించడమే కాక, ఒకోసారి జాగృదావస్థలో కూడా కన్పిస్తుంది."

"నాకు దిగుడుబావిలో పాము కనిపించింది" చెప్పాడు మునిరత్నం.

"సర్పం కాటు వేయడం అనే కల రావడం ఆధ్యాత్మిక పురోభివృద్ధిని సూచిస్తుంది."

"కమ్మరి తిత్తి కొడుతున్న మోస్తరు నా ఉచ్ఛ్వాస నిశ్వాసలు వేగంగా సాగుతాయి. ఎందుకని?" అడిగాడు మునిరత్నం.

"ఆ సమయంలో గడ్డం కంఠకూపంలో ఆనుకుంటుందా?"

"అవును."

"అలా అనుకోవడాన్ని 'జలంధరబంధ'మంటారు. అలా గాలి పీల్చి వేగంగా వదలడాన్ని 'భస్త్రిక ప్రాణాయామం' అంటారు. దీనివల్ల

కడుపులోని అనేక రోగాలు నశిస్తాయి. కుండలిని మరో దండంలోంచి శిరస్సులోకి వెళ్ళే ప్రయత్నంలో భాగమే ఇవన్నీ."

"నా నాలిక ఉండుండి అంగిటకి తగులుకుంటోంది స్వామి. ఎందుకిలా?" ప్రశ్నించాడు మునిరత్నం.

"దాన్ని ఖేచరముద్ర" అంటారు. అది నీ పూర్వజన్మ సంస్కారం వల్ల, పూర్వజన్మలో నువ్వు తరచు ఖేచరముద్రని వేసేవాడివి. అంతే గాను నీ నాలిక కిందవున్న నరాన్ని నీ గురువు తెగ్గొసాడు కూడా. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునికి చెప్పాడు, 'తత్రతం బుద్ధి సంయోగం లభతే పౌర్వ దేహికమ్' అని. అంటే పూర్వ దేహాన సాధించిన యోగం వల్ల ముక్తిపొందని మనిషి తిరిగి తర్వాతి జన్మలో మునుపటికన్నా అధికంగా సాధనచేస్తాడని. నీ విషయంలో అదే జరుగుతోంది" వివరించాడు తాతాజీ.

"అంటే, నేనూహించింది నిజమేనన్నమాట. పూర్వజన్మలో నేను యోగంలో వున్నాననుకుంటున్నాను."

"నువ్వు గతజన్మలో కూడా గృహస్థ, వాన ప్రస్థాశ్రమాలు దశలు కుండా ఏకంగా బ్రహ్మచారిగానే సన్యసించావు. అవాసనాబలం చేత ఈ జన్మలో కూడా సన్యాసానికి తాపత్రయపడి ఓ అబద్ధంతో మీ అమ్మ అనుమతి పొందావు. అవునా?" నవ్వుతూ ప్రశ్నించాడు తాతాజీ.

"మీకీ రహస్యం ఎలా తెలుసు?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మునిరత్నం.

"కొద్దికాలానికి అంతా నీకే బోధపడుతుంది. అది దుష్కర్మ. నువ్వు ఆ దుష్కర్మని కూడా నీ ధ్యానంతో ఈ జన్మలోనే భస్మం చేసుకోవాలి."

తాతాజీ సామాన్యుడు కాడని, గొప్ప తత్త్వవేత్త అని గ్రహించాడు మునిరత్నం.

"స్వామీ! మీరు ఆత్మ సాక్షాత్కారం పొందిన వారు కదా?" ప్రశ్నించాడు.

"అలా అని నా మొహాన్నే నీకు బోర్డు కనిపిస్తోందా?" నవ్వుతూ తిరిగి ప్రశ్నించాడు తాతాజీ. అంతేగానీ సూటిగా ఆ ప్రశ్నకి జవాబు ఇవ్వలేదు.

"నీ గురించి నాకు సర్వం తెలుసు. నువ్వు సరైన దారిలోనే వున్నావు. చక్కటి గురుకృప లభించింది. అందుకు నీ పూర్వజన్మ పుణ్య విశేషమే కారణం. ప్రయత్నిస్తే తప్పక, కొద్దికాలంలో నిన్ను ఆవరించుకుని వున్న గత జన్మలో చేసిన కర్మలన్నీ భస్మమైపోతాయి. ఒక్క కర్మ మిగిలినా దాన్ని అనుభవించడానికి తిరిగి దేహం తీసుకోవాల్సి వస్తుంది. ఆ కర్మ ప్రభావంచేత మరణసమయంలో దాని తాలుకు కోరిక కలిగి తీరుతుంది. ప్రయాణకాలంలో మనసు ఏం కోరుకుంటే, తర్వాత జన్మ అదే వస్తుంది. అసలు ఒక్క కర్మా లేకుండా అన్నీ ధ్యానాగ్నిలో భస్మమైపోతే ఇక మరణ సమయంలో ఏ కోరికా వుండదు, భగవత్ భావంతప్ప. దాంతో పునర్జన్మ వుండదు. అంతేకాక ఆఖరి కర్మ కూడా తొలగగానే అద్దంమీది మురికి తొలగితే, ప్రతిబింబం ఎలా స్పష్టంగా కనిపిస్తుందో మబ్బులు తొలగగానే సూర్యుడు ఎలా దర్శనమిస్తాడో, అలా ఆఖరికర్మ తొలగగానే మనిషి మనసు, అది పుట్టినచోట, అంటే ఆత్మలో శాశ్వతంగా లయం అయిపోయి 'నేను ఈ దేహాన్ని కాను, ఈ దేహాన్ని ధరించిన ఆత్మని' అన్న విషయం ఆ ఆత్మ గ్రహిస్తుంది. అదే మోక్షం. అంతదాకా మనకి 'నేను, ఈదేహాన్ని' అనిపిస్తూంటుంది. నీలోని 'ఆ అసలు నువ్వు'ని పట్టుకోగలగడమే, అంటే నీలోని వ్యక్తిత్వం లేదా 'అహం' భావాన్ని సమూలంగా నాశనం చేసుకోగలగడమే పరమోత్కృష్టమైన కైవల్యం."

తాతాజీ చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు మునిరత్నం. అతని కంత దాకా కైవల్యం కావాలన్న తపనయితే వుంది కాని అదంటే ఏమిటో స్పష్టంగా తెలీదు.

"అప్పుడే కంటికి కనిపించే ఈ సమస్త జీవరాశులు, వస్తు సముదాయాలు దేంతో అయితే తయారయ్యాయో ఆ పరబ్రహ్మ స్వరూపం నువ్వే అని గుర్తిస్తావు. ఆ పరబ్రహ్మం నువ్వే అని తెలుసుకుంటావు. దాంతో ఇప్పుడు నీకన్నా వేరుగా కనిపించే ప్రతీదీ అకారంగాకాక పరబ్రహ్మయిన నువ్వే అని, నీలోని భాగమే అని గ్రహించగానే నీకు వాటి

మీద ఇప్పుడుండే అనురాగం కాని, ద్వేషం కాని వుండవు. నీకు భిన్నమైన దాన్ని నువ్వు ప్రేమిస్తావు లేదా ద్వేషిస్తావు. నీకు వేరుగా రెండోదివుంటే, నీకు దాన్నించి భయం కలుగుతుంది. అంతా నువ్వే వున్నప్పుడు నీకు ప్రేమించడానికి కాని, ద్వేషించడానికి కాని, భయపడడానికి కాని ఇంకోటి లేనప్పుడు పరమశాంతిని పొందుతావు."

తాతాజీ చెప్పేది జాగ్రత్తగా అర్థం చేసుకుంటున్నాడు మునిరత్నం.

"నీ కాలు నీకు భిన్నంకాదు కాబట్టి దాన్ని ప్రేమించవు. అలాగే నీ చెయ్యి లేదా నీకన్ను, ముక్కు, నోరు నీకు భిన్నం కాదు కాబట్టి వాటిని ద్వేషించవు. పొరబాట్న నీ నాలికని నీ పళ్ళు కొరికితే, నీ పళ్ళని దండిస్తావా? లేదు. ఎందుకంటే, అది నీకు భిన్నం కాదు కాబట్టి, దానిమీద ద్వేషం కలగలేదు. అదే నీ నాలికని వేరొకరు కొరికితే వాళ్ళమీద వెంటనే ద్వేషం కలిగి వాళ్ళని దండిస్తావు. అలాగే, నీ చేతిలో పిస్తోలున్నా అది నిన్ను కాలుస్తుందని భయపడతావు. రెండోది, వేరొకటి, మరొకటి లేని అద్వైత స్థితే ముక్తి. ఆ ముక్త స్థితిలో శాంతిని మనకి దూరంచేసే గుణాలైన రాగ ద్వేషాలు, భయం ఉండవు కాబట్టి ఆ పరమ ఉత్కృష్టశాంతి సిద్ధిస్తుంది. **అదే పరమానందం, బ్రహ్మానందం అంటే."**

ఆ వివరణతో మునిరత్నానికి ముక్తి అంటే ఏమిటో కరతలామలకం అయింది.

"ఆ ముక్త స్థితిని పొందేదాకా ఆత్మ తాను చేసిన కర్మలని అనుసరించి ఓ దేహంనుంచి, ఇంకో దేహానికి మారుతూంటుంది. ఏ క్షణంలో ఈ ప్రయాణానికి తెరపడుతుందో ఆ క్షణమే కైవల్యప్రాప్తి జంతుజన్మల్లో ఈ వివేకం ఆ దేహధారికి వుండదు. కేవలం మనుష్య జన్మలోనే ఇది లభ్యమౌతుంది. కాబట్టి మనిషి జన్మని పొందడానికి సరైన కారణం ముక్తికై ప్రయత్నం చేయడానికే. కాని మానవుడు మాయలకి చిక్కి, అది తప్ప మిగిలిందంతా చేసుకుంటూపోయి, ఇంకా కొత్తరకాల ఊబిలో చిక్కుకుపోతూంటాడు."

"భగవంతుడు అసలా మాయని ఎందుకు కల్పించాడు స్వామీ. దాని

వల్ల లోకంలో కన్నీళ్ళు, కష్టాలు అధికమౌతాయి కదా?" ప్రశ్నించాడు మునిరత్నం.

తాతాజీ సన్నగా నవ్వి సమాధానం ఇంగ్లీష్‌లో ఇచ్చాడు.

"టు థికెన్ ది ప్లాట్."

మునిరత్నం ఆయన చెప్పింది అర్థం చేసుకోడానికి ఆలోచించే ప్రయత్నం చేస్తూండగా దాన్ని వివరించాడు తాతాజీ.

"నువ్వు సినిమాకి వెళ్ళావు. అందులో అంతా సంతోషంగా వుంటే నీకది నచ్చుతుందా? నచ్చదు. నాయకుడు నాయికని ప్రేమించాడు. ఆమె కూడా అతన్ని ప్రేమించింది. పెద్దలు వారి వివాహానికి అడ్డు చెప్పలేదు. పెళ్ళి చేసుకున్నారు. హాయిగా కలిసి జీవించారు ... ఇది సినిమాగా చూస్తే విసుగుపుట్టి తీరుతుంది. ప్రతి నాయకుడుండాలి. నాయికని ఎత్తుకుపోవాలి. నాయిక, నాయకుడి కోసం ఏడవాలి. నాయకుడు వెళ్ళి ప్రతినాయకుడ్ని చావ చితకబాదాలి. నాయికని తన దాన్ని చేసుకోవాలి. అందుకు అనేక కష్టాలకి గురవ్వాలి. ఇది సినిమాగా చూస్తే బావుంది అనుకుంటావు. అవునా?"

"అవును స్వామీ."

"ఈ ప్రపంచం మొత్తం దేవుడు వినోదించే నాటకరంగం. మనమంతా అందులోని పాత్రధారులం. మనందరికీ ఎలాంటి కష్టాలు లేకుండా సుఖంగా జీవనం సాగిపోతుంటే, అది చూసే ప్రేక్షక దేవుడికి ఎలా వుంటుంది?"

"బోరు కొడుతుంది."

"కదా? కాబట్టి ఇంతమంది దేహధారులనే పాత్రధారులున్న ఈ ప్రపంచం అనే నాటకాన్ని రక్తి కట్టించాలంటే ఏం చెయ్యాలి?"

"వారికి కష్టనష్టాలు ఉండి తీరాలి."

"ఇంకో ఉదాహరణ. దినపత్రికని చూసి 'ఏం వార్తలు లేవు' అని పారేస్తాం. అదే ఎక్కడో జరిగిన భూకంపం, యుద్ధం, రైలు ప్రమాదం, హత్య, దోపిడీల్లాంటి వార్తలుంటే ఆసక్తిగా చదువుతాం. అవునా!"

"అవును స్వామి."

"అంటే ఇతరులకి కష్టాలు, కన్నీళ్ళు వుంటేనే మనకి ఆ వార్తలు ఆసక్తిగా వుంటాయి కదా?"

"అవును స్వామి. వదంతులు పుట్టేవి ఇందుకే అనుకుంటాను."

"లోకంలో ఇన్ని కష్టాలు, కన్నీళ్ళు ఎందుకన్న ప్రశ్నకి 'టు థికెన్ ది ప్లాట్' అన్న నా సమాధానం. అర్థమైందా?"

"అయింది స్వామీ."

"అందుకే మనిషికి దేవుడు అరిషడ్వర్గాలు అనే గుణాలనిచ్చాడు. కామ, లోభ, మోహ, మదమాత్సర్యాలవల్లే మనిషికి కష్టాలు, కన్నీళ్లు. నాయకుడయిన మనిషి పోరాడి గెలవాల్సిన ప్రతి నాయకులవి. వాటిని చీల్చి చెండాడితే, ముక్తి కాంత మనిషికి లభిస్తుంది. ఎవరయితే వీరోచితంగా ఆ ప్రతి నాయకులతో పోరాడి గెలుస్తారో, వాళ్ళంటే దేవునికిష్టం. పరమాత్ముడు అనేక సందర్భాల్లో గీతలో అలాంటివారే తనకి ఇష్టులని చెప్పాడు. ఏ మునులైనా ఈ అరిషడ్వర్గాలని గెలవాలని చెప్పడానికి కారణం ఇదే. దేవుడు ప్రతీ మానవుడ్ని ఎంతో జాగ్రత్తగా, మనం మంచి సినిమాని చూసినంత శ్రద్ధగా అన్నివేళలా చూస్తుంటాడు. అతను ఈ విలన్లని ఓడించక వాటికి లొంగిపోయి కష్టాలు పడుతుంటే, అది చూసి భగవంతుడు వినోదిస్తాడు. వీటితో విసిగిపోయిన మనిషి ఎప్పుడైతే ఓ జన్మలో ముక్తికోసం ప్రయత్నం ఆరంభించాడో అప్పుడు ప్లాట్ థికెన్ అయి, ముగింపువైపు పరిగెత్తుతున్నట్లు. ఎంత వీరోచితంగా ఆ మనిషి తన ఆరుగురు ప్రతి నాయకులతో పోరాడుతాడా అని ఆసక్తిగా చూస్తుంటాడు. మనవల్ల అది ఎటూ సాధ్యం కాదు కాబట్టి సద్గురువు రూపంలో తనే వచ్చి సహాయం చేస్తూంటాడు."

"అంటే నేను కొన్ని జన్మలుగా ఈ ఆరుగురు విలన్లతో పోరాడుతున్నానన్నమాటేగా?" ప్రశ్నించాడు మునిరత్నం.

"అవును. ముగింపుకి చేరుకుంటున్నావు కాబట్టే నీకు సద్గురువు రూపంలో ఆ పరమాత్మ ప్రాప్తించాడు. నిజానికి ఆయన ప్రాపు లేకుండా ఎవరూ స్వశక్తితో ముక్తికాంతను పొందలేరు. ఆయన అనుగ్రహం ఒక్కటే మోక్షానికి తాళంచెవి. భక్తుడికే దేవుడు వశుడవుతాడు కాబట్టి,

భక్తుడికి దైవానుగ్రహం లభిస్తుంది. నీరు ప్రవహించకపోవచ్చు, అగ్నిలోని వేడి తగ్గచ్చు, సూర్యకిరణాలలో కాంతి లేకపోవచ్చు. కాని ఓసారి గురు కృప లభిస్తే అది జన్మ జన్మాంతరాలు శిష్యుడ్ని వెంబడిస్తూనే వుంటుంది. మన ఖర్మలనించి మనం ఎలా తప్పించుకోలేమో, అలాగే గురు కృపనించి కూడా తప్పించుకోలేము. శక్తి పాతదీక్ష గురువు అనుగ్రహానికి రుజువు. గురువే సత్యం, గురువే పూర్ణం, గురువే శాంతి, గురువే జ్ఞానం. అందుకనే ఇది తెలిసినవాళ్ళు 'ధ్యాన మూలం గురోర్ముక్తిః' అన్నారు."

తాతాజీ చాలాసేపు మాట్లాడలేదు. ఆయన వేళ్ళు తంబురా మీటుతూనే వున్నాయి. మునిరత్నం ఆయన చెప్పేదంతా జీర్ణం చేసుకుంటుండిపోయాడు. తాతాజీ మృదుమధురంగా ఓ మరాఠీ అభంగాన్ని పాడసాగాడు.

శేవటిలీ పాళీ తేవ్హాం మనుష్ జన్మ
చుకలీయా వర్మ ఫేరా పడే।
ఏక్ జన్మ ఓ శభీ కరా ఆత్మారామ్
సంసార సుఖమే భోగాం నకా॥

(ఈ శరీరంలోనే ఆత్మారాముడ్ని వెదుకు. ఎన్నో జన్మల అనంతరం సుమా మానవ జన్మ లభించేది. దీన్ని శ్రద్ధగా సంరక్షించుకోలేకపోతే మళ్ళీ పుట్టాల్సివస్తుంది జాగ్రత్త.)

తర్వాత ఆయన భజన మొదలెట్టాడు. మునిరత్నం ఆయనతో గొంతు కలిపాడు.

లోకాభిరాం! జయరాం!
ఆనందరాం! కోదండరాం!
కళ్యాణరాం! పట్టాభిరాం! సీతాభిరాం! సర్వచరాచర పాలకరాం!
రామనామ జయ రాజారాం! సర్వభావామయ తారకరాం!

పావన తారక నామ హరే, సీతామన ప్రభామ హరే!

శ్రీ తులసీ దాసధామా హరే!

ఆ బాణీవల్లో మనసులోంచి పెల్లుబికిన ఉద్వేగంవల్లో, గొంతు కలిపి పాడుతున్న మునిరత్నం ఆనందం పట్టలేక అవి కన్నీళ్ళుగా కారసాగాయి.

రామనామ జపలోకులో భయం

అంటే రామనామం జపించేవారికి భయం కలగదు.

మర్నాడు కొందరు భక్తులు జీపులో వచ్చారు. వాళ్ళల్లో ఆరేళ్ళ పిల్లవాడు మునిరత్నాన్ని చూసి తల్లితో చెప్పాడు.

"అమ్మా! అడుగో బూచాడు."

అప్పుడు అనిపించింది మునిరత్నానికి-తన జుట్టు, గడ్డం పెరగడమే కాక ఒంటిమీది ఒకే జత దుస్తులు బాగా మాసిపోయాయని.

వాళ్ళు ఓ కొబ్బరి చిప్పని మునిరత్నం దగ్గర పెట్టి వెళ్ళారు. అతను చిన్న ముక్క తీసుకుని భక్తిగా కళ్ళకద్దుకుని తిని, మిగిలింది దానివైపు ఆశగా చూస్తున్న కోతులవైపు విసిరేశాడు.

మునిరత్నానికి పెద్దపులి అరుపులు ధ్యానంలో వారందాకా సాగి ఆగిపోయాయి. క్రమేపీ ఆ తర్వాత వచ్చిన ఒంటె అరుపులు కూడా ఆగిపోయాయి.

శారీరక ఆసనాలు మాత్రం విడవకుండా వస్తున్నాయి. ఒక్కోసారి పద్మాసనంలో కూర్చున్న అతనికి తల ముందుకు వంగి నేలకి ఆనుకుం టుంది. ఆ స్థితిలో చాలాసేపు వుండిపోతాడు.

ఒక్కోసారి క్రింది భాగంలో గుదం దానంతట అది తెరచుకుని ముడుచుకోవడం గమనించాడు మునిరత్నం. అలాగే ఒక్కోసారి కాలి మడమ మలద్వారానికి తాకి దాన్ని గట్టిగా అదిమి కుంచించుకునేట్లుగా చేసేది.

ఇలాంటివి తెలుసుకోవడానికి తాతాజీ దగ్గరికి వెళ్ళసాగాడు. ఆయన దాని పేరు మూలబంధమని, ప్రాణాన్ని అపానవాయువును సమానం చేసే క్రియ జరుగుతోందని చెప్పాడాయన.

మరో క్రియ ఉడ్డియాన బంధం. లోపలనించి ప్రాణవాయువు బయ టకి వచ్చి పొట్ట పూర్తిగా లోపల చిన్న గుంట పడ్డట్లుగా అవుతుంది.

దాంతో బొడ్డుకింద నుంచి గాలి పైకి లాగిన భావన. నాడులు శుభ్రపడి మనోచాంచల్యాన్ని అరికడుతుందీ ప్రక్రియ.

* * * *

ఓ రోజు ఉదయం తాతాజీ మలవిసర్జన చేస్తూ కనిపించాడు మునిరత్నానికి. ఆ మలాన్ని ఆయన తన ఒంటికి పూసుకోవడం చూసి ఆశ్చర్య పోయాడు. 'ఆయన ఖచ్చితంగా పిచ్చివాడు. ఇన్ని రోజులు ఈ పిచ్చి వాడు చెప్పింది నిజమని నమ్ముతున్నాను' వెంటనే అనుకున్నాడు. తాతాజీ మునిరత్నాన్ని దగ్గరికి రమ్మన్నట్లుగా పిలిచి చెప్పాడు నవ్వుతూ.

"నేను పిచ్చివాడ్ని కాను."

ఆశ్చర్యం! ఆయన మలం నుంచి దుర్గంధం బదులు సువాసనలు వస్తున్నాయి!!

"స్వామీ!" అని ఆయన పాదాల మీద పడ్డాడు మునిరత్నం.

"మీరు యోగాగ్నిలో మీ శరీరంలోనూ, అంతరంగంలోని అన్ని మలినాలని పరిశుద్ధం చేసుకున్నవారు. మానవ శరీరం మలమూత్ర పేటిక. మీ దేహం దైవస్వరూపం" ఉద్వేగంగా చెప్పాడు.

తాతాజీ ఏం మాట్లాడకుండా లేచి వెళ్ళిపోయాడు. మునిరత్నం ఆ తర్వాత తరచు తన మలాన్ని దుర్గంధం కొద్దిగా అయినా తగ్గిందా అని వాసన చూసుకోసాగాడు.

* * * *

ఓ రోజు ధ్యానంలో స్ఫురించింది మునిరత్నానికి, తాతాజీ తంబురా ఎందుకు మీటుతున్నాడో. ఉయ్యాలవాడలోని తన బాబాయ్ ఆధ్యాత్మిక గ్రంథాల్లో ఓ దాంట్లో నాదోపాసన ప్రక్రియ గురించి చదివిన వైనం గుర్తొచ్చింది మునిరత్నానికి. ఆయన చేసేది నాదోపాసన. తన మనస్సుని శివ పంచాక్షరీ మంత్రం మీద ఎలా లగ్నం చేస్తున్నాడో అలా ఆయన తన మనస్సుని ఆ తంబురా నాదం మీద లగ్నం చేస్తున్నాడు. ఆ నాదం వింటూ అందులోనే సమాధి స్థితికి చేరుకుంటున్నాడు. ఆయన ఆ దారిలోనే మనో లయం చేసుకుని ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తి.

అప్పటినించి నిత్యం లేవగానే లింగాభిషేకం చేసుకుని వెళ్ళి తాతాజీకి పాద నమస్కారం చేసుకోసాగాడు. ఒక్కోసారి ఆయన తన పాదాలని వత్తమని కోరేవాడు. నాలుగయిదు గంటలు దాటినా ఆయన ఇక చాలనేదాకా పాదసేవ చేయసాగాడు మునిరత్నం.

ఆయన భోజనం చేయడని తెలుసుకుని ఆశ్చర్యపోయి అడిగాడు.

"శరీరానికి ఇంధనం లేకుండా ఎలా వుండగలరు తాతాజీ?"

"సూర్యరశ్మి చాలు నాకు."

"మరి మాకెందుకు అది సరిపోదు?"

"అందరికీ శక్తి అక్కడనించేగా. మీకు సూర్యరశ్మిని శక్తిగా మార్చుకోవడం తెలీదు కాబట్టి, ఆ శక్తిని స్వీకరించిన మొక్కల ఉత్పత్తి నించి దాన్ని పొందుతున్నారు. నా శరీరానికి ఈ మధ్యవర్తులు అవసరం లేదు."

16

ఓ రోజు తండాలోని చెంచులు చుట్టుపక్కల వృక్షాలను నరకడం చూశాడు మునిరత్నం. వాటికున్న కొమ్మలను చెక్కేసి ఆ కలపను గుడి ముందు ఓ చోట పేర్చారు. మునిరత్నం అనుకున్నాడు, వచ్చేది చలికాలం కాబట్టి చలిమంట కోసం అయివుండచ్చని.

అయితే చిత్రంగా మర్నాడు వాటిని ఉపయోగించి వాళ్ళు పంజరంలాంటిది నిర్మించడం చూశాడు. నాలుగడుగుల ఎత్తు, ఆరడుగుల పొడవు మూడడుగుల వెడల్పు గల పంజరాన్ని నిర్మించడానికి వాళ్ళకి ఆరురోజులు పట్టింది.

ఆరోజు ధ్యానం బాగా వచ్చింది మునిరత్నానికి. ప్రతి అమావాస్యకి, పౌర్ణమికి తనకి ధ్యానం బాగా డీప్‌గా రావడం, సదానంద గురువు శక్తిపాతం ఇచ్చినప్పటినుంచి గత నాలుగు నెలలుగా గమనిస్తున్నాడతను.

ఇప్పుడు హలాసనం, శీర్షాసనం లాంటివి తగ్గాయి. మునిరత్నం శరీరంలోంచి జంతువుల అరుపులు కూడా తగ్గాయి. నేల మీద పాములా

పాకడం, సర్పభావం లాంటివి పూర్తిగా పోయాయి. ఎక్కువ భాగం పద్మాసనంలో కూర్చుని, తలని ముందు నేలకి ఆనించి వుంచడం, అనేకరకాల ప్రాణాయామాలు ఆ సమయంలో కలగడం జరుగుతోంది.

అతనికి ధ్యానసమయంలో కలిగే శాంతితో కూడిన ఆనందం అధికమవసాగింది. ధ్యానం అయ్యాక నడుస్తూంటే, తాగినవాడు తూలినట్లుగా కాళ్ళు తడబడడంతో అది మత్తుతో కూడిన ఆనందంగా అర్థంచేసుకున్నాడు. ధ్యానానంతరం కొద్దిసేపుండే ఆ శాంతి కాలపరిమితి కూడా క్రమేపీ పెరుగుతుండడం గమనించాడు. ఆ ఆనందానుభవమే అతని మనస్సును ధ్యానం వైపుకి పురికొల్పుతోంది. రాత్రి నిద్రపోయేముందు ఆ ఆనందం గురించి ఆలోచిస్తాడు.

ఇలాంటి ఆనందం అంటూ ఒకటుందని ప్రపంచానికంతటికీ తెలిస్తే ఎంత బావుండును? ఇది ఒక్కసారి చవిచూస్తే ఇక ఎవరూ లౌకిక సుఖాల వెంట పరిగెత్తక దీన్ని పొందడానికి ధ్యానం చేస్తారు. అప్పుడు లోకంలో ఇన్ని బాధలు, కష్టాలు ఎవరికీ వుండవుగా!

అలా ఎందుకు జరగడంలేదో మునిరత్నంకి ఇంగ్లీష్‌లో తాతాజీ చెప్పడం గుర్తుకువచ్చింది.

"టు థి కెన్ ది ప్లాట్."

* * * *

పౌర్ణమి రాత్రి గాఢనిద్రలో వున్న మునిరత్నం దగ్గరకి వచ్చారు నలుగురు బలాఢ్యులైన చెంచులు. అంతా ఒకరికొకరు సైగలు చేసుకున్నాక అకస్మాత్తుగా మునిరత్నం కాళ్ళు, చేతులు పట్టుకుని ఎత్తుకెళ్ళి తాము కలపతో నిర్మించిన ఆ చెక్కపంజరంలో అతన్ని లోపలకి నెట్టి, సిద్ధంగా వున్న కలపచట్రాన్ని బయట అమర్చారు. దాన్ని ఆ పంజరానికి తాడుతో కట్టి బిగించేశారు.

ఏం జరుగుతోందో అర్థం చేసుకుని అరుస్తూ మునిరత్నం ఆ చట్రాన్ని తోయడానికి విశ్వప్రయత్నం చేశాడు. కానీ అది అతనికి సాధ్యం కాలేదు.

"ఏమిటిది? ఎందుకు నన్నిలా బంధించారు?" ప్రశ్నించాడు.

వాళ్ళు అతని ప్రశ్నలు వేటికీ జవాబు చెప్పకుండా వెళ్ళిపోయారు. లోపల నుంచోవడానికి వీల్లేదు. కూర్చునే వుండాలి. లేదా పడుకోవాలి. దుంగకీ, దుంగకి మధ్య వేలు దూరేంత సందు మాత్రమే వుంది. వాళ్ళీ పిచ్చిపని ఎందుకు చేసారో మునిరత్నానికి ఎంత ఆలోచించినా బోధపడలేదు.

తను ఏలాంటి తప్పూ చేయలేదు. ఎవరినీ పల్లెత్తు మాట కూడా అనలేదు. ఆ రాత్రి చాలాసేపు అతనికి నిద్రపట్టలేదు. సూర్యోదయానికి కొద్దిసేపటిముందే నిద్రపట్టింది. మెలకువ వచ్చాక అలవాటుగా లేవగానే తల పైకప్పుకి తగిలి గట్టి దెబ్బ తగిలింది. అప్పుడు గుర్తొచ్చింది రాత్రి జరిగింది.

మళ్ళీ గట్టిగా అరిచాడు. కన్నాల్లోంచి చూస్తే ఎవరూ కనపడలేదు. తంబురా ధ్వని విని అరిచాడు.

"తాతాజీ....నన్ను రక్షించండి తాతాజీ...."

దాదాపు నాలుగైదు గంటలు ఆగి ఆగి తాతాజీని గట్టిగా పిలుస్తూనే వున్నాడు. కానీ ఆయన మునిరత్నం రక్షణకి రాలేదు. మునిరత్నానికి ఎంతో బాధ వేసింది. ఏమిటీ చెరసాల తనకి? తననెందుకు ఖైదు చేశారో తెలిసినా కొస్త ఉపశమనంగా వుండేది. ఆ రోజంతా ఎవరూ అటువైపు రాలేదు. మునిరత్నాన్ని పట్టించుకోలేదు. మునిరత్నంకి కూర్చునే వుండటం లేదా పడుకునే వుండటం దుర్భరంగా వుంది.

తాతాజీ ఒక్కడే తనని రక్షించేవాడన్న ఆశ అతనిలో మిణుకు మిణుకుమంటోంది. తాతాజీ ఆ రోజు ఏదో ఓ సమయంలో వచ్చి తనని బయటకి తీయిస్తాడని ఎదురుచూశాడు. కానీ ఆయన రాకపోవడం అతని కెంతో బాధ కలిగించింది. ఆ రోజంతా తినడానికి, తాగడానికి కూడా ఏం లేదు. నాలిక పిడచకట్టుకుపోతోంది.

సూర్యాస్తమయ సమయం దాటింది. అంతా చీకటి ఇక ఆ రాత్రి ఎవరూ రారని గ్రహించాక పడుకున్నాడు. మర్నాడు తనను విడుదల చేస్తారని ఆశపడ్డాడు కానీ అతని ఆశ అడియాసే అయింది. రోజూ వచ్చే హనుమంతప్ప కూడా రాలేదు.

మునిరత్నం మనసులో ఆ ఆందోళన కొద్దిగా తగ్గాక శాంతంగా ఆలోచించాడు, చెంచులకి తనమీద ఎందుకు కోపం వచ్చిందా అని. అతనికి తట్టింది ఒక్కటే జవాబు.

తన దగ్గరకి వచ్చి కూర్చునే హనుమంతప్ప చెల్లెలు తనమీద ఏదైనా చాడీలు చెప్పి వుంటుంది. మరో ఆలోచన కూడా కలిగింది. గూడెంలో ఏ కన్యో గర్భవతై వుంటుంది. తన ప్రియుడి పేరు చెప్తే అతన్ని చంపేస్తారని తన పేరు చెప్పి వుంటుంది. తనని శిక్షించేలోగా పారిపోకుండా వుండడానికి ఈ ఖైదు ఏర్పాటుచేసి వుంటారు. అంతకుమించి వేరే కారణం తట్టకపోవడంతో మునిరత్నం దాన్నే విశ్వసించసాగాడు.

దాంతో ఇందుకు కారణమైన ఆ పేరు తెలీని ఆడదాని మీద కోపం కలిగింది. మర్నాడు కూడా తాతాజీని అరుస్తూ పిలుస్తూనే వున్నాడు కాని ఆయన రాలేదు. ఆయన కూడా తన పిలుపులను ఉపేక్షించాడంటే, ఆయనా ఆ ఆడదాని మాటలు నమ్మి వుండాలి. ఇక ఆయనే నమ్మితే తన గతి ఏం కాను?

రకరకాల ఆలోచనలతో, దాహంతో, ఆకలితో మునిరత్నానికి ఆ రోజు గడిచింది. సూర్యాస్తమయ సమయంలో అతనికి ఎంతో నిస్త్రాణగా అనిపించింది. ఉండుండి కళ్ళు బైర్లు కమ్మసాగాయి. ఆ దాహానికి తనకి చావు తప్పదనిపించింది. అతన్ని బంధించిన ఆ పంజరం పచ్చి చెక్కతో చేసింది కాబట్టి నాలికతో దాన్లోని తడిని పీల్చుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు.

తల్లిదండ్రుల మాట విని ఇంటిపట్టున వుండక, ఈ అనాగరిక జాతి వున్న చోటికి వచ్చినందుకు తగిన ఫలితం అనుభవిస్తున్నాననిపించిందతనికి. కొద్దిసేపట్లో మునిరత్నానికి అపస్మారకం కమ్మింది.

* * * *

తంబురా మీటుతూ, ఆ శబ్దంతో తన మనసుని లయం చేసి, ఏ ఆలోచన లేని స్థితిలో వున్న తాతాజీ నెమ్మదిగా ఇహలోకానికి వచ్చి కళ్ళు తెరిచాడు. హనుమంతప్ప తండ్రిని పిలిచి అతనికి తగిన సూచనలిచ్చాడు.

అతను వెంటనే ఓ ఎండు సొరకాయ బుర్రలో నీళ్ళు నింపి తీసుకెళ్ళి మునిరత్నం వున్న చెక్కపంజరం పైన ఏర్పాటుచేసిన చెయ్యి పట్టేటంత చిన్న చెక్క తలుపుని తెరిచాడు. ఎన్నిసార్లు పిలిచినా మునిరత్నం కదలకపోవడంతో నీటిని అతని మొహంమీద ధారగా పోశాడు. దాంతో మునిరత్నంకి మెలకువ వచ్చింది.

పున్నమి వెన్నెల్లో కనబడ్డ ఆ సొరకాయ బుర్రని తక్షణం అందుకుని దాని మూత తెరిచి, అందులోని నీటిని గటగట ఆత్రంగా తాగి ఖాళీ చేసేశాడు. దాంతో అతనికి పోయిన ప్రాణం లేచివచ్చినట్లుగా అయింది. అది గమనించిన హనుమంతప్ప తండ్రి మళ్ళీ చెక్క తలుపు మూశాడు.

"ఎవరది? నన్నెందుకు ఇలా బంధించారు? నే చేసిన నేరం ఏమిటో చెప్పండి" అరిచాడు మునిరత్నం.

జవాబు లేదు. అడుగుల సవ్వడి దూరమవుతూండడంతో గట్టిగా అరిచాడు మునిరత్నం.

"ముందు నన్ను బయటకి తీయండి. దుర్మార్గుల్లారా....మిమ్మల్నే."

ఆ రాత్రి మళ్ళీ నిద్రతో గడిచిందతనికి. మర్నాడు మధ్యాహ్నం ఆ చెక్క తలుపు తెరచుకుంది. సొరకాయ బుర్రతో నీళ్ళు, ఓ పెద్ద అరిటాకులో చుట్టిన పళ్ళు, ఫలాలు ఇచ్చారెవరో. వాటిని ఆత్రంగా తిన్నాడు. కొద్దిగా నీరు తాగాడు.

మరో రెండు రోజులు ఇదే విధంగా జరిగింది. ఎవరూ మాట్లాడరు, బదులు పలకరు. నీళ్ళు, పళ్ళు ఇస్తుంటారు. పడుకునే లేదా కూర్చునే వుండడంతో మునిరత్నానికి ఎంతో విసుగ్గా వుంది. పైగా మలమూత్రాల దుర్గంధం.

కొంత శక్తి వచ్చాక తప్పించుకోవచ్చేమోనని చూశాడు. ఆ దుంగలను ఒకదానికొకటి కలిపి బలమైన తాళ్ళతో కట్టారు. ముళ్ళు బయటకి వున్నాయి. ముడిని విప్పడానికి అతని చెయ్యి బయటకి పట్టేంత సందు లేదు. తాళ్ళను కొరకడానికి ప్రయత్నించాడు కానీ అది సాధ్యపడలేదు. తనకీ వింత ఖైదును ఎందుకు విధించారన్నది ఎంత ఆలోచించినా మునిరత్నానికి బోధపడలేదు. ఎన్నోసార్లు 'తన గురువు సదానందబాబా తిరిగి

త్వరగా వస్తే బావుండును. ఆయన వాళ్ళకి నచ్చచెప్పి విడిపించగలడు' అనుకున్నాడు. బ్రహ్మేశ్వరుడ్ని మౌనంగా ప్రార్థించాడు– సదానందబాబాని కానీ, అరుదుగా అక్కడికి వచ్చే ఫారెస్ట్ రేంజర్లను కానీ పంపమని.

శారీరకంగా, మానసికంగా కాస్త శక్తి పుంజుకున్నాక నాలుగోరోజు నుంచి మునిరత్నం ధ్యానం చేయసాగాడు. కూర్చుని కళ్ళు మూసుకుని, ధ్యానంలో వుంటే, ఒక్కోసారి కాలం చాలా ఆలస్యంగానూ, ధ్యానం బాగా కుదిరితే వేగంగానూ నడవసాగింది. పద్మాసనంలో కూర్చున్నాక అతని చేతులు వాటంతట అవే పొట్టమీంచి వీపుమీదకి, కుడిచెయ్యి ఎడమ వైపుకి, ఎడమచెయ్యి కుడివైపుకి వెళ్ళి, ఒకదాని వేళ్ళలోకి మరో చేతి వేళ్ళు దూరి గట్టిగా పట్టుకున్నాయి. ఆ స్థితిలో అతని తల ముందుకు వంగి కింద వున్న దుంగల వరసకి తాకింది. అదే స్థితిలో చాలాసేపు వుండిపోయాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు అనేక రకాలుగా రాసాగాయి. ఓసారి వేగంగా గాలి పీల్చి వదిలే భస్త్రిక మరోసారి శ్వాసవేగం బాగా తగ్గడం, రెండు రోజులపాటు అదేవిధంగా సాగిందతని ధ్యానం. ధ్యానం మళ్ళీ కుదురుకోవడంతో మునిరత్నంకి తనని బంధించారన్న ఆలోచన తగ్గి కొంత ఉపశమనం లభించింది. నిత్యం ఉదయం పళ్ళు, ఫలాలు, నీరు అందుతున్నాయి.

నేరం చేసిన మనిషికి ఎందుకు జైలుశిక్ష విధిస్తారో మునిరత్నానికి అర్థమైంది. తనంటే ఏ బాదరబందీలేని బ్రహ్మచారి. అదే కుటుంబసభ్యులు గలవారైతే, వాళ్ళకి దూరంగా ఇలా ఏళ్ళ తరబడి జైల్లో మగ్గడం ఎంత నరకమో మునిరత్నానికి అర్థమైంది.

అతన్ని ఖైదుచేసిన ఎనిమిదవరోజు ధ్యానంలో కొత్త అనుభవాలు కలిగాయి. రెండు చేతుల నాడుల్లో ఏదో సంచరిస్తున్నట్లుగా అనిపించసాగింది. వీపు కింది భాగంలోని నాడుల్లోంచి ఏదో వాయువులాంటిది పైకి సంచరిస్తున్నట్లు, అది వెన్నెముకలోంచి పైకి మాడుదాకా పాకిన భావన. మెడ అతి వేగంగా తిరుగుతూ వెనక్కి వాలేది. ఎంత వెనక్కి వాలేదంటే, వీపు కూడా కనిపించేది. ఆ వేగం తగ్గి మామూలు స్థితికి వచ్చేదాకా మునిరత్నానికి ఆందోళనగా వుండేది, ఎక్కడ మెడ బెణుకుతుందోనని.

అనవసరంగా కోపం, మోహం, చికాకు కలిగేవి. చాలా ఏళ్ళ క్రితం తనమీద ద్వేషభావంతో ప్రవర్తించిన మనుషులు గుర్తొచ్చి వాళ్ళమీద కోపం కట్టలు తెంచుకునేది. ఆ తర్వాత ఆ కోపం పోయి, తనకా కోపం వచ్చి నందుకు సిగ్గు, వాళ్ళమీద క్షమాభావం కలిగేవి.

'వాళ్ళు మనుషులు అరిషడ్వర్గాలకి లోబడి ఆ ప్రకారం వాళ్ళ తమ ఆనందం కోరి తనతో అలా ప్రవర్తించారు. అంతేగా!' అన్న వివ రణ స్ఫురించేది. దాంతో వాళ్ళమీద తనకి కలిగిన కోపానికి పశ్చాత్తాపం కలిగేది. 'అరే! నేను మౌనంగా వాళ్ళు పెట్టిన ఈ బాధని భరించకుండా ఎందుకు తిరగబడి వాళ్ళని మరింత బాధించాను?' అనిపించేది. వాళ్ళని కలిసి క్షమాపణ కోరాలన్న సంకల్పం కలిగేది.

ధ్యానానంతరం తీరిగ్గా తనకి కలిగిన ఆ భావాల గురించి ఆలో చించేవాడు. 'తాతాజీ చెప్పింది నిజమే అయితే, గురుకృపాశక్తి తనలో ధ్యానకాలంలో పనిచేస్తూ, తనలో ఈ ఉదాత్త భావాలని కలిగిస్తోంది' అను కునేవాడు. వాళ్ళమీద ప్రేమభావం కలిగినందుకు సంతోషం వేసేది.

తను ఇప్పుడు వాళ్ళ దగ్గరకి వెళ్ళి క్షమాపణ కోరితే, వాళ్ళెలా ఫీలవుతారు అన్న ఆలోచన కలిగింది. 'ఒరేయ్! వీడిలో అహంభావం కొంచెం కూడా లేదే ఇప్పుడు?' అని వాళ్ళు ఆశ్చర్యపోతారనిపించింది.

అహంభావం!

తనలోని అహంభావం చస్తోందన్న మాట! దేవుడికీ, మనిషికి మధ్య ఉన్న ఏకైక సన్నటిపొర అహంభావం అని తను చాలాసార్లు చదివాడు. ఆ పొర క్షీణిస్తోందంటే, తను మానవత్వం నించి దైవత్వానికి దగ్గరవు తున్నాడు. దాంతో మునిరత్నానికి తను సరైన దారిలో ఉన్నాడన్న నమ్మకం కలగడంతో అతనికెంతో సంతోషమేసింది. తను ఆధ్యాత్మిక జీవితంలో ప్రగతి సాధిస్తున్నాడన్న మాట! అతనికి ఆనందంతో కళ్ళనీళ్ళు వచ్చాయి.

"గురుదేవా ఇది నీ కృప" అని బయటకి అంటూ సదానందబాబా రూపం గుర్తుకు తెచ్చుకుని దణ్ణం పెట్టేవాడు. ఒకోసారి శరీరం లోపల ఏదో తగలబడిపోతున్నట్లుగా చిటపట శబ్దాలు వినిపించేవి. బయటకి తెలీక

పోయినా శరీరం బొడ్డు లోపలి భాగం అంతా సెగలు కక్కుతున్నట్లుగా అనిపించేది. ఆ వేడికి రాత్రి చలి తెలిసేదికాదు. అది తగ్గాక శరీరమంతా నొప్పిగా ఉండేది.

అతను ఆ పంజరంలో చిక్కుకున్న తొమ్మిదోరోజు రాత్రి నిద్ర పట్టక ధ్యానం చేస్తూంటే, కళ్ళు మూసుకుని ఉన్న స్థితిలో, కనుబొమల మధ్య మిలమిల మెరిసే జ్యోతి కొద్దిసేపు కనిపించింది. దానినంతే చూస్తుండిపోయాడు. అది మాయమయ్యాక, తన బాబాయ్ రామావతారం డైరీలో రాసుకున్న ధ్యానానుభవ జ్యోతి అదే అయివుంటుందనుకున్నాడు.

ఆ తర్వాత నిత్యం కొద్దిసేపు జ్యోతి దర్శనం కలగసాగింది.

అతనిలో ధ్యానంవల్ల కలిగే ఆనందస్థితి పూర్వంకన్నా సాంద్రత పెరిగింది.

ధ్యానం తర్వాత లభించే ఆ పరమ శాంతిలో తను బంధిఖానాలో చిక్కుకున్నాడన్న బాధ కూడా ఉండేది కాదు. తన మలమూత్రాల వాసనతో మొదట్లో నరకకూపంగా తోచిన ఆ ప్రదేశం, ధ్యానం తర్వాత కలిగే ఆ పరమశాంతిలో అతన్ని బాధించడంలేదు. ధ్యానానికి మునుపు ఏది అసౌ కర్యంగా వుందో అది ఆ తర్వాత లభించే శాంతిలో అలా తోచకపోవడం మునిరత్నంకి చిత్రంగా వుండేది. ఆ శాంతి వెళ్ళిపోకుండా తనని సదా అంటి పెట్టుకుని వుంటే బావుండుననిపించసాగింది.

• • • •

ఆ రోజు పున్నమి.

మునిరత్నాన్ని అందులో బంధించి ఆ రోజుకి సరిగ్గా ఇరవై ఎని మిది రోజులు.

మధ్యాహ్నం మూడుగంటలకి అకస్మాత్తుగా డప్పులు, కొమ్ము బూరల ధ్వని ధ్యానంలో వున్న మునిరత్నంకి వినిపించింది. 'తనని బలి ఇవ్వబోతున్నారా?' అన్న ఆలోచన వచ్చింది. 'ఇస్తే ఇచ్చుకోనీ' అన్న నిర్లిప్తభావం వెంటనే అతనిలో ఉదయించింది. అది ధ్యానంవల్ల కలిగిన శాంతి ఇచ్చిన ఆలోచన.

దుంగల సందుల్లోంచి పడే వెన్నెలని చూసి ఈరోజు పౌర్ణమి. అందుకే ధ్యానం బాగా వచ్చింది అనుకున్నాడు. ఆ రాత్రి ధ్యానం చేస్తూ నిద్రలోకి జారిపోయాడు మునిరత్నం.

ఏదో శబ్దానికి మెలకువ వచ్చింది మునిరత్నానికి. నేలకి ఆని వున్న తన తలనిలేపి, వీపు వెనక కలిపి పట్టుకునివున్న తన చేతులని విడదీసాడు. ఆ శబ్దం తన ఎదురుభాగంలోని దుంగలని ఎవరో గొడ్డలితో కొడుతుండడంతో వచ్చేదని గ్రహించాడు. వెన్నెలరేఖలు లోపలకి పడుతుండడంతో అదింకా రాత్రి అని గ్రహించాడు.

"ఎవరది?" అరిచాడు.

కొద్దిసేపట్లో అటువైపు ఉన్న తలుపుని ఎవరో తెరిచారు. మొదటిసారిగా విశాలమైన బయటి ప్రపంచం కనపడిందతనికి.

"బయటకి రా" పిలిచారెవరో?

మునిరత్నం నెమ్మదిగా బయటకి వచ్చాడు. ఎదురుగా తండాలోని వాళ్ళంతా నిలబడి వున్నారు. తనకి మంత్రదీక్ష ఇచ్చిన సదానందస్వామి కూడా నవ్వుతూ తనవంక వాత్సల్యంగా చూస్తుండడం చూసి వెంటనే లేచాడు.

అంతకాలం కూర్చుని, పడుకునే ఉండబట్టి వెంటనే సరిగ్గా నడవలేక తూలాడు. ఒంగోనే నడుస్తూ ఆయన దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"స్వామీ! వీళ్ళు చూసారా ఏం పని చేసారో? అనవసరంగా నన్ను ఇందులో బంధించారు. మీరు రాబట్టి సరిపోయింది."

సదానందస్వామి మునిరత్నం మొహంలోకి పరిశీలనగా చూసి చెప్పాడు.

"ధ్యానం బాగా సాగుతోందా?"

"సాగుతోంది స్వామి. నాకెన్నో అనుమానాలు. అన్నీ ఒకేటి అడుగుతాను. వీళ్ళల్లో ఎవరి పనిది?" అడిగాడు మునిరత్నం.

ఎవరూ జవాబు చెప్పలేదు.

"నే చేసిన తప్పేమిటో చెప్పమనండి స్వామి. తాతాజీ! మీరయినా ఎందుకు విడిపించలేదు?"

దానికీ జవాబులేదు. అంతా నవ్వుతూ వినోదంగా చూస్తున్నారు.

"నీ అవతారం ఎలా వుందో! వెళ్ళి స్నానం చేసిరా ముందు" చెప్పాడు సదానందస్వామి.

మునిరత్నం దిగుడుబావిలోకి దిగి ఆ వెన్నెల్లో కట్టుబట్టలతోనే తలారా స్నానంచేసి వచ్చాడు.

"స్వామీ! మీరు నన్నేం చేసారో తెలీదుకాని ధ్యానం బాగా వస్తోంది" కృతజ్ఞతగా చూస్తూ చెప్పాడు మునిరత్నం.

బదులుగా సదానందస్వామి చిన్న మందహాసం చేసాడు.

"స్వామీ! తాతాజీ మీ గురించి చెప్పారు - నిత్యానందబాబా మిమ్మల్ని నా దగ్గరకి పంపారని. నన్నాయన దగ్గరకి తీసుకెళ్ళండి."

"నన్ను చూస్తే గురుదేవులని చూసినట్లే. నాకూ, వారికీ బేధం ఏం లేదు" నవ్వుతూ చెప్పాడు సదానందస్వామి.

"ఇదివరకటిలా ఇలా కనిపించి అలా వెళ్ళిపోతారా? నాకెన్నో అనుమానాలు. మిమ్మల్నడిగి తీర్చుకునేదాకా ఉంటారుగా?"

"అలాగే! రేపు మధ్యాహ్నం బయలుదేరతాను."

17

"తాతాజీ కూడా సిద్ధయోగికదా స్వామి?" ప్రశ్నించాడు మునిరత్నం పర్నాడు సదానంద స్వామిని.

వారిద్దరూ బ్రహ్మేశ్వరాలయం సమీపంలో కూర్చున్నారు.

"అవును."

"మీరు వీళ్ళ దగ్గరకి ఎందుకు వచ్చి వెళుతుంటారు?"

"గురుదేవుల ఆజ్ఞ. ఈ ప్రాంతంలోని ఆటవికులకి శివభక్తి ఎక్కువ. శివుణ్ని తమ అల్లుడిగా భావించి కొలుస్తారు. పూర్వం శివుడు ఓ గిరిజన యువతిని నల్లమల అడవుల్లో వివాహం చేసుకున్నాడు. శ్రీశైల క్షేత్ర చరిత్ర అదేకదా. వీళ్ళల్లో ఆధ్యాత్మిక భావాలు రేకెత్తించి ఈ జన్మలో ధ్యానంవైపు మళ్ళించాలన్నది గురుదేవుల సంకల్పం. అందువల్ల ఇక

మీదట ప్రతి జన్మలో వీళ్ళు ధ్యానమార్గంలోకి కర్మ పరిపాకం అయ్యే దాకా నెట్టబడతారు."

ధ్యానంలో తనకి కలిగిన వివిధ అనుభవాలని వివరించి అడిగాడు మునిరత్నం.

"వాటికి మొదట్లో నాకు పిచ్చెక్కుతుందేమో అనిపించేది. ఇవన్నీ మంచికే జరుగుతున్నాయా స్వామీ?"

"అన్నీ మంచికే. ధ్యానంలో ఏ చెడూ జరగదు."

"ఒక్క నన్ను బందిఖానాలో వుంచిన విషయంతప్ప స్వామీ. మీరెళ్ళాక తిరిగి వీళ్ళు నన్ను మళ్ళీ బాధిస్తారేమో? నేను ఇంకెక్కడికైనా వెళ్ళనా?" భయంగా అడిగాడు మునిరత్నం.

"నువ్విక్కడ్నించి వెళ్ళడానికి ఇంకా కొంత సమయం వుంది."

"కానీ మరోసారి వీళ్ళు నన్నేమైనా చేస్తే? నాకిక్కడ దిక్కెవరూ లేరు."

బదులుగా సదానంద బాబా తన కుడిచేతి బొటన వేలుతో మునిరత్నం కనుబొమల మధ్య స్పృశించాడు. వెంటనే మునిరత్నం కనురెప్పలు మూతలు పడ్డాయి.

* * * *

మునిరత్నంకి తను మునిరత్నం అని తెలుసు. కానీ చిత్రంగా తను రాబర్ట్ అన్న స్మృతి కూడా వచ్చింది.

తను మునిరత్నమా? లేక రాబర్టా? రెండూ అన్న స్పృహ కలిగింది. అతని కంటిముందా దృశ్యం కనిపించింది. కల్నల్ యూనిఫాంలో వున్న రాబర్ట్ కనిపించాడు. అది తన శరీరమే అని గ్రహించాడు మునిరత్నం.

రాబర్ట్ తనకి చిక్కిన ఫ్రెంచ్ యుద్ధఖైదీని, వాళ్ళ ప్లెటూన్ ఎటునించి ఎటు వెళుతోంది, ఎందరు సైనికులున్నారు, వాళ్ళ పథకం ఏమిటి మొదలైన వివరాలు అడిగాడు. అతను పెదవి విప్పలేదు.

రాబర్ట్ కి కోపం వచ్చింది. తనకింది ర్యాంక్ సైనికుడితో చెప్పాడు.

"వాడు మాట్లాడేదాకా బాక్స్ లో వుంచండి. నే చెప్పేదాకా నీళ్ళు, ఆహారం ఇవ్వకండి."

ఆ ఫ్రెంచి సైనికుడిని బలమైన ఇనుప ఊచలతో నిర్మించిన పంజరంలో వుంచారు. అది సరిగ్గా తనని వుంచిన పంజరం పరిమాణంలో వున్న పంజరంగా గుర్తించాడు మునిరత్నం. ఆ తర్వాత జరిగింది మునిరత్నానికి కనబడకపోయినా, పూర్తి స్మృతి కలిగింది. తను పదహారు గంటలసేపు ఆ ఫ్రెంచ్ ఖైదీకి మంచినీళ్ళు కూడా ఇవ్వకుండా వుంచాడు. వాడు దాహం బాధ భరించలేక తమ ప్లెటూన్ వివరాలు చెప్పాక వాడ్ని విడుదల చేసారు.

తను ఆ రాబర్ట్ అని, బ్రిటన్ కి, ఫ్రెంచ్ నియంత నెపోలియన్ కి జరిగిన యుద్ధ కాలంలో తను బ్రిటిష్ సైన్యంలో పని చేసాడని, ఆ జీవిత వివరాలు మొత్తం మునిరత్నం మెదడులోని సబ్ కాన్షస్ పొరల్లోంచి బయటకి వచ్చి అతని కాన్షస్ బ్రెయిన్ కి అందాయి.

మునిరత్నం కళ్ళు తెరుచుకున్నాడు.

"స్వామీ! నాకు పూర్వజన్మ స్మృతి కలిగింది." ఆశ్చర్యంగా చెప్పాడు.

"ఆ జన్మలో నువ్వు చేసిన ఆ కర్మబంధం ఈ జన్మలో ప్రారబ్ధ కర్మగా నీ ఏభై నాలుగో ఏట అనుభవించాల్సి వుంది. జైలుశిక్ష నీకు రాసిపెట్టి వుంది. ఆ ప్రారబ్ధ కర్మని కొద్దిగా ముందుకు తెచ్చి ఈ విధంగా నువ్వు అనుభవించేలా చేసాను."

మునిరత్నం విభ్రాంతిగా చూస్తూ చెప్పాడు.

"ఆ జన్మలో నేను నా ఉద్యోగరీత్యా, నా ధర్మాన్ని నా దేశంకోసం నిర్వర్తించాను. అయినా ఆ కర్మ నా కంటుకుంటుందా?"

"భగవదర్పణం చేయని ఏ కర్మయినా అంటుకుని తీరుతుంది. నా దేశం అన్నావు. 'నాది' అనుకుని చేసే ప్రతిది కర్మబంధమే అవుతుంది."

"కాని నేను ఫ్రెంచ్ ఖైదీని బంధించింది పదహారు గంటలే కదా స్వామీ? నాకు నెల శిక్ష విధించారేమి?"

"ఇవాళ ఓ విత్తనం పాతితే పదేళ్ళ తర్వాత నీకు లభ్యమయ్యేది ఒక్క విత్తనమేనా?"

"కాదు. అనేక వందల పళ్ళు లభిస్తాయి."

"కర్మ కూడా అలాగే బీజరూపంలో వుండి, అది పక్వానికి వచ్చినప్పుడు ఎన్నోరెట్లు అధికంగా ఫలితాన్నిస్తుంది. నీ విషయంలో అంతే జరిగింది. ఓ క్షణంలో చేసే కర్మ ఫలితం పూర్తిగా అనుభవించడానికి ఒక్కోసారి దాని తీవ్రతనిబట్టి చాలా జన్మలు పడుతుంది."

"స్వామీ! ఆ జన్మలో నా భార్య మేరీ ఇప్పుడెక్కడ వుంది? నా కూతురు హెలీనా ఎక్కెళ్ళిపోయింది?" ఆసక్తితో కూడిన దుఃఖంతో అడిగాడు మునిరత్నం.

"గత జన్మలు గుర్తు రాకుండా దేవుడు ఎందుకు ఏర్పాటు చేసాడో అర్థమైందా? ఈ జన్మలోని సంబంధ బాంధవ్యాలతోనే మనసు సతమతమవుతూంటుంది. ఇంక గత జన్మల బంధాలు కూడా గుర్తుకివస్తే అది మరింత విలవిల్లాడిపోతుందని. అర్థమయిందా?"

సదానందస్వామి తిరిగి మునిరత్నం భృకుటిమీద తన బొటనవేలితో స్పృశించాడు. అతని కాన్షస్ బ్రెయిన్‌లోకి వచ్చిన ఆ సమాచారం మొత్తం మాయమైంది. ఇంక అది అతనికి గుర్తులేదు.

"ఇప్పుడేదో అంటున్నారు స్వామీ?" అడిగాడు మునిరత్నం.

"నీ అంతట నీవుగా ఈ లోకంలో ఏదీ చేయలేవు. నిన్ను ఎక్కడికి చేర్చాలో ఆ భగవంతుడిదే భారం అనుకో."

"ఇన్ని కోట్ల జీవరాశుల గతిని నడపడానికి భగవంతుడు ఒక్కడికే ఎలా సాధ్యం స్వామీ? అయినా ఇన్ని కోట్లమందిలో నేనంటూ అసలు ఒకడ్ని వున్నానని ఆ పరమాత్ముడికి తెలుసో తెలీదో?" సందేహించాడు మునిరత్నం.

"పరమాత్మ విషయంలో ఎలాంటి సందేహాలు వద్దు నీ చుట్టూ వున్న శూన్యం రూపంలో భగవంతుడు సదా నిన్ను గమనిస్తుంటాడు."

"స్వామీ! నాకు చాలా కాలంగా ఓ అనుమానం. భగవంతుడు నిరా

కారుడంటారు కొందరు. కాదు ఆకారం వుంది అంటారు ఇంకొందరు. అసలు ఈ రెండింటిలో ఏది నిజం?"

"రెండూ సత్యమే."

"అదెలా కుదురుతుంది స్వామీ? ఉంటే రూపం వుండాలి. లేదా లేకుండా వుండాలి తప్ప రెండూ ఎలా సాధ్యం అవుతాయి? ఒకటి సత్యం అయితే, ఇంకోటి అసత్యం అయినట్లేగా?"

సదానందస్వామి కొద్దిసేపు కరుణాపూరిత దృష్టితో మునిరత్నంవంక చూసి చెప్పాడు.

"నీకు ఐన్‌స్టీన్ థియరీ తెలుసుగా?"

"తెలుసు. ఈ ఈజ్ ఈక్వల్ టు యం. సి స్క్వేర్."

"సరే! నా ప్రశ్నలకి ఒకోదానికి సమాధానం చెప్తే నీకు భగవత్ తత్వం అర్థమవుతుంది."

ఆయన నేలమీది ఓ గడ్డిపోచని అందుకుని దాన్ని మునిరత్నంకి చూపిస్తూ అడిగాడు.

"దీన్ని చిన్న చిన్న ముక్కలుగా తెంపుతూ పోతుంటే ఏం మిగులుతుంది?"

"అతి చిన్నముక్క."

"సైన్స్ ప్రకారం ఇంకా ఇంకా చిన్న ముక్కలుగా చేస్తే?"

మునిరత్నం ఆలోచించి చెప్పాడు.

"ఆటమ్."

"ఆ అణువులో ఏం వుంటాయి?"

"ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లు."

"సరే. గడ్డిపోచలాగా నీ చొక్కాని కూడా చిన్న చిన్న ముక్కలుగా చేస్తూపోతే చివరికి ఏం మిగులుతుంది?"

"అణువే."

"ఆ చెట్టుని?"

"ఆ చెట్టుని చిన్న చిన్న ముక్కలుగా చేసినా చివరికి మిగిలేది అణువే స్వామీ."

"అ కొండని? అ నీటిని? కనిపించే ఈ సమస్త దృశ్య పదార్థంలో దేన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసినా చివరికి మిగిలేది ఏమిటి?"

"అణువే."

"ఇందాక గడ్డిపోచని చిన్న చిన్న ముక్కలుగా చేస్తే మిగిలేది అణువన్నావు. చెట్టుని విభజించినా అణువన్నావు. కొండని, నీటిని.... ప్రపంచంలోని సర్వదృశ్య పదార్థాన్ని విభజించుకుంటూ పోతే చివరికి మిగిలేదీ అణువేనన్నావు. అవునా?"

"అవును స్వామీ. ఐన్‌స్టీన్ థియరీ అది."

"గడ్డిపోచనించి వచ్చిన అణువుకి, కొండరాతి నుంచి వచ్చిన అణువుకి అలాగే ఏ దృశ్యపదార్థం నుంచి వచ్చిన అణువుకీ ఒకదానికొకటి విరుద్ధంగా ఉంటాయా లేక ఒకటిగా ఉంటాయా?"

"విరుద్ధంగా వుండవు స్వామి. ప్రతీ అణువు ఒక్కలానే వుంటుంది."

"అందులోని ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్లు ఏం చేస్తుంటాయి?"

"ఒకదానితో మరొకటి ఢీ కొనకుండా వేగంగా తిరుగుతూంటాయి."

కేవలం కౌపీనంలో వున్న సదానందస్వామికి ఇంత సైన్స్ ఎలా తెలుసా? అన్న ఆశ్చర్యం వేసింది మునిరత్నానికి.

"ఆ అణువుని కూడా విభజిస్తే ఏం జరుగుతుంది?"

"ప్రేలుడు సంభవిస్తుంది. ఇటీవల అమెరికా వారు హిరోషిమా, నాగసాకి...."

"అదలా వుంచు. ప్రేలుడు సంభవించిందంటే అణువు ఎలాంటిదని అర్థం?"

"శక్తితో కూడినదని."

"దేంతో కూడినదన్నావు?"

"శక్తితో."

"అమ్మవారికి మరో పేరేంటి?"

"శక్తి."

ఇద్దరి మధ్య కొద్దిసేపు మౌనం. సదానందస్వామి సన్నగా నవ్వుతూ అడిగాడు.

"శక్తి అన్నావు. అవునా?"

"అవును స్వామి."

"అంటే ఈ దృశ్య ప్రపంచంలో మనకి కనబడే సమస్తం దేనివల్ల ఏర్పడినట్లు?"

"శక్తి వల్ల."

"నువ్వు ఈశావాస్యోపనిషత్తు కంఠస్థం చేసావు కదా. అందులోని మొదటి శ్లోకం మొదటి పాదం చదువు."

"ఓం ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్।

"దానర్థం ఏమిటి?"

"ఈ అనిత్య జగత్తు మొత్తం, భగవంతుడిచేత ఆవరింపబడింది."

"అంటే ఈ దృశ్య ప్రపంచం దేనినుంచి ఏర్పడినట్లు?"

"భగవంతుడి నించి."

"ఇందాక భగవంతుడిని ఏ పేరుతో చెప్పావు?"

"శక్తి."

"మనం శక్తిని అమ్మవారి రూపంగా కొలుస్తున్నాం కదా! అంటే అర్థం ఏమిటి?"

"శక్తే దేవుడు."

"ఐన్‌స్టీన్ ఈ థియరిని- ప్రతీది ఎనర్జితోనే అంటే శక్తితోనే ఏర్పడిందని చెప్పక మునుపే, మన వేదాల్లో, ఉపనిషత్తుల్లో ఆ విషయాన్ని ఋషులు ధ్యానంలో దర్శించి చెప్పారు. తొలుత ఈ దృశ్య ప్రపంచం ఏర్పడక మునుపు ఈ విశ్వమంతా శక్తితో నిండి వుంది. ఆ శక్తిగల కోటానుకోట్ల అణువులు కలిస్తేనేకదా గడ్డిపోచ కాని, చెట్లు కాని, కొండ కాని, ఈ భూమండలం కాని, దూరంగా వున్న నక్షత్రాలు, సూర్యచంద్రాదులు కాని ఏర్పడింది. కొన్ని అణువులు కలిస్తే గడ్డిపోచ అయింది. మరి

కొన్ని కలిస్తే అది గడ్డిపోచగా కాకుండా కొండరాయి అయింది. లేదా నీరైంది. లేదా అగ్ని అయింది. అవునా?"

"అవును స్వామి."

"అణువులు ఒకటే అయినప్పుడు వస్తువుల్లో తేడా ఎలా వచ్చింది?"

"అణువుల కలయికలోని తేడావల్ల అయివుంటుంది స్వామి."

"కదా? మరి ఆ అణువులకి అలా వివిధ రకాలుగా, తేడాగా కలిసి ఈ భూప్రపంచం, కనిపించే ఈ విశ్వం సృష్టింపబడాలని ఎలా తెలిసింది?"

"ఎలా స్వామీ?"

"దానికి ఆ జ్ఞానం వుండబట్టే కదా?"

"అవును స్వామీ."

"దేవుణ్ని జ్ఞానవంతుడని అంటాం కదా?"

"అవును స్వామీ!"

"అప్పుడు దేవుడు ఎవరైనట్లు?"

"ఆ అణువులు, ఆ శక్తే స్వామీ!"

"అణువు దృశ్యమా? అదృశ్యమా?"

"అణువు కంటికి గోచరించదు స్వామీ. అదృశ్యమే."

"అంటే దేవుడు నిరాకారుడా? ఆకారుడా?"

"నిరాకారుడే స్వామీ! ఆ అదృశ్యశక్తే దైవం."

"ఇక్కడ గుళ్ళో ఓ లింగం వుంది. లేదా అహోబిలం గుళ్ళో సాలగ్రామం వుంది. కేదారనాథ్‌లో ఓ లింగం వుంది. బదరీలో ఓ విగ్రహం వుంది. ఈ దృశ్యపదార్థాలను మనం దైవం అని కొలుస్తున్నాం. ఇవి ఎక్కడనుంచి ఏర్పడ్డాయి?"

"ఆ నిరాకార అణువుల కలయికనుంచే స్వామీ!"

"చాలా క్షేత్రాల్లోని దేవుళ్ళు స్వయంభువులు. అంటే వాటంతట అవి వెలిశాయి అని కదా మనం నమ్మేది."

"అవును స్వామీ!"

"అంటే కంటికి కనిపించని ఆ నిరాకార తత్త్వం మన కళ్ళకి కనిపించే సాకారతత్త్వంగా మారడానికి అలా అవతరించాయి. మనం ఇప్పుడు చెప్పిందంతా క్రోడీకరించుకుని అది నమ్మచ్చా?"

"నమ్మచ్చు స్వామీ!"

"ఇందాక దేవుడు, అయితే నిరాకారుడవ్వాలి. లేదా సాకారుడవ్వాలి. ఒకటి సత్యమైతే, రెండోది అసత్యమన్నట్లేకదా అని కదా నీ అనుమానం. ఇంకా నీకా అనుమానం వుందా?" ప్రశ్నించాడు సదానందస్వామి.

"లేదు స్వామీ! అసలు దేవుడు మొదట్లో నిరాకారే. అందులోంచే సాకారం ఉద్భవించింది. రెండూ సత్యాలే."

"భగవద్గీతలోని ఏడో అధ్యాయంలోని ఏడో శ్లోకం గుర్తుందా?"

"మత్తః పరతరం నాన్యత్ కించిదస్తి ధనంజయా।
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥

"దానర్థం చెప్పు."

"ఓ ధనంజయ! నా కంటెను పరమ కారణమైనది వేరొకటి లేదు. ఈ జగత్తునందలి వస్తువులన్నీ హారంలోని మణులవలె నా యందే కూర్చబడినవి."

"ఇప్పుడు దాన్ని నేను చెప్పిందానితో అన్వయించుకుంటే సరిపోయిందా లేదా?"

"సరిపోయింది స్వామీ! శ్లోకం సూత్రం. మణులు భౌతిక పదార్థాలు. ఆ హారంలో భగవంతుడు కానిదేమీ లేదు."

"ఇది దృష్టిలో వుంచుకుని ఈసారి భగవద్గీత శ్లోకాలు చదువు. సాకారుడైన శ్రీకృష్ణుడు చెప్పిన ప్రతీ శ్లోకం అర్థమవుతుంది. సర్వం, ఖల్విదం, బ్రహ్మం, వాసుదేవసర్వమితి....'భూమిరాపోనలోవాయుః' అనే శ్లోకంలో భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారం అవి నా ప్రకృతి ఎనిమిది విధాలంటున్నాడు కృష్ణుడు. దాన్ని జడప్రకృతి లేదా అపరాప్రకృతి అంటారు. ఇదికాక సంపూర్ణ జగత్తుని ధరించి మరో ప్రకృతి నా జీవరూప 'పరాప్రకృతి' లేదా చేతన ప్రకృతి అంటున్నాడు. వీటి అర్థం ఇదే. మనం ధ్యానంలో అనేక కోట్ల అణువులతో ఏర్పా

మైన ఈ శరీరాన్ని విభజించుకుంటూపోతే, చివరికి ఒకే ఒక అణువు మిగులుతుంది. దాని దర్శనంవల్ల ప్రతీది అణువుల సమ్మిశితమైనదే అన్నది స్ఫురణకి వస్తుంది. అదీ అద్వైత సిద్ధి. అప్పుడు ఎక్కడ చూసినా ఇప్ప డులా దృశ్యప్రపంచం కనబడక, అది ఏర్పడటానికి కారణం అయిన అణువులే దర్శనమిస్తాయి. ఆ అణువులన్నీ తనే కనుక తనకి వేరుగా ఇంకో పదార్థం లేదని గ్రహిస్తాడు ఆత్మ సాక్షాత్కారం పొందిన మనిషి.

'ఏకమేవా ద్వితీయమ్.' అది అద్వైత సిద్ధి పొందేదాకా మనకి ఈ పరంపర తప్పదు. ఓ పరమాణువు చాలాకాలం క్రితం జీవుడిగా మారి శరీరం తీసుకునే జంఝాటంలో పడింది. తను ఆ పరమాణువు అన్న సంగతి జీవుడు మర్చిపోయాడు. ఈ శరీరం తను అన్న అపోహలో పడ్డాడు. ఎప్పుడైతే ఆ పరమాణువు తిరిగి మనకి దర్శనమిస్తుందో తక్షణం మనం జీవుడు కాదు, ఆ పరమాణువు అన్న సంగతి చటుక్కున గుర్తుకి వస్తుంది. ఆ గుర్తుకి రావడమే ముక్తి, మోక్షం, జ్యోతిదర్శనం, కైవల్యం, క్షేత్రజ్ఞతని సాధించడం, చేతనత్వం వగైరాలు. అణువుని విభజించడానికి సైన్స్ యంత్రాలని వాడితే, మనిషి ధ్యానం అనే ప్రక్రియని వాడి, ఆ శక్తి విచ్ఛేదనం జరగకుండా ఆ అణువును సందర్శించగలుగుతాడు. నీకింకేమైనా సందేహాలుంటే అడుగు."

"పంచభూతాల కలయికతో ఈ దృశ్యప్రపంచం పుట్టిందంటారే మరి అణువుల వల్లంటున్నారు మీరు?"

"భౌతిక పదార్థం ఒక్కటీ లేనప్పుడు ఈ విశ్వంలో వుండేది అణువులేగా? దృశ్యపదార్థాలైన ఆ పంచభూతాలు ఎవరినుంచి ఉద్భ వించాయి? అణువులనుంచేగా?"

"అవును స్వామీ!"

"వాటినించి మొదట అణువుకన్నా బరువైన ఆకాశం పుట్టింది. అంటే శూన్యం. ఆ శూన్యంనించి దానికన్నా బరువైన వాయువు పుట్టింది. ఆ వాయువునించి దానికన్నా బరువైన అగ్ని పుట్టింది. ఆ అగ్నినించి దాని కన్నా బరువైన నీరు పుట్టింది. ఆ నీటినుంచి దానికన్నా బరువైన భూమి

పుట్టింది. ఈ ఐదింటి కలయికతోనే ప్రతీ భౌతికపదార్థం తయారయ్యేది. దేన్ని తీసుకున్నా ఇవి వుంటాయి. ఉదాహరణకి ఆ చెట్టుని తీసుకో. అందులో నీరుంది. పిండితే నీరు వస్తుంది. అంటుకుంటే మండుతుంది. మండడం అంటే అందులో అదివరకు వున్న అగ్ని బయటకు రావడమే. వాయువు వుంది. శూన్యమూ వుంది. పిప్పిలా కనిపించేది భూమి. బ్రహ్మ పదార్థం ఇలా భౌతిక జడపదార్థంగా రూపొందింది. దేహాల్లోని ఆత్మ కూడా బ్రహ్మపదార్థమే. దానికి అతీతంగా ఏం లేదు."

"కాని భగవద్గీతలో శ్రీకృష్ణుడు విభూతి యోగంలో తను జంతువు లలో సింహం అని, వృక్షాలలో రావిచెట్టునని, జలాశయాలలో సముద్ర మని, పక్షులలో గరుత్మంతుడనని....ఇలా చెప్తాడుగా?"

"సర్వం ఖల్విదం బ్రహ్మ. ఈ విశ్వంలో ఏదైనా ఉద్భవించింది అంటే అది ఆ బ్రహ్మపదార్థంనించే. అదే అధ్యాయంలో శ్రీకృష్ణుడు ముఖ్యమైన వానిని ప్రాధాన్యతననుసరించి చెపుతూ 'తన వ్యాపకత్వానికి అంతమే లేదని' ముందుగా చెప్పి, కొన్నిటిని వివరించాడు. వీటిలో భగవత్ శక్తి మిగిలిన వాటిలోకంటే అధికంగా వుంటుంది కాబట్టి వీటిని ఉదహరిం చాడు. అందుకే ఆ అధ్యాయం చివరి శ్లోకంలో 'నేనీ సమస్త జగత్తుని నా యోగబలముచే ఒక్క అంశతోనే ధరించి వున్నాను' అని చెప్పాడు. ఈ జగత్తులోని దొంగ పరబ్రహ్మమే. అతన్ని దొంగతనానికి పురికొలిపే భార్యా పిల్లల ఆకలీ భగవంతుడే....అతన్ని పట్టే పోలీసు భగవంతుడే. అతనికి శిక్ష విధించే న్యాయాధికారీ భగవంతుడే....ఆయనే ఇలా వివిధ రూపాల్లో, లోకంలో సంచరిస్తున్నాడు. అది ఆయనకి తెలుసు, ఆయన్ని తెలుసుకున్న వాళ్ళకి తెలుసు. మిగిలిన వారికి తెలీదు కాబట్టి వారిని అజ్ఞానులన్నారు" వివ రించాడు సదానందస్వామి

వారిమధ్య తాత్విక చింతన మరికొద్దిసేపు సాగింది. మర్నాడు ఉద యం హనుమంతప్ప కనబడగానే అడిగాడు మునిరత్నం.

"స్వామే నన్ను ఖైదు చేయమని చెప్పి వెళ్ళారటగా?"

"అవును. పున్నమి నుంచి పున్నమిదాకా చేయమని చెప్పారు"

"ఎందుకుటా?"

"అవేం మేం అడగం. ఆయనా చెప్పరు. ఆయన చెప్పింది వేద
దమే మాకు తెలుసు."

హనుమంతప్ప చెల్లెలు కూడా ఎప్పటిలా రాసాగింది. మునిరత్నం రొటీన్ పూర్వంలా సాగుతోంది. నిద్ర, మెలకువ, కాలకృత్యాల అనంతరం లింగాభిషేకం, ధ్యానం, ఆహారం, ధ్యానం, నిద్ర.

18

మునిరత్నం బ్రహ్మేశ్వరాలయానికి చేరుకున్న ఎనిమిది నెలల హఠాత్తుగా వూడిపడ్డారు అతని తల్లిదండ్రులు. మునిరత్నాన్ని చూసి ఇద్దరూ చలించిపోయారు.

"అబ్బ! ఎంత చిక్కిపోయావురా? కడుపులోని పేగులు చూడు. ఎలా చర్మానికి అతుక్కుని కనిపిస్తున్నాయో!" ఏడుస్తూ చెప్పింది మహాలక్ష్మమ్మ.

మునిరత్నం తండ్రి నరసింహయ్య కొడుకును నిశితంగా చూసి చెప్పాడు-

"వాడి మొహం సరిగ్గా చూడు. ఇదివరకటి మొహం కాదు. ఎంతో కళగా వుంది."

"అవునండి. కళ్ళు కూడా."

ఆవిడ తనతో తెచ్చిన తినుబండారాలను కొడుక్కి పెట్టాలని బయటకి తీసింది. కాని మునిరత్నం వాటిని సున్నితంగా నిరాకరిస్తూ చెప్పాడు.

"అపక్వాహారానికే అలవాటుపడ్డాను. వండినవి తింటే నాకు అనారోగ్యం చేస్తుంది."

ఆవిడ ఎంత బ్రతిమాలినా వాటిని ముట్టలేదు. కొన్ని కోతులకి వేసి మిగిలినవి చెంచులకిచ్చేసాడు. మునిరత్నం అక్కడున్నాడని ఎవరో చెప్తే వచ్చారు వాళ్ళు. ఇంటికి రమ్మని ఎంత బ్రతిమాలినా రానన్నాడు. వాళ్ళకి తనమీద గల మమకారబంధానికి కించిత్ చిరాకు కూడా కలిగింది మునిరత్నానికి. ఇద్దరికీ తత్త్వబోధ చేసాడు. కాని వాళ్ళకది ఎక్కలేదు.

నరసింహయ్యకి మాత్రం తన కొడుకు ఆధ్యాత్మికంగా ఎదుగుతున్నాడని అతని రూపురేఖలని బట్టి తోచింది. ఇదివరకటిలా ఉద్వేగంగా కాక ప్రతిమాట తూచి తూచి ఎంతో నెమ్మదిగా మాట్లాడటం గమనించాడు. గతంలోలా తనెంత కఠినంగా మాట్లాడినా అందులో ఒక్క పొల్లుమాట కూడా లేదు.

ధ్యానంలో వున్న తన కొడుకు భూమికి కొన్ని అంగుళాలపైకి లేచి వుండడం, అర్ధరాత్రి కాలకృత్యానికి లేచిన మహాలక్ష్మమ్మ గమనించి, ఆశ్చర్యపోయి తన భర్తని వెంటనే నిద్రలేపి చూపించింది. ఆయన కూడా ఆ దృశ్యాన్ని అబ్బురంగా చూసి చెప్పాడు.

"మొదటి చక్రమైన మూలాధారం పూర్తిగా శుద్ధిఅయిన వారికిలా జరుగుతుంది. మా రామావతారం కూడా ధ్యానంలో ఇలాగే లేచేవాడు. నాకు చెప్పాడోసారి. మూలాధారంలో నిక్షిప్తమై వుండే కర్మలు భస్మం చేసుకోవడానికే కొన్ని జన్మల కాలం పడుతుందని. వీడు కొన్ని జన్మలుగా యోగి అయి వుంటాడు."

ఆవిడ ఆశ్చర్యంగా చూస్తుంటే చెప్పాడాయన మళ్ళీ.

"వీడు మన కుటుంబంలో పుట్టడానికి కారణం మన వంశానికున్న పుణ్యం కావచ్చు. అనిపిస్తోంది. వీడు పుట్టక మునుపే వీడు సన్యాసవుతాడన్నది దైవ నిర్ణయంగా తోస్తోంది. నాకిప్పుడు ఆనందంగా వుంది. వీడు సద్గతి దారిలోనే వున్నాడు తప్ప కాలం వృధాచేసుకోవడం లేదు."

మర్నాడు ఉదయమే వాళ్ళు ట్రాక్టర్‌లో తిరిగి వెళ్ళిపోయారు. తనని చూడడానికి ఎవర్నీ రావద్దని చెప్పమని, ఎవరైనా వచ్చి వెళుతుంటే, తనకి ధ్యానభంగం కలుగుతుందని గట్టిగా చెప్పాడు మునిరత్నం వాళ్ళకి.

• • • •

బ్రహ్మేశ్వరాలయానికి వచ్చిన దాదాపు పధ్నాలుగు నెలలకి మునిరత్నంలో చిన్న మార్పు సంభవించింది. అది అతనికి ఎంతో కలతగా వుంది.

అతని శరీరంలోకి కొన్ని అంగాల్లో వికృతమైన క్రియలు, ఇంద్రి వికారాలు కలగసాగాయి. అంతదాకా లేని విషయవాంఛ అకస్మాత్తుగా ము రత్నాన్ని ఆవరించుకుంది. తరచు అతనికి జరిగే ఓ క్రియ ఎంతో సిగ్గ తోచేది.

ఇంద్రియ ప్రవృత్తి బహిర్ముఖమైంది. వాంఛ- వాంఛ- వాంఛ. అదొక్కటే ధ్యానంలో వుండగా అతనికి వచ్చే స్ఫురణ. ఆ కామం కూడా ఎంతో బలంగా కలిగింది. ఇంద్రియాలు అతని మనస్సుకి ఎదురుతిరిగి గోం చేసేవి. క్రమేపీ అతనికి ధ్యానంలో జ్యోతి కనబడడం కనుమరుగై ఆ స్థానంలో ఓ నగ్నయువతి దర్శనం కలిగేది. అది కనబడగానే సిగ్గ పడుతూ చటుక్కున కళ్ళు తెరిచేవాడు. అయితే కాసేపాగి కళ్ళు మూసు కున్నా మళ్ళీ అదే దృశ్యం.

ఆ అందమైన యువతి సాధారణంగా చెంచుల్లోని ఎవరో ఓ స్త్రీఅయి వుండడంతో ఇంకాస్త సిగ్గుపడేవాడు. ఒక్కోసారి బాల్యంలో తను చూసిన వారో, తన పూర్వాశ్రమంలో తెలిసినవారో అయి వుండేవారు.

అతనికి అలాంటి కోరిక క్రమంగా బలవత్తరం కాసాగింది. తీవ్ర తంగా వచ్చే ఆ కోరికతో అతని ధ్యానం ఆగిపోయేది. కళ్ళు తెరిచి కాసే అటు ఇటు పచార్లుచేసి మళ్ళీ ధ్యానానికి కూర్చున్న కొద్దిసేపటికి తిరిగి అదే దృశ్యం. అదే కోరిక.

తన పరిస్థితి ఇంత అధ్వాన్నంగా మారుతుందని మునిరత్నం ఎన్నడూ అనుకోలేదు. క్రమంగా ధ్యానం చేయని సమయాల్లో కూడా పడ్డన్నా మనసు తనకి కనబడ్డ ఆ నగ్న స్త్రీల గురించి వివిధ రకాలుగా ఆలోచించేది.

ఓ రోజు బ్రహ్మేశ్వరాలయంలోకి వెళ్ళి లింగం ముందు మొర పెట్టు కున్నాడు.

"స్వామీ! నిన్ను సాక్షాత్తు అశ్వత్థామ ప్రతిష్ఠించాడంటారు కదా. బలమైన విరాగివైన నువ్వున్న ఈ పవిత్ర స్థలంలో నాలో ఎందుకు అపవిత్ర తలంపులు? తాతాజీతో చెప్పుకుంటే సిగ్గుచేటు. నా నిగ్రహంటిక

కం పోతోంది. వాళ్ళు నన్ను పంజరంలో వుంచింది ఈ సమ స్తైనా బావుండేది. నన్ను మీరే కాపాడాలి స్వామి."

అయినా ఉపయోగం లేకపోయింది. ధ్యానం, నగ్నస్త్రీ ప్రత్యక్షం.... లా సైగలుచేసే ఆమెని చూడగానే ధ్యానభగ్నం.... కాసేపటికి ఇదే మొదలు. సిగ్గుపడే విషయాలు అతనిలో జరిగేవి. వెంటనే లేచే హావభావాలతో, చూపులతో కవ్వించే ఆ స్త్రీ రూపం అతన్ని వెంటా

మునిరత్నంలో దుఃఖం కలగసాగింది. కామస్మరణే ధ్యానం అయి యింది. దాంతో దిగులు, విచారం. స్త్రీలని చూడాలంటేనే భయంగా తనికి. నిగ్రహం కోల్పోయి వాళ్ళతో ఎలా ప్రవర్తిస్తానో అనిపించ సింది. ఓరోజు కామదేవుడైన మన్మథుడ్ని ప్రార్థించాడు.

"స్వామీ, దయచేసి నన్ను వదిలిపెట్టు. నామీద ప్రయోగించిన బాలని ఉపసంహరించు. నేను కాలుజారితే మళ్ళీ కొన్ని జన్మలదాకా ఫలితం అనుభవించాలి. ఈ జనన మరణ చక్రం నుంచి బయటపడా నుకుంటున్న నన్ను మళ్ళీ ఆ చక్రంలోకి ఇంకాస్త కూరుకుపోయేలా యకు. నన్ను కరుణించు స్వామి."

అయన్ని మనసారా ప్రార్థించి, ధ్యానానికి కూర్చున్న కొద్దిసేపటికే నిరత్నం ఇంద్రియం విజృంభించింది. ఉపస్థేంద్రియం పైకి లేచి నాభికి గడవని అక్కడ కొద్దిసేపు వుండిపోయింది.

అది చూసి మునిరత్నంకి ఆగ్రహంతో పిచ్చిపట్టినట్లయింది. లేచి గుడుబావిలోకి అమాంతం దూకాడు. చాలాసేపు ఆ నీళ్ళలో ఈత తూ చక్రాలు తిరిగాడు. శరీరం పూర్తిగా అలసిపోయాక, ఇక ఈద ని స్థితిలో నీరసంగా పైకి వచ్చాడు. అతనికి దుఃఖం ముంచుకు వచ్చింది. ఏడవసాగాడు.

హనుమంతప్ప అది చూసి పరిగెత్తుకెళ్ళి తాతాజీతో చెప్పాడు. తాజీ పకపక నవ్వుతూండిపోయాడు.

మధ్యాహ్నానికల్లా మునిరత్నానికి ఎన్నడూ కలగనంత తీవ్రమైన కామవాంఛ కలిగింది. వెంటనే అతనికి చెంచు స్త్రీలలో ఒకామె పడే పడే

గుర్తుకు రాసాగింది. ఆమె తనవంక ఎప్పుడూ ఆదరంగా చూస్తూంటుంది కాబట్టి....

మునిరత్నం ఆ క్షణంలో నిర్ణయం తీసుకున్నాడు. తను అక్కడే వుంటే అనర్థం తప్పదు. ఏదో చేసి కాని వూరుకోలేడు. వెంటనే ఆ ప్రదేశాన్నించి ఎంతదూరం అయితే అంత మంచిదని అనిపించింది. ఎక్కడికి వెళ్ళాలి? అన్న ఆలోచన కూడా చేయకుండా, ఆఖరిసారి బ్రహ్మేశ్వరి దర్శనానికి వెళ్ళాలన్న యోచన కూడా లేకుండా, ఉన్న పళాన తను ఉద్వేగంతో నిండిన దుఃఖంతో వచ్చిన దారిపట్టాడు.

బాగా చీకటిపడ్డాక దగ్గరగా దీపాలు కనిపించాయి. నడకతో అలసిన మునిరత్నం మనుష్యులున్న ఆ ప్రదేశానికి వెళ్ళదలచుకోలేదు. అక్కడా స్త్రీలుంటారు. అతను ఓ చెట్టుకింద నిద్రకి ఉపక్రమించాడు. వెంటనే నిద్ర పట్టేసింది.

• • • •

నాలుగురోజులు నడిచి మునిరత్నం సరాసరి ఓంకారేశ్వరాలయానికి చేరుకున్నాడు. నంద్యాలకి పదిహేను కిలోమీటర్ల దూరంలో అడవిలో వున్న అది చాలా ప్రాచీన ఆలయం. ఎక్కడికి వెళ్ళాలన్న ఆలోచనకి జవాబుగా మనసు ఓంకారేశ్వరాలయం మీదే అధికంగా లగ్నం కావడంతో అక్కడికి చేరుకున్నాడు.

ఆలయం ఎదురుగా కోనేరు. దానికి ఎదురుగా అటు ఇటు రాతి పలకలతో వందలఏళ్ళ క్రితం నిర్మించిన విశ్రాంతి మందిరాలు. అడవి ప్రాంతం కనుక మామూలు ప్రజలు రారు. వాటిల్లో అయిదారుగురు సాధువులున్నారు.

మునిరత్నం ఓంకారేశ్వరుని దర్శనం చేసుకుని ప్రార్థించాడు.

"స్వామీ! అక్కడా నువ్వే, ఇక్కడా నువ్వే. ఎక్కడకెళ్ళినా నువ్వే. కాబట్టి నా కోరిక ఏమిటో నీకు తెలుసు. దయతో నన్ను బాధించద్దని మన్మథుడికి చెప్పి ఈ ఆపత్తులోంచి బయటపడేలా చెయ్యి స్వామీ."

మునిరత్నం ఓ విశ్రాంతి మందిరం శుభ్రం చేసుకుని ధ్యానంలో కూర్చోబోతుండగా ఓ యోగి అతని దగ్గరకి వచ్చాడు. ఆయన బట్ట జడలు కట్టి వుంది. ఆయన చెప్పాడు.

"నీ దగ్గర రెండు రూపాయలుంటే ఇవ్వు."

"లేవు."

"సరే. నీ స్థితి బావుంది. ధైర్యంగా ధ్యానం చేసుకో."

"ఎందుకలా అనిపించింది మీకు? నా స్థితి బాలేదని నాకు తెలుసు" చెప్పాడు మునిరత్నం దుఃఖంగా.

"నీ మొహం చూస్తే సగం తెలుస్తోంది. శివశక్తి నీ మొహంలో కొట్టొచ్చినట్లుంది. "నీ స్థితి ఎందుకు బాగా లేదంటున్నావు?" ప్రశ్నించాడాయన.

ఆయన పూర్తిగా కొత్తవాడు కాబట్టి మొహమాటం లేకుండా తనకి కలిగిన తీవ్ర స్త్రీవాంఛ గురించి వివరించాడు. మధ్యలో అతని కంఠం దుఃఖంతో పూడుకుపోయింది. మొత్తం విన్నాక చెప్పాడాయన.

"ఆనందపడాల్సిన విషయానికి దుఃఖపడతావెందుకు? నిన్నే కామపిశాచి ఆవహించలేదు. స్వాధిష్టానచక్రాన్ని కుండలినిమాత దాటుతున్న సూచన ఇదంతా. ఆస్వాధిష్టానచక్రభేద సమయంలో మనిషి తట్టుకోలేనంత కామప్రకోపం కలుగుతుంది. ఎంతకాలమైంది నువ్వు ధ్యానంలోకి వచ్చి?"

మునిరత్నం క్లుప్తంగా జరిగిందంతా చెప్పాక ఆయన చిరునవ్వుతో చెప్పాడు.

"అదృష్టవంతుడివి. ఏడాదిన్నరలోగా రెండు చక్రాలు దాటగలిగావంటే, ఈ జన్మలో నువ్వు దేవుడివి అవుతావు. భయపడద్దు. ఈ స్థితి ఎక్కువకాలం వుండదు. నీ ఇంద్రియం పైకి లేచి బొడ్డుకి తాకిందంటే అది ఊర్ధ్వరేతస్కతకి గుర్తు. నీలోని రేతస్సు బయటకి రాక పైకి పోతోంది. అది మస్తిష్కాన్ని చేరుకోగానే నీ మేథానాడి బలపడి అమోఘమైన జ్ఞాపకశక్తి కలుగుతుంది."

అక్కడున్న ఒకరిద్దరు సాధువులు కూడా విషయం తెలుసుకుని ఆయన చెప్పింది నిజమని బలపరిచారు. మునిరత్నం మనసు కుదుటపడింది.

• • • •

మునిరత్నంకి ఓంకారేశ్వరాలయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధన బాగా జరగసాగింది. ఆలయం ఆవరణలోని చిన్న కొలనులో చిన్న చేపలు ఉండబట్టి నీరు పరిశుభ్రంగా వుంటుంది. ఓ బావి కూడా వుంది. ఆ అడవిలో చుట్టుపక్కల చెట్లమీది పళ్ళు అతనికి ఆహారంగా సమకూరేవి.

ఆ ఆలయానికి భక్తులు వారానికి ఒకరిద్దరు మించి వచ్చేవారు కారు. దాంతో గర్భగుళ్ళో లింగం పక్కనే కూర్చుని ధ్యానం చేయసాగాడు మునిరత్నం.

క్రమేపీ మునిరత్నానికి ధ్యానంలో కలిగే ప్రశాంతత శాతం పెరగసాగింది. తరచు ధ్యానస్థితిలో కనుబొమల మధ్య వెలుగు కనిపించేది. కనుగుడ్లు పైకి భృకుటివైపు వెళ్ళేవి. ధ్యానానికి కూర్చున్న కొన్ని గంటలకి లేస్తే తన శరీర బరువు కించిత్ తగ్గిన భావన కలుగుతూండేది. ఇదివరకటిలా ధ్యానంలో ఆసనాలు రావడం తగ్గి స్థిరంగా కూర్చోగలుగుతున్నాడు.

అక్కడ పొట్టకూటి కోసం కాషాయం ధరించినవారు ఒక్కరూ లేరు. అంతా మోక్ష కాంక్ష తీవ్రంగా కలవారే. ఒకరిద్దరు సాధువులు గురువు సలహాననుసరించి అక్కడికి ధ్యానానికి వచ్చినవారు. వారిలో ఎఫ్.ఏ.దాకా చదివిన వాళ్ళు వున్నారు.

వారందరిలోకీ సీనియర్ స్వామి చిద్విలాసానంద. ఆయన అనాహతం దాటి విశుద్ధకి చేరుకునే స్థితిలో వున్నాడు. రైల్వేలో ఇంజనీరుగా చేస్తూ, అది వదులుకుని సన్యసించి ధ్యానజీవితంలో పడ్డాడు. సంస్కృతం క్షుణ్ణంగా చదువుకున్నాడు. అతనికి శాస్త్రజ్ఞానం అపారంగా వుంది.

ఆయన అధ్వర్యంలో అంతా కలిసి వండుకుని మధ్యాహ్నం మూడుకి భోజనం చేసేవారు. ఏకభుక్తం కాబట్టి మళ్ళీ మధ్యాహ్నం మూడుదాకా భోజనం వుండదు.

"స్వామీ! మధ్యాహ్నం పన్నెండులోగా భోజనం చెయ్యాలి. ఆ తర్వాత చేస్తే అది పిండాకూడుతో సమానం అంటారుగా? అందుకే తద్దినం భోజనం పన్నెండు తర్వాతే తింటారు కదా?" ప్రశ్నించాడు ఓ సాధువు.

"గృహస్తుకి తప్ప సన్యాసులకి ఆ నియమం లేదు. మధ్యాహ్నం మూడుకి తింటే, రాత్రికి, మర్నాడు ఉదయానికి కూడా శక్తి శరీరంలో నిల్వ వుంటుంది. కాబట్టి యోగసాధకులు ఏకభుక్తం మీద వుండేటట్లయితే, మధ్యాహ్నం మూడుకి తినడం ఉత్తమం. మా గురువుగారి ఆశ్రమంలో ఆ వేళకే సాధకులకి భోజనం పెడతారు."

నంద్యాలకి చెందిన ఒకావిడ వీళ్ళకి నెలకి సరిపడా ఆహారపదార్థాలు ఓసారి ట్రాక్టర్ లో పంపుతూంటుంది. పాలు, పెరుగు సమీప గ్రామస్థులు తెచ్చిస్తారు.

గాడిద, గాడిద కలిస్తే తన్నుకుంటాయి. అదే భక్తుడు, భక్తుడు కలిస్తే దేవుడి గురించి మాట్లాడుకుంటారు. ఆ ఆలయంలో దిన చేసే వారంతా ముక్తి కోరి ధ్యానం చేసే ముముక్షువులే. రోజూ వారు భోజనానంతరం కొద్దిసేపు దైవం గురించి, దైవాన్ని చేరే మార్గాల గురించి మాట్లాడుకునేవారు. మునిరత్నం ఆ చర్చల్లో పాల్గొనకుండా మౌనంగా ఆ సంభాషణలని వినేవాడు. ఆ విధంగా అతనికి గతంలో లభ్యంకాని సత్సాంగత్యం కూడా ఓంకారేశ్వరస్వామి ఆలయంలో లభించసాగింది.

"మాయ అంటే ఏమిటి?"

"పంచభూతాలతో తయారైన ఈ ప్రపంచంలోని వాటిమీద గల మమకారమే మాయ అంటే."

"అదెలా? నేను నిత్యం గ్రామంలోని కోతులకి అరటిపళ్ళు తీసుకెళ్ళి వేస్తూండేవాడిని. వాటిమీద నాకు మమకారం లేదు కదా?"

"అది దయ. స్వంత వారిమీద గల మమకారం మాయ. ఇతర జీవాలమీద గల ప్రేమ దయ. దయవల్ల సమదృష్టి ఏర్పడి మాయనించి అది మనల్ని దూరం చేస్తుంది. అందుకే 'దయ మోక్షద్వారం' అన్నారు. మాయ ఆ ద్వారబంధం. దయ చిత్తశుద్ధిని, తద్వారా జ్ఞానాన్ని కలిగిస్తే, మాయ అజ్ఞానాన్ని వృద్ధిపరుస్తుంది. మా గురువుగారు చెప్పిన ఈ కథ వింటే, మాయ అంటే ఏమిటో తెలుస్తుంది...." స్వామి చిద్విలాసానంద చెప్పేది అంతా శ్రద్ధగా వింటున్నారు.

"ఓ రాజుగారు పొరుగు దేశం మీదకి యుద్ధానికి వెళ్ళాడు. కొంత మేర గెలుచుకుని తన సైనికదళాలతో ఆ దేశంలోకి ప్రవేశించాడు. తన గుర్రాలకి మేత అవసరమై ఓ గ్రామస్థుడ్ని పిలిచి, గుర్రాలకి మేత వేయ డానికి అనువైన పచ్చటి పంటగల పొలాన్ని చూపించమని కోరాడు. అతను సరేనని, వాళ్ళని వెంటతీసుకుని ఆ గ్రామానికి బాగా దూరంగా వున్న ఓ పొలం దగ్గరకి తీసుకెళ్ళాడు. అప్పుడు ఆ రాజు ఆశ్చర్యంగా 'ఓయీ! దీనికన్నా పచ్చటి పంటగల ఎన్నో పొలాలని దాటాం కదా? దారిలో వున్న ఆ పొలాలన్నింటినీ కాదని ఇక్కడికే ఎందుకు తెచ్చావు?' అని కోపంగా ప్రశ్నించాడు. దానికా గ్రామస్థుడు "అయ్యా! అవన్నీ నా పొలాలు కావు. మీరెలాగూ వీటికి సొమ్ము చెల్లించరని నాకు తెలుసు. నాది కానిదాన్ని మీకెలా దానం చేయగలను? ఇది నా పొలం కాబట్టి మీ గుర్రా లకి నా పంటని మేపడంవల్ల నాకు కలిగే నష్టానికి ఫర్వాలేదు. నా ఇరుగు పొరుగుకి ఆ నష్టం వాటిల్లడం నేను సహించలేక ఇంతదూరం మిమ్మల్ని తెచ్చినందుకు క్షమించండి" అని జవాబు చెప్పాడు. తనకి నష్టం వాటిల్ల కూడదని ఇతరుల పొలాలు చూపించడం మాయ. ఇతరులకి నష్టం కలగ కుండా తన పొలాన్ని వాళ్ళకి ఇవ్వడం దయ."

"ఈ ప్రపంచంలో అన్నీ దేవుడి సృష్టే కదా?"

"అవును."

"పళ్ళు, పూలు కూడా."

"అవును."

"మరి దేవుడివైన వాటిని దేవుడి పూజకి వుపయోగించడంలో అర్థం లేదు కదా?"

"ఓ యజమాని తన తోటకెళితే అక్కడ పనిచేసే తోటమాలి కొన్ని చక్కటి పళ్ళు యజమానికిచ్చి, 'అయ్యా! మీ కోసం వీటిని ఇందాకే కోశాను' అని ఆప్యాయంగా చెప్తే పనివాడికి తనమీద గల ప్రేమకి సంతో షిస్తాడా లేదా?"

"సంతోషిస్తాడు."

"పూజ కూడా అంతే. వాటి హక్కుదారు తను అన్న సంగతి పళ్ళి కోట యజమాని విస్మరించి సంతోషించినట్లే దేవుడు సంతోషిస్తాడు."

ఓ సాధువు ఓసారి తనకి కలిగిన చిత్రమైన అనుభవం చెప్పాడు. అతను రోజూ మఠంలోని తన ఇష్టదైవం అయిన పార్వతి అమ్మవారికి ఏదో ఒకటి నైవేద్యం పెడుతుండేవాడు. ఆ రోజు ఏం దొరక్క నిమ్మ పండు నైవేద్యం పెట్టాడు. పుల్లగా వుంటుంది కాబట్టి దాన్ని ఆమె ప్రసాదంగా స్వీకరించలేదు. ఆ రాత్రి అతను తనకి దొరికిన జామపండు తింటే, అది నిమ్మపండులా పుల్లగా వుంది.

మనం తినేందుకు ఇష్టపడనిది దేవుడికి నైవేద్యం పెట్టకూడదన్న సంగతి అతనికి వెంటనే స్ఫురించి చెంపలు వేసుకుని, తెలియక చేసిన అప రాధం క్షమించమని కన్నీళ్ళతో అమ్మవారిని వేడుకున్నాడు.

ఓ రోజు సమీప గ్రామంలోని వారు ఆ సాధువులందర్నీ దీపావళికి భోజనాలకి ఆహ్వానించారు. మునిరత్నం అపక్వాహారమే తింటాడని వాళ్ళకి తెలుసు కాబట్టి అవే కోసిపెట్టారతనికి. ఆ రోజు వాళ్ళు వేసిన విస్తళ్ళు చూసి "నాకు బంగారు కంచంలో పెడితే కాని తినను" అన్నాడు చిద్వి లాసానందస్వామి.

ఆ ఇంటివాళ్ళు బిత్తరపోయారు. మిగిలిన సాధువులు ఇంకా-

అతను నవ్వి చెప్పాడు-

"బయట కొన్న ఈ ఆకులు మాకు దేనికి? మీ దొడ్లోని అరటి ఆకుల్లో పెట్టండి చాలు. లోపలి భాగం పచ్చబడితే ఆ అరటి ఆకులని స్వర్ణ పత్రం అని అంటారు. పండిన ఆకుని నాకు వెయ్యండి."

అతని చతురతకి అంతా నవ్వారు. ఆ ఇంటావిడ తనకున్న సందే హాన్ని అడిగింది.

"స్వామీ! మొన్నోరోజు హరికథలో శాస్త్రిలుగారు సొరకాయ. బీరకాయలు తినకూడదని, అవి సాత్విక కూరగాయలు కావని చెప్పారు. అవి [illegible] తప్పా?"

చిద్విలాసానంద స్వామి ఆ సందేహాన్ని ఇలా తీర్చారు.

"అమ్మా! అందులో కొంత నిజం వుంది. కాని పాటించదగ్గ నిజం కాదు. అసలు సూత్రం 'బహూ బీజ ఫలాని తర్కమేత్' అని. అంటే అనేక గింజలు గల ఫలాలనికాని, కూరగాయలని కాని వదలవలెను అని. అనేకం అంటే ఎన్ని? ఏకవచనం, ద్వివచనం, బహువచనం అన్నారు. అంటే రెండు దాటితే అవి ఎక్కువ అనర్థం. మూడుకాని అంతకు ఎక్కువ కాని గింజలున్నవాటిని తినకూడదని శాస్త్రం అనుకోకూడదు. బహూ అంటే లెక్కపెట్టలేనన్నిగా స్వీకరించాలన్నారు. దీనిమీద భాష్యంచెప్పినవారు బీర, ఆనప,సొరకాయల్లోని గింజలు ఓపికగా లెక్కపెట్టగలమేమోగాని, వంకాయ లోని గింజలు లెక్కపెట్టడం ఎవరి తరమూ కాదు. అందుకే ఆబ్దీకాల్లో వంకాయ పరమ నిషేధం. ఎన్నో రోగాలని వంకాయ వృద్ధి చేస్తుంది కూడా. ప్రతి కూరగాయలో వాతం, పిత్తం, శ్లేష్మలలో ఏదో ఒకటి వృద్ధిచేసే గుణాలుంటాయి. ఈ మూడు ఆరోగ్యానికి హానికరం. అందుకని కొన్ని రకాల కూరగాయలని కలిపి వండి తింటే, ఓదాని దోషాన్ని ఇంకోటి హరించివేస్తుంది. శాస్త్రంలో చెప్పిన ఈ విషయం ఆచరించాలనుకుంటే మనకి తినడానికి సరైన కూరఫలం దొరకనే దొరకదు. తినే ఆహారానికి మూడు నియమాలు పాటించాలని శాస్త్రం. ఒకటి— అన్యాయార్జితం కాకుండా, నిజాయితీగా సంపాదించిన ధనాన్నే అందుకు వుపయోగించాలి. రెండు— కేవలం మనకోసమే వండుకోకుండా, ఇతరులకి కూడా పెట్టి తినాలి. కనీసం కాకికో, పిల్లికో, కుక్కకి అయినా పెట్టి తినాలి.

మూడు— దేవుడికి నైవేద్యం చేసి, దాన్ని పవిత్రంచేసాక తినాలి.

నాలుగోది— కావాలంటే కూడా చెప్పుకోవచ్చు. 'ఎంత భండారంగా చేసావ్ వంట?' అని భర్త విస్తరి ముందునించి లేచిపోకుండా వుండేలా రుచిగా చెయ్యాలి" నవ్వి చెప్పాడు ఆయన ఆఖరి అంశం.

"అర్థమైంది స్వామీ" చెప్పిందా ఇల్లాలు.

పకపకా నవ్వి చెప్పాడు చిదానందస్వామి.

"అమ్మా! నీకు హరికథలో ఆనపకాయ, బీరకాయల గురించి చెప్పిన తను ఇలాంటివాడని నేనారోపించడంలేదు. కాని దీనిమీద ఓ పిట్ట కథ వుంది. ఓసారిలాగే ఓ హరిదాసుగారు జోరుగా పురాణ కాలక్షేపం

చెపుతూ, ఆనపకాయ తినకూడదని చెప్పాడు. తన పొలంనించి ఆనప కాయలు ఇంటికి కోసుకెళ్తూ, ఆ కథ వినడానికొచ్చిన ఓ రైతు 'అయితే ఇవి నాకెందుకు?' అనుకుని ఆ హరిదాసుకి యిచ్చి చక్కాపోయాడు.

మర్నాడు ఉదయం హరిదాసు భోజనానికి కూర్చున్నాక, 'ఏమే, ఆనపకాయి పులుసేది? ఆనపకాయ కూరేది?' అని అడిగాడట. అదేమి టండీ? నిన్నరాత్రి మీరేగా చెప్పారు ఆనపకాయ తినకూడదని. అందుకే వండలేదు అంటే, ఆ హరిదాసుగారు 'అది ఊళ్ళో వాళ్ళకిగాని మనకికాదు. రాత్రికి పాలుపోసి ఆనపకాయ కూరచేసి, పులుసులో ఆనప ముక్కలు పెరుగులోకి నంజుకోడానికి వెయ్యకపోయావో నేను భోజనం ముట్టను' అన్నాట్ట."

అంతా పగలబడి నవ్వారు.

ఓ పిల్లి 'మ్యావ్ మ్యావ్'మంటూ తిరుగుతూంటే, ఆ ఇంటాయన కోడలు దాన్ని అదిలించి పంపుతూ-"పాడు పిల్లి. పాలుబ్రతకనివ్వదు" అని తిట్టడం విన్న చిద్విలాసానందస్వామి ఆమెని పిలిచి చెప్పాడు బాధగా.

"అమ్మా! ఋణానుబంధ రూపేణ 'పశు, పత్ని సుతాలయః' అని ఓ సూక్తి. దానర్థం మనం ఋణపడ్డవాళ్ళే. ఆ ఋణాన్ని తీర్చుకోడానికి భార్య, కొడుకు, పశువుల రూపంలో మనకి సంప్రాప్తిస్తారు. ఎప్పుడూ మన ఇంటికి వచ్చే జంతువుల నలా వెళ్ళగొట్టకూడదు. ఇంతమందికి భోజనం పెడుతున్న మీరు దానికింత పాలుపోసే శక్తి లేదామ్మ పూర్వజన్మలోఅది నీ తండ్రో, తల్లో, తాతో, సోదరో ఎవరోఅయి వుండచ్చని, ఆకలితో వచ్చిన ఏ జంతువుని చూసినా అనుకుంటూండమ్మా. కర్మ పరిపాకానికే జంతు వులు మనకి తారసపడతాయి."

భోజనాలయ్యాక తిరిగి వస్తూంటే, ఆ గ్రామస్థుల్లో ఒకరు తమని తిట్టడం విన్నారు వాళ్ళు.

"అందరూ దొంగ సాధువులే. పొట్టకూటి స్వాములు."

"ఏమైంది తిడుతున్నారు?" అడిగాడు వాళ్ళలో ఒకరు.

"ఎన్నడూ లేనిది శుభ్రంగా తోమిన నా రాగిచెంబు ఇవాళ ఎలా మాయమౌతుంది, దొంగ సన్యాసులు కాకపోతే?"

ఘర్షణ పెరిగి ఆ సాధువు కోపంగా అతనికి ఎదురుచెప్పి కలబడ బోయాడు. మునిరత్నం అతన్ని వారిస్తూ చెప్పాడు.

"అతని మాటలకి ఓర్పుకుంటేనే మనం నిజమయిన సాధువులం. నీకు ఆ ఓర్పు లేకపోతే నువ్వు నిజంగా అతనన్నట్లు దొంగసాధువుకిందకే వస్తావు."

తమలో 'చెడు' ఉన్నవారికి మనలో 'చెడు' కనిపిస్తుంది. అందుకు మన తప్పేముంది? తమలో 'మంచి' ఉన్నట్లుంటే మనలో 'మంచి' కని పించి వుండేది. అందుకు మన ఒప్పేముంది? ఎవరి తప్పులు వారివేకదా! అందువల్ల ఎవరో ఏదో అన్నారని తిరిగి అని, చెడకండి. ఇదే నిష్ఠ, ఇదే మంత్రం."

"ఎవరైనా మనల్ని తిడితే వాళ్ళకి నమస్కరించాలి. దానికంటే, మనం ఎంత ఇంద్రియ నిగ్రహం సాధించామా, వాళ్ళ కోపాన్ని శాంతంగా భరించగలిగే స్థితికి చేరుకున్నామా లేదా అని వాళ్ళు మనకి ఎలాంటి రుసుము తీసుకోకుండా పరీక్ష పెడుతున్నందుకు" చెప్పాడు స్వామి చిద్విలాసానంద చిరునవ్వుతో.

ఆ సాధువు తన ప్రవర్తనకి సిగ్గు పడ్డాడు.

"స్వామీ! దేవుడు అరూపుడా లేక రూపం గలవాడా?" చాలామందికి వచ్చే సందేహాన్నే ప్రశ్నించాడు ఓ సాధువు.

"అష్టాదశ పురాణాలని, భగవద్గీతని, మహాభారతాన్ని రాసిన వ్యాసుడు ఓ శ్లోకంలో ఇలా చెప్పాడు.

'ఓ పరబ్రహ్మరూపమా, దేవుడికి రూపం వుందని కావ్యాలు, పురాణాలు రాసిన నేను గొప్ప అపరాధిని. ఆ తప్పుకి నన్ను క్షమించు....' ఎందుకంటే, దేవుడుకి రూపం వుందని మనిషి నమ్మినంతకాలం ద్వైతం అంటే మనిషి దేవుడి సేవకుడిగా, భక్తుడిగా వుండిపోతాడు. దేవుడు నిరాకారుడని నమ్మితేనే అద్వైత స్థితి గురించి నమ్ముతాడు.

జంతువులకిలేని, మనిషికి దేముడిచ్చిన వివేకం మనిషి అద్వైత స్థితికి చేరుకోవడానికి ప్రసాదించబడింది. వ్యాస భగవానుడు ఈ వివేకాన్ని వమ్ముచేసే రచనలు చేసాడు కాబట్టి అందుకు ఆవేదన చెందాడు. పరమేశ్వరుడు అన్నిటా వున్నప్పుడు ఒక్క విగ్రహం అనే వస్తువులోనే వున్నాడని భావించడంలో అర్థంలేదు.

ఈ కారణంగానే చాలా మతాల్లో విగ్రహారాధనలేదు. ఒక చక్రవర్తిని సర్వ రాజ్యాధిపతిగా భావించడానికి బదులు, ఒక గుడిసెకు అధిపతిగా భావించడం లాంటిదే ఇది. చక్రవర్తిని అది అవమానపరచడమే అవుతుం దంటారు.

విగ్రహాలు పరమాత్మకి ప్రతీకలు కావు అనేవారు. స్వామి దయానంద సరస్వతి ఈ వాదాన్ని ఎక్కువగా ప్రోత్సహించేవాడు.

అయితే రామకృష్ణ పరమహంస విగ్రహారాధనని సమర్థిస్తూ ఇలా అన్నాడు.

"ఆవు రక్తమంతటా పాలున్నా, దాని కొమ్ములు లేదా ఇతర అంగాలనించి పిండుకోలేంగదా? పొదుగునుంచే పాలు లభిస్తాయి. అలాగే పరమాత్మ అంతటా వున్నా, కొన్నిచోట్ల ఆయన శక్తి అధికంగా వ్యక్తం అవుతుంటుంది. అదే దేవాలయం."

గురువులని ఆశ్రయిస్తేనే కదా మంచి విషయాలు తెలిసేది అను కున్నాడు మునిరత్నం.

ఓసారి కొందరు భక్తులు ఓంకారేశ్వరాలయానికి వచ్చి అభిషేకాలు చేసుకుని వెళ్ళాక, వాళ్ళు పారేసుకున్న ఓ బేడకాసు నేలమీద కనిపించింది. దాన్ని శివాలయంలోని డిబ్బెనలో వేద్దామనుకుని వంగి చేతిలోకి తీసు కున్నాడు మునిరత్నం. వెంటనే అదిచూసి చిద్విలాసానందస్వామి అడి గాడు.

"మిఠాయి కొననివాడు ఎందుకు మిఠాయి దుకాణానికి వెళతాడు? ధనం అవసరం లేనివాడు డబ్బుని ఎందుకు తాకుతాడు?"

'తనకి చెందని ఆ ధనాన్ని తను తాకితే, ఆ కర్మ తనకి బంధం అవుతుందని ఆయన చెపుతున్నారని ఇక్కడనించి తీసి డిబ్బెనలో వేస్తాక

ఒకవేళ ఆ బేడ పోగొట్టుకున్నవాడు వెదుక్కుంటూ తిరిగివస్తే' అన్న ఆలోచనలు మునిరత్నంలో కలిగాయి.

"నిజమే! సిరిని కాక హరని, లక్ష్మిని కాక లక్ష్మీపతిని ఆరాధించే తను ధనాన్ని చూసి అది ధనం అని గుర్తించడం కూడా దోషమే. అది చిల్లపెంకుతో సమానం అన్న మానసిక స్థాయిని నేనింకా చేరుకోలేదు. ఇక దానికై కృషిచేస్తాను" చెప్పాడు మునిరత్నం ఆయన కాళ్ళకి మొక్కి.

ఇలా అంతా ఇతరులకి చిన్న చిన్న విషయాల్లో గురువులపై కాబ అర్పించిన భేదంతో తోటివారిని సరిదిద్దేవారు. ఓ రోజు గ్రామంలోని ఒకతను అందరికీ కొత్త కాషాయాంబరాలు తెచ్చిచ్చాడు. మునిరత్నంకి తెల్ల లుంగీలు తెచ్చాడు. అయితే అతను దొంగసారా కాయడంలో దిట్ట.

వాటిని స్వీకరించమని చెప్పాడు స్వామి చిదానందస్వామి.

"ఏం?" ప్రశ్నించాడు అతను ఆశ్చర్యంగా.

"నీ అక్రమ ఆర్జనలో భాగం తీసుకుంటే, నీ పాపంలో మాకు కూడా భాగం వస్తుంది.

ఎవరూ అతనిచ్చిన దుస్తులు స్వీకరించలేదు.

* * * *

వారితో కలిసి సంకీర్తనల్లో, భజనల్లో పాల్గొనేవాడు....ఒకరు డప్పు వాయిస్తే, ఇంకొకరు ఒంటి తీగ తంబురాని మీటేవారు. కొందరు భక్తిపార వశ్యంతో లేచి నృత్యం చేసేవారు. మునిరత్నంకి మొదటినించి అలవాటైన విద్యే.

కొందరు తమకి కంఠతా వచ్చిన ఉపనిషత్తులని చదివి వాటి అర్థం చెప్పేవారు. నిత్యం భగవద్గీతలోని ఓ అధ్యాయం అయినా మునిరత్నం ఒకరిద్దరి నోటివెంట వినేవాడు.

తనకి ధ్యానసాధనలో కలిగే ప్రగతిని మునిరత్నం తేలిగ్గా గుర్తించ గలుగుతున్నాడు. ఒళ్ళు తేలికపడ్డ భావన అధికం అవుతోంది. అది శారీరకంగా బరువు తగ్గడం కాదని, ఆతని ఆత్మ చుట్టూ ఆవరించుకుని సూక్ష్మ శరీరంగా వున్న గత జన్మల్లో అతను చేసిన అనేక కర్మలు తొలుస్తుండటం వల్ల అతనికి అలా అనిపిస్తోందని చిద్విలాసానందస్వామి వివరించాడు.

కొత్తగా తరచు ధ్యానంలో విమాన ప్రమాదం లేదా ఓడ మునగడం లేదా భూకంపం రావడం లాంటి ప్రమాదాలు కనిపించేవి. వాటి గురించి లేస్తే పాతంజలి యోగశాస్త్రం క్షుణ్ణంగా చదివిన ఒకరు చెప్పారు.

"దూరశ్రవణం, కుండలిని మణిపూరకం దాటాక అలాగే దూరదృష్టి కుండలిని అనాహతం చేరుకున్నాక కలుగుతాయి."

అవి నిజంగా జరిగాయో లేదా తన చిత్తభ్రాంతో మునిరత్నం రూఢిగా చేసుకునేందుకు అతనికి దినపత్రికలు కాని, రేడియో వార్తలు కాని అందుబాటులో వుండేవి కావు. అయితే ఆ దృశ్యాలు, అందులో చిక్కుకున్న ప్రజల ఆక్రందనలు తను వాళ్ళ దగ్గరుండి చూస్తున్నంత స్పష్టంగా కనిపించేవి.

అక్కడున్న వారిలో ఒకరిద్దరు అప్పటికే అనాహతందాకా చక్ర భేదనం అయిన వారున్నారు అయితే, వారు అవునని, కాదని మునిరత్నానికి స్పష్టంగా తేల్చిచెప్పలేదు — అతనిలోని అహం పెరగవచ్చన్న భయంతో. కాని వాళ్ళకి తెలుసు. మునిరత్నం అనాహతం చక్రాన్ని చేరుకున్నాడని.

మరో రెండు నెలలకి మునిరత్నంకి ధ్యానంలో మొదట కుడిచెవిలోంచి, తర్వాత రెండు చెవుల్లోంచి ఓంకారం వినబడసాగింది. ఆ తర్వాత వీణ, వాయులీనం, మృదంగం, మురళి మొదలైన వాయిద్యాల ధ్వనులు కూడా స్పష్టంగా వినబడసాగాయి. అవి వింటూంటే మనసు పులకరించిపోయేది.

క్రమేపీ ఓంకారధ్వని స్థాయి అధికం కాసాగింది. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు నిముషానికి మూడు నాలుగుసార్లకి మించి జరగడం లేదని కూడా గుర్తించాడు.

ఓ రోజు అకస్మాత్తుగా ధ్యానంలో అతనికి సద్గురు నిత్యానందబాబా స్వామి, తన గురువు అయిన సదానందబాబా కనిపించాడు. ఎంతో వాత్సల్యంగా చూస్తూ చెప్పాడు.

"నీకింకా ఇక్కడేం పని?"

మునిరత్నంకి అది తన భ్రాంతేమో అనిపించింది. కాని కొద్ది రోజుల్లోనే తనకి అక్కడనుంచి వెళ్ళిపోవాలన్న కోరిక ప్రబలం అవు తూండడంతో గురువు కనిపించి చెప్పడం భ్రాంతి కాదనిపించింది.

అతనికి ధ్యానంలో రెండు కొండలనడుమ ఉన్న వాగు, ఓ ఆలయం, ఆ ఆలయానికి కుడివైపు కొండలో ఎత్తయినచోట గుహలు కనిపించ సాగాయి. ఓ రోజు మునిరత్నం వాటి గురించి మిగిలిన సాధువులతో చర్చిం చాడు.

"అది యాగంటి" వెంటనే చెప్పారు ఇద్దరు.

బనగానపల్లెకి సమీపంలో యాగంటి క్షేత్రం వుందని మునిరత్నానికి తెలుసు. ఎప్పుడో చిన్నప్పుడు తన తల్లిదండ్రులతో వెళ్ళాడు. కాని అతని కది గుర్తులేదు.

మర్నాడు సూర్యోదయ సమయంలో లేచి, ఓంకారేశ్వరుడికి అభి షేకం చేసి, ఎవరికీ చెప్పకుండా బయటకి నడిచాడు. మిగిలిన సాధువుల కూడా అతను తమకి చెప్పకుండా వెళ్ళిపోవడంవల్ల విస్మయం చెందలేదు. తరచు అక్కడివాళ్ళు అలా చెప్పకుండా వెళ్ళిపోవడం మామూలే. స్వామి చిద్విలాసానంద నెలక్రితమే అలా ఎటో వెళ్ళిపోయాడు.

19

శివబాబా చెప్పడం ఆపి కళ్ళు తెరచి తన చుట్టూ పరివేష్టితులై వున్న తన పాతికమంది శిష్యులవంక, గ్రామస్థులవంక అనురాగంగా చూశాడు.

ఆయన చెప్పేది చెవులు రిక్కించి వింటున్నారంతా. డిసౌజా చేతి లోని నోట్ బుక్‌లో నోట్స్ రాసుకుంటూ వింటున్నాడు.

ఆ తర్వాత యాగంటికి చేరుకుని అక్కడ పదిహేడు నెలలు సాధన చేశాను. నేను సాధన చేసిన గుహలోనే ఒకప్పుడు బ్రహ్మంగారు ఆవుల, గొర్రెలు కాచుకోడానికి వచ్చి వాటిని వదిలివచ్చి అదే గుహలో సాధన చేసేవారుట."

"అవును స్వామీ! తనకి ఆశ్రయం యిచ్చిన గరిమిరెడ్డి అచ్చమ్మకి ఆయన మంత్రదీక్ష కూడా అక్కడే అనుగ్రహించారుట."

బ్రహ్మంగారు కాలజ్ఞానం ఆ గుహలోనే రాశారుట. యాగంటి క్షేత్రం చూసిన ఒక గ్రామస్థుడు చెప్పాడు.

"యాగంటి కూడా నల్లమల అడవుల్లో వున్న శివక్షేత్రమే. ఆల యం, పూజారి ఇల్లు, ఎవరో కట్టించిన అన్నసత్రం తప్ప అక్కడ అప్పట్లో ఇంకేం లేవు. అప్పటికే నేను వేటితో అయితే ఇంటినుంచి బయలుదేరానో ఆ వంటిమీది దుస్తులు పూర్తిగా శిథిలమైపోయాయి. నాకు కొత్తవి వేసు కోవాలన్న ఆలోచనే రాలేదు. నేను ఓంకారేశ్వరాలయంలో వుండగానే 'నేను ఈ శరీరాన్ని కాదు. ఆత్మని' అన్న ఆలాపన లీలగా మనసుపొరల్లో ...ంది. ధ్యానంలో నేను లోపలకి ప్రయాణిస్తున్న భావన ఎక్కువగా ...గేది. దాంతో ఈ శరీరం నాది అన్న భావన కూడా నేను ధ్యానంలో ...క లోతుగా వెళ్తుంటే, అంతగా దూరం కాసాగింది. శరీరావస్థలు తెలు ...న్నా, ఆ శరీరం ఓ తొడుగు అన్న భావన లీలగా అంతర్గతంగా మొదలై ...ది చాలా నెమ్మదిగా స్థిరపడసాగింది.

"అదెలాంటిదంటే, మీరు ఓసారి దుస్తులు వేసుకున్నాక, ఇంకా ...వి దుస్తులు దొరికినా వాటిమీద వేసుకోవాలనిపించదు కదా. నా కాయా ... దుస్తులు ధరించడం అంటే, ముందే వున్న దుస్తులమీద మళ్ళీ దుస్తు ...డుకు అనిపించసాగింది.

శివబాబా స్పిరిచ్యువల్ ప్రోగ్రెస్‌ని ఎంతో శ్రద్ధగా వింటున్నారంతా.

"ఓంకారేశ్వరాలయంనించి నేను నడచివస్తూ బనగానపల్లికి ఇరవై ...ళ్ళ అవతల ఓ గ్రామం పొలిమేరల్లో పడుకున్నాను. ఒకటే చలి. దారిన ...దే ఎవరో పుణ్యాత్ముడు నన్ను చూసి జాలిపడి నా వంటిమీద తన ...బళి కప్పి వెళ్ళాడు. దయ స్వభావం ఇది అనుకున్నాను. కాసేపయ్యాక ...కరు నేను కళ్ళు మూసుకుని వుండడం చూసి ఆ కంబళిని తస్క ...రాడు. మారు స్వభావం ఇది కదా అనుకున్నాను."

"ఆ మాటలనిబట్టి అప్పటికే ఆయన అద్వైత స్థితి దరిదాపుల్లోకి

చేరుకున్నాడని గ్రహించింది శారదామా. తనకా భాగ్యం ఎప్పుడా అని ఆమె మనసు విలపించింది.

"ఓంకారేశ్వరాలయంలో వుండగా నెలకోసారి ట్రాక్టర్ మీద ఓ ధన వంతురాలు వచ్చి సన్యాసులకి కావలసిన బియ్యం, ఇతర వంటసామాను ఇచ్చి వెళ్ళేది. ఎలా పడిందో అవిడ కూతురు కన్ను నామీద పడింది. ఓ రోజు తననే సమర్పించుకోడానికి వచ్చానంది. ఆమె నిజంగా అందగత్తె. పైగా ఐదోతనం కోల్పోయింది. మాయ దొరికే చిన్న అవకాశం కూడా వదులుకోలేదు కదా! క్షణకాలం నా మనసు జారింది. కాని అంత లోనే బుద్ధి తెచ్చుకున్నాను. "మాయ తల్లీ! నీ ముందు నేను అల్పుర్ని, బలహీనుడిని. నీ ముందు నా ఓటమిని ఒప్పుకుంటున్నాను. దయతో నన్ను విడిచిపెట్టు. నా మార్గాన ముందుకు సాగనివ్వు తల్లీ" అని మనస్ఫూర్తిగా మహామాయని ప్రార్థించాను. ఒంటిమీద తేలు పడితే ఎలా వెంటనే దులపు కుంటామో అలా చెడ్డ తలంపులు కలిగినప్పుడు వాటిని విసిరికొట్టాలి. సూర్యుడు ఉదయిస్తే పగలు, అస్తమిస్తే రాత్రి....రెండింటికీ సూర్యుడే కారణం. అలాగే మంచికీ, చెడుకీ మనసే కారణం. దానిని అదుపులో పెట్టడం నేర్వాలి."

మోక్షం వున్నచోట సాంసారిక భోగాలుండవు. భోగలాలస వున్న చోట మోక్షం లేదు. అందంగా కనిపించే అవిడ చర్మాన్ని కాక, అది లేక పోతే దాని వెనుక వున్న రక్తమాంసాలని, మలమూత్రాలని కలిగిన అవిడ దేహాన్ని ఊహించుకున్నాను. దాంతో మాయ తొలగింది. కాని ఆమె వెళ్ళ బోతూ వెళ్ళేదు నాకు ఎన్నో ఇస్తానని ఆశలు పెట్టసాగింది.

"తల్లీ! మా అమ్మ, మా నాన్న మైధునంలో కేవలం నాలుగుపార్లే పాల్గొన్నారు. మేం నలుగురమే తోబుట్టువులం. కామం తీర్చుకోడానికి కాక సంతానోత్పత్తికి మాత్రమే మైధునాన్ని ఉపయోగించే వంశచరిత్ర గల నాలో ఏం చూసావు తల్లి? చర్మం తొడిగిన నా ఎముకలు దుర్గంధపూరిత మైన ఉత్తి తోలుతిత్తే కదా అమ్మా ఇది" అన్నాను. ఏమనుకుందో వంగి నాకు దణ్ణం పెట్టి వెంటనే వెళ్ళిపోయింది.

పన్నాడు ఆమె నాకు కొత్త దుస్తులు జత పంపింది. అప్పుడు కాని నా ఒంటిమీదవి పూర్తిగా పిగిలిపోయాయని తెలీలేదు నాకు. నాలో ఎప్పుడూ ధ్యానం, దైవంతప్ప ప్రపంచపు స్పృహే వుండేది కాదు. అందుకు కారణం అయిన ఆనాటి నాతోటి సాధువులకి వారిలోని పరమాత్మకి అందుకు శిరస్సు వంచి సహస్ర కోటి ప్రణామాలు చేస్తున్నాను" దగ్గుత్తికతో చెప్పాడు.

"బాబా! మీరు ఒంటరిగా చిట్టడవుల్లో వున్నారు కదా? మరి విష సర్పాలు, క్రూరమృగాలవల్ల ప్రమాదం అనే భయం ఎన్నడూ కలగలేదా?" ప్రశ్నించాడు నాయర్.

చిన్నగా నవ్వాడు శివబాబా.

"నేను ఓసారి నల్లమలైలోని అహోబిలంకి వెళ్ళేదారిలో వున్న అడవిలో వుండగా నన్ను చూసి ఒకరు చెప్పారు. 'స్వామీ! ప్రమాదకరమైన ఈ చిట్టడవిలో దేనికి? జన సంచారంగల మా పట్టణానికి వచ్చి నివశించ వచ్చుగా? మీరు మా ఇంట్లో వుండడానికి అన్ని ఏర్పాట్లు చేస్తాను' అని."

"అక్కడ ఇంకా ప్రమాదకరం కదా" అన్నాను నేను.

"ఎలా స్వామీ! సదుపాయాలు తప్ప నగర జీవితంలో ప్రమాదాలేం వుంటాయి? ఇక్కడైతే క్రూరమృగాలు ఏ క్షణంలోనైనా కబళించవచ్చు. మృత్యువు ఏ రూపంలో ముంచుకు వస్తుందో తెలీదు కదా?"

అందుకు నేనిలా జవాబు చెప్పాను.

"అడవిలో జంతువుల్ని చూస్తున్నప్పుడు ఇది పులి, ఇది ఎలుగు బంటి, ఇది సింహం, ఇది వేటకుక్క అని గుర్తించి రక్షించుకోవడం తేలిక. కాని అక్కడ? మృగాలన్నీ మానవాకారం దాల్చి వుంటాయి. దెబ్బ తినే దాకా సాటి మనిషే కదా అనుకుంటాం. పులి కంటే క్రూరంగా చంపుకు తింటారు. విషనాగుల్లా కాటేస్తారు!"

"నిజమే స్వామి" ఒప్పుకున్నాడతను.

"ఓసారి నన్ను ఓంకారేశ్వరాలయంలో ఓ తేలు పాదంమీదకి ఎక్కింది. వెంటనే దాన్ని చంపుదామని పెద్ద బండరాయి అందుకున్నాను. కాని అంతలో నన్ను అది కుట్టనే కుట్టింది. ఇంక దాన్ని చంపి ఏం ప్రయో జనం అనిపించింది. దాంతో రాయిని పారేసాను" చెప్పాడు శివబాబా.

'అది ఆయన ఆధ్యాత్మిక పురోభివృద్ధికి నిదర్శనం' అనుకుంది సుధామణి.

"పెద్దపులి కన్నా నల్లమలై అడవుల్లో చిరుతపులుల బెడద ఎక్కువ. అయితే అవి కదిలినప్పుడే వేటాడతాయి. అవి మీదకి వచ్చినప్పుడు మనం కదలకుండా వుంటే ఏం చేయలేవు. చూస్తూ నిలబడతాయి. వేటాడే ఏ జంతువైనా కదలికవల్లే అది ప్రాణి అని గ్రహించి దాన్ని చంపి తినాలన్న స్పృహ కలుగుతుంది. నాకు ఎన్నడూ అడవులంటే భయంవేయలేదు. ఇందుకు కారణం నా పూర్వజన్మ సంస్కారం. వరసగా గత రెండు జన్మల్లో నేను సన్యసించి అడవుల్లో, కొండగుహల్లోనే జీవించాను కాబట్టి అడవుల్లోకి నిర్భయంగా వెళ్ళగలిగాను. మన ప్రారబ్దకర్మలనిబట్టి మనం ఎప్పుడు ఎలా ఎక్కడ మరణిస్తామో నిశ్చయమై వుంటుంది కాబట్టి ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళడానికి జంకు అనవసరం అని కూడా ఆ రోజుల్లో నమ్మేవాడిని."

* * * *

"స్వామీ! నిజంగా ఇంతమంది దేవుళ్ళున్నారా? శివుడు, కృష్ణుడు, వినాయకుడు, ఆంజనేయుడు.... వీళ్ళంతా నిజంగా వున్నారా?" ప్రశ్నించాడు పృథ్వీరాజ్.

"నువ్వుండడం ఎంత నిజమో, వాళ్ళుండడము అంతే నిజం."

"మరి దేవుడు ఒక్కడే అంటారు?"

"అది మనసు దాటిన స్థితిలో. నీ మనస్సు దాని పుట్టుక స్థానమైన ఆత్మలో లయిస్తే, ఆ అద్వైత స్థితిలో ఉండేది ఒక్కడే. రెండోదంటూ లేదు. అలా జరగనంతకాలం, మనసున్న ద్వైతస్థితిలో, ఆ ఒక్క బ్రహ్మ పదార్థమే అనేక రూపాల్లో దర్శనమిస్తుంది."

"శివకేశవుల మధ్య అలాంటప్పుడు తేడా వుంటుంది కదా? మరి వుండదంటారు?"

"సంధ్యావందనంలో వారిరువురికీ బేధం లేదన్న మంత్రం అర్థం ఎవరైనా చెప్పండి" కోరాడు శివబాబా వెంటనే.

వెంటనే పృథ్వీరాజ్ చెప్పాడు.

"శివాయ విష్ణు రూపాయ శివ రూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణుః విష్ణు హృదయం శివః
యథా శివమయో విష్ణుః విష్ణు మయం శివః

అంటే అర్థం శివుడే విష్ణు రూపం, విష్ణువే శివరూపం, శివుడి హృదయంలో విష్ణువు, విష్ణువు హృదయంలో శివుడు ఉంటారు. విష్ణువు శివమయుడు, శివుడు విష్ణుమయుడు అని."

"ఆ తర్వాతి మంత్రం గురించి తక్కువమందికి తెలుసు.

'యథాంతరం నపశ్యామి తథామే స్వస్తిరాయుషి.'

దానర్థం 'ఎంతవరకు నేను వారి మధ్య బేధాన్ని చూడనో అంతవరకు నా ఆయుష్షుకి మంగళం అగుగాక' అని. చూసారా? శివకేశవుల మధ్య భేదం చూస్తే నాకు ఆయుః క్షీణం అని, ఈ మంత్రం ద్వారా ఒట్టు పెట్టుకుంటున్నాడు. ఇది అతి గొప్ప ఒట్టుకదా?.... పూర్వం శివకేశవుల మధ్య అంతరాన్ని చూసే వాళ్ళలో రక్తపాతం జరగడానికి కారణం ఈ ఒట్టు పనిచేయడం వల్లనే. ఏ మానవాళి శ్రేయస్సుకై శివకేశవుల రూపంలో పరబ్రహ్మ అవతరించాడో ఆ మానవాళి రక్షణ కోసమే ఈ మంత్రం సృష్టించబడింది."

"స్వామీ! యాగంటిలో ఎంతకాలమున్నారు?" ప్రశ్నించాడు శరవణ్ణ చంద్రి.

20

ఓంకారేశ్వరాలయం నించి ప్రయాణ సమయంలో స్మరించాల్సిన శ్లోకంని భావార్థంతోసహా మనసులో స్మరించుకుని బయలుదేరాడు మునిశ్వరం.

జలే రక్షతు వారాహః స్థలే రక్షతు వామనః।
అటవ్యాం నారసింహశ్చ సర్వతః పాతుకేశవః॥

(అర్థం :- నీటి బాధలనించి వరహావతారం, భూ సంబంధమైన బాధలనించి వామనావతారం, అడవుల్లోని బాధలనించి నరసింహావతారం, అన్ని బాధలనించి అన్ని అవతారాలకీ మూలమైన శ్రీహరి రక్షించుగాక.)

మునిరత్నం పూర్వం రుద్రకోడుకి, గుండ్ల బ్రహ్మేశ్వరాలయానికి, ఇతర చోట్లకి వెళ్ళినప్పుడు కూడా ఇది స్మరించి కాని బయలుదేరలేదు. అది ఉప్పులూరి గణపతిశాస్త్రి శిష్యరికంలో అలవడింది.

మునిరత్నం యాగంటిక్షేత్రానికి వెళుతూ దారిలో ఓ కొండ ఎక్కి దిగుతుంటే ఓ పెద్ద బండరాయి అకస్మాత్తుగా పైనించి కిందకి జారసాగింది. అతను వెనక్కి తిరిగి చూసి తప్పుకునే లోగానే అది అతని కుడిపాదం మీదకి ఎక్కి కిందకి జారిపోయింది.

అయితే ఎంతో విచిత్రంగా ఆ పాదానికి ఏం కాలేదు. పాదంమీంచి పెద్ద దూది వుండ జారి వెళ్ళిన అనుభూతి కలిగింది మునిరత్నానికి.... అతను ఎంతో ఆశ్చర్యంగా ముందుకి కదిలాడు. ఎందుకిలా జరిగింది అని ఆలోచిస్తూ నడిచాడు.

అగస్త్య మహాముని తపస్సు చేసిన స్థలం యాగంటి. అక్కడ శివాలయంలోని విశేషం, అన్ని చోట్లలా అక్కడ లింగం వుండదు. స్వయంభూగా వెలిసిందని నమ్మే ఉమామహేశ్వరుల రాతి విగ్రహం వుంటుంది. గుళ్ళో వున్న నంది క్రమంగా పెరుగుతోందని కూడా భక్తులు చెప్తారు. అందుకు నిదర్శనంగా నందిపక్కన ఉన్న స్తంభానికి నంది తలకి మధ్యగల ప్రదేశం మనిషి పట్టేంతగా లేదు. పూర్వం తాము ప్రదక్షిణం చేసినప్పుడు అక్కడ మనిషి తిరగడానికి చోటుండేదని పూజారి మునిరత్నానికి వివరించాడు.

చుట్టుపక్కల కాకులున్నా, యాగంటిలో అగస్త్యుడి శాపంవల్ల అవి లేకపోవడం విశేషం. అక్కడ శనీశ్వరుడికి స్థానంలేదు. కాబట్టి నవగ్రహాలు కూడా లేవు. దాంతో ఇక్కడున్న వారిమీద శని ప్రభావం వుండదని విశ్వాసం.

ఆలయానికి కుడివైపున్న కొండలో భూమికి నూట ఏభై అడుగుల ఎత్తున సహజ సిద్ధమైన గుహలనేకం వున్నాయి. వాటిలో ప్రధానంగా

కనిపించేవి మూడు. ఒకదాంట్లో అగస్త్యుడు ప్రతిష్ఠించిన శివలింగం ఉంది. ఆ గుహ సీలింగ్‌కి ఉన్న పుట్ట ఆకృతిలోంచి ఆ లింగంమీద అభిషేకంగా నీటిచుక్కలు పడుతూంటాయి.

దాని పక్క గుహలో ప్రతిష్ఠించిన కుడి కాలిగోరులేని వెంకటేశ్వర స్వామి విగ్రహం. మూడో గుహలో బ్రహ్మంగారు బనగాన పల్లెనించి తనకి ఆశ్రయమిచ్చిన, గరిమిరెడ్డి అచ్చమ్మ ఆవులను అక్కడకి మేతకి తోలుకు వచ్చి, ఆ గుహలో కాలజ్ఞానం రాసాడని, అచ్చమ్మకి బ్రహ్మజ్ఞానం ఆ గుహలోనే బోధించాడని ప్రతీతి. ఎప్పుడూ చీకటిగా వుండే ఆ మూడో గుహ తన ధ్యానానికి అనువైందిగా భావించాడు మునిరత్నం.

మునిరత్నం యాగంటి చేరుకున్నరోజునించే తీవ్ర ధ్యానంలో నిమగ్నుడయ్యాడు. అప్పటికే రెండు గ్రంథుల ఛేదనం జరిగి మూలాధారం దగ్గర బ్రహ్మ గ్రంధి, మణిపూరకం దగ్గర విష్ణుగ్రంధి విభేదం జరిగి అనాహతందాకా కుండలిని చేరిన స్థితిలోని యోగి మామూలు మనిషికి ఎంతో భిన్నంగా ప్రవర్తిస్తాడు.

అతను లోచుకోలు కబుర్లు చెప్పడు. సైగల ద్వారానే ఎక్కువగా తెలియచేస్తూ అవసరం అయితేనే నోరు విప్పుతాడు. తోటి మనుషుల సాహచర్యం ఇష్టపడక, ఒంటరిగా వుండటానికే ఇష్టపడతాడు. అతని మనస్సు ఎక్కువకాలం దైవంమీదే లగ్నం అయివుంటుంది. శారీరక అవసరాలు కూడా దేహయాత్ర సాగించేందుకు కావలసిన మేరకే తప్ప అంతకుమించిన కోరికలుండవు.

తన గమ్యానికి చేరువవుతున్నాడన్న స్పృహ ఉండడంతో ఈ జన్మలో ఎలాగైనా కుండలిని మాతని సహస్రారంలోని శివుని సన్నిధికి చేర్చాలన్న తపన వుంటుంది. అందుకు భిన్నమైన ఏ చర్యా చేయడు. కొత్త కర్మలని పోగుచేసుకోకూడదన్న సంకల్పం స్థిరంగా కలుగుతుంది. దాంతో సాటి జీవులకి హాని చేయడు. వారినించి దూరంగా వుంటాడు. నిద్ర, భోజన కాలాదులు తప్ప మిగిలిన సమయం మొత్తం ధ్యానానికే ఖర్చు చేస్తాడు.

మునిరత్నంలో ఈ లక్షణాలన్నీ వుండడంతో అతను యాగంటిలో

ఆ ప్రకారం నడుచుకుంటూ, ధ్యానంను తీవ్రతరం చేసాడు. అక్కడ ధ్యానం లోగడ మీదట ఇంకాస్త ఉధృతంగా సాగుతున్న భావన కలిగిందతనికి.

యాగంటిలోని ఆ నల్లమల కొండలలోని గుహల్లో కూడా యోగులనేకులున్నారు. మునిరత్నంకి తరచు అనిపించేది– ముందే ఇక్కడికి వస్తే బావుండేవి, ఇక్కడ ధ్యానం ఎంతో తీవ్రంగా వస్తోందని.

ఓ రోజు అతను కొండ 'గుహముందు నిర్లిప్తంగా కూర్చుని సూర్యాస్తమయాన్ని గమనిస్తూండగా, ఓ యోగి పుంగవుడు కనిపించాడు. జడలు కట్టిన జుట్టు, అస్తిపంజరానికి చర్మం అతికించారా అనిపించేలా భారి, పొట్టమీది చర్మం వెనక ఎముకలు కనిపిస్తున్నాయి.

ఆయన మొహం ఎంతో తేజోవంతంగా వుంది. కళ్ళు మిలమిల మెరుస్తూ ఎంతో సౌమ్యంగా, ఆకర్షణీయంగా వున్నాయి. ఆయన్ని చూడగానే లేవాలనిపించి లేచి మునిరత్నం ఆయనకి వంగి పాదాభివందనం చేసాడు. ఆయన మునిరత్నంవంక కొద్దిక్షణాలు చూసి చెప్పాడు.

"ఇంట్లోకంటే, ఊళ్ళోని ఆలయంలో, ఊళ్ళోని ఆలయంలోకంటే, నదిఒడ్డున వున్న ఆలయంలో, నదిఒడ్డున ఆలయంకంటే, స్వయంభూవుగా వెలిసిన ఆలయంలో, అక్కడకంటే కొండమీది గుహల్లో, మామూలు కొండల 'సన్నిధిలో లేదా వారి సమాధి సమీపంలో ధ్యానం బాగా తీవ్రతరం అవుతూంటుంది. నువ్వు రావాల్సిన సమయానికే ఇక్కడికి వచ్చావు. అనాహతంమీదకి చేరే ధ్యానానికి ఓంకారేశ్వరాలయం శ్రేష్ఠం కాబట్టి అక్కడికి ఆకర్షించబడ్డావు. ఇక్కడ విశుద్ధ చక్రశుద్ధి ఆజ్ఞా చక్రంలో ప్రవేశించాక నువ్వు ఎక్కడికి వెళ్ళాలో అక్కడికి తిరిగి ఆకర్షింపబడతావు."

ప్రశ్నించకుండానే తన మనసులో నలుగుతున్న సందేహాలని ఆయన అంత సూటిగా తీర్చడంతో ఆయనకి తన మనసులోని విషయాలు తెలిసే వివరించడానికి వచ్చాడు అని గ్రహించాడు మునిరత్నం.

"స్వామీ! నేను ఈ జన్మలో ముక్తిని సాధించగలనా?" ప్రశ్నించాడు.

"[illegible]వుని నిత్యం అది వేడుకుంటూ కూడా సందేహమా? నిత్యానంద బాబా సాక్షాత్తూ దత్తాత్రేయుడే సుమా."

"స్వామీ! నేను జీవన్ముక్తుడవ్వాలని ఆశీర్వదించండి."

"సాలోక్య ముక్తిని సాధించావు కాబట్టి ప్రయత్నిస్తే, ఈ జన్మలోనే సారూప్య ముక్తిని పొందుతావు. నీకోసం ఇప్పటికే ఎందరో ఎదురుచూస్తున్నారు."

"స్వామీ! నాకర్థం కాలేదు మీ మాటలు."

"ముక్తిలో నాలుగు దశలున్నాయి. కుండలిని నిద్ర మేల్కొన్నాక మూలాధార చక్రం నించి బ్రహ్మగ్రంధి ఛేదకం జరిగాక ప్రయాణించి, విష్ణుగ్రంధిని ఛేదించి అనాహతంలోకి ప్రవేశించాక కలిగే ముక్తిని సాలోక్య ముక్తి అంటారు. ఇది నువ్వు గత జన్మలోనే సాధించావు. ఓసారి కుండలిని అనాహతం దాకా వస్తే తిరిగి కిందకి జారదు. నువ్వు ఈ జన్మలో చేసిన పాపం ఒక్కటే. స్కూల్లో చిన్నప్పుడు నీతోటి పిల్లల పెన్సిల్‌ని దొంగిలించావు. కాని దానికి నీలో పశ్చాత్తాపం కలిగి, దాన్ని గోదావరిలో వదిలి ఆ నదిలో స్నానం చేసావు. ఇది తప్ప నువ్వు పెద్ద తప్పేం చేయలేదు— ఒక్క మీ అక్కలని ఏడిపించడం తప్ప."

మునిరత్నానికి చటుక్కున తన గత జీవితంలోని ఆ సంఘటన గుర్తుకు వచ్చింది. తన ముందు బెంచీలో కూర్చునే నారాయణరెడ్డి తెచ్చుకున్న నిలువుగీతల లండన్ పెన్సిల్‌ని చూసి ముచ్చటపడి దొంగిలించాడు. మర్నాడే సంస్కృతం నేర్చుకోడానికి తనని ఉప్పులూరి గణపతిశాస్త్రిగారి దగ్గరకి పంపారు. దారిలో పశ్చాత్తాపం కలిగి ఆ పెన్సిల్‌ని గోదావరిలో కలిపి, శివుడ్ని క్షమించమని ప్రార్థించి, పదివేల నూటపదహారుసార్లు శివ పంచాక్షరి జపించి నదిలో స్నానం చేసాడు.

"అనాహతంనించి ఇప్పుడు విశుద్ధదాకా వున్న నాడుల శుద్ధి జరుగుతోంది. అది పూర్తయి కుండలిని విశుద్ధి చక్రంలోకి ప్రవేశించగానే కలిగేది సారూప్య ముక్తి. ఇదే సమాధిస్థితి కూడా. ఆ తర్వాత కుండలిని ఆజ్ఞా శక్తి దగ్గరుండే రుద్రగ్రంధిని ఛేదించి సహస్రారం చేరుకోగానే కలిగేది సాయుజ్య ముక్తి లేదా జీవన్ముక్తి."

"స్వామీ! నాకు సాయుజ్య ముక్తి కలగాలని ఆశీర్వదించండి."

"బాబా ఆశీస్సులని మించి నేనేం ఆశీస్సులివ్వగలను?"

ఆయన క్షణాల్లో అక్కడనించి వెళ్ళిపోయాడు. మళ్ళీ ఎన్నడూ కనపడలేదు. మునిరత్నం ఆయన ఎక్కడ తపస్సు చేసుకుంటున్నాడా అని గుహలన్నీ తిరిగి చూసాడు కాని, మళ్ళీ ఆయన దర్శన భాగ్యం కాలేదు. అలాంటి యోగి గురించి అతను మిగిలిన వాళ్ళని అడిగితే, తామెన్నడూ ఆయన్ని చూడలేదన్నారు. తన సద్గురువు సదానంద బాబా గురువు నిత్యానంద బాబానే ఆ రూపంలో వచ్చారేమో అనిపించింది మునిరత్నానికి. సదానందబాబా ఇంకో రూపంలో రానవసరంలేదు కదా?

మునిరత్నంకి మానసికంగా ఎంతో అద్వితీయశాంతి లభిస్తోంది. బయటనించి మాడుద్వారా తలలోకి ఏదో అదృశ్యశక్తి ప్రవహించి అది శరీరంలోని నాడులన్నిటా ప్రవహిస్తున్న భావన. ఆ ప్రవాహంవల్ల తిమ్మిరిలాంటిది కలిగి అద్వితీయమైన ఆనందం అనుభవానికి రాసాగింది.

ఆయన దర్శనానికి మునుపు తరచూ వచ్చే తలనొప్పి పూర్తిగా మాయమైంది. ధ్యానం బాగా జరిగేది. కనుబొమల మధ్య కోడిగుడ్డు ఆకారంలో శ్వేత జ్యోతి కనిపించసాగింది. శరీరంలోని ప్రతి అంగంలో నృత్యం చేయాలన్న కోరిక అధికం అవసాగింది.

ఇప్పుడసలు ఆసనాలన్నవే రావడంలేదు. పద్మాసనంలోనో, సిద్ధాసనంలోనో కూర్చుని కళ్ళు మూసుకుంటే, కొన్ని గంటలపాటు లేవకుండా అలాగే స్థిరంగా కూర్చోగలుగుతున్నాడు. ఇదివరకటిలా అలా కూర్చున్నా కాళ్ళు నొప్పులు కూడా రావడంలేదు. గతంలో అరగంటకోసారి కాళ్ళు మార్చుకోకపోతే నొప్పి వచ్చేది. ఇప్పుడు ఎలా కూర్చున్నవాడు అలాగే కూర్చుంటున్నాడు.

తెల్లారుఝామున నిద్రలేచి ధ్యానానికి కూర్చుంటే, ఆజ్ఞా చక్రంలో కనుబొమల మధ్య ప్రస్ఫుటంగా మెరుస్తూ జ్యోతిబిందు కనిపించసాగింది. ఏకాగ్రత, ఆ సమయంలో బాగా కుదరసాగింది. అప్పుడప్పుడూ తన భృకుటి దగ్గర కనబడే జ్యోతికిరణాలు తన శరీరంనించి బయటకి ప్రసరిస్తున్నట్లు అనుభూతిని కలగసాగింది. క్రమేపీ మనస్సులోని ఆలోచనలు తగ్గడంతో ఏకాగ్రత బాగా కుదరసాగింది.

తరచు మూలాధార చక్రంనించి అంటే వెన్నుపూస ఆరంభమైన ప్రదేశాన్నించి విద్యుల్లత చాలాసార్లు కిందనించి బయలుదేరింది అది శరీరమంతా ప్రవహించి విద్యుత్ కాంతితో మొత్తం జ్యోతిర్మయం అయిన అనుభూతి కలగసాగింది శ్వాస గమనం చాలా తగ్గింది. నిముషానికి ఒక్కసారి మాత్రమే శ్వాస ఆడుతోంది. క్రమేపీ ఆ శ్వాస కూడా క్రిందకి ఊపిరితిత్తుల్లోకి వెళ్ళకుండా భృకుటి దగ్గర స్థిరపడడం గుర్తించాడు. తను గాలి పీల్చకుండా ఎలా బ్రతకగలుగుతున్నాడా అని మునిరత్నానికి ఆశ్చర్యం కలిగింది.

క్రమేపీ మనస్సు ఇతర ఆలోచనల మీదకు వెళ్ళడం తగ్గి మంత్రం మీదే నిలబడసాగింది. సముద్రంలోని ఓడమీద కాకి బయటకి ఎగిరి నిలబడటానికి ఆధారం కోసం ఎగిరి అన్నిచోట్ల చూసి, ఎక్కడా అది దొరక్క తిరిగి ఆ ఓడమీదకే వెళ్ళి వాలినట్లుగా, మనసు బాహ్యంగా వెళ్ళినా తిరిగి దానంతట అదే మంత్రం మీదకి వచ్చి వాలడం గుర్తించాడు మునిరత్నం.

నిద్ర, మెలకువ కాని ఓ మగతని అనుభవించసాగాడు. రెండు చెవుల్లో ఓంకారనాదం వినిపిస్తుంటుంది. దాంతోపాటు మరికొద్ది వారాలకి శరీరం వున్న భావనలేదు. కాని పంచాక్షరీమంత్ర మననం అన్నివేళలా జరుగుతూనేవుంది. ఆ మంత్రం మీదకుతప్ప మనసు మరి దేనిమీదకి వెళ్ళడములేదని గుర్తించాడు మునిరత్నం.

ఓరోజు మూలాధారం నించి ప్రజ్వరిల్లిన విద్యుల్లత స్వాధిష్ఠాన (రహస్యాంగం పైభాగం) మణిపూరక (బొడ్డు ప్రాంతం) అనాహత (ఛాతి) విశుద్ధ (గొంతు) చక్రాల్లోకి ప్రవేశించడం మునిరత్నం ధ్యానంలో స్పష్టంగా చూశాడు. మాడులోపలి భాగంలో అతి శూన్య స్థితి ఏర్పడి అంతరిక్షంలోని నీలాకాశం, సూర్యచంద్రులు, నక్షత్రాలు, గ్రహాలు దర్శనం యిచ్చాయి. నిమ్మపండు సైజులో భూగోళాన్ని మనోనేత్రంతో స్పష్టంగా చూడగలిగాడు.

"ఐ బ్లెస్ దిగ్లోబ్ అండ్ ఆల్ ఇట్స్ అక్యుపెంట్స్" అది కనపడగానే మనసులో భూగోళాన్ని, భూగోళవాసులని మునిరత్నం ఆప్యాయంగా ఆశీర్వదించాడు.

ఒకోసారి మూలాధారంనించి సహస్రారం (మాడులోపలి భాగం) దాకా ఒకే వెడల్పయిన జ్యోతిరేఖ, సుషుమ్నానాడి, నాడీమండలాలు కనిపించసాగాయి.

మునిరత్నం భోజన సమయంలో ఆలోచించేవాడు, తనకి కనబడ్డ వాటి అంతరార్థంఏమైవుండచ్చాఅని. గురుదేవులే వాటిని విడమరిచి చెప్పాలి. ఆయన దర్శనం తనకి మళ్ళీ ఎప్పుడు లభ్యమౌతుందో? తన ధ్యానస్థితి వారికి ఖచ్చితంగా తెలిసే వుంటుంది. తను ఏకాకి కాదని, అవసరమైనప్పుడు వారంతట వారే వస్తారనే ధైర్యం మునిరత్నంలో వుంది. బహూశా తనకి విశుద్ధి కూడా జరిగి, కుండలిని అతి త్వరలో ఆజ్ఞ చక్రంలోకి ప్రవేశిస్తుందని మునిరత్నం అనుకోసాగాడు.

అతనికి ఇతరుల గురించి ఆలోచనలేరావు. అరుదుగా ఎప్పుడైనా ఎవరినైనా స్ఫురిస్తే వాళ్ళు మనోనేత్రం ముందు దర్శనం ఇవ్వసాగారు. తన కోసం బెంగపెట్టుకున్న తల్లి, ఆమెను ఓదారుస్తున్న పొరుగావిడ సీతామహాలక్ష్మి కనపడ్డారు. ఎలాంటి మానసిక స్పందన అందువల్ల మునిరత్నంలో కలగలేదు. పూర్తి వైరాగ్యం అతన్ని ఆవరించుకుని వుండటంతో. 'ఇదేనా దివ్యదృష్టి అంటే' అనుకున్నాడు. అయితే అతనికి అప్పటికే దాన్ని గురించిన విశేషాలు తెలుసుకోవాలన్న ఆసక్తి నశించింది.

రామకృష్ణ పరమహంస తరచు తన శిష్యులకి చేసే హెచ్చరిక మునిరత్నానికి గుర్తొంది.

వంటగదిలో పనిలోవున్న తల్లి కోసం పసిపిల్ల ఏడిస్తే, ఊరుకోబెట్టడానికి ఆ పిల్ల దగ్గర ఆటబొమ్మలు పడేస్తుంది తల్లి. వాటితో ఆడుకుంటూ పిల్ల ఏడుపుని ఆపుతుంది. ఇలాగే పరమాత్మ కోసం ధ్యానం చేసేవారికి దేవుడు సిద్ధులు ఇస్తాడు. వాటి మోహంలోపడి, వాటిని ఇతరుల ముందు ప్రదర్శనకిపెట్టి ధనార్జనచేస్తూ పరమాత్మని విస్మరిస్తారు కొందరు. తన విషయంలో అలా జరగకూడదని మునిరత్నం రోజూ నిద్రలేవగానే గురుదేవులని, 'నాకు వచ్చిన సిద్ధులని నానించి మరుగుపరచు స్వామి' అని వేడుకునేవాడు

ఓ రోజు యాగంటికి వచ్చిన ఓ సన్యాసి మునిరత్నం గురించి స్థాని

కులు చెప్పగా ఆయన దర్శనం చేసుకుని కాని పోదలుచుకోక ఆ గుహ బయట కాపేసాడు.

సాయంసంధ్యాసమయంలో బయటకి వచ్చిన మునిరత్నాన్ని చూసి దగ్గరకు వెళ్ళాడు. మునిరత్నం వచ్చి పాదాభివందనం చేశాక తేరిపార చూసి ఆశ్చర్యంగా చెప్పాడు.

"మీరా స్వామీ? ఎంత మార్పు మీలో?"

మునిరత్నం ఆయన్ని నిశితంగా చూశాక గుర్తుపట్టాడు. ఆయన్ని ఏడేళ్ళక్రితం తను సన్యాస దీక్ష ఇప్పించమని వెళ్ళి కోరిన, శ్రీ మళయాళ స్వామి శిష్యుడైన జొన్నదరాసికి చెందిన శ్రీ రామకృష్ణానందగిరి. మునిరత్నం పెదవి విప్పలేదు. కుడిచేత్తో ఆయన వీపుమీద ఆశీర్వచనపూర్వకంగా తట్టాడంతే.

అతని తల్లిదండ్రులకి కబురు తెలిసి వచ్చేసరికే మునిరత్నం ఆ ప్రదేశాన్ని వదిలేశాడు.

ఓ రోజు అతనికి తను రెండోసారి ఇల్లు వదిలినప్పుడు నందవరంలోని చౌడేశ్వరీమాత ఆలయం దగ్గర ఓ సన్యాసి కనబడి గుండ్ల బ్రహ్మేశ్వరాలయం ఆవరణలోంచి జామపళ్ళు కోసి తెచ్చిచ్చిన వైనం గుర్తుకు వచ్చింది. ఆకలిమీద ఉండటంవల్లనేమో తనకి దోరగా పండిన ఆ జామపండు రుచిగా వుంది అనుకున్నాడు. అలాంటి పండు మళ్ళీ ఎక్కడైనా దొరికితే బావుండును అని కూడా క్షణకాలం అనిపించింది.

తక్షణం మునిరత్నం చేతులు బరువయ్యాయి. చూసుకుంటే చేతిలో సరిగ్గా అలాంటి జామపండు దర్శనం ఇచ్చింది. మునిరత్నం ఆశ్చర్యానికి అంతేలేదు. తను కోరుకున్న మాత్రాన పండు చేతిలోకి ఎలా వచ్చింది? దాన్ని కొరకబోయి ఆగిపోయాడు.

ఈ ఒక్క పండుతో తన కోరిక ఆగకపోవచ్చు. దీని తర్వాత ఏ మున్నుందో, కొత్తావకాయ కలిపిన వేడివేడి అన్నమో తినాలనిపిస్తే? అవీ ప్రత్యక్షం అయితే? ఇక తన ప్రగతి అంతటితో ఆగిపోవచ్చు. ఆ ఆలోచన రాగానే తక్షణం ఆ జామపండుని కొండమీంచి కిందకి గిరాటేశాడు.

అది అలా ఎలా ప్రత్యక్షమైంది అని ఆలోచిస్తే మునిరత్నంకి కారణం తట్టలేదు. కాని రెండు రోజుల తర్వాత ధ్యానంలో అతను ఆ విష యం ఆలోచించకపోయినా కారణం స్ఫురించింది.

మూలాధారం పృథ్వీ తత్త్వం, స్వాధిష్ఠానం జలతత్త్వం మణిపూరకం అగ్నితత్త్వం, అనాహతం, వాయుతత్త్వం, విశుద్ధ ఆకాశతత్త్వం. ఈ అయిదూ పంచభూతాలు తన ఆధీనంలోకి వచ్చాయి. తను వాటికి లోబడి లేడు. తన కోరికని తీర్చడానికి, పంచభూతాలతో తయారైన జాపకాయని తన చేతిలో వుంచాయవి. ప్రపంచంలోని ఏ వస్తువైనా సరే తయారయ్యేది పంచభూతాలతోనే కాబట్టి తను ఏది కోరుకున్నా అది లభ్యం అవచ్చు. పూర్వం ఓంకారేశ్వరాలయంనించి యాగంటి వస్తూంటే, తన కాలిమీద ఓ కొండరాయి దొర్లినా అది దూదిలా ఏ మాత్రం బరువులేకుండా కాలిమీంచి దొర్లిపోవడం గుర్తొచ్చింది. అప్పటికే తను మూలాధారతత్వం అయిన పృథ్వీమీద విజయం సాధించబట్టి తనని పృథ్వీ తత్త్వం అయిన ఆ రాయి ఏం చేయలేదన్న వివరణ కూడా మునిరత్నంకి లభించింది.

మునిరత్నం ఒక్కసారి తనకొచ్చిన ఆ శక్తిని పరీక్షించదలిచాడు. రెండు అరచేతులు ముందుకి చాపి మనస్ఫూర్తిగా తనకేం ఇష్టమో తనకే తెలీదని, దాన్ని ప్రసాదించమని కోరుకున్నాడు.

తక్షణం అతని కుడిచేతిలోకి పానవట్టంగల పెద్ద స్ఫటికలింగం ప్రత్యక్షం అయింది. మునిరత్నం దాన్ని చూసి తన్మయం చెందాడు. భక్తిగా జలంతో అభిషేకించాడు. తను ఇల్లు వదిలి ఆరేళ్ళవుతోంది. ఈ ఆరేళ్ళలో అయిదు చక్రాలు దాటాడు. ఆరో చక్రం కూడా దాటి సందలిని ఆజ్ఞా చక్రంనించి సహస్రారంలోకి చేరితే ఇక మళ్ళీ ఎన్నడూ అమ్మ కడుపున పుట్టడం వుండదు. 'స్వామీ! ఆ భాగ్యాన్ని ప్రసాదించండి' అని ఆ లింగాన్ని వేడుకున్నాడు.

ఆ సాయంత్రం మునిరత్నంకి అక్కడనించి వెళ్ళిపోవాలనిపించ సాగింది. క్రమేపీ ఆ కోరిక గాఢం అవడంతో రెండు రోజుల తర్వాత ఎక్కడికి వెళ్ళాలన్న ఆలోచన చేశాడు మునిరత్నం. అతనికి హిమాలయాల్లోని శివక్షేత్రం అయిన కేదార్‌నాథ్, శ్రీశైలం, కాశీలు స్ఫురించాయి.

ఈ మూడింటిలో ఎక్కడికి వెళదామా అని కాసేపు ఆలోచించాడు. అన్నిటి కన్నా శ్రీశైలం దగ్గర కాబట్టి అక్కడికి వెళ్ళాలన్న నిశ్చయానికి వచ్చాడు.

అయితే అతనికి అక్కడనించి బయలుదేరే రోజు ధ్యానంలో ఏడు నదులు సంగమించే ప్రదేశం కనిపించింది. అదేమిటో ఎక్కడుందో తెలీ లేదు. ధ్యానంలో అది సంగమేశ్వర క్షేత్రంగా తోచింది.

మర్నాడు కొండ దిగి కింద వున్న ఉమామహేశ్వరాలయంలోకి వెళ్ళాడు. ఆ విగ్రహానికి వాగులోని జలంతో అభిషేకం చేశాడు. అది చూసిన పూజారి పరిగెత్తికెళ్ళి ఇంట్లోంచి పాలగిన్నెతో వచ్చి చెప్పాడు భక్తిగా.

"స్వామీ! స్వచ్ఛమైన ఆవు పాలు."

మునిరత్నం అతనివంక ప్రసన్నంగా చూసి మాట్లాడకుండా ఆవు పాలతో లింగానికి అభిషేకం చేశాడు. తను కోరగా ప్రత్యక్షం అయిన స్ఫటికలింగాన్ని పూజారి చేతిలో వుంచి కదిలాడు.

అనుకోకుండా మునిరత్నం చూపు ఆ ఆలయంలో బొట్టు పెట్టుకోవడానికి ఎవరో దాతలు, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన అద్దంమీద పడింది మునిరత్నం రెండోసారి ఇల్లు వదిలినప్పటినించి అతను ఎన్నడూ తన మొహం అద్దంలో చూసుకోలేదు. ఆనాటి తన మొహానికి, ఈనాటి ముఖానికి గల తేడాని గుర్తించాడు. కళ్ళకింద చారలు లేవు. ముఖంనుండి అద్వితీయమైన వర్చస్సు. కళ్ళు ప్రశాంతంగానే కాక కాంతివంతంగా ఉన్నాయి.

ఇది కోరికదా తను ఇల్లు వదిలింది. మునిరత్నంకి ఒక్కసారిగా ఆనందం తన్నుకువచ్చింది. అంతలోనే వెనక్కి తిరిగి శివుడి విగ్రహం దగ్గరకి పరిగెత్తుకెళ్ళి దాన్ని ఆలింగనం చేసుకున్నాడు. అతని కళ్ళవెంట నీరు ధారగా కారసాగింది.

"స్వామీ! నాలోని మార్పుకి ఫలితంగా నాలో చెలరేగిన ఈ అహాన్ని సమూలంగా సర్వనాశనం చెయ్యి స్వామీ! నాలో మరిక అహం అనేమలినం కలగకుండా కాపాడు స్వామీ" మనసులో కోరుకున్నాడు.

పూజారి ఆ దృశ్యాన్ని చేతులు జోడించి భక్తిగా చూశాడు.

22

మనిషి జీవాత్మని శరీరంనించి మృత్యువనే ప్రక్రియతో విడదీసేవాడు, ఆ జీవాత్మ పరమాత్మతో కలిసే ప్రక్రియలో సహాయం చేసేవాడు, త్రిమూర్తులలో ఒకరైన ఈశ్వరుడే. అందుకే అద్వైత సిద్ధికోరే భిక్షువులు, సన్యాసులు యోగసాధకులు శివుడ్ని కొలుస్తారు.

శివారాధనలోని ఆధ్యాత్మిక అంతరార్థం ఇదే. 'శ' అంటే చిదానందం, 'కర' అంటే కలిగి వుండేవాడు. తనని ఆశ్రయించిన వారికి చిదానందాన్నిచ్చేవాడే శంకరుడు. ఈ విషయంలో పరమేశ్వరుడు బోధనల అంతరార్థం ముక్తి మార్గంలోని వారికి తేలిగ్గా అర్థమౌతాయి.

పరమేశ్వరుని నివాసం వెండి కొండ. ధనాధిపతి కుబేరుడు ఆయనకి ఆప్తమిత్రుడు. అయినా శివుడు భిక్షా పాత్రతో తిరుగుతూంటాడు. ధన కనకాదులు అద్వైతసిద్ధికి ప్రతిబంధకాలని, వాటిని త్యజించి అవిచ్చే సుఖ దుఃఖాలకి అతీతంగా ఉండాలని ఆ భిక్షాపాత్ర బోధిస్తుంది.

శివుడికి కామదహనుడని పేరు. అంటే కోరికలని జయించిన వాడని అర్థం. కోరికలు తీరడానికి మనం చేసే కర్మలు బంధానికి, బంధం జన్మ పరంపరలకి దారితీసి జన్మ మృత్యు పరంపరలోకి జీవిని నెట్టివేస్తాయి. అందుకే కోరికలని త్యజించాలని చెప్పే ఆ పరమేశ్వరుడు మృత్యుంజయుడుగా పేరు పొందాడు.

శివుడి మెళ్ళోని సర్పం మనిషిలో నిద్రాణంగా వుండే కుండలిని మాతకి ప్రతీక. దాన్ని శివుడు స్వాధీనం చేసుకుని అలంకరించుకున్నట్లే మనిషీ షట్ చక్రాలని కుండలిని సహాయంతో దాటి కుండలినిని తన ఆధీ

నంలోకి తెచ్చుకోవాలి అని అర్థం. అంతేకాక లోకం పొందాల్సిన అమృతానికి అడ్డువచ్చే విషాన్ని తాను స్వీకరించాలని, అప్పుడే 'స్వార్థం' నశించి ముక్తి లభిస్తుందన్నది నీలకంఠుడి బోధ.

శివుడు విబూదిని వంటికి పూసుకుంటాడు. విభూతి వైరాగ్యాన్ని సూచిస్తుంది. ఈ ప్రపంచంలో కనబడే ప్రతీజీవి చిట్ట చివరి స్వరూపం బూడిదే! ఇది గుర్తుంచుకుని వైరాగ్యం ద్వారా కోరికలు, దురలవాట్లు భస్మం చేసుకుని పవిత్ర జీవితంతో ముక్తిని సాధించాలని చెప్పేందుకే శివుడు విభూతిధారి అయ్యాడు.

కార్తీకమాసంలో శివాలయాలన్నీ జ్యోతులతో నిండిపోతాయి. 'జ్ఞానాత్ మహేశ్వరం'. అంటే జ్యోతే సాక్షాత్తూ పరబ్రహ్మం. అంతర్గతంగావున్న కామం అనే చీకటిని జ్ఞానం అనే జ్యోతిని వెలిగించుకుని అజ్ఞానాన్ని పారద్రోలి హృదయంలోని శివుడ్ని దర్శించాలన్నదానికిది సంకేతం.

శివుడికి ప్రీతికరమైనవి బిల్వపత్రాలు. మూడు దళాలతో వుండే బిల్వపత్రంతో ఆయన్ని అర్చించడమంటే, ఆధ్యాత్మిక సాధన ద్వారా మనలోని త్రిగుణాలైన తమో రజస్తత్వ గుణాలని పరమేశ్వరుడికి అర్పించి, అత్యున్నతమైన శుద్ధసత్త్వాన్ని పొందాలని అర్థం.

శివరాత్రికి పగలంతా ఉపవాసం చేసి, రాత్రి జాగరణ చేయమంటారు. 'ఉప' అంటే దగ్గరగా 'వాసం' అంటే నివశించడం అని అర్థం. జీవితం అనే పగలంతా లౌకిక విషయాలకి వాసనలకి దూరంగా వుండి, శివుడిని మనసులో నిలుపుకుని భక్తితో జీవించాలని, రాత్రి జాగరణ చేయడమంటే, నిద్రించే కుండలిని మేలుకొలిపి షట్చక్రాల్లో కర్మలతో పేరుకుని వున్న చీకటిని నాశనంచేయాలని అర్థం.

శివుడు మూడో కన్ను తెరిస్తే కనబడ్డదల్లా భస్మమౌతుంది. ప్రతి మనిషిలో మూడో నేత్రం మూసుకునే వుంటుంది. అది తెరచుకుంటే, కంటికి కనబడే ఈ ప్రపంచంలో మనం ఆనందం పొందుతున్నామనుకున్నవి ఏవీ అసలైన శాశ్వత ఆనందాన్నివ్వలేదన్న సంగతి కనువిప్పు కలిగి, అవిచ్చే ఆ ఆనందాలన్నీ భస్మం అవుతాయి. ఆ జ్ఞాన తేజస్సుతో ఆ జ్ఞానాంధకారం పటాపంచలవుతుంది.

ఈ కారణంగానే ఇనుముని అయస్కాంతం ఆకర్షించినట్లుగా శివుడు ముక్తి కాముకుల్ని ఆకర్షిస్తున్నాడు.

అలాగే పూర్వజన్మ సంస్కారం వల్ల మునిరత్నాన్ని రుద్ర కోటీశ్వరుడు, గుండ్ల బ్రహ్మేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, ఉమామహేశ్వరుడు రూపంలో ఆకర్షించి శుద్ధిచేసాక చివరి మజిలీగా సంగమేశ్వరుడు ఆకర్షించాడు.

మునిరత్నం జీవాత్మ, పరమాత్మతో సంగమించాల్సిన స్థలంగా అభయంకర శంకరుడు కృష్ణ, తుంగభద్రల సంగమస్థానంలో వెలిసిన సంగమేశ్వరుడు ఆ క్షేత్రాన్ని నిర్ణయించాడు.

శ్రీశైలానికి పశ్చిమ భాగాన సహ్య పర్వతాల్లో పుట్టి, సర్వపాపాలు హరించే శక్తిగల 'వేణి' అనే నది విష్ణాంశ సంభూత అయిన 'కృష్ణ'తో సంగమించి, శివకేశవుల స్వరూపాలుగా కృష్ణవేణిగా మారే స్థలంఅదే. అలాగే సహ్య పర్వతాల్లో పుట్టిన తుంగ, భద్ర అనే రెండు నదులు కలిసి తుంగభద్రగా మారిన స్థలమూ అదే. అయిదో నది అయిన 'భీమరధి' మనిషిలోని సర్వమలినాలని అపహరించే, అంటే తొలగించే 'మలాపహారిణి'తో అది 'భవనాశిని' నదిలో సంగమిస్తుంది. ఈ ఏడు నదులు సంగమించే స్థలం ఇదే. మనిషిలుండే భవబంధాలని నాశనంచేసి ముక్తినిచ్చే శివుడే సాక్షాత్తు 'భవనాశిని' రూపం ధరించి అక్కడ ప్రవహిస్తున్నాడని నమ్మకం.

మునిరత్నం నల్లమలై కొండలమీద నడిచి అడవులు దాటి ముందుగా కృష్ణ, వేణి సంగమించే స్థలంలో స్నానం చేసాడు. తను కోసిన పళ్ళని కోతులకి దానం చేసాడు. తర్వాత కృష్ణవేణితో మలాపహారిణి సంగమించే చోటకూడా స్నానాదులు చేసాడు. భీమరధీ నదీ కృష్ణవేణిలో కలిసేచోట స్నానాదులు చేసాడు. చివరగా ఈ అన్ని నదుల కలయికతో భవనాశిని కలిసేచోట కూడా స్నాన దానాలు చేసాడు. ఆ విధంగా సప్తనదుల సంగమ స్నానాలయ్యాక సంగమేశ్వరాలయాన్ని సందర్శించాడు.

మునిరత్నం ముఖవర్చస్సులో స్ఫుటంగా కనిపించే తేజస్సు, జ్ఞాని అని గమనించిన ఆలయ పూజారి అతన్ని మహాపురుషుడిగా ఇట్టే గ్రహించాడు.

"ఓసారి బయటకి వస్తారా?" అని పిలిచి ఆలయంగా బయటకి తీసుకెళ్ళి చేతులు రెండూ జోడించి చెప్పాడు.

"క్షమించండి. శివుడున్న ఆలయంలో నమస్కరించకూడదని పిలిచాను. నేను సన్మార్గంలో నడిచేలా ఆశీర్వదించండి."

మునిరత్నం తన పాదాలమీద పడి నమస్కరించిన, తనకన్నా వయస్సులో పెద్దవాడైన అయన్ని వంగి భుజాలు పట్టుకుని లేపి ఆయన సూక్ష్మ శరీరాన్ని తన మూడో నేత్రంతో పరిశీలనగా చూసి చెప్పాడు.

"రెండు చక్రాలు దాటారు. యాగయోగ్యమైన భూమిలో ఉన్నారు. ధ్యానం బాగా చేసుకోండి."

ఆయనే మునిరత్నాన్ని చుట్టుపక్కల వున్న శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ సూర్యనారాయణస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ మృత్యుంజయుడు, వశిష్ఠుడిచే ప్రతిష్ఠించబడ్డ శ్రీ నరసింహస్వామి, శ్రీ సరస్వతి అమ్మవారి విగ్రహాలని చూపించాడు.

"స్వామీ! దీనికి నివృత్తి సంగం అని పేరు. అంటే ముక్తినిచ్చే సంగమస్థలం అని. నిత్యం సూర్యుడు ఉదయించేప్పుడు పవిత్ర శ్రీశైల శృంగనీడ ఈ క్షేత్రంమీద, తీర్థాలమీద పడుతుంది. ఇక స్థలపురాణం; ద్వాపరయుగంలో ధర్మరాజు బంధు మిత్రులని చంపిన పాపం పోవడానికి ఇక్కడికివచ్చి, స్వహస్తాలతో ఓ లింగాన్ని ప్రతిష్ఠించదలిచాడు. భీమసేనుడు లింగం తీసుకు రావడానికి కాశీ వెళ్ళాడు. అయితే ముహూర్త సమయం దగ్గరపడుతున్నా, భీమసేనుడు రాకపోవడంతో ధర్మరాజు వేపచెట్టు కొట్టగా మిగిలిన ఓ వేప మొద్దుని 'దారులింగం'గా ప్రతిష్ఠించాడు. కాబట్టి ఇది ప్రపంచంలో మరెక్కడాలేని దారులింగం. భీమసేనుడు తనతో తెచ్చిన ఆ లింగాన్ని, తన శ్రమ వ్యర్థమైందన్న చిరాకుతో నదీ మధ్యమానికి విసిరేసాడు. ధర్మరాజు అతన్ని శాంతింపచేస్తూ "ఎవరైతే ముందుగా నువ్వు విసిరేసిన లింగాన్ని దర్శించి, ఆ తీర్థంలో స్నానంచేసి తర్వాత నాచేత ప్రతిష్ఠింపబడ్డ లింగాన్ని దర్శిస్తారో వాళ్ళకే పూజాఫలం దక్కుతుంది' అని ఆ భీమలింగానికి కూడా స్థానం కల్పించాడు."

అగస్త్యుడు, కపిల మహర్షి, విశ్వామిత్రుడు, తపస్సు చేసారని నమ్మబడే ఆ క్షేత్రానికి చేరిన రెండో రోజు మునిరత్నం తన ధ్యానానికి అనుకూలమైనచోటు కోసం వెదికాడు.

భీమలింగేశ్వరుడికి, సంగమేశ్వరుడికి నమస్కరించి కన్నీళ్ళతో మనసారా ప్రార్థించాడు.

"స్వామీ! నువ్వు ఇక్కడ రాతి రూపంలో వున్నావు. దారురూపంలో వున్నావు. నా సహస్రారంలో కూడా వున్నావు. నీ దర్శనం ఇక్కడ నాచర్మ చక్షువులకి అయినట్లుగానే, నీ క్షేత్రమైన నా సహస్రారంలో కూడా నీ దర్శన భాగ్యం నా అంతర్ నేత్రానికి కలిగించి మళ్ళీ అమ్మ కడుపున పుట్టని భాగ్యాన్ని ప్రసాదించు స్వామీ! నిత్యానందబాబా, సదానందబాబా రూపాల్లో నన్ను ముందుకి నడిపించు ఈశ్వరా."

మునిరత్నాన్ని చూసి అలయానికి వచ్చిన ఒకరిద్దరు భక్తులు వంగి అతని పాదాలకి దణ్ణం పెట్టారు. వాళ్ళ స్పర్శ తగలగానే అతనికి ఎలక్ట్రిక్ షాక్ కొట్టినట్లయి బాధ కలిగింది. ఈ అనుభవం అతనికి గత రెండేళ్ళుగా చాలాసార్లు అయింది. అయితే తనని దైవ స్వరూపుడని భావించి వాళ్ళు ప్రణామం చేస్తే దాన్ని కాదనలేక 'శివార్పణమస్తు' అనుకుని స్వీకరించేవాడు. ఆ పాద నమస్కారం ద్వారా వారినించి తనకి బదిలీ అయిన వారి కొన్ని కర్మలని తన ధ్యానంలో భస్మం చేసుకునేవాడు.

'చిన్న వయసులోనే ముఖంలో ఎంత వర్చస్సు' అని వాళ్ళు అనుకోవడం విన్నాడు. వెంటనే తనలో అహంకార తృప్తి తాలూకు గొప్పదనం భావన కలిగిందా అని ఆత్మపరిశీలన చేసుకున్నాడు.

ఆ నదుల సంగమానికి కొద్ది దూరంలో వున్న, దట్టంగా పెరిగిన చెట్లకిందకి నడిచాడు. కొద్దిసేపు వెదికి మనుష్యులకి చాటుగా వున్న ఓ బండ రాయిని ఎన్నుకున్నాడు. మొదటిదానికి నమస్కరించి, తర్వాత దానిపక్కనే వుండి నీడని ఇస్తున్న రావిచెట్టుకి నమస్కరించాడు. అది రావిచెట్టు కావడం చూసి సంతోషించాడు. భగవద్గీతలో శ్రీ కృష్ణుడు తను వృక్షాలలో అశ్వత్థ వృక్షం అని చెప్పడం గుర్తొచ్చిందతనికి.

రావిచెట్టు గురించి తన సంస్కృత అధ్యాపకుడు గణపతిశాస్త్రి చెప్పిన శ్లోకం మనసులో చదువుకున్నాడు.

మూలే విష్ణుః స్థితోన్నిత్యం స్కంధే కేశవ ఏవచ।
నారాయణస్తు శాఖాసు, పత్రేషు భగవాన్ హరిః॥
ఫలేచ్యుతో న సందేహః సర్వదేవైః సమన్వితః

(రావి చెట్టుమూలంలో విష్ణువు, స్కంధంలో కేశవుడు, కొమ్మల్లో నారాయణుడు, ఆకుల్లో శ్రీహరి, ఫలాల్లో సర్వదేవతా సమాన్వితుడైన అచ్యుతుడు నివశిస్తారు. ఇందులో ఏమాత్రం సందేహంలేదు.)

సాక్షాత్తూ విష్ణు స్వరూపమైన ఆ రావి చెట్టుకి నమస్కరించాక, వున్న కింది బండరాయికి మొక్కి దానిమీద ఉత్తర దిక్కుగా మొహం పెట్టి పద్మాసనంలో కూర్చున్నాడు. 'నారాయణ' అని మూడుసార్లు అనుకుని దీర్ఘ శ్వాస తీసుకుని కళ్ళు మూసుకుని ధ్యాన నిమగ్నుడయ్యాడు. మళ్ళీ పద్దెనిమిది గంటలదాకా మునిరత్నం కళ్ళు విప్పలేదు. లేవలేదు, కదల్లేదు.

23

"ఎవరాయన?"

మునిరత్నం ఆ రాత్రి ఆలోచిస్తున్నాడు. తనకి ధ్యానంలో కనబడ్డ ఆ ఋషి పుంగవుడు ఎవరు?

'త్యాగాత్ శాంతి రనంతరం' అని మూడుసార్లు పలికి అదృశ్యమయిన ఆయన ఎవరు? త్యాగం వల్ల శాంతి లభిస్తుందని చెప్పాడు. ఏది త్యాగం చెయ్యడం? తను అన్నిటినీ త్యాగం చేసాడు. ఇంకేముంది త్యాగం చేయడానికి? స్వజనులమీద, సర్వజనులమీద ఆసక్తిని పూర్తిగా వదులుకుని చిట్టడవిలోని కొండ గుహలో ఫలాలు, తుళ్ళతింటూ ఉన్న తను ఇంకా త్యాగం చేయాల్సింది ఏముంది? అనిపించిది.

కాని ఆ ఋషి తరచు ధ్యానంలో కనబడి అ ముక్కచెప్పి మాయమయ్యేవాడు. మునిరత్నానికి ఎంత ఆలోచించినా ఏం త్యాగం చేయాలో అర్థంకాలేదు. తన శరీరం తప్ప తనదంటూ తనకి ఏంలేదు. తన పేరుని

కూడా ఉపయోగించడంలేదు. శరీరాన్ని ఎలా త్యాగం చేయడం? ఇది ముక్తి మార్గంలో పయనించడానికి ఉపయోగించే వాహనంకదా. ఆ సంగతి **అంతటితో మర్చిపోయాడు.**

రోజులు వారాలవుతున్నాయి. మునిరత్నానికి మొదటిసారిగా సమాధి స్థితి అంటే ఎలా వుంటుందో అనుభవమైంది. ఆరోజు ధ్యానంలో మనస్సు కేవలం మననం అయే మంత్రం మీదే వుండేదికాదు. కాని ఆరోజు మాత్రం మననం ఆగిపోయి, ఏ ఆలోచనాలేదు. ఒక్క చిన్న ఆలోచనాలేని ఆ స్థితిలో మునిరత్నం వుండిపోయాడు. అయితే ఆ ఆలోచనా రహిత స్థితి గాఢ నిద్రాస్థితి కాదు. ఆ గాఢ నిద్రావస్థలో ఏం జరుగుతుందో మేలుకుని వుండి తెలుసుకునేస్థితి.

బయట ప్రపంచంలో ఎన్ని చప్పుళ్లున్నా సమాధిస్థితిలో ఒక్కటీ చెవి గ్రహించలేదు. అలాగే మిగిలిన ఇంద్రియాలు కూడా ఏదీ గ్రహించడం లేదు. మనసు పూర్తిగా పనిచేయడం ఆగిపోయింది. సమాధిలోంచి బయటకి రాగానే మునిరత్నానికి ఇట్లా కళ్ళు మూసుకుని కూర్చుని, మళ్ళీ వెంటనే అట్లా కళ్ళు తెరచినట్లనిపించింది. అయితే అది మధ్యాహ్న సమయం కాక దట్టంగా, చీకటిగా అలుముకున్న సమయం.

'ఇదేమిటి? ఒక్కక్షణంలో ఇంత చీకటి పడింది' అనుకున్నాడు కాని ఆ తర్వాత ధ్యానంలో చాలా తరచు కళ్ళు మూసుకున్న సమయంలోని సూర్యుడు, కళ్ళు తెరచిన సమయానికి చాలా దూరం ప్రయాణించాడని గ్రహించాక ఇంత తక్కువ సమయంలో ఇదెలా సంభవమవుతుందా అని ఆలోచించాడు. తను కళ్ళు మూసుకున్నాక మనసు పనిచేయడం లేదని, దాంతో కాలం తెలీలేదన్న ఆలోచన క్రమేపీ కలిగి తన ధ్యానం సమాధి స్థితికి చేరుకుందని గ్రహించాడు.

ఆ సమాధి స్థితిలో మునిరత్నం అనే తెలుసుకోవలసిన ధ్యాని, తెలుసుకునే విషయం అయిన ధ్యానం, తెలియవలసిన విషయం అయిన ధ్యేయం, ఈ మూడూ ఒకటిగా మారిపోయాయి. ఈ మూడిటి ఐక్యతే సవికల్ప సమాధి. ఈ దశలో అన్ని కోరికలు, తలంపులు, ఆలోచనలు, వ్యామోహాలు, రుచులు, అభిరుచులు, ఇష్టాయిష్టాలు, అహంకారం అంత

ంచి బోయాయి. దాంతో మనసు ఎటూ పరిగెత్తకుండా నిశ్చలంగా వుండడంతో అపూర్వమైన, అద్వితీయమైన, దివ్యమైన పరమశాంతిని, తద్వారా పరమానంద స్థితిని మునిరత్నం పొందగలిగాడు. ఆ శాంతిలో ఏకీ దుఃఖాన్ని కలిగించలేదు.

ఆ సవికల్ప సమాధిలోంచి బయటకి రాగానే మనసు ఎంతో ప్రశాంతంగా వుంటుంది. ఏ చెట్టు చూసినా, ఆకు చూసినా, ప్రపంచంలోని ఏ వస్తువు చూసినా అంతా కొత్తగా, అపూర్వ సౌందర్యదాయకంగా, ఆనందదాయకంగా కనిపించసాగాయి. మనసు అకారణ సంతోషంతో పరవళ్ళు తొక్కుతుంటుంది.

అలసటనేదే తెలీదు. సమాధిస్థితి తర్వాత మునిరత్నానికి నిద్రపోవాల్సిన అవసరం కూడా కలగలేదు. రెండు రోజులు నిద్ర లేకపోయినా, ఎలాంటి బడలికా వుండకపోగా బాగా నిద్రపోయిలేచినప్పటి స్థితి కలుగుతోంది.

ముందు మనసు నడుస్తున్న 'ఓం నమశ్శివాయ' మీద వుంటుంది. కొద్దిసేపటికి మంత్రం ఆగిపోతుంది. మనస్సు పనిచేయడం ఆగిపోతుంది, మునిరత్నం ఉచ్ఛ్వాస నిశ్వాసలు కూడా ఆగిపోతాయి. విగ్రహంలా వుండిపోతాడు. గుండె కొట్టుకోవడం ఆగిపోతుంది. ఆ సమాధి స్థితిలో అతని ఆజ్ఞాచక్రంలోని గత జన్మల దుష్కర్మలని మలిన సంస్కారాలని కుండలిని శక్తి భస్మం చేస్తూంటుంది.

ఆ సమాధి స్థితిలో కూడా తాను వున్నానన్న స్ఫురణమాత్రం మునిరత్నానికి వుంటుంది. అంతకుమించి వేరే ఏ ఆలోచనా వుండదు.

ఇప్పుడు ఇదివరకటిలా ఎక్కువ ఆహారం కూడా స్వీకరించడం లేదు. రెండు మూడు రోజులకోసారి ఓ పండో, ఫలమో తింటే చాలు. అతని శరీరంలోని ఎముకలు బిగుతయిన చర్మంమీంచి కనబడుతున్నా శరీరం ఎంతో కాంతివంతమైంది. కళ్ళు తెరచి వున్నప్పుడు అతని కనురెప్పలు మామూలు మనిషి కనురెప్పల్లా ఆడడం పూర్తిగా తగ్గిపోయింది. ఓ విధమైన తంద్రావస్థలో వుంటాడు. ఎప్పుడూ. మనసునిండా ఏదో చెప్పలేని అద్వితీయ ఆనందం ఉప్పొంగుతూంటుంది.

అయితే ఈ ఆలోచనారహిత స్థితిలో మునిరత్నం ఎక్కువసేపు వుండలేకపోతున్నాడు. తిరిగి ప్రపంచ స్పృహలోకి వస్తున్నాడు.

తను రోజుల తరబడి, ఆ స్థితిలో వుండగలిగితేనే నిర్వికల్పసమాధి స్థితిని చేరుకున్నట్లు. కాబట్టి నిత్యం గురుదేవుడిని తనకి నిర్వికల్ప సమాధిని అనుగ్రహించమని కోరసాగాడు.

మునిరత్నం ఇప్పుడు రోజుకి ఇరవై గంటల ధ్యానంలో వుంటున్నాడు. అతనిలో క్రమేపీ తను ఆ దేహం కాదన్న స్ఫురణ అధికం అవసాగింది. తను వేరని, ఆ దేహంలో తను వున్నాడు తప్ప తనా దేహం కాదన్న జ్ఞానం బలపడసాగింది. ఓ కొబ్బరికాయ ఎండగా ఎండగా లోపలి నీరంతా ఆవిరైపోయాక పెంకుకి అంటుకుని వున్న కొబ్బరి క్రమేపీ ఆ పెంకునించి ఎలా కొరడిగా విడిపోతుందో, అలా మునిరత్నం దేహాన్ని ఆవరించుకుని వున్న జీవాత్మ ఆ దేహాన్నించి విడిపోసాగింది. ఆ చైతన్యానికి క్రమేపీ ఆ ఆలోచనలు చేసేది తనే తప్ప శరీరం కాదని, ఆ శరీరంలోని పంచేంద్రియాల ద్వారా జ్ఞానాన్ని ఇంతకాలం అందుకున్నది తనే తప్ప ఆ శరీరం కాదని, ఆలోచించింది తనే తప్ప, మనస్సు కాదని, తను చైతన్యవంతమైన జీవాత్మ తప్ప, ఆ శరీరం కానీ, మనస్సు కానీ, బుద్ధి కానీ, చిత్తం కాని, ఇంద్రియాలు కాని కాదని, తను వాటన్నిటికీ పూర్తిగా వేరని, ఆ శరీరం వేరని ఆ చైతన్యానికి అర్థమవసాగింది.

మునిరత్నం మనసు ఖాళీ అవుతోంది. నానా జన్మలనించి నింపుకున్న విషయాలన్నీ ఆ మనసులోంచి ఖాళీ అవుతున్నకొద్దీ, అందులో దైవ చైతన్యం భర్తీగా నిండసాగింది. చేతిరుమాలులోని ఒకో దారాన్ని తీసేస్తూపోతే కొంత కాలానికి ఇక రుమాలే మిగలనట్లు మునిరత్నం మనసులోని ఆలోచనలు, తలంపులనే దారాలన్నీ ఖాళీచేయబడుతూండటంతో ఇక మనస్సనేదే లేకుండాపోయింది. దాంతో అతని మాట తీరు, చూపు అన్నీ మనస్సనేదే లేని పసిపాప తీరుగా, ప్రవర్తనగా మారింది.

ఆజ్ఞాచక్రం దగ్గరుండే రుద్ర గ్రంథి భేదనం కూడా జరిగింది. ఆ చైతన్యం తను ఇంతకుముందు ఏ శరీరాన్ని వదిలి ఈ శరీరంలోకి ప్రవేశించిందో ఆ జన్మ తాలూకు జీవితం గుర్తుకువచ్చింది.

గత జన్మలో తను తమిళనాడులో బాలషణ్ముగం అనే పేరుతో పుట్టాడు. అంతకుముందు జన్మలోనే ధ్యానంలో తను ఇతరులతో గల ఋణానుబంధాలన్నీ భస్మీపటలం చేసుకోవడంతో తనకి ఆ జన్మలో భార్యాపిల్లలు అనే ఋణగ్రస్థులు లేనందువల్ల వివాహం కాలేదు. బ్రహ్మచారి ఆశ్రమంనుంచి ఎకాఎకి సన్యాసాశ్రమానికి వెళ్ళాడు. కుర్తాళం దగ్గర వున్న ఓ మఠంలో వుంటూ బాణతీర్థం, కొరియర్, తిరువణ్ణామలై దగ్గరి అడవుల్లో తపస్సు చేశాడు. అయినా ఇంకా కర్మలు మిగిలిపోవడంతో ఈ జన్మ తీసుకున్నాడు. ఈ జన్మలో కూడా తనకి వివాహబంధానికి దారితీసే ఋణానుబంధం ఎవరితోనూ లేదు కాబట్టి పెళ్ళిచేసుకోలేదు.

క్రమేపీ మునిరత్నం మెదడులోని సబ్‌కాన్షియస్ మైండ్ విస్తరించుకోవడంతో అతని శరీరాన్ని ఆవరించుకుని వున్న ఆ జీవాత్మ చైతన్యానికి అంతకు మునుపటి ఏడు జన్మలు గుర్తొచ్చాయి.

అప్పటికి రెండు జన్మలముందు కూడా వివాహం జరగలేదు. ఉత్తర ప్రదేశ్‌లో సాత్నా జిల్లాలోని 'ఘన్‌పూర్' అనే ఊళ్ళోని కుమ్మరి వాళ్ళింట్లో పుట్టి, ధూమ్రాదేవి ఉపాసనతో జీవితం మొత్తం గడిపాడు. ఆ పుణ్యఫలితంవల్లే శక్తిమాత ఆలయం అయిన మూకాంబికాదేవి ఆలయాన్ని తను దర్శించగానే గతజన్మదాకా పొంది, మరుగున వున్న జ్ఞానం ఒక్కసారిగా బయటకి వచ్చిందని గ్రహించిందా జీవాత్మ.

అంతకుమునుపు హిమాలయాల్లోని ఛమోలీ జిల్లాలోని బిరాహి అనే గ్రామంలో ఓ సంస్థానాధీశుడికి కూతురిగా పుట్టింది. ఆ జన్మలో పిల్లలు కలగకపోవడంతో ఉధృతంగా దానధర్మాలు చేసింది. అంతకుమునుపు జన్మలో ఫ్రాన్స్‌లోని నెపోలియన్ సైన్యంలో ఉన్నత పదవిలో వున్నాడు. తన చివరి దశలో దూరమైన తన కూతురు హెలీనా కోసం తను చాలా తపన చెందాడు. అందుచేత ఆ హెలీనా జీవాత్మే, ఈ జన్మలో తనకి తల్లిగా జన్మించిందని, తను ఆమెకి దూరమై, ఆమెకి తనమీద అదే తపనని కలిగించి ఋణానుబంధం తీర్చేసుకున్నాడని గ్రహించింది.

అంతకుముందు జన్మలో థాయ్‌లాండ్ అడవుల్లో ఏనుగుగా పుట్టి, అంతకుపూర్వపు జన్మలో తను ఋణం తీసుకుని ఎగ్గొట్టినతని చేతికి చిక్కి-జీవితాంతం కలపని మోస్తూ అతనికి వెట్టిచాకిరీ చేసి ఋణానుబంధం కొంత దాకా తీర్చుకుందని గ్రహించింది.

ఫ్రాన్స్‌లో పుట్టినప్పుడు తను రక్తపాతం చిందించడంతో, క్రితం జన్మలో తను రక్తహీనత అనే వ్యాధితో ఎంతో అవస్థపడ్డాడని తెలిస వచ్చింది. తను ఎంతమంది రక్తపాతానికి కారణమయ్యాడో మళ్ళీ వారిచేత అలా చంపబడలేదు. ఏ రక్తం కారి వారు మరణించారో, తన శరీరం ఆ రక్తం కోసం అలమటించే బాధతో ఆ రుణానుబంధం తీరిందని కూడా తెలిసొచ్చింది,

అతని సబ్‌కాన్షియస్ మైండ్ పొరలు ఒకదాని తర్వాత ఒకటి విచ్చుకోవడంతో గత ఏడు జన్మల వివరాలు క్షుణ్ణంగా మునిరత్నానికి స్ఫురణకి వచ్చాయి.

అయిదు జన్మలక్రితం తన ఇంట్లో అన్నం తింటున్న ఓ సన్యాసిని తను 'ఒళ్ళు వంచి పనిచేసుకోక ఎందుకీ సన్యాసి వేషాలు' అని తిట్టడం, అతను వెంటనే విస్తరి ముందునించి లేచి 'నేను గుడ్డలకేగాక గుణానికి కూడా సన్యాసినైతే, నేను నిజంగా మానసిక సన్యాసినైతే నీ వంశంలోని ప్రతితరంలో ఒకరు సన్యసిస్తారు. ఇదే అందుకు గుర్తు' అని శపించడం ఆ చైతన్యానికి గుర్తొచ్చింది. ఆ క్షణంలో ఆ సన్యాసిలోని చైతన్యం, ఈ శరీరానికి గురుదేవులైన సదానంద బాబాలోని చైతన్యం ఒకటే అన్న విషయం కూడా తెలిసింది. తనని శపించినందుకు ఈ జన్మలో గురువుగా ఆ ఋణం తీర్చుకుంటున్నారని కూడా అర్థమైంది.

కాని సమాధి స్థితిలోంచి బయటకి వచ్చాక ఆ చైతన్యం ప్రత్యేక చైతన్యంగానే ఉంటోంది తప్ప తను విశ్వచైతన్యమే అన్న విషయాన్ని అర్థంచేసుకోలేకపోతోంది. ఆ చైతన్యానికి తను ఈ విశ్వచైతన్యమేనని, అది అనుభవపూర్వకంగా తెలుసుకోవాలన్న తపన వుంది. కాని అందుకు దానికి సాధ్యం కావడంలేదు. ఆ చైతన్యం తను ఓ ప్రత్యేక జీవాత్మననే భావనతో ఉండిపోతోంది.

మునిరత్నం జీవాత్మకి ప్రపంచం తనకి భిన్నంగా కనబడుతోందని, అలాకాక తనే ప్రపంచం, ఆ ప్రపంచమే తను అన్న అనుభూతి పొందితే కాని, పరిపూర్ణ అద్వైత స్థితిని చేరుకోవడం జరగదని తెలుసు. ఆ స్థితి కోసం ధ్యానం చేయసాగింది. నెల, రెండు నెలలు.... ఆరు నెలలు గడిచినా ఆ జీవాత్మకా అనుభూతి సిద్ధించడంలేదు.

మునిరత్నం ఉండుండి పెద్ద పెట్టున నవ్వుతాడు. అంతలోనే ఏడుస్తాడు. రాళ్ళు తీసుకుని తనవైపు వచ్చే వాళ్ళమీదకి విసురుతాడు. ఒక్కటే ధ్యాస. ఆ విశ్వచైతన్యంలో కలవడం ఎలా?

సముద్రపు నీటిమీద ఏర్పడ్డ పెద్ద బుడగ, ముందు తను సముద్రానికి భిన్నం అనుకుంటుంది. తర్వాత తను భిన్నం కాదు, ఆ సముద్రపు నీటిలోనే తను బుడగగా ఏర్పడ్డానని తెలుసుకుంటుంది. సంతోషిస్తుంది. తను తిరిగి సముద్రపునీటిలో కలవాలనుకుంటుంది. కాని బుడగరూపంలోని తను తిరిగి ఎలా ఆ అనంత జలంలో కలవాలో అర్థంకాక తన్నుకుంటుంది. తనని తను పగలగొట్టుకోవడం చేతకాదు. అందుకు ఇతరుల సాయం కావాలి.

మునిరత్నంలోని చైతన్యం పరిస్థితి సరిగ్గా ఇదే. ఇప్పుడు మునిరత్నం అన్న నామం గల, రూపంగల వ్యక్తికి దాదాపు అహంలేదు. అది లీనమైపోయింది. మునిరత్నం జీవాత్మ పూర్వం తనని శరీరంగా భావించి ముక్తికోసం పడ్డ తపనని, ఇప్పుడా జీవాత్మ తనని తాను జీవాత్మగా గ్రహించాక విశ్వాత్మగా అనుభూతి చెందాలని అదే తపనని పడుతోంది.

* * * *

ఆరోజు ఉదయం తను ఆవరించివున్న శరీరంతో స్నానానికి తీర్థానికి వెళ్ళిందా జీవాత్మ. స్నానంచేసి నదిలోంచి బయటికివస్తే నేలమీద ఇసుక రేణువులు లేవు. ఆ స్థానంలో ఎక్కడ చూసినా చిన్నచిన్న స్ఫటిక లింగాలు. వాటిని ఎలా తొక్కాలి అన్న సంశయంతో, ఎటు నించుందామా అని చూస్తే ఎటు చూసినా స్ఫటిక లింగాలే. నేల, ఆకాశం, చెట్లు, కొండలు ఏవీ ...టి మునుపటి రూపాల్లోకాక శివలింగాలుగా దర్శనమిస్తున్నాయి.

"నాకు పిచ్చెక్కిందే' అనుకుంటూ జీవాత్మ, తప్పదు కాబట్టి వాటిని తొక్కుకుంటూ, అందుకు బాధపడుతూనే తను డ్రయివర్‌గా వున్న ఆ శరీరాన్ని నడిపించింది.

'అన్నిటా ఆ పరమేశ్వరుడే' అంటే ఇదే అర్థం కామోసు. అన్నిటా పరమేశ్వరుడ్నే చూస్తున్నాను, అనుకోసాగింది. కాని దానికి అది ముక్తి కాదని తెలుసు. 'తనే అంతా-తనకి భిన్నంగా ఏంలేదు 'అన్న భావన కలిగేదాకా తను విజయాన్ని సాధించనట్లే. ఇంకా గమ్యానికి ప్రయాణిస్తున్నట్లే.

ఇప్పుడు నిర్వికల్ప సమాధి తరచు కలుగుతూ మునిరత్నం శరీరం రెండు మూడు రోజులపాటు ఏకధాటిగా కదలిక లేకుండా సమాధి స్థితిలో వుంటోంది.

'ఇంకెంత కాలం గురుదేవా?' అని ఆ జీవాత్మ విలపిస్తూనే వుంది. ధ్యానం చేస్తూనే వుంది. కాని తను అందుకు చాలా దగ్గరకి వచ్చానని అంతలోనే సంతోషం. చూసే వాళ్ళకి అతను పిచ్చివాడిగా తోచసాగాడు. ఏడుపు. వెంటనే కారణంలేకుండా అప్పుడే నవ్వు. దగ్గరకి ఎవరైనా వెళ్తే రాళ్ళువేసి కొట్టితరుముతాడు. బాహ్యానికి అతని స్థితి ఉన్మాదస్థితిగా గోచరించసాగింది.

ఇతని గురించి సంగమేశ్వర క్షేత్రానికి మూడు మైళ్ళ దూరంలో వున్న ముచ్చుమర్రి అనే గ్రామస్థులకి తెలిసింది. ఓ.రోజు ఒకతనికి ఆ అడవిలో కర్పూరపువాసన గుబాళిస్తూ వేసింది. ఎక్కడించా అని ఆ గ్రామస్థుడు శోధించి చూస్తే మలం! అది మునిరత్నం మలంఅయి వుండచ్చని అతను ఆయన దినచర్యని రహస్యంగా గమనించాడు. మునిరత్నం మర్నాడు కాలకృత్యం తీర్చుకున్నాక ఇతను దగ్గరకి వెళ్ళి చూస్తే ఆ మలం కర్పూరపు వాసనతో గుబాళిస్తోంది. ఈవార్త గ్రామంలోకిపాకగానే, ఆ వింత చూడడానికి జనం ఎగబడ్డారు. విషయం గ్రహించిన మునిరత్నం అది ఎవరికీ కనబడకుండా భూమిలో పూడ్చసాగాడు.

మునిరత్నం ఎప్పుడూ కళ్ళు మూసుకునే ఉంటాడు. ఎప్పుడైనా కళ్ళు తెరచి ఎవరి వంకైనా చూస్తే, ఆరోజు వాళ్ళకి ఏదో శుభం జరిగి

తీరడం కూడా గ్రామస్తులు గ్రహించారు. రోగగ్రస్థులు, కోరికలున్న వాళ్ళు వచ్చి, అతని దృష్టి తమమీద ఎప్పుడు పడుతుందా అని కాచుకుని చూర్చొసాగారు.

కొందరు కొంటెకుర్రాళ్ళు సమాధిస్థితిలో ఒంటిమీద స్పృహలేని అతని శరీరంమీద మూత్రం పోసేవారు. భయంకర సర్పాలు స్పృహలేని అతని వంటిమీద పాకడం గ్రామస్థులు చూసారు. జడలు కట్టిన జుట్టు, దారెడు పెరిగిన గోళ్ళు, స్నానపానాదులు సరిగాలేని ఆ శరీరంనించి దుర్గంధం రాకపోగా సుగంధ పరిమళాలు రావడం గ్రామస్థులు గ్రహించారు.

ఇతని గురించి తెలిసిన ఆంధ్రపత్రిక విలేఖరి వచ్చి అతన్ని ఫోటోలు తీసాడు. దాంతో అతని ఫోటో, తక్కువ వివరాలతో పేపర్లో పడింది. కాని ఆ రోజు మునిరత్నానికి తెలిసిన వారు ఆ పత్రికని చదివినా 'మునిరత్నం ఇతను ఒకరే' అని పోల్చుకోలేకపోయారు.

24

ఆ ప్రదేశం కొండల మధ్య వుంది. దగ్గరలోనే ఓ నది ప్రవహిస్తోంది. పూర్వం వశిష్ఠ మహర్షి తపస్సు చేసిన స్థలం అది. అటుఇటు మందాకిని పర్వతాలు, వాటి అంచున ప్రవహించే తన్సా నది. పక్కనే శిష్యాలు ఓ కోటలా నిర్మించిన వజ్రేశ్వరి మాత ఆలయం. తను చేసే యజ్ఞం కోసం అప్పట్లో వశిష్ఠుడు సృష్టించాడని చెప్పబడే మూడు ఉష్ణ కుండాలు. వాటిలో సలసల మరిగే గంధకం వాసన వేసేసీరు.

నేటికీ ప్రాచీనాలయం అయిన భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న ఆ మూడు- బ్రహ్మ, విష్ణు, శివ పేర్లుగల ఉష్ణ కుండాల్లోని నీటిలో, జ్యోతి రూపంలో సూక్ష్మ శరీరంతో మహాపురుషులు అర్ధరాత్రి స్నానానికి వస్తారని స్థానికుల నమ్మకం.

సద్గురు నిత్యానందబాబా మహారాష్ట్రలోని బొంబేకి సమీపంలో వున్న గణేష్‌పురి అనే ఈ ప్రదేశాన్ని తన నివాస స్థానంగా ఎన్నుకున్నారు. ఆయన అక్కడికి పంతొమ్మిది వందల ముప్పై ఏడులో వచ్చారు. అప్పటి నించి గణేష్‌పురి అనేకమంది ఆధ్యాత్మిక సాధకులని, భక్తులని ఆకర్షిస్తూ క్రమేపీ అభివృద్ధి చెందుతోంది.

ఆయన అక్కడికి వచ్చి సుమారు ఇరవై ఒక్క ఏళ్ళయింది. కైలాస్ నివాస్' నించి బయటకివచ్చి ఉదయపు నడక అనంతరం ఆ రోజు ఉష్ణకుండంలో స్నానానికి వెళ్ళారు. ఆయన రెండు అడుగులు దిగాక ఆగి బాబా ఆగ్నేయంవైపు తలతిప్పి చూసారు. 'హూ' అని హూంకరించి వంగి ఉష్ణకుండంలోని నీటిని కుడిచేత్తో అందుకుని ఆగ్నేయంవైపు మూడుసార్లు చల్లారు. తర్వాత బాబా ఉష్ణకుండంలోకి దిగారు.

గురు బినా కౌన్ బతాయే బాట్?

గురువు తప్ప అన్యులెవరు మార్గం చెప్పగలరు?

దుర్లభో విషయోత్యాగో దుర్లభం తత్వదర్శనం।
దుర్లభా సహజావస్థా సద్గురోః కరుణావినా.

ఈ సహజావస్థ ఎంతో దుర్లభమైంది. సద్గురు కరుణలేనిదే అది లభ్యంకాదు. కేవలం గురుకృపతోనే తాను ఆత్మనన్న అనుభూతి జీవాత్మకి లభిస్తుంది.

* * * *

తక్షణం సమాధి స్థితిలోని మునిరత్నంకి ఆ ఋషి దర్శనం మళ్ళీ లభించింది.

'త్యాగాత్ శాంతి రనంతరం' పలికాడాయన మళ్ళీ.

తను 'నాది'ని పూర్తిగా త్యాగం చేసాడు. కాని 'నేను' ఇంకా తనని అంటిపెట్టుకునే వుందని ఆ క్షణంలో స్ఫురించింది.

పరమేశ్వరి అనుగ్రహశక్తి ఆ జీవాత్మమీద సంపూర్ణంగా ప్రసరించింది. దాంతో అంటిపెట్టుకుని ఉన్న మాయ తొలిగింది. అతన్ని అంటిపెట్టుకుని వున్న 'నేను' అనే అహం స్ఫురణ పేలిపోయి సంపూర్ణంగా తుడిచిపెట్టుకుని పోయింది.

సముద్రంలోని బుడగ పేలిపోయి తక్షణం అది అనంత జలవాహినిలో కలిసిపోయింది.

ఆ క్షణంలో తను సర్వదా నాశనం లేనివాడని, నిత్యుడని, నిర్వికారుడని, నిర్గుణుడని, నిరాకారుడని, జ్ఞాన స్వరూపుడని, శుద్ధుడని, తను లక్షల ఏళ్ళక్రితం మర్చిపోయిన ఆ సంగతిని గుర్తుకు తెచ్చుకుంది ఆ జీవాత్మ.

అప్పటినించి తను తీసుకున్న ఎనభై నాలుగు లక్షల జీవరాసుల జన్మలతోపాటు ఇతర లక్షలాది జన్మల పరంపర యావత్తు ఆ చైతన్యానికి స్ఫురణకి వచ్చింది.

ఆ క్షణంలో అమృతం వర్షించింది.
అహంబ్రహ్మాస్మి స్థితి అది.
తత్వమసికి అర్థం అది.
అది ప్రజ్ఞానం బ్రహ్మస్థితి.
ఆ స్థితి ఏకమేవా ద్వితీయం బ్రహ్మ
అదే....

సర్వం విష్ణుమయం జగత్
ఈశ్వర సర్వభూతానాం
విశ్వం విష్ణు స్వరూపం
సర్వం ఖల్విదం బ్రహ్మ
వాసుదేవ సర్వమిదం...
ఈశా వాస్య మిదం సర్వం...
బ్రహ్మసత్యం-జగత్ మిథ్య

పాశబంధనం జరిగి ఆ జీవాత్మకి శివసాయుజ్యం లభించింది. పరిపూర్ణమైనదాన్ని తెలుసుకున్న ఆ క్షణంలోనే ఆ జీవాత్మలో, లక్షలాది సంవత్సరాలుగా చీకటిగావున్న గుహలోకి కాంతి ప్రవేశించిన తక్షణం ఆ చీకటి ఎలా మాయం అవుతుందో అలా, ఆత్మ దర్శనం జరిగిన ఆ క్షణంలో మిగిలివున్న కర్మలు, అహం భస్మమైపోయి పరమ పరిశుద్ధమైన ఆత్మగా పరిణమించింది.

తాను చూసే ప్రపంచమంతా నిజానికి తన రూపమేనని, ఇంతకాలం వేరైనట్లుగా గోచరించిందని తెలియగానే పరమానందం కలిగింది. ఇంతకాలం వేరని భ్రమిస్తుండటంవల్ల కలిగిన దుఃఖం మొత్తం ఆ క్షణంలో అంతరించిపోయింది.

ఆ పౌర్ణమి రోజు మునిరత్నం జీవాత్మకి కొత్త అనుభూతి కలగసాగింది. అతని అంతరంగం ఒక వూపు ఊపినట్లవడంతో అతనిలోని డెబ్భై రెండువేల నాడుల్లో అసంఖ్యాకమైన రక్తకణాల్లో తెల్లటి కిరణాలు ప్రవహించసాగాయి. కంటి ముందు కనిపించిన జ్యోతి బిందువులో తళతళ మెరిసే నీలంరంగులో మునిరత్నానికి తన రూపం కనిపించింది. తన రూపాన్ని తనే చూసుకుంటున్న అతను, తను జీవాత్మ కాదని, నిజానికి చిత్‌జ్యోతినని అర్థమైంది.

కలగన్న వాళ్ళకి మెలకువ వచ్చేదాకా ఆ కల నిజంగా జరుగుతోంది అనిపించినట్లుగా, భౌతిక ప్రపంచం అనే ఈ దీర్ఘ కలలోంచి మెలకువ వచ్చిన ఆ జీవాత్మకి తనింతకాలం దేహంగా, ఆ తర్వాత జీవాత్మగా కలగన్నదని, నిజానికి తను ఈ రెండూ కాక చిత్‌జ్యోతి అని అర్థమైంది. ఆ చిత్‌జ్యోతినించి వెలువడుతున్న వెలుగు విశ్వమంతా వ్యాపించి వుంది. అగ్నిలోంచి పైకి లేచే పొగలా ఆ వెలుగునించి పృధ్వి, గ్రహ మండలం సమస్తం ఉదయించడం కనబడింది.

బంగారంలో నగ, నగలో బంగారం ఏకకాలంలో ఉన్నట్లుగా అలాగే మట్టితో కుండ, కుండతో మట్టి వున్నట్లుగా ఆ వెలుగులోపలే ప్రపంచం, ప్రపంచం లోపల వెలుగు వున్నట్లుగా కనిపించింది. ఆ వెలుగే వివిధ రూపాల్లో అన్ని జీవరాశులుగా తననించి, తనలో తాను సృష్టించు

ి, క్రీడించడం తెలుస్తోంది. అలాగే తనలోంచి ప్రపంచంలోకి ఆ వెలుగు
పరిస్తూ, దానిలోంచి సమస్త జడపదార్థం సృష్టింపబడ్డ గ్రహింపు కలి
ి. నీటిలో మునిగినవాడికి ఎటుచూసినా నీరు తప్ప ఇంకేం ఎలా కన
దో, అలా అన్నివైపులా ఆ కాంతిపుంజం తప్ప మరేంలేదు. ఆ తేజస్సు
ంచే సూర్యుడికి వెలుగు అందుతోంది. అందులోంచే అగ్నికి వేడి,
యువుకి చలనశక్తి అందుతున్నాయి అన్న గ్రహింపు కలిగింది. ఎక్కడ
నా దివ్యపరమానంద భావం వెల్లివిరుస్తోంది.

అకస్మాత్తుగా ఆ జ్యోతిబిందువులో కనిపించిన మునిరత్నం నీల
ు ఆకారం గురుదేవుడు సదానంద బాబాగా మారింది. ఆ పరమగురువు
ికన్నా వేరు కాదన్న విషయం బోధపడింది. తర్వాత అది మరో
రంగా రూపుదిద్దుకుంది. అది సద్గురు నిత్యానందబాబా ఆకారం అన్న
ంపు వచ్చింది. కుడిచెయ్యి ఎత్తి, ఆశీర్వదిస్తున్న ఆ నీలకాంతి శరీరం
మునిరత్నంలా మారింది. ఆ తర్వాత ఆ కాంతి విడిపోయి జ్యోతి
వులో కలిసిపోయింది.

ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురుః పదమ్
మంత్రమూలం గురోర్వాక్యం మోక్షమూలం గురోఃకృపా

అవును! తను ఆ జ్యోతే. ఇంతకాలం ఇంకేదో అని కలగనడం
ంది. తన సహజస్థితి, స్వస్థితి సరిగ్గా ఇదే. అప్పుడూ, ఇప్పుడూ,
డూ తను ఆ జ్యోతి బిందువే. దాన్నించి వెలువడే ఆ కాంతి తనే. ఆ
తో ఏర్పడే సమస్తమూ తనే.

మునిరత్నం పెదవులమీద పరమానందంతో కూడిన చిరునవ్వు వెలి
. మొదట్నించి తను ఏదైతే వున్నాడో, తన దగ్గరే వున్న, తనదైన
ోసం ఇన్నాళ్ళపాటు వెదుకులాడినందుకు ఎంతో దూరంగా వుందను
ఆ పరమాత్మ అత్యంత దగ్గరలో తన హృదయ కుహరంలో
ని తెలుసుకున్నందుకు ఆ నవ్వు జనించి వుంటుంది. అతని కంటివెంట
దభాష్పాలు.

మృత్యువుకి శాశ్వతమరణం సంభవించింది.
జీవుడు శివుడయ్యాడు.
నరుడు నారాయణు డయ్యాడు
మానవుడు మాధవుడయ్యాడు.
పాపి గోపి అయ్యాడు.
ఆత్మ పరమాత్మ అయింది.
శవం శివంగా మారింది.
ఆ రోజు గురుపౌర్ణమి.

25

ఆ తర్వాత మునిరత్నానికి ప్రపంచం ఎన్నడూ కనబడని కొ కోణంలో కనిపించసాగింది. ఏది చూసినా దాని రూపం బదులు తన కాం పుంజంగా కనిపించసాగింది. వస్తువుల రూపనామాల భేదం అతని పూర్తిగా తొలగడమేకాక ప్రతీదీ తన జ్యోతి తాలూకు వెలుగునించి ఉ వించినదే కాబట్టి ఏదీ తనకి భిన్నంగా కనిపించడంలేదు. అన్నీ రూపంగా గోచరించడంతో అందర్నీ 'శివ' అని పిలవసాగాడు.

వంటరి అయిన తనే తన ఆనందం కోసం అనాదిగా వివిధ ర నామాలతో, ప్రపంచం అనే ఈ నాటకరంగంమీద అనేక పాత్రలని పోషి వినోదిస్తున్నాడని, అయితే తనే అన్నీ అని తెలుసుకుంటే నాటకీ వుండదు కనక 'మాయ' అనే శక్తిద్వారా ఆ పాత్రల్లో నటించే తను, నిజస్థితిని ఆ పాత్రల్లో వుండగా మరుగు పరుచుకుంటున్నాడని కూడా మైంది. అందువల్ల రాముడైనా, రావణాసురుడైనా, కృష్ణుడైనా, క డైనా, చీమైనా, ఏనుగైనా తనే అన్న స్పృహ కలిగి వుంటోంది

అతనికి అంగిట్లోంచి తరచూ అత్యంత అద్భుతమైన ఆనందామృ రసం కారుతోంది. నాలికని వెనక్కి మడిచి దాన్ని అందుకుంటూ ఆ బ్ర నందాన్ని అనుభవిస్తున్నాడు.

మునిరత్నంకి ఓ మనిషిని చూస్తే అతని గతజన్మలు, ప్రస్తుత జన్మ యే జన్మలు తెలిసిపోతున్నాయి. తన కాన్షస్‌నెస్సే వాళ్ళది కూడా అందులో ఉన్న ఏదీ అతనికి దాపరికం కాకపోవడంతో అలా తెలిసి న్నాయి.

సకల మిద మహంచ వాసుదేవః।

పరమ పుమాని పరమేశ్వరః సపకః।

మనకు కనిపించే ఈ ప్రపంచమూ మరియు నేను, పరమ పురుష ఆ వాసుదేవుడే.

ఏదీ అతన్ని బాధించదు, సుఖం ఇవ్వదు. ప్రతీ ఒకటి తనే అని చితప్ప, గతంలో లాగా కొందరు తనవారు, మరికొందరు పరాయి అనిపించదు. దాంతో ఎవరిమీదా ద్వేషం కాని, ప్రేమకాని కలగదు. పరమశాంతి స్థితిలో వుంటాడు.

* * * *

తన ప్రారబ్ధ కర్మానుసారం మునిరత్నం సంగమేశ్వర క్షేత్రంనించి కన గుంటూరు జిల్లాలోని రవ్వవరం అనే గ్రామానికి చేరుకున్నాడు. ర ఇటుకలబట్టీ వ్యాపారంచేసే చిన శీనయ్య అనే అతని దగ్గర తట్ట పట్టిపోసే రోజు కూలీగా పధ్నాలుగేళ్ళు పని చేసాడు.

'బట్టలు కూడా కట్టని, ఎవరితోనూ ఏమీ పలకని మునిరత్నానికి ఉ అనే పేరు పెట్టారు వారు. మునిరత్నానికి అందరిలోనూ తనే గోండడంతో లింగభేదం కూడా తెలీని ఆ స్థితిలో 'శివ' అనే అందర్నీ గరించసాగాడు. ఎర్రోడ్ని చేసి చిన శీనయ్య మునిరత్నానికివ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టాడు. సూర్యరశ్మితో మునిరత్నం తనకి కావలసిన శక్తిని తయారుచేసుకోసాగాడు.

అహంలేదా మనసులేని ఏ పసిపాపయినా అని వున్న పెద్దలని ఎలా స్తుందో, అలా మునిరత్నం అందరినీ ఇట్టే ఆకర్షించసాగాడు. అతని ఆ సమ్మోహనా శక్తి నించి ఎవరూ తప్పించుకోలేకపోతున్నారు.

పనిమీద వెళ్ళేప్పుడు ఎర్రోడు ఎదురుపడితే, ఆ పని జరుగుతుందని ప్రజలకి అనుభవంమీద అర్థమైంది. అప్పట్లో కమీషన్‌మీద ఇటుకల వ్యాపారంచేసే గురవయ్యకి పూర్వజన్మ సంస్కారాలవల్ల దైవభక్తి మెండు, సజ్జనులంటే ప్రీతి. అతనికోసారి ఎర్రోడి గురించి తెలిసింది.

'ఏమిటీ? మురుగ్గుంట్లో నీళ్ళు తాగినా ఏం కాదా? పళ్ళుతప్ప ఏం తీసుకోకపోయినా దృఢంగా ఉంటాడా?' అని ఆశ్చర్యపోయిన గురవయ్యకి ఎర్రోడు మహాపురుషుడనిపించింది. తన ఊరుకి రమ్మని బ్రతిమాలాడు.

ఫ్రెంచ్ దేశంలో పుట్టినప్పుడు తను సరిగ్గా జీతం ఇవ్వకుండా తన ఇంటి పనికి వెట్టిచాకిరి చేయించుకున్న జార్జ్‌కి ఋణపడ్డాడు. అది ఈ జన్మలో ఈ చాకిరీతో చిన శీనయ్యతో తీరడంతో, గురవయ్యతో తీర్చుకోవాల్సిన బాకీవల్లనే అతను తనకి తారపపడ్డాడని తెలుసు కాబట్టి, మునిరత్నం గురవయ్యవెంట అతని ఊరు వెళ్ళాడు.

మునిరత్నంలోని అవధూత లక్షణాలని గ్రహించిన మొదటి వ్యక్తి గురవయ్యే.

మునిరత్నం అందర్నీ 'శివ' అని పిలుస్తూండడంతో అతనికి 'శివబాబా' అనే పేరు పెట్టింది కూడా గురవయ్యే,

గురవయ్య ఇంట్లోని శివబాబా గురించి స్థానిక యమ్.ఎల్.ఏ. కి తెలిసింది. శివబాబా ఎవరికేం చెప్తే అది జరుగుతుందని తెలీడంతో, ఇలాంటి వాటిమీద నమ్మకం గల అతను ఎన్నికల ముందు గురవయ్య ఇంటికి వెళ్ళాడు. తను వచ్చే ఎన్నికల్లో గెలుస్తానో లేదో చెప్పమని కోరాడు.

శివబాబా నన్వి కాగితం, పెన్సిల్ రెండు కవర్లు తీసుకు రమ్మన్నారు. శివబాబా తీరు సాధారణ మనుషుల్లా లేకపోవడంతో ఇంప్రెస్ అయిన యం.ఎల్.ఏ. వెంటనే అవి తెప్పించాడు. శివబాబా దీక్షగా కాగితంమీద ఏదో రాసి, దాన్ని ఓ కవర్లో వుంచి, అతికించి, అతికించిన చోట ఆ యం.ఎల్.ఏ. సంతకం తీసుకున్నారు. దాన్ని రెండో కవర్లో వుంచి మళ్ళీ అతికించి, గురవయ్యచేత దానికి లక్క సీలు వేయించారు. యం.ఎల్.ఏ. కి ఆ కవరిచ్చి చెప్పారు.

"ఇది ఎన్నికలయ్యేదాకా తెరచి చూడకు. మంచి జరుగుతుంది."

ఎన్నికలైన రోజు రాత్రి గురవయ్య ఆయనింటికి వెళ్ళి ఆ కవర్ సంగతి గుర్తుచేస్తాడు. వాళ్ళు దాన్ని వెదికి చింపి శివబాబా రాసిన కాగితం తీసి చదివారు. ఆయన ఎన్ని ఓట్ల మెజారిటీతో నెగ్గుతాడో రాసి వుంది. అంతే కాదు. ఆ కాగితం రాసిన సమయంలో ఉత్తర భారతదేశంలో పోటీ చేసిన అబ్రహాం అనే యం.పి. వాళ్ళింట్లోనే వుంటాడని, ఆయన ఎన్ని ఓట్ల మెజారిటీతో నెగ్గుతాడో కూడా రాసి వుంది. కేంద్రంలో ఆయన వాణిజ్య శాఖకి మంత్రి అవుతాడని కూడావుంది. అది చదివిన యం.ఎల్.ఏ.కి నిజంగా అబ్రహాం తన ఇంట్లో ఉన్నందుకు పరమాశ్చర్యం కలిగింది.

పుట్టుకతో క్రిస్టియన్ అయినా హిందూమతంమీద కూడా విశ్వాసం గల అబ్రహాంకి, దాదాపు మూడు వారాల క్రితం రాసిన ఆ కాగితంలో ఈ వివరాలు ఉండడంతో శివబాబామీద గురి కుదిరింది.

ఎన్నికల ఫలితాలు వచ్చాక శివబాబా రాసింది కరెక్టే అవడంతో అబ్రహాం ప్రత్యేకంగా వచ్చి ఆయన్ని దర్శించాడు.

"నాకేదైనా మంత్ర దీక్ష ఇప్పించండి స్వామీ" కోరాడు అబ్రహాం.

"అలాగే. కాని వివేక చూడామణిలో ఇరవై మూడో శ్లోకం చెప్పు శివా" అడిగాడు శివబాబా.

అప్పుడు గుర్తొచ్చింది అబ్రహాంకి శివబాబాని గతంలో కలిసినపుడు చేసిన సూచన. ఆ మూడు గ్రంథాలని కంఠస్థంచేసి కాని తన దగ్గరకి రావద్దని చెప్పారు శివబాబా. రెండేళ్ళు గడిచినా అబ్రహాం వాటిని కంఠస్థం చేయలేదు. అబ్రహాం ఎంతో పట్టుదలతో వాటిని కంఠస్థంచేసి, మూడేళ్ళ తర్వాత ఓరోజు వాటిని అప్పగించడానికి వెళ్ళాడు. శివబాబా మొహంలో సంతృప్తి కనబడింది.

"అదృష్టవంతుడివి. ఓ మానవజన్మ వృధాచేసుకోలేదు నువ్వు" చెప్పాడాయన.

ఆ పద్యాలు అప్పచెప్పించుకోకుండానే అబ్రహాంకి శక్తిపాతం ఇచ్చి ఆయనకి శివ పంచాక్షరి మంత్రాన్ని ఉపదేశించి చెప్పారు.

"జాగ్రత్తగా ధ్యానం చేసుకో. నీ ఆధ్యాత్మిక ప్రగతి గురించి ఒకర్ని అడగక్కర్లేదు. నీకే అర్థమౌతుంది శివా."

ఢిల్లీకి రమ్మని శివబాబాకి ప్రత్యేకంగా ఓ బంగ్లా, కారు ఇస్తానని అర్థించాడు అబ్రహాం. "చేతిలో నయాపైసా, ఎన్నికల జాబితాలో పేరు, ఒంటికి బట్టలేని నాకు అవెందుకు శివా?" నిరాకరించారు శివబాబా.

శివబాబా దగ్గరకి అనేకమంది ఆధ్యాత్మిక సాధకులు మంత్రదీక్ష కోసం ఆశగా వచ్చేవారు. వాళ్ళని తేరిపార చూసి 'నేను నీ గురువుని కాను' అని పంపించేసేవారు. కొందరికి ఫలానావారి దగ్గరకి వెళ్ళమని చెప్పేవారు. ఎవరైనా మరీ మొండి ఘటాలుంటే, వాళ్ళని వివేక చూడామణి, భగవద్గీత, ఈశావాస్యోపనిషత్తులు అప్పచెప్పమనేవారు. వాళ్ళల్లో ఎవరూ అవి అప్పచెప్పడానికి తిరిగి రాలేదు. ఓసారి గురవయ్య ఆ విషయంమీద ప్రశ్నిస్తే అందుకాయన నవ్వి 'నా శిష్యులుగా అర్హత ఉన్నవారు ఇరవై ఏడుగురే' అని చెప్పారు.

అప్పటికే ఇరవై ఒక్క మంది శిష్యులని ఆయన స్వీకరించారు.

శివబాబాకి వారంరోజుల్లో నోట్లోని దంతాలన్నీ పుచ్చి వూడిపోయాయి. అది గ్రహించిన గురవయ్య పళ్ళ డాక్టర్‌ని తెచ్చినా శివబాబా వైద్యం చేయించుకోడానికి ఒప్పుకోలేదు. ఆయనకి పై పళ్ళు నాలుగు, కింద పళ్ళు మూడు దవడ దగ్గర నాలుగు దంతాలు మాత్రమే మిగిలాయి. దాంతో మాట ఇదివరకటి అంత స్పష్టంగా వుండేది కాదు. దాంతో శివబాబా పళ్ళు మానేసి కేవలం ఆవు పాలే తీసుకోసాగారు. నిత్యం ఉదయం ఆరునించి ఓ అరగంటపాటు ఏదైనా సద్గ్రంథంమీద ప్రవచనం ఇవ్వడం, సాయంత్రం ఆరుకి భజనలో పాల్గొనడం శివబాబా కార్యక్రమాలయ్యాయి. క్రమంగా ఆయన ఖ్యాతి ఆంధ్రప్రదేశ్ అంతటానే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా పాకింది. ముఖ్యంగా కర్నాటక, మహారాష్ట్రనించి చాలామంది వచ్చేవారు.

శివబాబా ఓరోజు చాలా ఉత్సాహంగా ఉన్నారు. అది గమనించిన గురవయ్య ఎందుకని అడిగితే 'ఇవాళ సతారానించి శారదా బేన్ వస్తోంది.

ంతో నా ప్రారబ్ధకర్మ కొంత తీరుతుంది' అన్నారు. ఆరోజు వంటలోకి ం చెయ్యాలో కూడా చెప్పారు. నిజంగానే ఆ రోజు శారదా బేన్ తన ర్తతో మహారాష్ట్రలోని సతారా నించి, శివబాబా గురించి విని వచ్చింది. మెతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ఆ రోజు వండిన కూరగాయ న్నీ శారదా బేన్ కిష్టమైనవే. ఆమెకి మంత్రదీక్ష ఇచ్చారు శివబాబా. జన్మలో ఆవిడ శివబాబా మాతృమూర్తి. మరో రోజు డిసౌజా అనే తను వచ్చి గురవయ్య తలుపు తట్టాడు.

"మీ ఇంట్లో ఎవరైనా సిద్ధ పురుషులున్నారా?" ప్రశ్నించాడు ంగ్లీషులో.

"రండి. ఉన్నారు. ఎక్కడ నించి వచ్చారు మీరు?" ప్రశ్నించాడు రవయ్య.

"గోవా నించి."

"మీ ఊళ్ళో పేపర్లో కూడా శివబాబా గురించి రాసారా?" అడిగాడు రవయ్య ఆసక్తిగా.

"లేదు. నాకు వరసగా మూడు రాత్రులుగా ఆయన స్వప్నంలో నిపించి, తన దగ్గరకి రమ్మని చెప్తున్నారు. అది స్వప్నమో, లేక నిజంగా దగ్గరకి వచ్చే చెప్పారో స్పష్టంగా చెప్పలేను. తెల్లారి లేచాక ఓసారి లనుకుంటాను, మరోసారి నిజంగా జరిగిందనుకుంటాను. నేను బయలు దేరినప్పటినించి నా చెవిలో ఎవరో, ఫలానా చోటుకి టిక్కెట్ తీసుకుని ఫలానా బండెక్కు అంటూ గైడ్ చేస్తూ ఇక్కడికి రప్పించారు. నాకేమైనా భ్రాంతా లేక నిజమా అని తేల్చుకోలేక పోతున్నాను...."

గురవయ్య శివబాబా గురించి చెప్పి అది భ్రాంతి కాదని చెప్పాడు.

శివబాబా డిసౌజాని చూడగానే ఆప్యాయంగా దగ్గరకి తీసుకుని నుదుటిమీద ముద్దుపెట్టుకుని గురవయ్యకి అర్థం కాని భాషలో మాట్లాడారు. ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నాక డిసౌజాని అడిగాడు గురవయ్య.

"మీరేం భాషలో మాట్లాడుకున్నారు?"

"పోర్చుగీస్. శివబాబా అక్కడి వారనుకుంటాను?"

"కాదు. నాకు తెలిసి వారు ఎన్నడూ గోవాలో కాలుపెట్టలేదు."

"మరి నా మాతృభాష ఎలా మాట్లాడారు?"

"బ్రహ్మజ్ఞానం పొందిన వారికి ఈ ప్రపంచంలో తెలీని విషయమే పుండదు."

తమ మాటల సారాంశం చెప్పాడు డిసౌజా. డిసౌజాకి గత రెండేళ్ళుగా హిందూ మిస్టిక్ సెయింట్స్‌మీద ఆసక్తి కలిగింది. అతను అలాంటి వారిని స్వయంగా కలుసుకోవాలని వారి గురించి ఎంక్వయిరీ చేస్తున్నాడు. ఈ విషయం శివబాబా చెప్తూ 'పూర్వజన్మ కర్మ పరిపాకంవల్లే నీకా ఆసక్తి పుట్టింది. నా దగ్గరకి చేరేకర్మ లేకపోతే నీకా ఆసక్తే ఏర్పడేది కాదు' అన్నారు.

శివబాబాకి పద్దెనిమిది జన్మల క్రితం డిసౌజా ఆధ్యాత్మిక గురువు. మొట్టమొదటగా ధ్యానం నేర్పించింది డిసౌజానే. అప్పట్లో ఇద్దరూ ఈజిప్ట్‌లో జన్మించారు. శివబాబా ఆధ్యాత్మిక మార్గంలోకి రావడానికి డిసౌజా ఆ జన్మలో కారణం కాబట్టి ఆయనకి డిసౌజాతో తన ఋణశేషం తీర్చుకోడానికి పిలిచారు. శివబాబా అప్పటి నించి పట్టుదలగా ప్రతీ జన్మలో యోగసాధన చేస్తూ వస్తున్నారు. కాని డిసౌజా దారి మళ్ళాడు. తిరిగి డిసౌజాని ఆ దారిలో పెట్టడానికి శివబాబా ఆహ్వానించారు.

డిసౌజా మూడురోజులున్నాడు. అతను వివేక చూడామణి, ఈశావాస్యోపనిషత్తు, భగవద్గీత కంఠస్థం చేయాలన్న నిబంధన మీద అతనికి మంత్రదీక్ష ఇచ్చి ధ్యానం చేయించి పంపారు. అప్పటినించి నెలకోసారి శివబాబా దర్శనానికి డిసౌజా వస్తూనే ఉన్నాడు.

శివబాబా చేష్టలు కొన్ని ఎంతో వింతగా ఉండేవి. ఒక్కోసారి వంట గదిలోకి వెళ్ళి అన్నం తీసుకుని పాలతోనో, పెరుగుతోనో కలిపి బయటకి వెళ్ళి అక్కడున్న పిల్లికో, కుక్కకో పెట్టేవారు. ఒకోసారి బియ్యం తీసుకుని వెదజల్లగానే పక్షులు వచ్చి వాటిని ఏరుకు తినేవి. మరోసారి ఎంతో సంతోషంగా ఉండేవారు. ఇంకోసారి విచారంగా ఉండేవారు. వర్షాకాలంలో ఓరోజు శివబాబా తెల్లవారుఝామున రెండున్నరకి గురవయ్యని లేపి చెప్పాడు.

"నేను వెళ్తున్నాను."

"ఎక్కడికి బాబా?" ప్రశ్నించాడు గురవయ్య.

"నీ ఇంటికీ నాకు ఋణం తీరింది శివా. ఇంక నేను నీ ఇంట్లో ఉండాల్సిన అవసరం లేదు."

"అదేమిటి బాబా? నావల్ల ఏం అపరాధం జరిగింది?" బాధగా అడిగాడు గురవయ్య.

"ఏం జరగలేదు. నువ్వు నన్ను పద్నాలుగు వందల తొంభై రెండు రోజులు చక్కగా చూసుకున్నావు.... దాంతో నీ ఇంటితో నా ప్రారబ్ధకర్మ తీరింది."

గురవయ్య, ఆయన కుటుంబసభ్యులు ఎంత కాళ్ళా వేళ్ళా పడ్డా శివబాబా ఉండకుండా బయలుదేరడానికి సిద్ధమయ్యారు. తెల్లారేదాకా ఉండమన్నా వినిపించుకోలేదు. దాంతో గురవయ్య తన భార్య సలహామీద శివబాబా వర్షంలో వెళ్ళడం ఇష్టం లేక మర్నాడు ఉదయం చూసుకోవచ్చని శివబాబా వున్న గది తలుపువేసి బయట గడియపెట్టాడు. కాని మర్నాడు ఉదయం గడియతీసి చూస్తే గది ఖాళీగా వుంది. శివబాబా లేరు.

26

అవింకా జమీందారీ హక్కులు పోని 1971కి మునుపు రోజులు.

ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్ దగ్గరున్న చిన్న జమీకి అధిపతి అయిన రాజేంద్రకుమార్‌కి దైవభక్తి మెండు. అతను ప్రతీ ఏడు హరిద్వార్‌లోని మానాదేవి ఆలయానికి వచ్చి కానుకలు సమర్పించుకుని వెళ్తుంటాడు. ఆ సందర్భంలో హరిద్వార్‌లో పండిత సభలు కూడా నిర్వహిస్తుంటాడు. ఆ ఏడు పండిత సభలకి ఓ పీఠాధిపతిని అధ్యక్షుడిగా పిలిచాడు. పండితసభ జరిగే కైలాసాశ్రమ ఆవరణలోని ఏర్పాట్లని రాజేంద్రకుమార్ స్వయంగా పర్యవేక్షిస్తుండగా అక్కడికి వచ్చిన శివబాబా నవ్వి 'ఎందుకు అనవసరపు ఖర్చు? మూడు రోజులపాటు ఈ సభ ఎటూ జరగదు'

అన్నారు. రాజేంద్రకుమార్‌కి ఆ మాటలకి ఎంతో చిరాకేసింది ఆ దిగంబర వింత వ్యక్తిమీద అరిచాడు.

"చంపుతా. పో ఇక్కడ్నించి"

మర్నాడు ఉదయం ఎనిమిదిన్నరకి సభ ఆరంభం అవడానికి ఇంకా కొద్ది క్షణాల వ్యవధే వుంది. భారత రాష్ట్రపతి శ్రీ జాకీర్ హుస్సేన్ మరణించారని, రాష్ట్రపతి మరణానికి సంతాపసూచకంగా ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుపరాదని, దాంతో ఆ పండిత సభకి ఇచ్చిన అనుమతిని మూడు రోజులపాటు ఉపసంహరించుకుంటున్నామంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి నోటీస్‌ని రాజేంద్రకుమార్‌కి అందించాడు. రాజేంద్రకుమార్‌కి అప్పటికి కాని బోధపడలేదు, క్రిందటిరోజు తను పిచ్చాడిలా భ్రమించిన వ్యక్తి మాటల్లోని అర్థం. వెంటనే అతని కోసం వెదికాడు. సాలిగ్రాంఘాట్ దగ్గర శివబాబా ఆయనకి కనిపించారు. వెంటనే రాజేంద్రకుమార్ ఆయన కాళ్ళమీద పడి చెప్పాడు.

"మహరాజ్. మీరు పిచ్చివాళ్ళనుకున్నాను. కాని అవధూత అనుకోలేదు. మీరు మా ఇంటికి దయచేయాలి."

శివబాబా రాజేంద్రకుమార్ వెంట అతని జమీకి వెళ్ళాడు. అక్కడున్నన్ని రోజులూ నిత్యం భగవద్గీతమీద శివబాబా శుద్ధ హిందీలో చెప్పే ప్రవచనాలు అంతా ఎంతో ఆసక్తిగా వినేవారు. సాయంత్రం భజనలో వందల మంది పాల్గొనేవారు. ఎంతమంది మంత్రదీక్ష అడిగినా ఇవ్వలేదు శివబాబా. ఒక్క రాజేంద్రకుమార్ కొడుకు శివకుమార్‌కే ఇచ్చారు.

"స్వామీ. మీరు దీక్ష నాకు కూడా ఇవ్వచ్చుగా?" ప్రాధేయపడ్డాడు రాజేంద్రకుమార్.

"ఊఁహూ. నీ కొడుక్కి నాకు వున్న ఋణశేషం తీరడానికే వాడికిచ్చాను. నీకు నాకు గత జన్మలో అలాంటి ఋణం లేదు."

రాజేంద్రకుమార్ స్వామి దయానంద సరస్వతి పుస్తకాలు బాగా చదివి ఉన్నాడు. కాబట్టి అతను 'దేవుడు నిరాకారి, విగ్రహారాధన మూఢాచారం' అన్న విశ్వాసంతో ఉండేవాడు. దేవాలయానికి వెళ్ళి పూజలు

చేయడం శుద్ధ వృథా అని నమ్మేవాడు. శివబాబా ఓ శివరాత్రికి రాజేంద్రకుమార్‌ని శివాలయానికివెళ్ళి పంచామృతంతో లింగాభిషేకం చేయమ చెప్పారు.

"బాబా. పంచామృతం పేరుతో పాలు, పెరుగు, తేనె, నెయ్య పళ్ళు ఎందుకు వృథాచేయడం? వాటిని ఎవరైనా పేదవాళ్ళచ్చినా మే విగ్రహారాధన మూఢత్వం కదా బాబా?" చెప్పాడు రాజేంద్రకుమార్.

అదంతా ఓపికగా విన్నాక శివబాబా కొద్దిసేపు అతనివంక తీక్షణం చూసారు.

"మూఢత్వమా?" అమాయకంగా ప్రశ్నించారు శివబాబా.

"అవును బాబా. పూర్వకాలం కొందరు అగ్రజాతి వాళ్ళు త పెత్తనం చలాయించడం కోసం విగ్రహారాధనని ప్రవేశపెట్టారు...." తన తెలిసినదంతా చెప్పాడు రాజేంద్రకుమార్.

శివబాబా గోడకి వేలాడుతున్న రాజేంద్రకుమార్ ఫోటోని తీసి అత సేవకునికి చూపించి చెప్పారు.

"ఈ ఫోటోమీద ఉమ్మెయ్."

"మహరాజ్?"

"ఉమ్మెయ్."

అందుకు వాడు నిరాకరించాడు.

"ఇది నీ యజమాని కాదుగా? ఆయన అక్కడున్నాడు. ను ఉమ్మేది ఆయన బొమ్మమీదేగా. ఉమ్మెయ్ ఫర్వాలేదు."

వాడు ఆ పని చెయ్యలేదు.

శివబాబా మారుమాట్లాడకుండా ఆ గదిలోంచి బయటకి నడిచా రాజేంద్రకుమార్‌కి ఆయన చెప్పదల్చుకున్న విషయం - విగ్రహం అనే నిరాకార దేవుడికి ప్రతీక అన్నది- బోధపడింది. వెంటనే శివాలయా వెళ్ళి శివలింగానికి పంచామృతంతో అభిషేకం చేసాడు అతను.

• • • •

కర్నాటకలోని చిక్‌మగుళూర్ అడవి ప్రాంతంలోని ఓ గ్రామం చేరుకున్నాడు శివబాబా. దారిలో ఆయన కొల్లూరులోని మూకాంబికాదేవి ఆలయాన్ని సందర్శించారు. ఆ తల్లే ఆయనలోని ఆధ్యాత్మిక పరిణామానికి దోహదం చేసినా, మనస్సేలేని ఆయనకి ఎలాంటి భావాలైనా ఎందుకు కలుగుతాయి? అసలా ఆలయంకాని, అందులోని దేవిగాని, తన ఆత్మలోనిదే కాబట్టి ఆయనకి పరభేదం ఎందుకు కలుగుతుంది?

క్రమంగా ఆయన గురించి ఆ గ్రామస్థులకి తెలిసింది. ఆయన సత్పురుషుడై వుండాలని అంతా నిశ్చయించుకున్నాక, గ్రామంలోని దేవాలయంలోకి వచ్చి వుండమని కోరారు. తను ఇంట్లోతప్ప దేవాలయంలో ఉండనని చెప్పారాయన. దిగంబరంగా, అందులో వయసులోవున్న ఆయన్ని తమింటికి తీసుకువెళ్ళడానికి గృహస్థులెవరికీ మనస్కరించలేదు. కాని శరవణ్ణ నాయనమ్మ మాత్రం ఆయన్ని తమింటికి ఆహ్వానించింది. అప్పటికింకా శరవణ్ణ పుట్టలేదు.

వాళ్ళింట్లో శివబాబా సరిగ్గా ఏడాదిమీద నలభై ఏడు రోజులున్నారు.

శరవణ్ణ నాయనమ్మ, శివబాబా ఓ రాత్రి ఇంట్లోని అన్నం, పెరుగు కలిపి తేసుకెళ్ళి ఓ నక్కకి పెట్టడం చూసి, కోపం వచ్చి తిట్టింది. శివబాబా బదులు తిట్టారు. నాయనమ్మ తన చిన్న కొడుకు చేతికి కర్రఇచ్చి చెప్పింది.

"వెళ్ళగొట్టు వెధవని."

"వెళ్ళగొట్టడానికి మీకు శక్తి వుంటేగా? కూర్చున్నప్పుడు సరిపడే శ్వాస, నీకు నడిచేప్పుడు చాలదు. నడిచేప్పుడు అక్కరకి వచ్చే శ్వాస, పరిగెత్తేప్పుడు చాలదు. ఇంత శక్తిహీనుడవైన నీకు అహంకారమెందుకు?"

అతను కోపం పట్టలేక శివబాబాని కర్రతో దెబ్బలు వేసాడు. తన ప్రారబ్ధకర్మ ఆ క్షణంలో తీరడంతో శివబాబా ఆ ఇంట్లోంచి బయటకి పరిగెత్తుతూ చెప్పాడు.

"కొంత కాలానికి నన్ను వెదుక్కుంటూ మీరే వస్తారు."

అక్కడనించి కోయంబత్తూరు వెళ్ళిన శివబాబా సుందరాంబాళ్ తండ్రి ఇంకా బ్రతికి వుండగా, వాళ్ళింట్లో కొద్దికాలం వున్నాడు.

ఓ రోజు శివబాబా పాలు తీసుకోకుండా ఆ రోజంతా కదలకుండా కూర్చున్నారు. ఎవరెంత బ్రతిమాలినా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు. సాయంత్రం గడియారంవంక చూసి చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

"అయిపోయింది....నాకు టిక్కెట్ కొనిచ్చి నన్ను రైలెక్కించండి."

"ఏ ఊరికి స్వామీ?"

"నంద్యాలకి." చెప్పారు శివబాబా.

* * * *

మహాలక్ష్మమ్మ మృతదేహాన్ని స్మశానానికి తీసుకెళ్ళడానికి కొద్ది నిముషాలముందు వచ్చారు శివబాబా. అతన్ని చూసి అంతా తలోవిధంగా అనుకున్నారు. స్వగ్రామం వదిలాక అయిన మళ్ళీ అదే రావడం. స్మశానానికి వెళ్ళిన శివబాబా చితికి నిప్పంటించాలన్నారు కాని స్వంతబావ, మేనమామ అందుకు అడ్డుపడ్డారు.

"సన్యాసివి. నీకు తల్లి చితికి నిప్పంటించే హక్కు ఎక్కడుంది?" తండ్రి ఆవేదనగా చూసాడు. శివబాబా వెంటనే తల్లి చితివంక తీక్షణంగా చూసాడు. తక్షణం ఎవరూ నిప్పంటించకుండానే చితికి తల దగ్గర అంటుకుంది. అందరికీ ఆ సంఘటన ఎంతో ఆశ్చర్యకరంగా అనిపించింది. తెలిసిన ఓ పెద్దమనిషి చితికి దణ్ణంపెట్టి చెప్పాడు.

"మహాలక్ష్మమ్మ ధన్యురాలు. యోగాగ్నితో ఆవిడ శరీరం కాలిపోతోంది."

తక్షణం ఆ గ్రామం వదిలిన శివబాబా మళ్ళీ ఎన్నడూ భీముని పాడులో కాలు పెట్టలేదు.

* * * *

ఆ తర్వాత ఇంకెన్ని చోట్లకో వెళ్ళారు శివబాబా. ఎందరిళ్ళల్లోనో వున్నారు. ఒకోసారి వున్న ఇంట్లో పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా దూరంగా వున్న పరాయి వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళిచ్చే పాలో, మజ్జిగో తాగేవారు. అలా అనేకచోట్లకి తిరిగి వారితో మిగిలిన ప్రారబ్ధ కర్మ బంధాలు తెగాక జగ్గయ్యపేటకి చేరుకున్నారు శివబాబా.

అప్పట్లో జగ్గయ్యపేటలోని అబ్దుల్ అనే ముస్లిం ఇంట్లో ఉంటున్నారు శివబాబా. శివబాబా గురించి విని ఓరోజు మాణిక్‌లాల్ అనే జైన్ మతస్థుడు వాళ్ళింటి వచ్చాడు. ఏభై ఏళ్ళు నిండిన శివబాబాని చూడగానే అతనికి భక్తిభావం పెల్లుబికింది. వంగి శివబాబా పాదాలకి నమస్కారం చేసాడు. హైద్రాబాద్‌లో వడ్డీ వ్యాపారంచేసే మాణిక్‌లాల్ తరచు జగ్గయ్యపేటలోని శివబాబాని చూడడానికి వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా శివబాబా నవ్వుతూ 'నువ్వు నాకు ఓ ఇల్లు బాకీ' అనేవారు.

రెండేళ్ళ తర్వాత ఓ రోజు మాణిక్‌లాల్‌కి అనిపించింది, ఇంత దూరం బాబాని చూడడానికి వచ్చేకంటే, హైద్రాబాద్‌లోని తన ఇంట్లోనే వుంచుకుంటే అని. మొదట్లో అతని దిగంబరత్వానికి ఇంట్లో వుండడం క్షేమం కాదనుకున్నాడు. కాని క్రమంగా అతని కుటుంబ సభ్యులు కూడా బాబాని తమ ఇంట్లో వుంచుకోడానికి ఒప్పుకున్నారు. ఆయన్ని తమింటికి ఆహ్వానించడానికి కుటుంబ సభ్యులంతా బయలుదేరారు.

"మా ఇంటికి వచ్చి ఉండమని ఆహ్వానిద్దాం అని వచ్చాం బాబా" చెప్పింది మాణిక్‌లాల్ భార్య.

"మీ ఇంట్లో ఉంటే నాకు చిరాకు. ఇకపై నాకోసం దేశవిదేశాల నించి చాలామంది వస్తారు. మీకు ఇబ్బంది."

"ఏం ఇబ్బంది ఉండదు బాబా."

"హైద్రాబాద్ నించి జగ్గయ్యపేటకన్నా మణికొండ దగ్గరకదా?" ప్రశ్నించాడు శివబాబా.

ఆ కుటుంబసభ్యులు ఆశ్చర్యంగా ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. మాణిక్‌లాల్‌ది మణికొండగ్రామం. తాత హయాం దాకా అక్కడే ఉండేవారు. తండ్రి హయాంలో హైద్రాబాద్ వచ్చారు. మణికొండలో తమకున్న ఇంటిని అమ్మేయాలని, ఆ సొమ్ము వ్యాపారంలో పెట్టాలని మాణిక్‌లాల్ సోదరులు ముగ్గురు ఓ నిర్ణయానికి వచ్చారు. క్రితం రోజే ఒకరినించి అడ్వాన్స్ తీసుకుని నలభైరోజుల్లో ఇల్లు రిజిస్టర్ చేసుకునే అగ్రిమెంట్ రాసుకున్నారు.

"బాబా! మణికొండలో మా ఇంటి గురించా మీరు అడిగేది?" అడిగాడు మాణిక్‌లాల్.

"అవును!"

"దాన్ని అమ్మేసాంగా?"

"మీరు అమ్మితే సరే, కాని వాడు కొనకపోతే అందులో వచ్చి వుంటా."

నలభైరోజుల తర్వాత అడ్వాన్స్ ఇచ్చినతను ఆ ఇల్లు కొనలేదు. దాంతో మాణిక్‌లాల్ తన సోదరులకి వాళ్ళ వంతు డబ్బు ఇచ్చి ఆ ఇల్లు తనపేర బదలాయించుకున్నాడు. శివబాబా జగ్గయ్యపేటనించి మణికొండకి మారారు. అబ్దుల్ కుటుంబసభ్యులు శివబాబా వెళుతున్నప్పుడు ఏడిస్తే ఆయన నవ్వుతూ చెప్పాడు.

"ఎందుకా ఏడుపు శివా? ఓ జీవికి, ఇంకో జీవితో ఋణం ఉన్నంత వరకే ఏదైనా! ఋణం తీరితే చావో, స్థలం మార్పో, పట్టుదలో ఏదో ఒకటి వాళ్ళని విడదీస్తుంది. మన ఋణం తీరింది."

27

శివబాబా మణికొండలోని ఆ ఇంటిని 'ఆత్మకుటీర్'గా వ్యవహరించసాగారు. ఆ ఇంటి ఆవరణలో రకరకాల చెట్లని నాటించారు. వెనక గోశాల కట్టిస్తుంటే ఎవరో అడిగారు.

"గోవులు లేకుండా దేనికి బాబా గోశాల?"

"వస్తాయ్ శివా! వస్తాయ్."

అన్నట్లుగానే అబ్రహాం తండ్రి మరణించాక శివబాబాకి గోదానంగా మూడు ఆవులు ముట్టాయి. ఎంతో సింపుల్‌గా జీవించడానికి ఇష్టపడే శివబాబా కోసం అబ్రహాం ఓ లారీనిండా ఖరీదైన సామాను పంపించాడు. రోజ్‌వుడ్ మంచం, సోఫాసెట్టు, ఫ్రిజ్ మొదలైనవి. లారీ చప్పుడు

వినగానే శివబాబా తను సన్యాసదీక్ష ఇచ్చిన అనంతానంద స్వామితో చెప్పారు

"వెళ్ళి ఆ సామాను ఆత్మకుటీర్‌కి అవసరంలేదని చెప్పి తిప్పి పంపెయ్."

అతనికి అర్థంకాలేదు బాబా మాటలు. బయటకి వెళ్ళి విషయం తెలిసాక అర్థమైంది. దేశం నలుమూలలనించి తరచూ వచ్చి ఆత్మకుటీర్‌లో బాబా సన్నిధిలో ఉండే ఆయన శిష్యులు ఫోన్ పెట్టిస్తామని చెప్తే నిరాకరిస్తూ చెప్పారాయన.

"మీరు నాకు ఫోన్‌లో ఏం చెప్పదలచుకున్నారో, ఆ వార్త అంతకు ముందే నాకు తెలుస్తుంది. నేను మీకు చెప్పదలచుకున్నది ఫోన్ లేకపోయినా అది మీకు చేరి తీరుతుంది. ఇంకెందుకు దండగగా ఆ ఫోన్?"

ఎవరెన్ని ఖరీదైనా వస్తువులు తెచ్చినా శివబాబా వాటిని సున్నితంగా నిరాకరించేవారు. ఓసారి మేజర్ శివకుమార్ బాధపడుతూ 'చేతికర్ర ఊతంగా వుంటుందని కాశ్మీర్‌నించి తెచ్చాను బాబా' అంటే శివబాబా చిన్నగా నవ్వి చెప్పారు.

"పిచ్చివాడా! నాకీ జన్మకి ప్రారబ్దసుఖాలుండవు. గతజన్మలో నేను ఏ సత్కార్యాలుచేసినా 'యత్ కరోషియదశ్నాసి యజ్జహోషిదదాసియత్.' అన్నాడుకదా శ్రీకృష్ణుడు. దాంతో గత మూడు జన్మలుగా ఏ సత్కార్యం చేసినా దాని ఫలితాన్ని భగవదర్పణం చేస్తూ వచ్చాను. అందువల్ల వాటి ఫలితాలు ఆ నల్లగొల్లవాడు కొట్టేస్తూ వచ్చాక ఇక నాకు ఇవన్నీ ఎక్కడ దక్కుతాయి?"

"ఎందుకలా చేసారు మరి?"

"చిత్తశుద్ధి కోసం. 'నేను, నాది' అన్న భావాలు పోవాలంటే మనం ఏం చేసినా ఆ భగవంతుడిచేత చేయించబడుతున్నామన్న భావన ఉండాలి. కాబట్టి అలాంటి భావనతోనే చేసాను. చిత్తశుద్ధి లభించినమేర అజ్ఞానం పోయి, జ్ఞానం అబ్బుతుంది. జ్ఞానం అబ్బినమేర అది కర్మలని, అజ్ఞానాన్ని కాల్చేస్తుంది. ఒక్కరోజుతో రాదుకదా ముక్తి. కొన్ని జన్మలుగా ఇన్‌స్టాల్‌మెంట్ ప్లాన్‌తో సంపాదించుకోవాలి శివా."

శివబాబాకి ప్రారబ్దకర్మపరంగా లభించిన ఆ ఆత్మకుటీర్‌లో ఇరవై నాలుగేళ్ళకి పైగా వున్నారు. ఆస్ట్రేలియానించి వచ్చిన ఒకతనికి సన్యాసదీక్ష ఇచ్చి అమృతానంద అనే పేరుపెట్టి చెప్పారు.

"మనవాడే! కర్మవశాన అక్కడ పుట్టాడు." నిరంజనానందకి సన్యాసదీక్ష ఇచ్చాక చెప్పారు.

"చూడు శివా! నువ్వు చాలా సేవ నాకు బాకీ కాబట్టే ఇక్కడ తేలావు. కాబట్టి నా సేవ చేసుకుంటూ వుండు. ధ్యానంకన్నా నా సేవ నీకు ఈ జన్మలో ముఖ్యం. నాలుగు జన్మలక్రితం భార్యగా నేను నీకు గొడ్డు నౌకరీ చేసాను. అప్పుడప్పుడు నీకు దెబ్బలు కూడా పడుతూంటాయిలే! చెల్లుకి చెల్లు"

ఓ రోజు ఆత్మకుటీర్‌కి మురళి వచ్చాడు. అతన్ని చూసి ఏళ్ళై ఏళ్ళు అవుతున్నా, చూడగానే శివబాబా చెప్పాడు.

"రా మురళీ! కులాసానా?"

"మీరు నన్ను గుర్తుపడతారనుకోలేదు. బట్టతల వచ్చి లావయ్యాను."

"ఆ రోజు పామునిపట్టి దాని విషం తీసి నేను ఆపత్ సన్యాసం స్వీకరించడానికి సహాయం చేసిన నిన్ను ఎలా మరిచిపోగలను శివా? అందుకు నీకు ప్రత్యుపకారం చేస్తానంటే సన్యాసినయ్యాక నువ్వేం చేయగలవని కూడా అన్నావు గుర్తుందా?" నవ్వారు శివబాబా.

"నా ఆఖరి మనవరాలికి చెవుడు. అసలు వినపడదు. దానికి మీరు యం చేయాలి" అర్థించాడు.

"ఊహూ! చేయను శివ."

మురళి కొద్దిసేపాగి అడిగాడు.

"మరి నాకు ప్రత్యుపకారం మాటేమిటి?"

"అది నీవు కోరకుండానే ఎప్పుడో తీర్చేసానుగా!"

ప్రశ్నార్థకంగా చూశాడు మురళి.

"నీవు పాముల్నిపట్టి వాటి కోరలు పీకేసి వాటిని వదులుతుండే

వాడివి గుర్తుందా? ఆ పాప ఫలితంగా ఈ జన్మలోనే నీకు పళ్ళు, దంతాలు పూడిపోయే కర్మ వుంది. దాన్ని నాకు బదలాయించుకున్నాను."

తనకోసారి పళ్ళ నొప్పులు వచ్చి డాక్టర్ దగ్గరికి వెళితే పళ్ళు పుచ్చిపోయాయి తీయాలని చెప్పడం, తర్వాత అవి ఆరోగ్యంగానే ఉన్నాయని చెప్పడం గుర్తొచ్చింది మురళికి.

"నీ మనవరాలు క్రితం జన్మలో ఓ ఉన్నత ప్రభుత్వాధికారిగా పని చేస్తూ, ప్రజలు తాము చెప్పుకున్న కష్టాలనివారణ చేయగలిగి వుండీ చేయకుండా ఉదాసీనంగా ఉండేది. ఆ పాప ఫలితమే ఈ జన్మలో చెవిటితనం. అనుభవించి తీరాల్సిందే! ఆడపిల్ల పెళ్ళికాదన్న బెంగ అక్కర్లేదు. సలక్షణమైన మొగుడొస్తాడు."

మురళి శివబాబా పాదాలకి నమస్కరించి సంతోషంగా వెళ్ళిపోయాడు.

శివబాబా చెప్పేవన్నీ నిజం అవుతాయని తెలిసి రాఘవరెడ్డి ఓరోజు ఆయననించి జ్యోతిష్యం నేర్చుకోడానికి వచ్చాడు.

"వద్దు శివ. ఇతరులకి ఏమౌతుందో నువ్వు చెప్పినా, చెప్పకపోయినా అది అయ్యే తీరుతుంది. నీ మార్గం అదికాదు. దీక్ష ఇస్తాను. ధ్యానం చేసుకో"

అది అతని అదృష్టం అన్నారు చాలామంది.

శివబాబా అంతదాకా కేవలం ఇరవై ఆరుమందికే దీక్ష ఇచ్చారని ప్రధానమంత్రికి దీక్ష ఇమ్మని రాష్ట్రపతి అబ్రహం కోరినా ఇవ్వలేదని తెలిసిన రాఘవరెడ్డి, శివబాబా దగ్గర శక్తిపాతంతో కూడిన మంత్రదీక్ష తీసుకుని ధ్యానంలో పడ్డాడు. త్వరలోనే ఆధ్యాత్మిక ప్రగతిని పొందాడు.

అలాగే ఉత్తరప్రదేశ్‌కి చెందిన సంతోష్‌కుమార్ శివబాబా దగ్గరకి వచ్చి ఓ యక్షిణిని తన వశం చేయమని, దాని సహాయంతో లోకులకి జరగబోయేది చెప్పి, సంపాదించుకుంటానని కోరాడు. ఆ కోరికని తిరస్కరిస్తూ అతనికి మంత్రదీక్ష ఇచ్చారు. కొంతకాలానికి అతను ఏం అంటే అది జరగడం ప్రారంభమైంది. అతను కోపంతో అన్నవి కూడా జరగడంతో అతను భయపడి తన కుటుంబసభ్యులతో తప్ప, బయటివారితోమాట్లాడడం మానేశాడు. అది అభ్యాసం అయ్యేదాకా నోటికి అడ్డంగా బట్టకట్టుకున్నాడు.

బెంగాల్‌నించి వచ్చిన వరాళి తనకి భోగభాగ్యాలు కావాలని కోరితే శివబాబా మధురంగా నవ్వి చెప్పారు- "పిచ్చిదానా! నీకేం కావాలో నీకే తెలీదు. ప్రతీ మనిషి అజ్ఞానంలో జీవితాంతం పగలు ఐశ్వర్య జయాన్ని, కుటుంబ జయాన్ని, కాంచనా జయాన్ని, రాత్రి కామినీ జయాన్ని కోరుకుంటాడు. లోకులు కోరుకునే జయాలు ఇవే. నిజానికివన్నీ జయాలు కావు. అపజయాలు. మనిషిని సంసారచక్రంలోకి పడదోసి, జననమరణ చక్రంలోకి నెట్టివేసే, జయాలుగా భ్రమ కల్గించే ఇవి అపజయాలు. ప్రతీ మనిషి ఎప్పటికైనా పొందవలసిన ఏకైక జయం, అంతిమ జయం, శాశ్వత జయం ఒక్కటే. అది 'అహంబ్రహ్మాస్మి' స్థితిని పొంది ఆత్మదర్శనం చేసుకోగలగడం. మానవుని పుట్టుకకి అసలైన లక్ష్యం ఇదే. నీకది కావాలంటే తీసుకో. లేదా వచ్చిన దారిన వెళ్ళు."

వరాళి శివబాబా మాట విన్నది. శివబాబా శిష్యురాలైంది. ఇలా మొత్తం ఇరవై ఏడుమందికి మంత్రదీక్ష ఇచ్చి తన శిష్యులుగా చేసుకున్నాడు శివబాబా.

* * * *

అప్పటికే శివబాబా నిర్యాణం గురించి టి.వి.లో ఫ్లాష్ న్యూస్ వెలువడటంతో అనేకమంది ఆయన భక్తులు హుటాహుటిన ఆయన్ని చూడడానికి ఒక్క ఆంధ్రప్రదేశ్‌నించే కాక, దేశంలోని ఇతర చోట్లనించి కూడా బయలుదేరి వస్తున్నారు. మణికొండ గ్రామంలోని అన్ని రోడ్లు స్కూటర్లు కార్లతో నిండిపోయాయి. ఆత్మకుటీర్ ముందు రోడ్డుమీద ఇసక వేస్తే రాలనంతమంది జనం. అందరికీ బాబాని ఆఖరిసారిగా కళ్ళతో చూడాలని ఆశ.

అమృతానందస్వామి, నిరంజనానందస్వామి వాళ్ళని క్యూలో లోపలకి పంపిస్తున్నారు. కొద్దిసేపు చూసి, శివబాబా పాదాలకి నమస్కరించి బయటకి వచ్చి, అయినా కోరిక తీరక మళ్ళీ క్యూలో నిలబడుతున్నారు.

సంధ్యాసమయం అయింది కాబట్టి ఆశ్రమంలో దీపం వెలిగించారు. దీపం వెలిగించగానే ఆ సందర్భంలో చదవాల్సిన శ్లోకాన్ని బయటకి పఠించారు.

దీపం జ్యోతిః పరబ్రహ్మ దీపం సర్వ తమోపహమ్।
దీపేన సాధ్యతే సర్వం సంధ్యాదీపం నమోస్తుతే॥

(అర్థం : దీపజ్యోతే పరబ్రహ్మం. దీపజ్యోతే అన్ని తమోగుణాలని హరించేది. దీపంవల్లే సర్వం సాధ్యం. సంధ్యలో వెలిగే దీపానికి నమస్కారాలు.)

28

"నాలుగు వందల ఏళ్ళక్రితం ఓ జన్మలో నేను అత్తగారు, నాకున్న ఒక్కగానొక్క కొడుకు మరణించాడు. వాడికి సంతానం లేదు, బోలెడా స్తి. దాంతో భగవత్‌చింతనలో పడ్డాము నేనూ, నా విధవ కోడలు. నిత్యం అహోబిలానికి కాలినడకన వెళ్ళి ఆ స్వామిని దర్శించుకుని వచ్చే వారం. యాత్రికులు విశ్రాంతి తీసుకోడానికి, ముఖ్యంగా వంట చేసుకోడానికి ఆ అడవి దారిలో ఎలాంటి సదుపాయం లేదు. దాంతో మా ఆస్తిని సద్వినియోగ పరచాలన్న తలంపుతో దారిలో వంద-నూటయాభై మంది యాత్రికులు విశ్రాంతి తీసుకోడానికి వీలుగా కొండరాళ్ళతో ఓ విశ్రాంతి మందిరాన్ని కట్టించాము. మేము గతించినా ఈనాటికీ అది నిలిచి వుంది, 'అత్తా కోడళ్ళ సత్రం' అనే పేరుతో. ఆ పుణ్యశేషం తర్వాతి జన్మల్లో అనుభవించగా ఇంకా కొంత మిగిలి వుంది. ఆ పుణ్యఫలమే మాణిక్‌లాల్‌చేత ఈ 'ఆత్మ కుటీర్'ని నాకు ఇప్పించింది....ఇక్కడ మీకో సందేహం రావచ్చు. మాణిక్‌లాల్‌కి, ఈ సత్రానికి ఏమిటి సంబంధం అని. ఏమీలేదు. అతను ఈ విషయంలో దేవుడి చేతిలో పరికరంగా వాడుకోబడ్డాడు. ఇతను ఇలా ఆర్జించిన పుణ్యఫల విశేషాన్ని వచ్చే జన్మల్లో తిరిగి అందుకుంటాడు. మనం ఒకర్ని చంపితే, ఏదో జన్మలో తిరిగి వారు మనల్ని చంపుతారని, అలాగే ఒకరికేమైనా దానం చేస్తే, ఏదో జన్మలో తిరిగి వారినించి అది మనం పొందుతామన్న నమ్మకం హిందూ కర్మసిద్ధాంతాన్ని నమ్మే వాళ్ళలో వుంది. కాని అది అన్నివేళలా నిజం కాదు.

"ఉదాహరణకి నేను నెపోలియన్ సైన్యంలో ఉన్నతాధికారిగా వుండగా, నావల్ల ఎంతో రక్తపాతం జరిగింది. నేను స్వయంగా తలలు

తెగ్గోసిన వాళ్ళు మళ్ళీ నాకు తర్వాతి జన్మల్లో తారసపడలేదు. కాని ఆ పాపఫలాన్ని మరుసటి జన్మలో 'రక్తహీనత' అనే వ్యాధితో అనుభవించాను. ఏ రక్తం కారి వాళ్ళు మరణించారో, ఆ రక్తం ఓ జీవితకాలం, నా శరీరానికి తగు పాళ్ళలో లభించక నా శరీరం ఎంతో నరకం అనుభవించింది. కర్మపరిపాకం భౌతికస్థాయిలో కాక ఇలా మానసిక స్థాయిలో కూడా అవుతూంటుంది.

"పూర్వం నా దగ్గరకి ఆస్తమాతో బాధపడేవారు అనేకమంది వచ్చేవారు. వారిలో ఎక్కువశాతంమంది పూర్వజన్మల్లో గొంతు పిసికో, నీళ్ళల్లో ముంచో ఇతరులని చంపినవారే ఏ గాలి అందక దానికోసం తన్నుకుని వాళ్ళు చచ్చారో, ఆ గాలి ఊపిరితిత్తులకి సరిపడా ఈ జన్మలో అందక ఆ కర్మ పరిపాకం కావడానికి నరకం అనుభవిస్తున్నారు తప్ప తాము చంపిన వాళ్ళచేత కొద్ది నిముషాల్లో, మళ్ళీ అదే పద్ధతిలో చంపబడటం వల్లకాలేదు. కర్మశాస్త్రం బహు గోప్యమైనది, బహు సూక్ష్మమైనది. ఏ శాస్త్రమూ దీన్ని పూర్తిగా బహిర్గతం చెయ్యలేదు."

చెప్పడం ఆపాక కొద్దిసేపు నిశ్శబ్దంగా వున్నారు శివబాబా. ఆయన చెప్పేది శ్రద్ధగా వింటున్న ఆయన శిష్యులు, గ్రామస్థులు కూడా ఆయన అజ్ఞాన స్థితినించి, అంధకార స్థితినించి, సంపూర్ణ జ్ఞానిగా, సిద్ధపురుషుడిగా మారిన ఆయన తాలూకు వివరాల సమ్మోహన స్థితిలో వుండటంతో ఎవరూ నోరు మెదపలేదు.

కొద్ది నిశ్శబ్దం తర్వాత చెప్పారు శివబాబా.

"మీలో ఎవరికయినా, ఏమైనా సందేహాలుంటే అడగండి"

"బాబా! కొందరు యోగులు వందల ఏళ్ళు జీవిస్తారని చెప్తారుకదా అలా మీరు మరికొంతకాలం జీవించచ్చుగా?" ప్రశ్నించాడు పృథ్వీరాజ్.

"మనిషి ఆయుష్షుని మానవులు, సంవత్సరాలు, నెలలు, రోజులు, గంటలు అనే కాలంతో కొలుస్తారు, కాని మనిషి ఉచ్ఛ్వాస నిశ్వాసలతో దాన్ని దేవుడు కొలుస్తాడు. మనిషికన్నా వేగంగా శ్వాసించే కుక్కలు, పిల్లుల ఆయుః ప్రమాణం అందుకే మనిషికన్నా తక్కువ. యోగులు సమాధిస్థితిలో ఉన్నంతకాలం వారి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు అరికట్టబడి ప్రాణ

వాయువు భృకుటిలో స్థిరంగావుంటుంది. వాళ్ళలా ఎంతకాలం సమాధిలో వుంటే ఈ ప్రపంచ కాలమానం ప్రకారం అంతకాలం వారి ఆయుష్షు పొడిగింపబడ్డట్టే. ఆ విధంగా వారు ఎక్కువ కాలం సమాధిలో వుండడంతో వారి ఆయుష్షు వందల ఏళ్ళకి పెరుగుతుంది తప్ప దైవ శాసనానికి మించి ఎక్కువసార్లు ఊపిరి తీసుకుని వదిలి బ్రతకలేరు. కొందరు కోరి జీవ సమాధి అయినప్పుడు కొన్ని వందల ఏళ్ళు ఆ సమాధి స్థితిలో, శ్వాస లేకుండా బ్రతికుంటారు. కాబట్టే దానికి జీవసమాధి అనే పేరు వచ్చింది. అవసరం అనుకున్నప్పుడు వారు ఆ సమాధి స్థితిలోంచి బయట పడి తిరిగి లేవగలరు. కాని నిజానికి ఓసారి 'అహం బ్రహ్మాస్మి' స్థితిని రుచి చూశాక మనలోని ఆత్మ ఈ శరీరంలో బంధింపబడి వుండడం భరించ లేనిదిగా వుంటుంది. ఎప్పుడెప్పుడు దీన్ని వదిలి ఆ విశ్వాత్మలో కలిసి పోదామా అని వుంటుంది. చిలకకి వనమంతా ఎగరాలని వుంటుంది కాని, చిన్న పంజరంలో బంధింపబడి వుండడం నచ్చదు కదా?"

"ఆత్మసాక్షాత్కారం పొందిన భౌతిక గురువువల్లే ముక్తి లభిస్తుందంటారు. మరి మీరు దేహత్యాగం చేశాక మా గతి ఏమిటి?" ప్రశ్నించింది శారదామా.

"ఆ విషయంలో చింత వద్దు.. గురువు అనుగ్రహం అలాంటి మరో భౌతిక గురువుని మీ దగ్గరికి చేర్చగలుగుతుంది. అందుకే పులినోటపడ్డ మాంసఖండం ఎలా బయటకిరాదో, అలాగే సద్గురువు పాలబడ్డ శిష్యుడికి ఎన్నటికయినా ముక్తి తప్పదంటారు. కాకపోతే గురువు అనుగ్రహానికి పాత్రులవ్వాలి. అది చాలా తేలిక. ప్రపంచంలో లభించే ఆనందాలవెంట పరుగులు మాని చిత్తం సర్వదా భగవంతుని మీద లగ్నం చేయగలగడమే గురువు అనుగ్రహం పొందడానికి తేలికయిన మార్గం."

"స్వామీ. మీరెన్నడూ మా రోగాలని నయం చేయడం లాంటివి ఎందుకు చేయలేదు?" ప్రశ్నించాడు డిసౌజా.

"మీ మేలుకోరే. 'పూర్వ జన్మకృతం పాపం వ్యాధిరూపేణ పీడితం' అని శాస్త్రం. మనం చేసే పాపాలన్నీ రోగరూపంలో అనుభవించాలి, ఉదాహరణకి ఎవరికో మూర్ఛవ్యాధి. దాన్ని ఈ జన్మలో

తగ్గించగలను. కాని శాశ్వతంగా రద్దు చేయలేను వచ్చేజన్మలో వాయిదా పడ్డ ఆ పాపం, వాయిదా పడ్డ రుణంలా పెరిగి ఇంకా ఎక్కువ బాధ అనుభవించాల్సి వుంటుంది. తేలికతో పోయేదాన్ని ఎందుకు ఎక్కువ చేయడం అని గుర్తుంచుకోండి. గురువు మీచేత ధ్యానం చేయిస్తే ఇప్పుడున్న కర్మలు భస్మమై వచ్చేజన్మలు ఆరోగ్యంగా వుంటాయి అదీ గురువుగా నేను మీకు అందించే ప్రసాదం."

"స్వామీ. మంత్రదీక్ష గురువునించి తీసుకుంటేనే ఫలిస్తుందంటారు అది నిజమేనా?" ప్రశ్నించాడో గ్రామస్థుడు.

"అవును. మంత్రి తమ రాజుని బంధించమని ఎన్నిసార్లు భటులకి ఆజ్ఞాపించినా వాళ్ళు మాటలని ఖాతరు చేయరు. కాని రాజుగారు మంత్రిని బంధించమని ఒక్కసారి చెప్తేచాలు. భటులాపని చేస్తారు. ఆజ్ఞ ఒక్కటే అయినా అది ఎవరినుంచి వచ్చిందన్నది భటుడికి ఎలా ముఖ్యమో అలా మంత్రం ఒక్కటే అయినా అది ఎవరు ఉపదేశించారన్నది ముఖ్యం"

"స్వామీ. ఇందాక మీరు చెప్పినట్లుగా మరి మాకో భౌతిక గురువుని పంపిస్తారా?" అడిగాడు రాఘవరెడ్డి.

శివబాబా మధురంగా నవ్వి పంపిస్తానన్నట్లుగా తల ఊపి చెప్పారు.

"శివా. ఇంకాసేపట్లో మీరంతా కొత్త గురువుని చూస్తారు. కాసేపు భజన చేయండి. మీ అందరికీ జయమగుగాక."

శారదామా ఏక్‌తారని మీటుతూ భజన అందుకుంది. అంతా గొంతు కలిపారు.

"చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమాం
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్షమాం

29

హిమాలయాలు.

గుప్తకాశినించి పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న చిన్న గ్రామం అది. పేరు సిద్ధ కాశమత్. అంతా కలిపి వందిళ్ళు లేవాగ్రామంలో.

పక్కనే పారుతున్న మందాకిని గలగలలు వినబడేంత దూరంలో ఉందో ఇల్లు. ఆ ఇంట్లో నేలమీద పరిచిన వున్ని తివాచిమీద, దర్భలతో వేసిన చిన్న చాపమీద కప్పిన తెల్లటి వస్త్రంమీద కూర్చుని వున్నాడు అరవై రెండేళ్ళాయన. అయితే చూడడానికి ఆయన ముప్పైకి దరిదాపులకి వచ్చి వుంటాడనుకుంటారు అతని వయసు తెలియనివారు.

కళ్ళు మూసుకుని పద్మాసనంలో ఎడమ అరచేతిమీద కుడి అరచేతిని వుంచి కూర్చుని వున్న ఆయన వంటిమీద గోచితప్ప ఎలాంటి అచ్ఛాదన లేదు. ఆయన మొహం ఎంతో తేజోవంతంగా, ప్రశాంతంగా వుంది. గాఢ నిద్రలో వున్నట్లుగా కూడా వుంది. ఆయన సమాధిస్థితికి వెళ్ళి ఆ రోజుకి మూడు రోజులైంది. మరో రెండు రోజులదాకా ఆయన ఇహలోకానికి రారని అనుభవపూర్వకంగా ఆ ఇంటివాళ్ళకి తెలుసు.

క్రమంగా ఆయనలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు మొదలయ్యాయి. నెమ్మదిగా కళ్ళుతిప్పి చూశాడు. ఆ ఇంటివాళ్ళు అది గమనించి దగ్గరికి రాగానే చెప్పాడు.

"నేను వెళుతున్నాను."

గత ఏడాదిన్నరగా ఇల్లు దాటని ఆయన వెళతాననడంతో ఆ ఇంటి వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు స్వామీ?"

"రెండు మూడు రోజుల్లో."

అతను ఇంట్లోంచి బయటికి నడిచారు. కొండల వెనక గ్రామం కనుమరుగయ్యాక కళ్ళు మూసుకున్నాడు. మరుక్షణం అతని శరీరం అణువులుగా విడిపోయింది. ఆ అణువులన్నీ తిరిగి మణికొండ గ్రామంలో యథాతథంగా అతుక్కున్నాయి.

• • • •

రాత్రి ఎనిమిదింపావు. గ్రామస్థులు, శిష్యులు అంతాకలిసి కళ్ళు మూసుకుని తన్మయత్వంగా గానం చేస్తున్నారు. భజన మొదలు పెట్టి అప్పటికే అరగంట దాటింది. అప్పటికే వేద పఠనం మధ్య శిష్యులంతా తమ సద్గురువుకి ఆఖరిసారిగా పాదపూజ చేసుకున్నారు.

అదయ్యాక కళ్ళు తెరచిన కొందరు తమ మధ్య కూర్చున వున్న ఓ కొత్త వ్యక్తిని చూశారు.

శివబాబాలాగా జడలుకట్టిన జుట్టు, ఎక్కడా చెంచాడు ఎక్కువ మాంసంలేని గట్టి శరీరం. మొహంలో బ్రహ్మ వర్చస్సు ప్రస్ఫుటంతో కనిపిస్తోంది. కౌపీనధారి అయిన అతను వంగి శివబాబా పాదపద్మాలకి తన నుదుటిని ఆనించి దణ్ణం పెడుతున్నాడు. శివబాబా అతనివంక వాత్సల్యంగా చూసి అందరికీ పరిచయం చేశాడు.

"ఇతను నా మొదటి శిష్యుడు సద్గుణానందస్వామి. ఇతనికి నేను సన్యాసదీక్ష ఇచ్చి పదమూడేళ్ళు గడిచాయి. ఇకమీదట ఇతనే మీ గురువు."

అంతా బ్రహ్మ వర్చస్సుగల అతనికి నమస్కారం చేశారు. మళ్ళీ భజన చేయమన్నట్లు సైగ చేశారు శివబాబా. శారదామా లింగాష్టకం అందుకుంది.

బ్రహ్మమురారి సురార్చిత లింగం
నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజ దుఃఖ వినాశక లింగం
తత్ ప్రణమామి సదాశివ లింగం....

శివబాబా ఓసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలారు. తర్వాత దీర్ఘమైన ఓంకారాలని మూడుసార్లు చేశారు. మూడోసారి ఓంకారం జరుగుతుండగా, పరమాత్మ స్ఫురణతో ఆయన భృకుటిలో నిలిచివున్న ప్రాణవాయువు బుల్లెట్‌లా పైకి వెళ్ళి మాడుని ఛేదించుకుని దశమ ద్వారంగా చెప్పబడే బ్రహ్మరంధ్రంలోంచి బయటికెళ్ళిపోయింది. అక్కడ స్వల్పంగా రక్తం చిమ్మింది.

సర్వ ద్వారాణి సం యమ్య మనో హృది నిరుధ్య చ
మూర్ధ్న్యాధాయా త్మనః ప్రాణమా స్థితో యోగ
ధారణామ్.
ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మా మనుస్మరన్
యః ప్రయాతి త్యజన్ దేహం సయాతి పరమాం గతిమ్
(గీత; 8-12, 13)

(సర్వేంద్రియాలను నిగ్రహించి, మనస్సును, హృదయమునందే స్థిరముగా నిలిపి, అట్లు వశమైన మనస్సు ద్వారా ప్రాణములను మూర్ధ-స్థానమునందు (సహస్రారమునందు) స్థిరమొనర్చి, పరమాత్మ ధ్యానమునందే నిమగ్నుడై, అక్షర పరబ్రహ్మ స్వరూపమైన ఓంకారమును ఉచ్ఛరించుచు, ఆ ఓంకారమునకు అర్థ స్వరూపుడను, నిర్గుణబ్రహ్మను అయిన నన్ను చింతించుచు దేహ త్యాగమొనర్చువాడు పరమగతిని (మోక్షమును) పొందును.

మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్।
నా ప్నువంతి మహాత్మానః సంసిద్ధిం పరమాంగతాః॥
(గీత: 8-15)

(పరమ సిద్ధిని పొందిన మహాత్ములు నన్ను చేరిన పిదప, దుఃఖములకు నిలయమైన, క్షణభంగురమైన పునర్జన్మను పొందరు.)

కపాలమోక్షం కలిగాక శివబాబా శరీరం పక్కకి వరిగిపోతూండగా సద్గుణానందస్వామి దాన్ని పట్టుకున్నారు. జరిగింది చూసి కొందరు చేసిన హాహాకారాలకి మిగిలిన వాళ్ళు కళ్ళు తెరచి చూసారు. శివబాబా ఆత్మ బ్రహ్మైక్యం చెందిందని గ్రహించగానే ఆయన శిష్యులూ, సందర్శకులు, గ్రామస్థులూ స్వంత ఆప్తుడ్ని కోల్పోయిన వారిలా పెద్దపెట్టున ఆక్రందనలు చేయసాగారు. అందరి కళ్ళ వెంట నీళ్ళు.

బయట రోడ్డుమీద వున్న జనంలో ఒకరు చీకట్లో పైన ఆకాశంలో దక్షిణం వైపు నించి వెళ్తున్న వెలుగుని చూసి మిగిలిన వాళ్ళకి చూపించాడు. సరిగ్గా ఆత్మ కుటీరం పైనించి ఆకాశమార్గంలో ఆ వెలుగురేఖ ఈశాన్య దిశకి ప్రయాణంచేసి కొద్ది నిముషాల్లో కనుమరుగైంది.

అప్పుడు టైం రాత్రి సరిగ్గా ఎనిమిది గంటల నలభై ఏడు నిమిషాలు ఒక్క శారదామా, సద్గుణానందస్వామి తప్ప విలపించనివారు లేరక్కడ. వీరిద్దరి హృదయాల్లో మాత్రం ఆనందంతో కూడిన సంతృప్తి.

* * * *

ఆ నాలుగురోజులు వేదపఠనం, భజనలు, భగవద్గీత పఠనం సాగుతూనే వుంది. రాష్ట్రపతి అగ్రహంతో సహా అనేక వందలమంది శివబాబా

పార్థివ శరీర దర్శనార్థం వచ్చారు. శివబాబా భౌతికకాయాన్ని అలా వుంచినా ఆయన కాయం నించి నాలుగు రోజులైనా దుర్వాసన రాకపోగా సుగంధం రావడం సందర్శకులందరినీ ఆశ్చర్యపరచింది. ఆ ఇంటి బయట రోడ్డు మీద దాకా ఆ సుగంధం వ్యాపించింది.

శివబాబా బ్రతికి వున్నంతకాలం శారీరక సుఖాన్ని దరిచేరనివ్వలేదు. చిన్న పాకలో పేడతో అలికిన నేలమీద చాపమీదే తన చేతిని దిండుగా చేసుకుని నిద్రించేవారు. ఉదయం రాత్రి కలిపి రెండు వందల మిల్లీలీటర్ల ఆవు పాలతో జీవించిన శివబాబాకి వంటిమీద నూలుపోగు కూడా లేదు. ఏం తీసుకురాకుండా ఎలా వచ్చారో అదే భౌతిక స్థితిలో వెళ్ళిపోయారు. అయితే పూర్వజన్మల కర్మలతో పుట్టినా, ఈ జన్మలో వాటిని ధ్యానాగ్నిలో శివచరణాల దగ్గర భస్మం చేసుకుని, తానే శివుడై, తానే నారాయణుడై, తానే మాధవుడై, తానే గోపి అయి, మనుష్య జన్మకి ఏది కారణమో దాన్ని సఫలీకృతం చేసుకుని వెళ్ళిపోయారు. అతి స్వల్ప శారీరక అవసరాలతో జీవించిన శివబాబా పార్థివ శరీరాన్ని మాత్రం ఆయన భక్తులు పూలమాలలతో గంధపు మాలలతో అలంకరించారు. ఆత్మకుటీర్‌లో తీసిన మూడడుగుల వెడల్పు, ఆరడుగుల లోతు గల గోతిలో కర్పూరం, గంధంపొడి, ఉప్పులని ఓ అడుగు ఎత్తుదాకా పోసి దానిమీద శివబాబా భౌతిక దేహాన్ని ఉత్తరముఖంవైపు పద్మాసనంలో కూర్చోపెట్టారు. ఆ పని చేసేవారు, చూసేవారు, మిగిలిన వారి నోళ్ళల్లో ఆదిశంకరాచార్య విరచితమైన నిర్వాణ షట్కం పలకసాగింది.

మనోబుద్ధ్యా హంకార చిత్తాని నాహం
న శ్రోత్రం న జిహ్వా న చ ఘ్రాణనేత్రం
న చ వ్యోమ భూమిన్న తేజో నవాయు
శ్చిదానంద రూపః శివోహం శివోహం...

(మనోబుధ్య హంకార చిత్తములు నేను కాదు. శ్రవణ జిహ్వాలు కాని, నేత్ర ఘ్రాణములు కాని నేను కాదు. ఆకాశము, వాయువు, అగ్ని, జలము పృథివి కూడా నేను కాదు. నేను శాశ్వతానందమును, చైతన్యమును, నేను శివుడను. నేను శివుడను.)

ఆ తర్వాత శంకరాచార్యే రచించిన దక్షిణామూర్తి స్తోత్రం చదివా రంతా. ఆ గోతిలోని మిగతా భాగాన్ని కూడా ఉప్పు, కర్పూరంతో నింపి శివబాబా దేహం వాటిలో మునిగిపోయాక పైన నల్లటి బండరాళ్ళని పేర్చి సిమెంట్ చేసారు. ఆ పైభాగాన్ని భక్తులు క్యూలో వచ్చి తలో గుప్పెడు మట్టి పోసి నింపారు. వారిలో ఒకరు మట్టిపోసి కన్నీరు కారుస్తూ మనసులో ఇలా అనుకున్నాడు.

"బాబా. మీరు మా ఇంటికి భోజనానికి వస్తానని చెప్పినా నా తండ్రి కారణంగా తీసుకెళ్ళలేదు. నన్ను క్షమించండి. ఈ జన్మలో నాకా అదృష్టం లేదు" వెక్కి వెక్కి ఏడుస్తున్న అతన్ని సముదాయిస్తూ తీసుకెళ్ళింది అతని భార్య.

శివబాబా శిష్యులు, భక్తుల విరాళాలతో జైపూర్ నించి తెప్పించిన పాలరాళ్ళతో సమాధి స్థలం పైన చక్కని మందిరం నిర్మించి పాలరాతితో చేసిన పద్మాసనంలో వున్న శివబాబా విగ్రహాన్ని, ప్రక్కనే నాలుగడుగుల శివలింగాన్ని ప్రతిష్టించారు.

నిత్యం అమృతానందస్వామి తెల్లారు ఝామున అరున్నరకి మధ్యాహ్నం పన్నెండున్నరకి, సాయంత్రం ఆరున్నరకి, రాత్రి పదకొండు న్నరకి లింగానికి, విగ్రహానికి హారతి ఇస్తాడు.

చాలామంది శివబాబా సమాధి దగ్గర కూర్చుని ధ్యానం చేసుకోడానికే వస్తూంటారు- ఆయన్ని భౌతికంగా చూడని విదేశస్తులు కూడా.

ఆయన సమాధిమీద ఇలా చెక్కి వుంది.

ఓం

భారత భూమిలో ఒక అణువు ఆవిర్భావం : 12-11-1934

దాని పరిణామము : 10-9-2005

శ్రీ స్వామి శివబాబా హృదయం ఇచ్చట విరాజిల్లుతోంది.

ఆ సమాధికి మిగిలిన మూడు వైపులా ఆయన చెప్పిన సూక్తులు చెక్కి వున్నాయి. 'ఈ ప్రపంచంలో శ్వాసక్రియ జరిపే ప్రతి జీవి నాకు ఆత్మబంధువే.'

అహంకారానికి విరుగుడు ఓంకారం

భోగం పాపం. భక్తి పుణ్యం.

ఆయన సమాధి మందిరంలో గోడలకి ఆయన చెప్పిన అనేక ఇతర సూక్తులు రాసి వున్నాయి.

వృద్ధాప్యం కష్టం, దాని కంటే పేదరికం కష్టం పుత్ర శోకం అంత కంటే కష్టం. కష్టాల్లోకెల్లా మిక్కిలి కష్టం ఆకలి బాధ.

మనసును కోరికలతో హెచ్చువేస్తే వచ్చేది లబ్ధం : నరకం

గుండెలోంచి అసంతృప్తి తీసివేస్తే వచ్చేది శేషం : స్వర్గం

జ్ఞానం వస్తే పోదు. అజ్ఞానం పోతే రాదు. స్థిరంగా వుండే ఆత్మ తత్వం పోదు. రాదు.

మనస్సు వెళ్తే తిరిగి వస్తుంది. మనిషి వెళ్ళకూడదు.

ఉపశ్రుతి

హైద్రాబాద్ దగ్గరున్న నిజామాబాద్‌లో మరాఠీ భోజనం దొరికే హోటల్‌ని నడిపే షిండే అనే వ్యాపారి, హైద్రాబాద్ వచ్చినప్పుడల్లా మణికొండలోని శివబాబా దగ్గరకి వచ్చి ఆయన పాద సేవ చేసుకొనేవాడు. షిండే జన్మతహ క్రిస్టియన్.

ఓసారి శివబాబా 'మీ ఇంటికి తీసుకెళ్ళు. వస్తాను' అన్నారు. అయితే 'తన తండ్రికి ఇలాంటి వారు గిట్టరని, మా ఇంటికి రావద్దని' ఎలా చెప్పడమా అని షిండే మధనపడుతుంటే శివబాబా 'పోన్లే. ఇంకెప్పుడైనా వస్తాన్లే 'అన్నారు.

శివబాబా బ్రహ్మైక్యం చెందిన రోజు ఆ వార్త తెలుసుకుని హుటా హుటిన ఆత్మకుటీర్‌కి వచ్చిన షిండే, ఆయన భౌతికకాయంమీద మట్టిని చల్లిన వారిలో ఒకడు. అందుకోసం క్యూలో నాలుగైదు గంటలు నించు న్నాడు కూడా.

ఆ తర్వాత రెండేళ్ళకి షిండే తండ్రి మరణించాడు. సంతర్పణరోజు అయిదువందల మందికి వంట చేసారు. అయితే పిలవకుండా వచ్చిన ఓ సాధువు ముందు తనకి వడ్డించమని, బాగా ఆకలిగా వుందని చెప్తే

ఆయనకి భోజనం పెట్టి పంపారు. ఉచిత భోజన సంతర్పణ గురించి తెలిసి అనుకోకుండా మరో వెయ్యమంది వచ్చారు. 'వండినది ఎలా సరిపోతుందిరా భగవంతుడా?' అని షిండే బాధపడ్డాడు. మరో నాలుగు బస్తాల బియ్యాన్ని షాపునించి తెప్పించాడు. కాని మళ్ళీ వండాల్సిన అవసరం లేకపోయింది. వండినది సరిపోగా, ఆ రాత్రికి మరోనూట అరవై మంది తిన్నారు. విస్తళ్ళ లెక్కలో తేడా లేదు. అయిదు వందల కోసం వండింది పదిహేనువందల మంది ఎలా తిన్నారు? షిండేకి అర్థంకాలేదు.

అకస్మాత్తుగా అతనికి పిలవకుండా వచ్చిన సాధువు, ఆకలిగా వుందని ముందు తనకి పెట్టమని చెప్పడం గుర్తొచ్చింది. 'ఇంకెప్పుడైనా వస్తాన్లే' అన్న శివబాబా మాటలు కూడా గుర్తుకు వచ్చాయి. ఆ సాధువే శివబాబా అని, ఆయన తన వాగ్దానాన్ని నిలబెట్టుకోడానికే ఆ సాధువు రూపంలో వచ్చాడని షిండే గ్రహించాడు. తనింటికి రావడానికి ఏ తంత్రి అడ్డో ఆయన పోయాకే వచ్చారని తెలుసుకున్న షిండే కంఠంలో ఏదో అడ్డుపడినట్లుగా అయింది. తనింట్లోని శివబాబా ఫోటోముందుకివెళ్ళి నిలబడి చేతులుజోడించి డగ్గుత్తికగా ఇలా చెప్పాడు.

"బాబా! ఆ సాధువు నువ్వే అని తెలుసుకోలేకపోయాను. అలనాడు ఏసుక్రీస్తు ఏడు చేపలతో ఏడువేలమందికి భోజనం పెట్టగా ఇంకా ఏడు గంపల కూర మిగిలినట్లు మత్తయిలో వుంది. ఆ క్రీస్తువి నువ్వే కదా బాబా! నా ఇంటికి తరచు ఏదో రూపంలో వచ్చి భోజనం చేస్తుండు బాబా."

సర్వం శ్రీ గురుబ్రహ్మార్పణమస్తు

ఓం శాంతిః ఓం శాంతిః ఓం శాంతిః
